www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 8-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 100 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం; తిథి: తదియ పూర్తి; నక్షత్రం: పుష్యమి ఉ. 6.03 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: రా.7.49-9.33, దుర్ముహూర్తం: మ.12.46-1.38, మ.3.22-4.14; అమృతఘడియలు: ఉ.6.09-7.53; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 5.50, సూర్యాస్తమయం: 6.49 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఎన్‌హెచ్‌65పై ట్రామా కేర్ సెంటర్

హైదరాబాద్-విజయవాడ హైవే మీద కొర్లపాడు టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు

- 10 పడకలు.. అత్యాధునిక వసతులు
- నేడు శంకుస్థాపన
- ఈ రోడ్డుపై నెలకు 30-40 మరణాలు
- ప్రజల ప్రాణరక్షణకు ప్రాధాన్యం
- 'ఆంధ్రజ్యోతి'తో మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఎన్‌హెచ్ 65.. తెలుగు రాష్ట్రాల్లోని రెండు ప్రధాన నగరాలైన హైదరాబాద్‌ను, విజయవాడను కలిపే అత్యంత కీలకమార్గం! తెలంగాణలోని 23 జాతీయ రహదారుల్లో.. అతి ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరిగే హైవేల్లో మొదటిది కూడా ఇదేనని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో.. ఎన్‌హెచ్-65పై రోడ్డు

మిగతా 12వ పేజీలో...

తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు

రూ.241 కోట్ల ఖర్చుతో 48 వేల ఎకరాలకు నీరు

- అసంపూర్తిగా ఉన్న సాగునీటి ప్రాజెక్టులపై సీఎం దృష్టి
- త్వరితగతిన పూర్తి చేయాలని రేవంత్‌రెడ్డి సంకల్పం
- తొలుత గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టుల పూర్తికి చర్యలు
- అంచనాలు సిద్ధం చేయాలని అధికారులకు సీఎం ఆదేశం
- వచ్చే ఏడాది మార్చి నాటికి పనులు పూర్తయ్యేలా లక్ష్యం

హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అసంపూర్తిగా ఉన్న సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన వినియోగంలోకి తీసుకురావాలని సీఎం రేవంత్ సంకల్పించారు. వాటిని పూర్తి చేస్తే తక్కువ ఖర్చుతోనే ఎక్కువ ఆయకట్టుకు సాగునీరు అందించే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఈ మేరకు.. ఇప్పటికే నిధులు ఖర్చు చేసినవి, అసంపూర్తిగా ఉన్నవి , గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదిలేసిన సాగు ప్రాజెక్టులను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని సీఎం నిర్ణయించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ముఖ్యంగా తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ప్రాజెక్టులపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. తాజాగా.. గోదావరి, కృష్ణా బేసిన్‌లలో నిలిచిపోయిన పలు ప్రాజెక్టుల వివరాలను ఇరిగేషన్ శాఖ అధికారులు, ఇంజనీర్లతో మాట్లాడి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయకట్టు భూములకు సాగునీటిని అందించే డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించినట్టు తెలిసింది. ఇప్పటికే పలు దఫాలుగా ఈ ప్రాజెక్టులపై అధికారులతో చర్చించిన ముఖ్యమంత్రి.. తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ప్రాజెక్టులు, వీలైనంత త్వరగా సాగునీటిని అందించేందుకు వీలున్న ప్రాజెక్టులను చేపడితే రైతులకు మేలు జరుగుతుందని, అందుకు అవసరమైన అంచనాలను సిద్ధం చేయాలని సూచించారు. ఇందులో భాగంగా గోదావరి బేసిన్ పరిధిలోని నీల్వాయి వాగు, పింప్రి ప్రాజెక్టు, పాలెంవాగు, మత్తడి వాగు, ఎస్సారెస్పీ స్టేజ్-2, సదర్మట్ ప్రాజెక్టులను వేగంగా పూర్తిచేయాలని

మిగతా 13వ పేజీలో...



ఆదివారం హైదరాబాద్‌లో ఇందిరాపార్కు వద్ద పూరీ జగన్నాథ రథయాత్ర వెళ్లే దారిని శుభ్రం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

నేడు ఏపీకి రేవంత్‌రెడ్డి

- వైఎస్సార్ జయంతి కార్యక్రమంలో పాల్గొనడం కోసం..
- ముఖ్యమంత్రి వెంట వెళ్లనున్న డిప్యూటీ సీఎం, మంత్రులు
- టీపీసీసీ చీఫ్‌గా మూడేళ్లు పూర్తి చేసుకున్న రేవంత్ 13



ఏటా 2 ఇంజెక్షన్లతో ఎయిడ్స్‌కు చెక్

- లెనాకాపవిర్ పేరుతో అభివృద్ధి చేసిన గిలియడ్ సైన్సెస్ కంపెనీ
- దక్షిణాఫ్రికా, ఉగాండాలో ట్రయల్స్
- 100% సక్సెస్.. ఈ ఇంజెక్షన్ తీసుకున్న 2,134 మంది సురక్షితం
- మరిన్ని అధ్యయనాల తర్వాత మార్కెట్‌లోకి విడుదల

హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న హెచ్‌ఐవీ (హ్యూమన్ ఇమ్యూనో వైరస్) నుంచి రక్షణ ఇచ్చే ఇంజెక్షన్.. లెనాకాపవిర్ త్వరలో అందుబాటులోకి రాబోతోంది. ఏటా రెండుసార్లు ఈ ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా ఆ వైరస్‌కు చెక్ పెట్టవచ్చు. నిజానికి హెచ్‌ఐవీని నిరోధించే రెండు రకాల మాత్రలు ప్రస్తుతానికి అందుబాటులో ఉన్నాయి. మొదటిది 2012లో అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (ఎఫ్‌డీఏ) అనుమతి పొందిన ట్రువాడా మాత్ర. రెండోది.. 2016లో అందుబాటులోకి వచ్చిన డెస్కోవీ. ఆ రెండింటితో పోలిస్తే క్లినికల్ ట్రయల్స్‌లో ఈ ఇంజెక్షన్ నూటికి నూరుశాతం విజయవంతం కావడం గమనార్హం. ఈ ఔషధం.. హెచ్‌ఐవీ క్యాప్సిడ్ (వైరస్ చుట్టూ ఉండే ప్రొటీన్లతో కూడిన రక్షణ పొర)ను ధ్వంసం చేయడం ద్వారా వైరస్ తన సంఖ్యను పెంచుకోకుండా చేస్తుంది. ఆఫ్రికా దేశాల్లో చాలా మంది మహిళలు అత్యాచారాలకు గురై ఎయిడ్స్ బారిన పడుతున్న నేపథ్యంలో ఈ ఇంజెక్షన్ క్లినికల్ ట్రయల్స్‌ను సౌతాఫ్రికాలోని 25 ప్రాంతాల్లో, ఉగాండాలోని 3 ప్రాంతాల్లో నిర్వహించారు. ట్రయల్స్‌లో భాగంగా 5000 మంది మహిళలను

మిగతా 2వ పేజీలో...

31,382

గ్రూప్-1 మెయిన్స్‌కు అర్హత సాధించిన వారు

ఒక్కో పోస్టుకు 50 మంది అభ్యర్థులు

- ప్రిలిమినరీ పరీక్ష ఫలితాల వెల్లడి.. అక్టోబరు 21 నుంచి 27 దాకా మెయిన్స్
- మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులకు సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు

హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ప్రకటించింది. ప్రిలిమ్స్‌లో కనబరిచిన ప్రతిభ ఆధారంగా 31,382 మంది అభ్యర్థులను మెయిన్స్‌కు ఎంపిక చేసినట్లు కమిషన్ అధికారులు వెల్లడించారు. ఫలితాలను ఆదివారం కమిషన్ వెబ్‌సైట్‌లో ఉంచారు. రాష్ట్రంలో 563 గ్రూప్-1 పోస్టుల భర్తీ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి 19న నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ పోస్టుల భర్తీలో భాగంగా జూన్ 9న ప్రిలిమినరీ పరీక్షను నిర్వహించారు. జూన్ 24న ప్రాథమిక కీని విడుదల చేశారు. దానిపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి, ఆదివారం తుది కీని ప్రకటించారు. ఆ తర్వాత కొద్దిసేపటికే ఫలితాలను కూడా వెల్లడించారు. ప్రిలిమినరీ పరీక్షలో కనబరిచిన ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్టుకు 50 మంది అభ్యర్థులను మెయిన్స్‌కు ఎంపిక చేయనున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఈ నిష్పత్తి ప్రకారం మెయిన్స్‌కు 28,150 మంది ఎంపిక కావాల్సి ఉంది. అయితే.. 1:50 నిష్పత్తిలో కొన్ని ప్రత్యేక రిజర్వేషన్ కేటగిరీల్లోని పోస్టులకు అభ్యర్థులు అందుబాటులో లేకపోతే మెరిట్ జాబితాలోని ఇతర అభ్యర్థులను పరిగణనలోకి తీసుకుంటారు. రిజర్వేషన్ పోస్టుల భర్తీ కోసం కటాఫ్ మార్కుల కంటే దిగువ ఉన్న అభ్యర్థులను ఎంపిక చేస్తారు. దీనివల్ల పోస్టుల సంఖ్య, ఎంపికైన అభ్యర్థుల నిష్పత్తిలో కొంత వ్యత్యాసం కనిపిస్తోంది. ప్రస్తుతం ఎంపికైన అభ్యర్థులకు అక్టోబరు 21 నుంచి 27 వరకు మెయిన్స్ పరీక్షలను నిర్వహించనున్నారు. ప్రిలిమినరీ పరీక్ష కటాఫ్ మార్కుల జాబితాను పోస్టుల ఎంపిక ప్రక్రియ పూర్తయిన తర్వాత వెల్లడించనున్నట్లు కమిషన్ అధికారులు ప్రకటించారు.

మూడు సార్లు..!

గ్రూప్-1 పోస్టుల భర్తీ విషయంలో అనేక సంవత్సరాలుగా వివాదం కొనసాగుతున్న విషయం తెలిసిందే. గత ప్రభుత్వ హయాంలో ఈ పోస్టుల భర్తీకి నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షలను రెండు సార్లు వాయిదా వేయాల్సి వచ్చింది. మొదటిసారి ప్రశ్నపత్రం లీక్ కావడంతో రద్దు చేశారు. రెండోసారి పరీక్ష నిర్వహణలో నిబంధనలను

మిగతా 13వ పేజీలో...

ఈసారి 98,296 ఇంజనీరింగ్ సీట్లు

- 173 కాలేజీలకు గుర్తింపు 13
- కన్వీనర్ కోటాలో 70,307 సీట్లు, మిగతావి మేనేజ్‌మెంట్‌లో భర్తీ
- కంప్యూటర్ కోర్సుల సీట్లే అధికం

సైబర్ చెర.. విముక్తి

- కాంబోడియా నుంచి ఎట్టకేలకు స్వస్థలానికి చేరుకున్న తెలంగాణ యువకుడు
- సాఫ్ట్‌వేర్ జాబ్ పేరిట ఆ దేశానికి.. అక్కడ సైబర్ క్రైమ్స్ చేయాలంటూ వేధింపులు
- కాదన్నందుకు మత్తు ఇంజెక్షన్లు, చిత్రహింసలు
- వాట్సాప్ కాల్‌తో సోదరుడికి ప్రకాశ్ కబురు
- అతణ్ని కాపాడేందుకు రంగంలోకి పోలీసులు
- కాంబోడియాలోని భారత ఎంబసీకి వివరాలు
- ప్రకాశ్‌తోపాటు మరో 9 మంది భారత్‌కు రాక

బయ్యారం (మహబూబాబాద్ జిల్లా), జూలై 7: సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కోసం కాంబోడియాకు వెళ్లి.. అక్కడ సైబర్ నేరాలు చేసే ముఠా చేతిలో చిత్రహింసలు అనుభవించిన తెలంగాణవాసి మున్సిఫ్ ప్రకాశ్‌కు ఆ చెర నుంచి విముక్తి లభించింది. అక్కడ 45 రోజులపాటు నరకం అనుభవించిన అతడు.. తిరిగి తన స్వస్థలమైన గంధంపల్లికి (మహబూబాబాద్ జిల్లా, బయ్యారం మండలం) సురక్షితంగా తిరిగొచ్చాడు. గంధంపల్లికి చెందిన మున్సిఫ్ రాజు-విజయ దంపతులకు ప్రశాంత్, ప్రకాశ్ సంతానం. వీరిలో ప్రకాశ్ బీటెక్ (సివిల్ ఇంజనీరింగ్) పూర్తి చేశాడు. అవివాహితుడైన ప్రకాశ్.. జీవనోపాధి కోసం ఆరునెలల కిందట

మిగతా 12వ పేజీలో...



హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ప్రకాశ్



పూరీ రథయాత్రలో తొక్కిసలాట

- ఒక భక్తుడి మృతి.. ఐదుగురికి తీవ్రగాయాలు 2
- డీహైడ్రేషన్, శ్వాస సమస్యలతో 300 మంది ఆస్పత్రిలో చేరిక
- బలభద్రుడి రథం లాగుతుండగా ఘటన.. వేడుకలకు హాజరైన రాష్ట్రపతి ముర్ము
- తొలిరోజు యాత్ర పూర్తి.. నేడు కొనసాగింపు.. 53 ఏళ్ల తర్వాత 2 రోజులపాటు

మహా 'మత్తు' పార్టీ

- హైదరాబాద్ ఖాజాగూడ కేవ్ పబ్‌లో 'సైకెడెలిక్ డ్రగ్స్' పార్టీ
- ముందుగా డ్రగ్స్ తీసుకోవడమే దీని హాజరుకు అర్హత
- పాల్గొన్న 55 మంది.. 24 మందికి పాజిటివ్; కేసు నమోదు
- పట్టుబడినవారిలో ఐటీ సంస్థల ఉద్యోగులు, విద్యార్థులు
- పబ్‌ను సీజ్ చేసిన పోలీసులు.. నిర్వాహకులు పరార్ 13

న్యాప్‌కిన్లకు నిధుల కొరత

- నిరుటి నుంచి విద్యాసంస్థల్లో నిలిచిన పంపిణీ
- 8-12వ తరగతుల బాలికలకు తీవ్ర ఇబ్బందులు
- రాష్ట్రవ్యాప్తంగా 11 లక్షలమంది విద్యార్థినులు
- ఏడాదికి 25-30 కోట్లు అవసరమని అంచనా



హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): బాలికల ఆరోగ్య సంరక్షణలో భాగంగా నెలసరి సమయంలో ఇచ్చే శానిటరీ న్యాప్‌కిన్ల పంపిణీ ఏడాది కాలంగా నిలిచిపోయింది. వాస్తవానికి వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వీటిని కొనుగోలు చేసి విద్యాశాఖకు పంపితే, అక్కడి అధికారులు అన్ని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాల విద్యార్థినులకు అందించేవారు. ప్రస్తుతం వైద్య ఆరోగ్యశాఖ వద్ద నిధుల

మిగతా 12వ పేజీలో...

స్కూటీని ఢీకొట్టి.. మహిళను ఈడ్చుకెళ్లి!

- మద్యం మత్తులో కారు నడిపిన శివసేన ముఖ్య నేత కుమారుడు
- భార్య మృతి.. భర్తకు గాయాలు
- ముంబైలో ఘటన 2

రూ.5 కోట్లకు టోకరా!

12

- సైబర్ నేరగాళ్ల వలలో ట్రాన్స్‌కో రిటైర్డ్ అధికారి

పాంగాంగ్ సరస్సు వద్ద చైనా తవ్వకాలు



- భారీగా బంకర్ల నిర్మాణం
- వాటిలో ఆయుధాలు, ఇంధనం నిల్వ
- సాయుధ వాహనాలకు పటిష్ఠమైన షెల్టర్లు
- ఉపగ్రహ చిత్రాలతో వెలుగులోకి

మోదీ ప్రభుత్వం కళ్లకు గంతలు కట్టుకుంది: ఖర్గే

న్యూఢిల్లీ, జూలై 7: తూర్పు లద్దాక్‌లోని పాంగాంగ్ సరస్సు వద్ద భారీ బంకర్లు నిర్మించేందుకు చైనా సైన్యం చాలా లోతుగా తవ్వుతున్న దృశ్యాలు ఉపగ్రహ చిత్రాల ద్వారా వెలుగులోకి వచ్చాయి. ఆయుధాలు, ఇంధనం నిల్వ చేయడంతోపాటు, సాయుధ వాహనాలకు పటిష్ఠమైన షెల్టర్లుగానూ వీటిని ఉపయోగించుకోనున్నట్టు భావిస్తున్నారు. పాంగాంగ్ సరస్సు ఉత్తర దిక్కున పర్వతాల మధ్య సిర్జాప్ ప్రాంతంలో చైనా సైన్యం పీఎల్‌ఏ(ది పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ) ప్రధాన స్థావరం ఉంది. పాంగాంగ్ సరస్సు చుట్టుపక్కల ప్రాంతాల్లో మోహరించిన డ్రాగన్ సైన్యానికి అదే ప్రధానకార్యాలయం. దానిని వాస్తవాధీన రేఖకు సుమారు 5 కిలోమీటర్ల

మిగతా 2వ పేజీలో...

చార్‌ధామ్ యాత్ర తాత్కాలిక నిలిపివేత

- భారీ వర్షాల నేపథ్యంలో నిర్ణయం 2



ఏపీలో వచ్చిన సునామీలో ఓ సైకో కొట్టుకుపోయాడు. పెట్టుబడిదారులను ఆహ్వానిస్తుంటే.. 'మీపై నమ్మకం ఉంది కానీ ఆ భూతం మళ్లీ వస్తే పరిస్థితి ఏంట'ని అడుగుతున్నారు. అలాంటివారికి నేను భరోసా ఇస్తున్నా.. ఆ భూతాన్ని భూస్థాపితం చేస్తాం. - చంద్రబాబు

తెలంగాణలో టీడీపీ పునర్నిర్మాణం

- ఆంధ్రప్రదేశ్, తెలంగాణ.. నాకు రెండు కళ్లు
- రేవంత్ పాలనలో అభివృద్ధిలో తెలంగాణ
- నేను జైల్లో ఉన్నప్పుడు గచ్చిబౌలిలో పెట్టిన సభను ఎప్పటికీ మరువను: బాబు
- ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ అధినేతను ఘనంగా సన్మానించిన నేతలు
- చంద్రబాబును కలిసిన మంత్రి తుమ్మల
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి గాంధీ కూడా.. 3

ఇందిరమ్మ ఇంటికి భరోసా!

- పీఎంఏవై పథకానికి అనుసంధానం.. రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక ఉపశమనం
- పేదల ఇంటికి సాయం పెంచే యోచనలో కేంద్ర సర్కారు?
- పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలు.. గ్రామాల్లో రూ.1.30 లక్షలకు?

హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదల కోసం చేపట్టనున్న 'ఇందిరమ్మ ఇల్లు' పథకాన్ని ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై)కు అనుసంధానం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకాన్ని పీఎంఏవైకి అనుసంధానిస్తే అర్హులైన పేదలకు సత్వరమే ఇళ్ల నిర్మాణానికి సాయం అందించగలగడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక భారం తగ్గే అవకాశం ఉంటుంది. పీఎంఏవై కింద పలు రాష్ట్రాల్లో అమలు చేసే ఇళ్ల నిర్మాణాల పథకాలకు కేంద్రం కొంతమేర నిధులు అందిస్తుంటుంది. ఆ నిధులు అందుకోవాలంటే రాష్ట్రంలో ఎన్ని ఇళ్లను నిర్మించాల్సి ఉందనే అంశంతో పాటు లబ్ధిదారుల వివరాలను తెలుపుతూ కేంద్ర ప్రభుత్వానికి నివేదికను అందించాలి. ఆ వివరాలను పరిశీలించిన తర్వాత కేంద్రం విడతల వారీగా రాష్ట్రాలకు నిధులు అందజేస్తుంది. 2024-25లో పీఎంఏవై కింద దేశవ్యాప్తంగా 3 కోట్ల ఇళ్లను అర్హులైన పేదలకు అందించాలని మోదీ సర్కారు తొలి మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ఢిల్లీలో ప్రధాని మోదీతో భేటీ అయినప్పుడు రాష్ట్రానికి 25 లక్షల ఇళ్లను మంజూరు చేయాలని, ఆర్థిక సాయాన్ని కూడా పెంచాలని కోరారు. పీఎంఏవై మార్గదర్శకాలకు అనుగుణంగానే రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణాల విధివిధానాలను రూపొందిస్తామని తెలిపారు.



సర్కారుకు ఉపశమనం..


రాష్ట్రంలో ఇళ్లు లేని అర్హులైన పేదలకు (ఇంటి స్థలం ఉన్న వారికి ఆర్థిక సాయం, జాగా లేని వారికి స్థలమిచ్చి, ఆర్థిక సాయం) ఇంటిని నిర్మించుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సాయం చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. దీని ప్రకారం 2024-25లో తొలి విడతలో నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 4,16,500 ఇళ్లను పేదలకు అందించాలని, రిజర్వ్ కోటా కింద మరో 33,500 ఇళ్లను ప్రభుత్వ అధీనంలో ఉంచాలని

మిగతా 13వ పేజీలో...

పాంగాంగ్ వద్ద చైనా తవ్వకాలు

(మొదటి పేజీ తరువాయి)

దూరంలో నిర్మించారు. అది భారతదేశ భూభాగమని భారత్ వాదిస్తోంది. 2020 మేలో వాస్తవాధీన రేఖ వెంబడి ఇరుదేశాల సైన్యం మధ్య జరిగిన ఘర్షణలో 20 మందికి పైగా భారత సైనికులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఆ ఘటనకు ముందు ఇక్కడ ఎటువంటి మానవ ఆవాసాలూ లేవు. 2021-22 మధ్యలోనే సిర్జాప్‌లోని స్థావరాన్ని డ్రాగన్ సైన్యం నిర్మించింది. అక్కడ ఆయుధాలు, ఇంధనం, ఇతర సామగ్రి నిల్వ చేసుకునేందుకు భూగర్భ బంకర్లు నిర్మిస్తున్న విషయాన్ని అమెరికాకు చెందిన బ్లాక్‌స్కై సంస్థ ఉపగ్రహ చిత్రాల ద్వారా వెలుగులోకి తెచ్చింది. తమ ఉపగ్రహాల ద్వారా రోజుకు 15 సార్లు ఫొటోలు తీయగల సామర్థ్యం ఈ సంస్థకు ఉంది. మే 30వ తేదీన తీసిన ఫొటోలో 8 ఏటవాలు మార్గాలు ఉన్న భారీ భూగర్భ బంకర్ వెలుగులోకి వచ్చింది. దానికి సమీపంలోనే 5 ప్రవేశమార్గాలున్న మరో చిన్న బంకర్ కూడా ఉంది. ఇక్కడి ప్రధాన స్థావరం కోసం అనేక భారీ భవనాలు నిర్మించడంతోపాటు, సాయుధ వాహనాల పార్కింగ్‌కు పటిష్ఠమైన షెల్టర్‌ను కూడా ఏర్పాటు చేసుకున్నారు. కాగా, సరిహద్దులో పరిస్థితిపై ప్రభుత్వం దేశాన్ని విశ్వాసంలోకి తీసుకోవాలనే కాంగ్రెస్



పార్టీ డిమాండ్‌ను ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పునరుద్ఘాటించారు. పాంగాంగ్ సరస్సు వద్ద చైనా తవ్వకాలపై మీడియా కథనాన్ని ఖర్గే ఆదివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. 2020 మే వరకు భారత ఆధీనంలో ఉన్న భూభాగంలో చైనా ఎలా సైనిక స్థావరాన్ని నిర్మిస్తోందని ఖర్గే ప్రశ్నించారు. 'మన వీర సైనికులు ప్రాణత్యాగాలు చేసిన ప్రాంతం గాల్వాన్‌పై ప్రధాని మోదీ క్లీన్ చిట్ ఇచ్చి ఐదేళ్లయినా, మన ప్రాదేశిక సమగ్రతను చైనా అతిక్రమిస్తూనే ఉంది. మన భూభాగాన్ని ఆక్రమిస్తూనే ఉంది. వాస్తవాధీన రేఖ వెంబడి యథాతథ స్థితి పాటించకపోవడానికి మోదీ ప్రభుత్వమే బాధ్యత వహించాలి. డెప్సంగ్ ప్లెయిన్స్, డెంచోక్, గోగ్రా హాట్ స్ప్రింగ్స్ ప్రాంతాల్లోని మన 65 పెట్రోలింగ్ పాయింట్లలో 26 పెట్రోలింగ్ పాయింట్లను మనం కోల్పోయాం. మోదీ ప్రభుత్వం తన ఎర్రటి కళ్లపై 56 అంగుళాల చైనా గంతలు కట్టుకోవడంతో మోదీ యొక్క చైనీస్ గ్యారెంటీ కొనసాగుతోంది' అని ఖర్గే విమర్శించారు. దీనిపై అధికార పార్టీ బీజేపీ నుంచి గానీ, కేంద్ర ప్రభుత్వం నుంచి గానీ ఇంకా స్పందించలేదు.

లోకం తీరు



ఏటా 2 ఇంజెక్షన్లతో ఎయిడ్స్‌కు చెక్

(మొదటి పేజీ తరువాయి)

ఎంచుకుని వారిని మూడు కేటగిరీలుగా విభజించారు. మొదటి కేటగిరీలోని 2134 మంది మహిళలకు లెనాకాపవిర్ ఇంజెక్షన్ ఇచ్చారు. రెండో కేటగిరీలోని 1068 మందికి ట్రువాడా, 2136 మందికి డెస్కోవీ మాత్రలు ఇచ్చారు. వీరిలో ట్రువాడా మాత్ర తీసుకున్నవారిలో 16 మందికి, డెస్కోవీ మాత్ర తీసుకున్నవారిలో 39 మందికి ట్రయల్ సమయంలో హెచ్ఐవీ సోకింది. లెనాకాపవిర్ ఇంజెక్షన్ తీసుకున్న 2134 మందిలో ఒక్కరికి కూడా హెచ్ఐవీ సోకలేదు. అంటే.. 100 శాతం సక్సెస్. ఎయిడ్స్ కారక హ్యూమన్ ఇమ్యూనో వైరస్ నుంచి పూర్తిస్థాయిలో రక్షణ లభిస్తుందని తేలింది. ట్రువాడా, డెస్కోవీ మాత్రలను అభివృద్ధి చేసిన అమెరికన్ ఫార్మా దిగ్గజం గిలియడ్ సైన్సెస్ సంస్థే ఈ లెనాకాపవిర్‌నూ అభివృద్ధి చేసింది. తమ క్లినికల్ ట్రయల్స్‌కు సంబంధించిన పూర్తి వివరాలను సౌతాఫ్రికా, ఉగాండా దేశాల్లోని ఔషధ నియంత్రణ సంస్థలకు, ప్రపంచ ఆరోగ్య సంస్థకు అందించనున్నట్లు గిలియడ్ సైన్సెస్ వెల్లడించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ కొత్త ఔషధాన్ని ఆమోదిస్తుందని తాము ఆశిస్తున్నట్లు గిలియడ్ సైన్సెస్ ప్రకటించింది. దీన్ని ప్రపంచ మార్కెట్లోకి తీసుకువచ్చే ముందు ఈ ఔషధంపై మరిన్ని అధ్యయనాలు చేయాల్సిన అవసరం ఉందని ఆ సంస్థ అభిప్రాయపడింది. ఈ ఔషధం అందరికీ అందుబాటులో ఉండేలా తక్కువ ధరకు అందించే ఉద్దేశంతో గిలియడ్ సైన్సెస్ సంస్థ.. జనరిక్ డ్రగ్స్ తయారుచేసే కంపెనీలకు దీనికి సంబంధించిన లైసెన్స్‌లు ఇచ్చే యోచనలో ఉన్నట్లు సమాచారం. అంటే ఆయా ఫార్మా కంపెనీలు కూడా ఈ ఔషధాన్ని తయారు చేస్తాయన్నమాట. తద్వారా ఇది ఎక్కువగా అందుబాటులోకి వచ్చి ధర తగ్గుతుంది. అలాగే ప్రభుత్వాలు కూడా ఈ ఔషధాన్ని విరివిగా కొనుగోలు చేసి.. హెచ్ఐవీ నుంచి రక్షణ పొందాలనుకునే ప్రతీ ఒక్కరికి ఇవ్వాలని ఆ సంస్థ కోరింది. కాగా.. హెచ్ఐవీ చికిత్స నిమిత్తం ఈ డ్రగ్‌కు ఎఫ్‌డీఏ 2022లోనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

అసోంలో టీచర్‌ను పొడిచి చంపిన విద్యార్థి

గువాహటి, జూలై 7: అసోంలో 11వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థి తరగతి గదిలోనే ఉపాధ్యాయుడిని పొడిచి చంపేశాడు. ఈ ఘటన శివసాగర్ జిల్లాలో శనివారం జరిగింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేశ్ బారువా బెజవాడ(55) శివసాగర్ పట్టణంలో ఓ కోచింగ్ సెంటర్‌లో రసాయన శాస్త్రం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. సరిగ్గా చదవడం లేదని ఓ విద్యార్థిని శుక్రవారం ఆయన మందలించారు. శనివారం ఆ విద్యార్థి కోచింగ్ సెంటర్‌కు సివిల్ డ్రెస్‌లో వచ్చాడు. సాయంత్రం క్లాస్ చెప్పేందుకు వచ్చిన రాజేశ్.. సివిల్ డ్రెస్‌లో వచ్చినందుకు ఆ విద్యార్థిని మరోసారి మందలించాడు. దాంతో ఆ విద్యార్థి ఒక్కసారిగా కత్తితో ఉపాధ్యాయుడిపై దాడి చేశాడు. పలుమార్లు పొడవడంతో రాజేశ్ తీవ్రరక్తస్రావమై పడిపోయాడు. రాజేశ్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మరణించాడని వైద్యులు తెలిపారు. పోలీసులు మైనర్ అయిన ఆ విద్యార్థిని అదుపులోకి తీసుకున్నారు. దాడి చేసిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు.

ఇద్దరు బెంగాల్ ఐపీఎస్‌లపై క్రమశిక్షణ చర్యలు

కోల్‌కతా, జూలై 7: రాజ్‌భవన్ పరువు తీశారన్న ఆరోపణలపై పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఇద్దరు ఐపీఎస్ అధికారులపై కేంద్ర హోం శాఖ క్రమశిక్షణ చర్యలు ప్రారంభించింది. కోల్‌కతా పోలీసు కమిషనర్ వినీత్ గోయల్, డీసీపీ ఇందిరా ముఖర్జీలపై చర్యలు ప్రారంభించినట్లు తెలిపింది. వారిద్దరు రాజ్‌భవన్‌పై దుష్ప్రచారం చేస్తున్నారంటూ గవర్నర్ సివి.ఆనంద్ బోస్ కేంద్ర హోం శాఖకు ఫిర్యాదు చేయడంతో పాటు, వారి పనితీరుపై నివేదిక పంపించారు. ఎన్నికల అనంతరం జరిగిన హింసలో బాధితులైనవారు తనను కలిసేందుకు రాగా ఆ అధికారులు వారిని రానీయలేదని గవర్నర్ తెలిపారు. తనపై ఓ మహిళా ఉద్యోగి కల్పిత ఆరోపణలు చేయగా మరికొందరు పోలీసు అధికారులు వాటిని ప్రచారంలోకి తెచ్చారని తెలిపారు. గవర్నర్ కార్యాలయ ప్రతిష్ఠకు నష్టం కలిగించారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. తాను వద్దని చెప్పినప్పటికీ రాజ్‌భవన్ ఉద్యోగులను తనిఖీ చేస్తున్నారని, గుర్తింపు కార్డులు చూపాలని అడుగుతున్నారని తెలిపారు.

మహువాపై కొత్త చట్టం బీఎన్ఎస్ కింద కేసు

న్యూఢిల్లీ, జూలై 7: జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖా శర్మ తన బాస్(ప్రధాని మోదీ) పరువు కాపాడే పనిలో బిజీగా ఉన్నారనే అర్థం వచ్చేలా టీఎంసీ ఎంపీ మహువా ఇటీవల చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలపై ఆదివారం ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్త నేర న్యాయ చట్టమైన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్ 79 (మహిళలను కించపరిచేలా మాట్లాడడం, సంజ్ఞలు చేయడం) కింద కేసు పెట్టారు. మహువా వ్యాఖ్యలపై జాతీయ మహిళా కమిషన్ ఆదేశాల మేరకు ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు ఈ కేసు పెట్టారు.

హత్రాస్ బాధితులకు పరిహారం పెంచండి: రాహుల్

న్యూఢిల్లీ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): హత్రాస్ తొక్కిసలాట ఘటన బాధిత కుటుంబాలకు నష్టపరిహార మొత్తాన్ని పెంచి, వీలైనంత త్వరగా ఆ మొత్తం అందించాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ విజ్ఞప్తి చేశారు. క్షతగాత్రులకు సరైన చికిత్స అందించాలని, వారికి కూడా తగిన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు ఆయన లేఖ రాశారు. బాధితులకు యూపీ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం చాలా తక్కువగా ఉందని రాహుల్ అన్నారు. ఘటనకు స్థానిక యంత్రాంగ నిర్లక్ష్యమే ప్రధాన కారణమని బాధిత కుటుంబాలు తనతో చెప్పాయని ఆయన వివరించారు. ఈ వ్యవహారంపై నిష్పాక్షిక, పారదర్శక దర్యాప్తు జరిపించాలని కోరారు.

కశ్మీర్‌లో 8కి పెరిగిన ఎన్‌కౌంటర్ల మృతుల సంఖ్య

న్యూఢిల్లీ, జూలై 7: కుల్‌గాం జిల్లాలో శనివారం జరిగిన రెండు ఎన్‌కౌంటర్లలో మరణించిన వారి సంఖ్య ఎనిమిదికి పెరిగింది. మోడెర్‌గాంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక జవాను; చిన్నిగాంలో జరిగిన ఎదురు కాల్పుల్లో ఒక జవాను, నలుగురు ఉగ్రవాదులు మరణించారని, మొత్తం ఆరుగురు ప్రాణాలు కోల్పోయారని తొలుత అధికారులు ప్రకటించారు. అయితే ఆదివారం మోడెర్‌గాంలో మరో ఇద్దరు ఉగ్రవాదుల శవాలు దొరకడంతో మరణించిన వారి సంఖ్య ఎనిమిదికి పెరిగింది. ప్రాణాలు కోల్పోయిన జవాన్లలో సుశిక్షితుడైన ఒక పారా కమాండో కూడా ఉన్నారు.

రష్యాపై ఉక్రెయిన్ దాడులు.. వొరొనెజ్‌లో ఎమర్జెన్సీ

- మోదీ రష్యా పర్యటనకు ఒక్కరోజు ముందు ఘటన

మాస్కో, జూలై 7: రష్యా దాడులను ఉక్రెయిన్ తిప్పికొడుతోంది. క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడుతోంది. ఈ దాడులతో రష్యాలోని వొరొనెజ్‌లో మందుగుండు డిపోలో మంటలు చెలరేగాయి. దీంతో ఆదివారం వొరొనెజ్ ప్రాంతంలో అత్యవసర పరిస్థితిని విధించారు. ప్రధాని మోదీ రష్యా పర్యటనకు ఒక్కరోజు ముందు ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. అయితే ఉక్రెయిన్ దాడుల్లో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదని వొరొనెజ్ గవర్నర్ అలెగ్జాండర్ గుసేవ్ ఓ ప్రకటనలో తెలిపారు. పొడ్గొరెన్స్కీ ప్రాంతంలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు వెల్లడించారు. ఉక్రెయిన్ డ్రోన్ల దాడిని కొనసాగిస్తోందని.. మందుగుండు డిపోలో మంటలు చెలరేగాయని తెలిపారు. కాగా, భారత్-రష్యా 22వ వార్షిక శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు ప్రధాని మోదీ సోమవారం నుంచి రెండ్రోజుల పాటు రష్యాలో పర్యటించనున్నారు. 2019 తర్వాత మోదీ రష్యా పర్యటనకు వెళ్లడం ఇదే తొలిసారి.

పూరీ రథయాత్రలో తొక్కిసలాట

ఒక భక్తుడి మృతి.. ఐదుగురికి తీవ్రగాయాలు.. బలభద్రుడి రథం లాగుతుండగా ఘటన

- డీహైడ్రేషన్, శ్వాస సమస్యలతో 300 మంది ఆసుపత్రికి
- లక్షలాది భక్తులతో పూరీ కిటకిట
- వేడుకలకు హాజరైన రాష్ట్రపతి ముర్ము


పూరీ జగన్నాథుడి రథయాత్రకు తరలివచ్చిన జనం


యాత్ర ప్రారంభానికి ముందు రథాల ముందు ప్రణమిల్లుతున్న రాష్ట్రపతి ముర్ము

భువనేశ్వర్, జూలై 7: ఒడిశాలోని సముద్రతీర క్షేత్రం పూరీలో ఆదివారం నిర్వహించిన జగన్నాథ రథయాత్రలో అపశ్రుతి చోటు చేసుకుంది. రథయాత్ర సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ఒక భక్తుడు మృతిచెందగా మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. బలభద్రుడి తాళధ్వజ రథాన్ని లాగడానికి భక్తులు ఒక్కసారిగా ఎగబడటం ఈ దుర్ఘటనకు దారితీసింది. తొక్కిసలాటలో కింద పడిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లిన గుర్తు తెలియని 60ఏళ్ల వృద్ధుడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తొక్కిసలాటలో గాయపడిన మరో ఐదుగురిని కూడా ఆస్పత్రికి తరలించగా వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. మరోవైపు విపరీతమైన ఎండ, ఉక్కపోతతో యాత్రకు హాజరైన 300మందికి పైగా భక్తులు డీహైడ్రేషన్, శ్వాస తీసుకోవడంతో ఇబ్బందులతో ఆస్పత్రిలో చేరారు. వీరిలో 50 మందిని ప్రాథమిక చికిత్స అనంతరం డిశ్చార్జి చేశారు. ఒడిశా ఆరోగ్యశాఖ కార్యదర్శి ఆస్పత్రికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.

మార్మోగిన 'జై జగన్నాథ్' నినాదాలు

పూరీ జగన్నాథుడి రథయాత్ర ఆదివారం కోలాహలంగా ప్రారంభమైంది. 1971 తర్వాత తొలిసారిగా ఈ ఏడాది రెండు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలను ప్రత్యక్షంగా వీక్షించడానికి దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. ఆలయం నుంచి దేవతామూర్తులను రథాల వద్దకు తీసుకొచ్చే పహండి కార్యక్రమం మధ్యాహ్నం 2.15 గంటలకు ముగిసింది. గర్భాలయం నుంచి మూలవిరాట్టు బయలుదేరే ముందు మంగళహారతి, మైలం, నవయవ్వన దర్శనం, నేత్రోత్సవం తదితర ఆచారాలు నిర్వహించారు. తొలుత బలభద్రుడిని తాళధ్వజ రథంపైకి, సుభద్రను దర్పదలన్ రథంపైకి చేర్చారు. భక్తుల జయజయధ్వానాల మధ్య జగన్నాథుడు తన నందిఘోష్ రథం వద్దకు చేరుకున్నారు. పహండీ అనంతరం రథాలను అధిష్ఠించిన దేవతామూర్తులకు పూరీ శంకరాచార్య నిశ్చలానంద సరస్వతి ప్రత్యేకపూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 4గంటలకు పూరీ రాజు గజపతి దివ్య సింగ్ దేవ్ రథాలపై చెరాపహరా (చీపురుతో రథాలను శుభ్రం చేసే ప్రక్రియ) చేశారు. రథాలకు చెక్క గుర్రాలను అమర్చిన తర్వాత రథయాత్ర ప్రారంభమైంది. సాయంత్రం 4.50 గంటలకు బలభద్రుడి రథం తాళధ్వజం ముందుగా బయలుదేరింది. ఆ తర్వాత 6 గంటలకు దర్పదలన రథంలో సుభద్ర దేవి కదిలారు. 6.45 గంటలకు నందిఘోష్ రథంలో జగన్నాథుడి యాత్ర కదిలింది. ఈ ఊరేగింపు జగన్నాథుడి ఆలయం వద్ద ప్రారంభమై అక్కడకు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుండిచా ఆలయం వద్దకు చేరుకొంటుంది. ఆదివారం రాత్రి రథయాత్ర ముగిసే సమయానికి బలభద్రుడు, దేవి సుభద్ర రథాలు గ్రాండ్ రోడ్డులోకి ప్రవేశించాయి. మారికోట్ చాక్ వద్ద, రాజ్ ప్యాలెస్ సమీపంలో ఈ రెండింటినీ వరుసగా నిలిపివేశారు. జగన్నాథుడి రథం ఆలయ సింహద్వారం నుంచి బయలుదేరి కొన్ని అడుగులు ప్రయాణించిన తర్వాత ఆగిపోయింది. సోమవారం ఉదయం రథయాత్ర తిరిగి ప్రారంభంకానుంది. కాగా, రథయాత్రలో దాదాపు 15 లక్షల మంది భక్తులు పాల్గొనే అవకాశం ఉందని అంచనా వేసిన అధికారులు ఆ మేరకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు. కాగా, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై నుంచి రాష్ట్రపతి ముర్ము రథయాత్రను వీక్షించారు. మూడు రథాలకు ప్రదక్షిణలు చేసి బలభద్రుడి తాళధ్వజాన్ని, సుభద్ర దర్పదలన రథాన్ని ముర్ము ప్రారంభించారు. పూరీ రథయాత్రలో దేశ రాష్ట్రపతి పాల్గొనడం ఇదే మొదటిసారి. కాగా పశ్చిమ బెంగాల్ సీఎం మమత ఆదివారం ఇస్కాన్ ఆధ్వర్యంలో కోల్‌కతాలో నిర్వహించిన జగన్నాథుడి రథయాత్రలో పాల్గొన్నారు. రథాన్ని లాగారు.

చార్‌ధామ్ యాత్ర తాత్కాలిక నిలిపివేత

- భారీవర్షాల నేపథ్యంలో నిర్ణయం
- వరదలతో గోవా, మహారాష్ట్రల్లో పలుచోట్ల చిక్కుకుపోయిన జనం

డెహ్రాడూన్, పనాజీ, ముంబై, జూలై 7: ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు కొనసాగుతాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో స్థానిక అధికారులు చార్‌ధామ్ యాత్రను ఆదివారం తాత్కాలికంగా నిలిపివేశారు. ఆది, సోమవారాల్లో భారీ వర్ష సూచన ఉండటంతో యాత్రికుల భద్రత కోసం ఈ నిర్ణయం తీసుకున్నామని గెర్వాల్ కమిషనర్ వినయ్ శంకర్ పాండే తెలిపారు. యాత్రికులు రుషికేశ్‌ను దాటివెళ్లవద్దని, ఇప్పటికే యాత్రలో ఉన్న వాళ్లు ఎక్కడిక్కడే నిలిచిపోవాలని హెచ్చరించారు. ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలతో కొండచరియలు విరిగిపడుతున్నాయి. దీంతో బద్రీనాథ్‌కు వెళ్లే మార్గంలో పలుచోట్ల ఆటంకాలు ఏర్పడ్డాయి. హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు యాత్రికులు బద్రీనాథ్‌కు వెళ్లి మోటార్‌సైకిల్‌పై తిరిగి వస్తుండగా కొండచరియలు పడి దుర్మరణం పాలైన విషయం తెలిసిందే. రుషికేశ్‌లోని గంగానదిలో నీటి మట్టం ప్రమాదకరస్థాయికి చేరుకోవటంతో తీరప్రాంతంలోని ప్రజలను సురక్షితప్రాంతాలకు తరలించారు.

జలపాతం వద్ద చిక్కుకున్న పర్యాటకులు

భారీ వర్షాలతో గోవా, మహారాష్ట్రల్లో నదులు ఉప్పొంగుతున్నాయి. గోవాలోని సత్తారీ తాలూకాలో ఆదివారం ఓ జలపాతం వద్దకు వెళ్లిన పర్యాటకులు.. అకస్మాత్తుగా నీటి ఉధృతి పెరగడంతో అక్కడే చిక్కుకుపోయారు. అధికారులు 50 మందిని రక్షించారు. మరో 30 మందిని రక్షించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని ఎస్పీ అక్షత్ కౌశల్ తెలిపారు. మహారాష్ట్ర థానే పరిధిలో ఓ రిసార్టు వరద ముంపునకు గురవటంతో అక్కడున్న 49 మందిని ఎన్డీఆర్ఎఫ్ రక్షించింది. పాల్ఘాట్ జిల్లాలో 16మంది గ్రామీణులు వరద ప్రవాహంలో చిక్కుకుపోగా ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది కాపాడారు.

బీసీసీఐ గర్వం అణిగింది

- జింబాబ్వేతో మొదటి మ్యాచ్‌లో భారత్ జట్టు ఓటమిపై థరూర్ వ్యాఖ్య

న్యూఢిల్లీ, జూలై 7: జింబాబ్వేతో ఐదు టి20 మ్యాచ్‌ల సిరీస్‌కు భారత ద్వితీయ శ్రేణి జట్టును పంపడంపై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. టీమ్ ఇండియా తొలి మ్యాచ్‌లో ఓడిపోవడంతో బీసీసీఐ గర్వం అణిగిందన్నారు. "టి20 ప్రపంచకప్ గెలిచినందుకు ముంబైలో చేసుకున్న సంబరాలు ప్రతిధ్వనిస్తుండగానే.. బలహీన జట్టయిన జింబాబ్వే చేతిలో పరాజయం ఎదురైంది. ప్రత్యర్థిని తేలిగ్గా తీసుకున్నందుకు బీసీసీఐకి తగిన శాస్తి జరిగింది. జూన్ 4 (దేశంలో సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజు)న కానీ, జూలై 6న కానీ (భారత్‌పై జింబాబ్వే గెలిచిన రోజు).. అహంకారం ఓ మెట్టు దిగింది. జింబాబ్వే బాగా ఆడింది" అంటూ ట్వీట్ చేశారు. దీనిపై బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా తీవ్రంగా స్పందించారు. "ఓటమి నిజమే. అయితే, జింబాబ్వేపై ఆడింది మన ప్రధాన జట్టు కాదు. కాంగ్రెస్ మాత్రం మోదీపై ద్వేషాన్ని దేశంపైన చూపుతోంది. భారత్ పరాజయంపై సంబరాలు చేసుకుంటోంది" అంటూ మండిపడ్డారు. ప్రతిగా.. "అంతర్జాతీయ మ్యాచ్‌లలో భారత జట్టు అంటే అదే స్థాయిలో ఉండాలి. కానీ, ఇది ఇండియా ఎ టీమ్. బుమ్రా, సూర్య, పంత్, సిరాజ్ వంటి వారిలో సగం మందైనా ఉండాల్సింది. వారు అందుబాటులో లేకుంటే టూర్‌ను వాయిదా వేయాల్సింది. అందుకే బీసీసీఐకి విజయం గర్వం ఇచ్చిందన్నాను" అంటూ థరూర్ మరో ట్వీట్ చేశారు. కాగా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా కుమారుడు జై షా బీసీసీఐ కార్యదర్శిగా ఉన్న సంగతి తెలిసిందే.

స్కూటీని ఢీకొట్టి.. మహిళను ఈడ్చుకెళ్లి!

- ముంబైలో హిట్ అండ్ రన్ కేసు
- మద్యం మత్తులో కారు నడిపిన శివసేన ముఖ్యనేత కుమారుడు
- మహిళ మృతి.. పరారీలో నిందితుడు


ప్రమాదానికి కారణమైన కారు ఇదే..

ముంబై, జూలై 7: పుణే కారు ప్రమాద ఘటన మరవకముందే.. ముంబైలో అలాంటి ఘోరమే మరొకటి చోటుచేసుకుంది. ఆదివారం తెల్లవారు జామున వర్లీ ప్రాంతంలో ఓ బీఎండబ్ల్యూ కారు స్కూటీని వెనక నుంచి అతి వేగంతో ఢీ కొట్టింది. దీంతో స్కూటీ నడుపుతున్న వ్యక్తి పక్కకు ఎగిరిపడగా.. అతడి భార్యను కొద్ది దూరం కారు ఈడ్చుకెళ్లింది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు అప్రమత్తమై ఆమెను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. దంపతులను ప్రదీప్ నఖవా, కావేరి నఖవా (45)గా పోలీసులు గుర్తించారు. అధికార పార్టీ శివసేన (షిండే)కు చెందిన ముఖ్య నేత రాజేశ్ షా కుమారుడు మిహిర్ షా (24)నే ఆ కారు నడిపాడని ధ్రువీకరించారు. ప్రమాదం జరిగినప్పటి నుంచి మిహిర్ పరారీలో ఉన్నాడని.. అతడిని పట్టుకునేందుకు నాలుగు బృందాలను ఏర్పాటు చేసినట్లు సీనియర్ పోలీసు అధికారి కృష్ణకాంత్ తెలిపారు. పోలీసు వర్గాల సమాచారం మేరకు.. గత రాత్రి జుహూలోని ఓ బార్‌లో మిహిర్ అతిగా మద్యం సేవించాడు. ఇంటికెళ్లే సమయంలో తానే కారు నడుపుతానని డ్రైవర్ నుంచి తీసుకుని అతి వేగంతో నడుపుతూ వర్లీలో స్కూటీని ఢీకొట్టాడు.. భయంతో కారుతో సహా అక్కడి నుంచి ఉడాయించాడని సమాచారం. అనంతరం అతడు నేరుగా ఓ స్నేహితురాలి ఇంటికెళ్లాడని తెలియడంతో పోలీసులు ఆమెను కూడా విచారించారు. ప్రమాద సమయంలో కారులోనే ఉన్న డ్రైవర్ రాజ్‌శ్రీ బిజావత్‌తో పాటు కారు రాజేశ్ షాపై పేరుపై ఉండటంతో ఆయన్ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఘటనపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

వాళ్లను ఎవరేం చేయలేరు..

ప్రమాదంలో స్వల్పగాయాలతో బయటపడ్డ ప్రదీప్ నఖవా వర్లీ పోలీస్ స్టేషన్‌లో మీడియాతో మాట్లాడారు. 'మేం చేపలు అమ్ముకొని బతికేవాళ్లం. ఎప్పటిలాగే తెల్లవారు జామున చేపల కొనేందుకు బయలుదేరగా.. 5.30 గంటల సమయంలో ఓ కారు వెనక నుంచి ఢీ కొట్టింది. మాకు ఇద్దరు పిల్లలు.. నా బండిని ఢీకొట్టిన వారు పెద్ద వాళ్లు.. వారిని ఎవరేం చేయలేరు' అని ఆవేదన చెందారు. బాధితున్ని శివసేన(యూబీటీ) నేత ఆదిత్య ఠాక్రే పరామర్శించారు. నిందితున్ని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా, ముంబై ప్రమాద ఘటనపై సీఎం ఏక్‌నాథ్ షిండే విచారం వ్యక్తం చేశారు. 'ఇది దురదృష్టకరం.. పోలీసులతో మాట్లాడాను. నిందితులెవరైనా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. ఎవరినీ విడిచిపెట్టం.. చట్టం ముందు అందరూ సమానమే' అని వ్యాఖ్యానించారు.

తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీ
హర్షణీయం: వెంకయ్య

న్యూఢిల్లీ, జూలై 7(ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు భేటీ కావడం ఓ మంచి ముందడుగని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు, తెలంగాణ సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి భేటీపై ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. వారిద్దరూ ఇదే స్ఫూర్తితో ముందుకు సాగి ఉభయ రాష్ట్రాల మధ్య అపరిష్కృత అంశాలపై వీలైనంత త్వరలో అంగీకారానికి వస్తారని ఆశిస్తున్నానని పేర్కొన్నారు.

పిల్లలు పోర్న్ చూడకుండా స్పెయిన్ ఫోన్ యాప్

మాడ్రిడ్, జూలై 7: సెల్‌ఫోన్లు అందుబాటులోకి వచ్చి చిన్నపిల్లలు అశ్లీల చిత్రాల వీక్షణకు బానిసలైపోతున్న నేపథ్యంలో స్పెయిన్ అప్రమత్తమైంది. పిల్లలు 'పోర్న్' సైట్లను చూడకుండా నిరోధించేందుకు కార్టెరా డిజిటల్ బీటా పేరుతో ఓ యాప్‌ను అభివృద్ధి చేసింది. ఒక్కముక్కలో చెప్పాలంటే.. పెద్దలు మాత్రమే చూడాల్సిన కంటెంట్‌ను చూడ్డానికి ప్రభుత్వం 'పెద్దలకు మాత్రమే' ఇచ్చే 'పోర్న్ పాస్‌పోర్ట్' అన్నమాట. ఈ యాప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకుని పిల్లలు నీలిచిత్రాలు చూడకుండా ఆపొచ్చు. సెల్‌ఫోన్‌లో అశ్లీల కంటెంట్ చూడాలనుకునేవారు ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డుల ద్వారా వయసును ధ్రువీకరించుకున్నాక యాప్ 30 'పోర్న్ క్రెడిట్స్'ను ఇస్తుంది. వాటితో నెల రోజులు నీలిచిత్రాలు చూడొచ్చు. కంప్యూటర్‌లో పోర్న్ సైట్లు చూడాలంటే ఒక్కో క్రెడిట్ ఒక్కో క్యూఆర్ కోడ్‌ను ఉత్పత్తి చేస్తుంది. మొబైల్‌తో దాన్ని స్కాన్ చేసి వేలిముద్ర, ఫేస్ రికగ్నిషన్, పిన్ నంబర్, ప్యాటర్న్ ద్వారా వయసును ధ్రువీకరించుకోవాలి. సెల్‌ఫోన్‌లోనే చూడాలనుకుంటే క్యూఆర్ కోడ్ అవసరం లేదు. వేలిముద్ర, ఫేస్ రికగ్నిషన్ వంటి వాటి ద్వారా సదరు వెబ్‌సైట్లను యాక్సెస్ చేయొచ్చు. పిల్లలు తమ వేలిముద్రను ఆ ఫోన్‌లో నమోదు చేసుకున్నా యాప్‌లో వయసు ధ్రువీకరించుకునేందుకు వాడిన వేలిముద్ర వారి తల్లిదండ్రులది అయి ఉంటుంది కాబట్టి ఆ సైట్లు వారి వేలిముద్రతో తెరచుకోవు. పెద్దలు ఒక్కో క్రెడిట్‌తో ఒక పోర్న్ సైట్‌ను పదిసార్లు చూడొచ్చు. నెలలోపే 30 క్రెడిట్లు అయిపోతే ఎన్నిసార్లైనా రెన్యూ చేసుకోవచ్చు. చిన్నపిల్లలు పోర్న్ చూడకుండా నిరోధించడమే ప్రభుత్వ ఉద్దేశం కాబట్టి పెద్దలకెలాంటి పరిమితీ విధించలేదు.

కెనడాలో ఇళ్ల సంక్షోభం

- భారీగా పెరిగిన అద్దెలు
- కొందామన్నా.. అదేమోత
- మరోవైపు పెరిగిన నిరుద్యోగం



న్యూఢిల్లీ, జూలై 7: విద్యార్థులు, వృత్తి నిపుణులకు గమ్యస్థానంగా ఉన్న కెనడాలో ఇళ్ల సంక్షోభం తలెత్తింది. ఇళ్ల అద్దెలతోపాటు లీజుల ధరలు కూడా ఆకాశాన్నంటుతున్నాయి. పోనీ ఒక ఇల్లు కొనేద్దాంలే! అనుకున్నా అవి కూడా అలానే ఉన్నాయి. దీంతో విద్యార్థులు, వలసదారులు కెనడా శివారు ప్రాంతాలకు తరలిపోతున్నారు. మరికొందరు ఈ అద్దెల ధరలు భరించలేక దేశాన్నే విడిచిపెట్టేస్తున్నారు. ఎక్కువ మంది అల్‌బెర్టా ప్రావిన్స్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు. మరికొందరు అమెరికాకు వలస పోతున్నారు. ఇళ్ల ధరలను భరించలేక కెనడాను వదిలేస్తున్న వారి సంఖ్య 28% ఉందని ఆంగస్ రీడ్ ఇనిస్టిట్యూట్(ఏఆర్ఐ) తన నివేదికలో పేర్కొంది. ఫలితంగా కెనడా ప్రతిష్ఠ దెబ్బతింటోందని పేర్కొంది. ప్రధానంగా ఖరీదైన నగరాలుగా పేరున్న వాటిలో ఇళ్ల ధరలు, అద్దెలు కూడా నింగినంటాయి. గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికం నాటికి ఇళ్ల అద్దెల ద్రవ్యోల్బణం 7.8 శాతానికి చేరింది. ఎన్నో ఆశలతో కెనడాకు వస్తున్న వలసదారులు ఇక్కడ నివసించేందుకు సౌకర్యవంతమైన పరిస్థితి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నివేదికలోని కీలక అంశాలు ఇవీ..

- ప్రస్తుతం ఉన్న ఇళ్ల అద్దెలు పెరగడంతో వాటిని ఖాళీ చేయాలని 28% మంది నిర్ణయించుకున్నారు.
- గత పదేళ్లుగా కెనడాలోనే ఉంటున్నవారిలో 39% మంది ఇతర ప్రాంతాలకు తరలిపోయారు.
- ప్రతి 10 మంది కెనడా వాసుల్లో ముగ్గురు ఇళ్ల ధరలు పెరిగిపోవడంపై ఆందోళనగా ఉన్నారు.
- కెనడాకు వలసదారులు పెరిగిపోయిన కారణంగా ఇళ్ల సంక్షోభం ఏర్పడిందని 44.5% మంది కెనడియన్లు అభిప్రాయపడుతున్నారు.
- కెనడాలో 2013 నాటికి 32,828 మంది ఉన్న భారతీయుల సంఖ్య పదేళ్లలో 2023 నాటికి 1,39,715కి చేరింది. అంటే.. 326 శాతం పెరిగింది.

29 నెలల గరిష్ఠానికి నిరుద్యోగం

కెనడా ఉద్యోగ కల్పన ఒడిదుడుకుల్లో పడింది. గత నెల జూన్‌లో 1400 మంది ఉద్యోగాలు కోల్పోయారు. ఇదేసమయంలో నిరుద్యోగ సూచి 29 నెలల గరిష్ఠాన్ని(6.4%) నమోదు చేసింది. వాస్తవానికి మే నెలలోనే మార్కెట్ నిపుణులు నిరుద్యోగం 6.3 శాతానికి పెరుగుతుందని అంచనా వేశారు. కానీ, వారి అంచనాలు దాటి మరీ నిరుద్యోగం నమోదైంది. యువతలో నిరుద్యోగ రేటు 0.9% నుంచి 13.5 శాతానికి చేరిందని విశ్లేషకులు తెలిపారు. ఉద్యోగుల వేతనాల పెంపు.. నియామకాలపై ప్రభావం చూపుతోందని అంటున్నారు. ఈ ఏడాది మేలో గంటల ప్రాతిపదికన ఉద్యోగుల వేతనాన్ని 5.2% నుంచి 5.6 శాతానికి పెంచారు. ఈ వేతనాల పెంపు నియామకాలపై ప్రభావం చూపిందని చెబుతున్నారు.



చంద్రబాబుతో ముచ్చటిస్తున్న తుమ్మల

తెలుగు రాష్ట్రాలు అభివృద్ధిలో కలిసి సాగాలి

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఏపీ సీఎం చంద్రబాబుతో భేటీ

హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఇరు రాష్ట్రాలు అన్నదమ్ముల్లా విడిపోయినా అభివృద్ధిలో కలిసి సాగాలని, ఎలాంటి జలవివాదాలు లేకుండా తెలుగు రాష్ట్రాలు పురోభివృద్ధి సాధించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తెలుగు రాష్ట్రాలు తలెత్తుకొని ఉండేలా అభివృద్ధి చెందాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో ఆశాభావం వ్యక్తం చేసినట్లు తుమ్మల తెలిపారు. మంత్రి తుమ్మల ఆదివారం నగరంలోని చంద్రబాబు నివాసానికి వెళ్లి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. తెలుగు రాష్ట్రాలకు మేలు కలిగే జాతీయ రహదారులు, జలవనరులు, రైల్వేలైన్లపై చర్చించినట్లు తుమ్మల తెలిపారు. పట్టిసీమ నుంచి ప్రకాశం బ్యారేజ్‌కు.. అక్కడి నుంచి పులిచింతల, నాగార్జునసాగర్‌కు గోదావరి జలాలు తరలించటం భవిష్యత్తులో చాలా కీలకమని, పట్టిసీమ-పులిచింతల లింకుతో తెలంగాణకు మేలు జరుగుతుందన్నారు. సత్తుపల్లి నుంచి కొవ్వూరు రైల్వేలైన్, పెనుబల్లి నుంచి కొండపల్లి రైల్వేలైను పనులు పూర్తయితే ఇరు రాష్ట్రాలకు ప్రయోజనకరంగా ఉంటుందని చంద్రబాబుకు సూచించినట్లు తుమ్మల తెలిపారు. రైల్వే లైన్ నిర్మాణంతో బొగ్గు రవాణా, పుణ్యక్షేత్రాలు సందర్శించే భక్తులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కొత్తగూడెం నుంచి పెనుబల్లి రైల్వేలైను పూర్తయ్యిందని, ఏపీలో రైల్వేలైనుపై దృష్టి పెట్టాలని సూచించారు. భద్రాచలంలో ఐదు గ్రామాల విలీనం ఆవశ్యకతను చంద్రబాబుకు వివరించినట్లు తెలిపారు.

చంద్రబాబును కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

నార్సింగ్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును గ్రేటర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రకాష్‌గౌడ్, ఆరెకపూడి గాంధీ ఆదివారం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీ సీఎంగా బాధ్యతలు చేపట్టి నగరానికి రావడంతో ఆయన్ను ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు.



తెలంగాణలో టీడీపీ పునర్నిర్మాణం

ఏపీ, తెలంగాణ నాకు రెండు కళ్లు.. తెలుగు జాతి ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యం: చంద్రబాబు

హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో టీడీపీని పునర్నిర్మిస్తామని ఆ పార్టీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు ప్రకటించారు. పార్టీకి యువ రక్తాన్ని ఎక్కిస్తామని, విద్యావంతులకు అవకాశం ఇస్తామని, మూడు నాలుగు దశాబ్దాలు పార్టీ ఉత్సాహంగా పని చేసేలా సమర్థ నాయకత్వాన్ని తీసుకొస్తామని వెల్లడించారు. తెలంగాణలో పార్టీ బలోపేతం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని వివరించారు. "ఎన్నికల్లో పోటీచేయక పోయినా పెద్దఎత్తున కార్యకర్తలు తరలిరావడం చూస్తుంటే తెలంగాణలో పార్టీ బలం ఏమిటో తెలుస్తోంది. 20 ఏళ్లుగా అధికారంలో లేకున్నా కార్యకర్తల్లో అభిమానం, పట్టుదల ఉంది. తెలుగుజాతి ఉన్నంతవరకు తెలంగాణ గడ్డపై పసుపు జెండా ఎగురుతూనే ఉంటుంది. ఏపీలో పరిస్థితులను సెట్ చేసిన తర్వాత ఇక్కడకు వస్తా" అని వివరించారు. ఏపీ సీఎంగా మరో సారి బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌కు వచ్చిన చంద్రబాబుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అంతకుముందు జూబ్లీహిల్స్‌లోని చంద్రబాబు నివాసం నుంచి ఎన్టీఆర్ భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ తనకు పునర్జన్మ అంటూ ఉంటే తెలుగు గడ్డపైనే పుట్టాలని భగవంతుడిని కోరుకుంటానన్నారు. అన్నదమ్ములుగా విడిపోయినా రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధే టీడీపీ లక్ష్యమని స్పష్టం చేశారు. ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు పరస్పరం సహకరించుకుంటూ అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. "రెండు రాష్ట్రాల మధ్య ఉన్న విభజన సమస్యలపై చర్చించేందుకు నేను చొరవ తీసుకుని తెలంగాణ సీఎం రేవంత్‌కు లేఖ రాస్తే.. ఆయన తక్షణమే స్పందించారు. ఇందుకు ఆయన్ను అభినందిస్తున్నా. ఏపీ, తెలంగాణాలో వేర్వేరు ప్రభుత్వాలు ఉన్నాయి. సైద్ధాంతికంగా వైరుధ్యాలున్నా తెలుగు జాతి అభ్యున్నతే లక్ష్యంగా శనివారం రెండు రాష్ట్రాల మధ్య చర్చలు ప్రారంభమయ్యాయి. భవిష్యత్తులో అధికారులతో కమిటీలు ఏర్పాటు చేసి, సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని నిర్ణయించాం" అని వివరించారు. తెలంగాణ, ఏపీ తనకు రెండు కళ్లు అని పేర్కొంటూ, రెండు రాష్ట్రాల అభివృద్ధిని తాను కోరుకుంటానని చెప్పారు. 2047నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధాని మోదీ పని చేస్తున్నారని, ఆ పరంపరలో తెలుగు జాతి నంబర్ వన్‌గా నిలవాలని ఆకాంక్షించారు. ఎన్టీఆర్, పీవీ నర్సింహారావు తెలుగు బిడ్డలు కావడం మనకు గర్వకారణమని పేర్కొన్నారు.



హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన సభలో ప్రసంగిస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

సీఎం రేవంత్‌కు ప్రశంసలు

తెలంగాణ రాష్ట్రాన్ని సీఎం రేవంత్‌రెడ్డి అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారని చంద్రబాబు ప్రశంసించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దూరదృష్టితో తాను చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఆ తర్వాత వచ్చిన సీఎంలు కొనసాగించడం అభినందనీయమన్నారు. సైబరాబాద్ అని మాట్లాడితే ఆ రోజు తనను ఎగతాళి చేశారని, కానీ.. ఇప్పుడు ఆ అభివృద్ధి ఫలాలు యువతకు అందుతున్నాయని పేర్కొన్నారు. తనను అక్రమంగా జైల్లో పెట్టినప్పుడు సంఘీభావంగా ఇక్కడ ఆందోళనలు నిర్వహించారని, ముఖ్యంగా గచ్చిబౌలిలో నిర్వహించిన సభను జీవితంలో మరచిపోలేనని చెప్పారు. "విభజన సమయానికి (2014లో) తలసరి ఆదాయం పరంగా చూస్తే ఏపీ కంటే 35 శాతం ముందంజలో తెలంగాణ ఉంది. 2014-19 వరకు ఏపీ సీఎంగా తాను పనిచేసిన సమయంలో ఈ వ్యత్యాసాన్ని 27.5శాతానికి తగ్గించాను. ఏపీలో గడచిన ఐదేళ్లలో విధ్వంస పాలన కారణంగా ఈ వ్యత్యాసం 44శాతానికి చేరింది. ఒకవేళ పొరపాటున మొన్నటి ఎన్నికల్లో కూటమి గెలువకపోతే ఈ వ్యత్యాసం వంద శాతానికి పెరిగేది" అని వ్యాఖ్యానించారు. తలసరి ఆదాయంలో గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక కంటే తెలంగాణ(రూ.3,08,732) ముందంజలో ఉందని పేర్కొంటూ, ఏపీ తలసరి ఆదాయం రూ.2,19,518గా ఉందని వివరించారు.

ఏపీలో ఆ భూతాన్ని భూస్థాపితం చేస్తాం

ఏపీ సమస్యల సుడిగుండంలో ఉందని, ఇబ్బందులను అధిగమించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాల్సిన అవసరం ఉందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. "మొన్నటి ఎన్నికల వేళ ఇక్కడి నుంచి పార్టీ అభిమానులు పెద్దఎత్తున తరలి వచ్చి పని చేశారు. విదేశాల నుంచి ఎన్ఆర్ఐలు వ్యయప్రయాసలకు ఓర్చి తరలివచ్చారు. యువగళం హిట్ అయింది. నన్ను అక్రమంగా జైల్లో ఉంచినప్పుడు పవన్‌కల్యాణ్ స్వయంగా వచ్చి అండగా నిలిచారు. ఇంతమంది కష్టపడితే కూటమి అధికారంలోకి వచ్చింది. ఈ సునామీలో ఓ సైకో కొట్టుకుపోయాడు. ఆయన సైకోనే కాదు.. భూతం అని కొంతమంది అంటున్నారు.. పెట్టుబడిదారులను ఆహ్వానిస్తుంటే మీపై నమ్మకం ఉంది కానీ.. ఆ భూతం మళ్లీ వస్తే పరిస్థితి ఏంటని అడుగుతున్నారు.. అలాంటివారికి నేను భరోసా ఇస్తున్నా.. ఆ భూతాన్ని భూ స్థాపితం చేస్తాం" అని ప్రకటించారు. ప్రజాస్వామ్యంలో నియంతృత్వ పోకడలకు వెళ్తే ప్రమాదకరమని, అలాంటి వారిని ఎక్కడికి పంపించాలో ప్రజలకు బాగా తెలుసని వ్యాఖ్యానించారు. అందుకే.. భూమ్మీదనే నడవాలని తన సహచర మంత్రులకూ హిత బోధ చేసినట్లు తెలిపారు. 1995లో సీబీఎన్ ఎలా పని చేశాడో.. 2024లోనూ అదే విధంగా పని చేస్తాడని స్పష్టం చేశారు.



ఎస్సై మృతదేహంతో నారక్కపేటలో ఆందోళన చేస్తున్న దృశ్యం

అశ్వారావుపేట ఎస్సై మృతి

- గత నెల 30న ఆత్మహత్యాయత్నం
- సీఐ వేధింపులే కారణం... దళిత సంఘాల ఆందోళన
- ఎస్సై మరణవార్త విని గుండెపోటుతో మేనత్త మరణం

అశ్వారావుపేట, నర్సంపేట టౌన్, దుగ్గొండి, జూలై 7: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్(38) మృతి చెందారు. సీఐ జితేందర్ రెడ్డి, నలుగురు కానిస్టేబుళ్ల వేధింపులకు గురిచేస్తున్నారంటూ... జూన్ 30న మహబూబాబాద్‌లో పురుగు మందు తాగి శ్రీనివాస్ ఆత్మహత్యాయత్నం చేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి హైదరాబాదులోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నేతలు ఆదివారం శ్రీనివాస్ స్వగ్రామమైన నారక్కపేటలోని జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. శ్రీనివాస్ మృతికి కారణమైన సీఐని, సహచర సిబ్బందిని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆందోళనకారులతో మాట్లాడి.. మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామని, శ్రీనివాస్ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతదేహానికి అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాస్ అంత్యక్రియలు స్వగ్రామంలో పూర్తయ్యాయి. మరోవైపు ఎస్సై శ్రీనివాస్ మరణవార్త విని వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం నాచినపల్లిలో ఉండే ఆయన మేనత్త దార రాజమ్మ(66) కుప్పకూలి గుండెపోటుకు గురై మృతిచెందారు.

ఆయువు తీసిన అప్పులు!

- విషం తాగిన రైతు దంపతులు.. భర్త మృతి, భార్యకు సీరియస్
- మరో మహిళా రైతు ఆత్మహత్య.. కరెంట్ షాక్‌తో రైతు మృతి



సంతోష్, కమల, శంకరయ్య (ఫైల్)

రఘునాథపల్లి, వర్ధన్నపేట, భువనగిరి రూరల్, జూలై 7: ఎన్నో ఆశలతో సాగు చేసిన పంటలు చేతికి రాకపోవడం, నాటిన విత్తనాలు మొలకెత్తక పోవడంతో అప్పులు తీర్చే మార్గం కనిపించక ముగ్గురు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటనలు జనగామ, వరంగల్ జిల్లాల్లో జరిగాయి. జనగామ జిల్లాలో రఘునాథపల్లి మండలం సోమయ్యకుంట తండాకు చెందిన కేతావత్ సంతోష్ (36), సరోజన దంపతులకు రెండెకరాల భూమి ఉండగా పత్తి, వరి సాగు చేసేందుకు నారు పోశారు. అయితే సకాలంలో వర్షాలు కురియక బోరులో నీటి మట్టం తగ్గిపోయింది. దీంతో మరో బోరు వేద్దామని సంతోష్ భార్యకు చెప్పగా, ఇప్పటికే అప్పులు ఎక్కువయ్యాయి.. ఇచ్చినవాళ్లు ఒత్తిడి చేస్తున్నారు.. మళ్లీ బోరు వేయొద్దు అని వారించింది. ఈ విషయంలో ఆదివారం ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన సరోజన పురుగు మందు తాగగా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పారు. ఆస్పత్రిలో భార్య పరిస్థితి చూసి తట్టుకోలేక పోయిన సంతోష్ పొలానికి వెళ్లి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అలాగే, వరంగల్ జిల్లా వర్ధన్నపేట మునిసిపాలిటీ పరిధిలోని గుబ్బెటితండాకు చెందిన బానోత్ కమల (35), రాంధాన్ దంపతులు తిర్మలాయపల్లి గ్రామ శివారులోని తొమ్మిది ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తిగింజలు నాటారు. వర్షాభావంతో విత్తనాలు మొలకెత్తలేదు. అప్పులు చేసి రెండోసారి విత్తనాలు నాటగా ఈసారీ మొలకెత్తలేదు. దీంతో అప్పులు తీరే మార్గం కనిపించక తీవ్ర మనస్తాపానికి గురైన కమల శనివారం పురుగు మందు తాగింది. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. కాగా, యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం ముత్తిరెడ్డి గూడెం గ్రామానికి చెందిన రైతు వద్ది శంకరయ్య (45) ఆదివారం వరి పైరుకు నీరు పెట్టేందుకు వెళ్లాడు. ఫెన్సింగ్ వైర్‌పై మోటారు తీగలు పడడంతో దానికి తగిలి విద్యుదాఘాతానికి గురై చనిపోయాడు.

అప్పుల బాధతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య



నాగేంద్రబాబు

మిర్యాలగూడ అర్బన్, జూలై 7: ఆర్థిక ఇబ్బందులతో పాటు కుటుంబ పోషణ భారంగా మారి మిర్యాలగూడలో ఆదివారం ఓ ఆటోడ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన నానాపురం నాగేంద్రబాబు (35) 15 సంవత్సరాలుగా ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆటో గిరాకీ రోజురోజుకూ తగ్గిపోవడంతో కొద్ది రోజులుగా ఆటోకు తెచ్చిన ఫైనాన్స్ కట్టలేదు. అంతేకాక ఆటో నడవకపోవడంతో కుటుంబపోషణ కూడా భారంగా మారింది. దీంతో తెలిసిన వారి వద్ద అప్పులు తీసుకున్నాడు. ఆటో ఫైనాన్స్ కట్టపోవడం, తెచ్చిన అప్పులు మొత్తం రూ. 3లక్షలు ఎలా చెల్లించాలో తెలియక మనోవేదనకు గురయ్యాడు. ఆదివారం ఉదయం మిర్యాలగూడలో గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.

ఎమ్మెల్యే పదవికి జగన్ రాజీనామా?

- కడప ఎంపీగా పోటీ చేసే యోచన!
- పులివెందుల నుంచి విజయలక్ష్మి లేదా సతీమణి భారతిలను దింపే ఆలోచన
- విపక్ష హోదా లేకపోవడంతో చంద్రబాబును ఎదుర్కోలేమనే ఆవేదన
- వైఎస్ జయంతి సందర్భంగా నేడు ప్రకటన?

అమరావతి, జూలై 7(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయం చవిచూసిన వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి సంచలన నిర్ణయం తీసుకునే దిశగా అడుగులు వేస్తున్నారా? కేవలం 11 స్థానాలకు మాత్రమే పరిమితమైన నేపథ్యంలో విపక్ష హోదా కూడా దక్కకపోవడంతో.. సీఎం చంద్రబాబును ఎదిరించి నిలవలేనని ఆయన ఓ నిర్ణయానికి వచ్చారా? అంటే ఔననే అంటున్నారు పరిశీలకులు. ఈ క్రమంలో పులివెందుల ఎమ్మెల్యే స్థానానికి జగన్ రాజీనామా చేస్తారని, అదే విధంగా తన సోదరుడు, కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డితో కూడా రాజీనామా చేయిస్తారని ప్రచారం జరుగుతోంది. ఆ వెంటనే కడప ఎంపీ స్థానానికి జరిగే ఉప ఎన్నికలో జగన్ పోటీ చేస్తారని, పులివెందుల స్థానానికి జరిగే ఉప ఎన్నికలో తన మాతృమూర్తి విజయలక్ష్మి లేదా సతీమణి వైఎస్ భారతిలను రంగంలోకి దింపుతారని కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం ఊపందుకుంది. అదేసమయంలో భారతికి వైసీపీ రాష్ట్ర పగ్గాలు అప్పగించి, తాను ఢిల్లీకే పరిమితమయ్యేలా జగన్ ప్లాన్ చేస్తున్నట్టు ఈ ప్రచారం చాటి చెబుతోంది. ఎంపీగా ఉంటే.. తనపై నమోదైన అక్రమాస్తుల కేసులను మేనేజ్ చేసుకునేందుకు అవకాశం ఉంటుందని కూడా ఆయన తలపోస్తున్నట్టు సోషల్ మీడియా భావిస్తోంది. అదేసమయం లో ఢిల్లీ రాజకీయాల్లోనూ కీలకం కావొచ్చన్నది ఆయన ఆలోచనగా ఉన్నట్టు చెబుతున్నారు. సోమవారం జరగనున్న దివంగత ముఖ్యమంత్రి, తన తండ్రి.. వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతిని పురస్కరించుకుని కడపలోని ఇడుపులపాయలో ఉన్న వైఎస్ సమాధి వద్ద జగన్ నివాళులర్పించనున్నారు. ఈ సందర్భంగా ఆయన తన రాజీనామా ప్రకటన చేసే అవకాశం ఉందని సోషల్ మీడియాలో ప్రచారం జోరుగుతుండడం గమనార్హం.



అధికారం నేలమట్టం కావడంతో

2019లో జరిగిన ఎన్నికల్లో 151 స్థానాల్లో విజయం దక్కించుకున్న వైసీపీ తాజా ఎన్నికల్లో నేలమట్టమైంది. దీంతో జగన్‌కు ఇప్పుడు ఎటూ పాలుపోని పరిస్థితి ఏర్పడింది. పైగా అసెంబ్లీలో 11 స్థానాలే ఉండడంతో ప్రధానప్రతిపక్ష హోదా కూడా దక్కేలా లేదు. దీంతో జగన్ కేవలం సాధారణ ఎమ్మెల్యేగానే మిగిలిపోనున్నారు. జగన్ స్వభావాన్ని బట్టి చూస్తే ఈ స్థితిని జీర్ణించుకునే అవకాశం ఆయనకు లేదని ఆయన సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఎమ్మెల్యేగా తప్పుకోవడమే మంచిదనే భావనలో ఆయన ఉన్నట్టు వైసీపీ వర్గాలూ భావిస్తున్నట్టు తెలుస్తోంది. అయితే.. ఈ ప్రచారాన్ని సీనియర్లు కొందరు ఖండిస్తున్నారు.

ఢిల్లీలో ఉంటే..

పులివెందుల ఎమ్మెల్యే స్థానానికి రాజీనామా చేసిన అనంతరం.. కడప ఎంపీగా జగన్ ఉప ఎన్నికలో పోటీ చేసేందుకు మానసికంగా సిద్ధమైనట్టు తెలుస్తోంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో జోరుగా జరుగుతున్న ప్రచారాన్ని గమనిస్తే.. ఎంపీగా గెలిచిన తర్వాత ఢిల్లీలో ఉంటూ.. అక్కడ వైసీపీ రాజకీయాలను చక్కబెట్టుకునే దిశగా జగన్ ఆలోచన చేస్తున్నట్టు సమాచారం. ముఖ్యంగా తనపై ఉన్న అక్రమాస్తుల కేసులను ఢిల్లీ స్థాయిలో మేనేజ్ చేసుకునే అవకాశం ఉంటుందని ఆయన భావిస్తున్నట్టు పార్టీ వర్గాల్లోనూ చర్చ సాగుతోంది. ఒకవేళ వైఎస్ జయంతి సందర్భంగా కాకపోయినా.. వచ్చే 2-3 మాసాల్లో అయినా.. జగన్ తాను అనుకున్నదే చేస్తారని ఆయన సన్నిహితులు అంచనా వేస్తున్నారు.

ఏపీలో ఇక ఉచిత ఇసుక

- నేటి నుంచే కొత్త విధానం అమల్లోకి
- నేడు టీడీపీ సర్కారు మార్గదర్శకాల విడుదల

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఐదేళ్లుగా రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న ఇసుక కష్టాలు ఇక ఉండవు. అన్ని వర్గాల ప్రజలకు ఇసుక ఉచితంగా అందుబాటులోకి రానుంది. తెలుగుదేశం కూటమి సర్కారు ప్రకటించిన ఉచిత ఇసుక విధానం సోమవారం నుంచి అమల్లోకి రానుంది. ప్రభుత్వం అధికారికంగా ఈ మేరకు ఉచిత ఇసుక పాలసీని ప్రకటించనుంది. దాని అమలుకు మార్గదర్శకాలు వెలువరించనుంది. ఇప్పటికే విధివిధానాలను గనుల శాఖ సర్వం సిద్ధం చేసింది. జగన్ సర్కారు తీసుకొచ్చిన నూతన ఇసుక పాలసీ-2020 స్థానంలో కూటమి ప్రభుత్వం నూతన ఇసుక పాలసీ-2024ను ప్రకటించనుంది. ఈ పాలసీ ఏకైక లక్ష్యం.. కులం, మతం, వర్గం తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరికి గృహనిర్మాణం కోసం ఉచితంగా ఇసుక అందించడమే. ప్రభుత్వం ఇకపై సీనరేజీ ఫీజులు వసూలు చేయదు. గత టీడీపీ ప్రభుత్వంలో 2016-19 వరకు ఉచిత ఇసుక పాలసీని అమలు చేసిన సంగతి తెలిసిందే. జగన్ సర్కారు వచ్చాక ఉచితాన్ని తీసేసి అంగడి సరుకుగా మార్చేశారు. జగన్ పాలనలో రీచ్‌లతో సంబంధం లేకుండా 20 టన్నుల ఇసుక లారీ గరిష్ఠంగా 46 వేలకు అమ్మారు. ట్రాక్టర్ ఇసుకను 13 వేలకు అమ్మారు. పెరిగిన ధరలతో గత ఐదేళ్లు నిర్మాణ రంగం కుదేలైంది. ఫలితంగా భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయారు. లక్షల కోట్ల వ్యాపారాలు దెబ్బతిన్నాయి. దీని ప్రభావం రాష్ట్ర ఆర్థిక, పారిశ్రామిక, నిర్మాణ రంగ పురోగతిపై పడింది. ఇవేవీ పట్టించుకోని జగన్ తన పంథానే కొనసాగించారు. ఫలితంగా ఇసుక దొరక్క ప్రజలు అల్లాడిపోయారు. సొంత ఇల్లు నిర్మించుకోవాలన్న ఆలోచనే మానుకున్నారు. తాము అధికారంలోకి వస్తే మళ్లీ ఉచిత ఇసుక అమలు చేస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు పలు వేదికలపై హామీ ఇచ్చారు.

సీఎం సార్‌కు సారీ చెప్పాలి

బాబు ఇంటి చుట్టూ నిఘా మాజీ చీఫ్ ప్రదక్షిణ.. ఆంజనేయులుకు సీఎం అపాయింట్మెంట్ లేదన్న అధికారులు

- గత ప్రభుత్వంలో అడ్డగోలు పనులు
- వీఆర్ఎస్‌కు అనుమతిస్తే వెళ్లిపోయేందుకు ఇప్పుడు పాట్లు



అమరావతి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఏది చేసైనా జగన్ కళ్లలో ఆనందం చూడాలి... ఎలాగైనా పోలీస్ బాస్ పోస్టు సాధించాలి! ఈ లక్ష్యంతో ఐదేళ్లపాటు చేయకూడని పనులన్నీ నిఘా విభాగం మాజీ చీఫ్ చేశారు. ఇప్పుడు ఆయన పడుతున్న పాట్లు పోలీసుశాఖలో చర్చనీయాంశం అయ్యాయి. మాజీ సీఎం జగన్ తాడేపల్లి ప్యాలెస్‌లో ప్రత్యేకంగా ఒక గదిలో కూర్చుని నిన్నటి దాకా రాజకీయ సమస్యలు పరిష్కరించిన పీఎస్ఆర్ ఆంజనేయులు ప్రభుత్వం మారడంతో హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంటి చుట్టూ ఇప్పుడు ప్రదక్షిణ చేస్తున్నారు. రెండేళ్ల సర్వీసు ఉండగానే వీఆర్ఎస్ తీసుకోవడానికి సిద్ధమైనట్లు ఉన్నతస్థాయి వర్గాల్లో చర్చ జరుగుతోంది. విజయవాడ పోలీస్ కమిషనర్‌గా మహిళా వైద్యురాలితో జరిపిన ఫోను సంభాషణతో అభాసుపాలై రాష్ట్రం వదిలి కేంద్ర సర్వీసులకు వెళ్లిపోయారు. 2019లో ఏపీలో వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్ర సర్వీసుల్లోకి తిరిగొచ్చి జగన్‌కు కళ్లు, నోరు, చెవులు అన్నీ ఆయనే అయ్యారు. ప్రతిపక్ష నేతల్ని లక్ష్యంగా చేసుకుని మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద రావు కుమారుడి ద్విచక్రవాహన షోరూమ్‌పై పడ్డారు. ఆ షోరూమ్‌లో అసెంబ్లీకి సంబంధించిన కుర్చీలు ఉన్నాయంటూ కోడెల పరువు తీశారు. పోలీసులు దొంగతనం కేసు పెట్టడంతో మనస్తాపానికి గురైన ఆయన ఏకంగా లోకాన్నే వదిలి వెళ్లిపోయారు. మొదటిసారి జగన్ కళ్లల్లో ఆనందం చూసిన ఘటన అది. ఇక రెండో గురి తాడిపత్రిలో జేసీ ప్రభాకర్ రెడ్డిపై పెట్టారు. జేసీ సోదరుల కుటుంబానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న ట్రాన్స్‌పోర్టు వ్యాపారంపై పడ్డారు. పొరుగు రాష్ట్రాల్లో కొనుగోలు చేసిన వాహనానికి మార్పులు చేసి ఏపీలో ఆర్టీఏ అనుమతి తీసుకోలేదంటూ బస్సుల్ని ఆపించారు. హైదరాబాద్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న జేసీ ప్రభాకర్ రెడ్డిని, ఆయన కుమారుడు అస్మిత్ రెడ్డిని అర్ధరాత్రి అరెస్టు చేసి లాక్కొచ్చి కడప సెంట్రల్ జైలుకు పంపించారు. ఈ రెండు ఘటనలతో జగన్ మనసును పీఎస్ఆర్ గెలుచుకున్నారు. ఏసీబీ డీజీగా రెండో పోస్టు సాధించారు. దీంతో మరింత రెచ్చిపోయిన పీఎస్ఆర్.....అప్పటి ప్రతిపక్ష నేతలపై వరుసగా గురిపెట్టారు. అసెంబ్లీలో జగన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్న అచ్చెన్నాయుడుపై ఈఎస్ఐ మందుల కొనుగోలు వ్యవహారంలో ఏసీబీ కేసు పెట్టారు. ఆపరేషన్ చేయించుకున్న అచ్చెన్నను టెక్కలిలోని ఇంటిలో అరెస్టు చేసి గుంటూరుకు కారులో తీసుకొచ్చి సుమారు 70రోజులు జైలుపాలు చేశారు. చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ వ్యాపారాన్ని దెబ్బకొట్టడంతో పాటు సొంత లాభం కోసం అమూల్ సంస్థకు జగన్ రాష్ట్రంలోకి రెడ్ కార్పెట్ వేశారు. దీనికి సంగం డెయిరీ చైర్మన్‌గా సహకరించని ధూళిపాళ్ల నరేంద్రపై కేసు పెట్టి జైలుకు పంపిన ఘనత కూడా ఆంజనేయులుదే. ఇది చాలదన్నట్లు రాష్ట్రానికి చెందిన న్యాయమూర్తి సుప్రీంకోర్టులో ఉన్నత స్థానాన్ని అధిరోహించకుండా ఆయన కుమార్తె అమరావతిలో భూమి కొనుగోలు చేశారంటూ కేసు పెట్టారు. ఇలాంటివి చేస్తోన్న పీఎస్ఆర్ ఆంజనేయులును జగన్ బహిరంగంగానే 'అంజన్నా' అని పిలిచే స్థాయిలో అభిమానాన్ని చూరగొన్నారు. వెంటనే నిఘా విభాగం అధిపతి పోస్టు సాధించారు. అప్పటినుంచి తాడేపల్లి ప్యాలెస్‌లోనే మకాం పెట్టారు. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులపై ముఖ్యమంత్రికి వివరించడం.. పరిష్కరించేందుకు నడుం బిగించి అటువైపు వ్యక్తుల్ని బెదిరించడం.. జగన్ మనసుకు నచ్చేలా ప్రవర్తించడం.. సర్వసాధారణం అయ్యాయి. ఏ తప్పూ చేయని చంద్రబాబుపై పలు కేసులు పెట్టించి స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టు చేయించడం వెనుక కీలక కుట్రదారు, సూత్రధారి 'అంజన్న' అనే విషయం రాష్ట్రంలో ఎక్కువ మందికి తెలుసు. ఆయన చేసిన అడ్డగోలు పనులలో పలువురు పోలీసుల్ని కూడా భాగస్వాముల్ని చేశారు.

చేసినవి చిన్న పాపాలు కావు...

వైసీపీ నాయకుని తరహాలో అడ్డమైన పనులు చేస్తోన్న పీఎస్ఆర్‌ను ఎన్నికల సమయంలో ఎలక్షన్ కమిషన్ తప్పించింది. జగన్ అరాచక పాలనతో విసిగిపోయిన రాష్ట్ర ప్రజలు దారుణంగా ఓడించడంతో అవాక్కైన ఆంజనేయులు....తాడేపల్లి ప్యాలెస్ నుంచి ఉండవల్లి కరకట్టవైపు వచ్చి చంద్రబాబును కలిసే ప్రయత్నం చేశారు. అపాయింట్మెంట్ లేదని సెక్యూరిటీ అడ్డుకోవడంతో వెనుదిరిగారు. రెండు రోజులుగా చంద్రబాబు హైదరాబాద్‌లో ఉండటంతో జూబ్లీహిల్స్‌లోని చంద్రబాబు ఇంటి చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. అపాయింట్మెంట్ లేదని అధికారులు చెబుతుంటే 'సీఎం సార్‌కు సారీ చెప్పేందుకే వచ్చా' అంటూ బతిమాలుతున్నట్లు సమాచారం. లోపలి నుంచి సిగ్నల్ లేకుండా తాము అనుమతించబోమంటూ సెక్యూరిటీ సిబ్బంది తెగేసి చెప్పడంతో ఆదివారం మరోమారు వెనుదిరిగారు.

వివిధ

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

బుక్ బ్రహ్మ ఫెస్టివల్

2500 ఏళ్ళ సుదీర్ఘ చరిత్రగల దక్షిణ భారతీయ భాషల (తెలుగు, కన్నడ, తమిళ, మలయాళం) ఘన వారసత్వాన్ని, ప్రపంచ సాహిత్య సంస్కృతిపై వాటి ప్రభావాన్ని చాటేందుకు, దక్షిణ భారతీయ భాషల రచయితలు, ప్రచురణకర్తలందరినీ ఒకే వేదిక మీదకు తెచ్చేందుకు 'బుక్ బ్రహ్మ లిటరేచర్ ఫెస్టివల్ - 2024' జరుగుతున్నది. 'ఆంధ్రజ్యోతి' పత్రిక మీడియా భాగస్వామిగా ఉన్న ఈ కార్యక్రమం ఆగస్ట్ 9 నుంచి 11 దాకా సెయింట్ జాన్స్ ఆడిటోరియం, కోరమంగల, బెంగళూరులో జరుగుతుంది. కె. సచ్చిదానందన్, జెయమోహన్, పెరుమాళ్ మురుగన్, కె. శివారెడ్డి, వివేక్ శాన్‌భాగ్, ఓల్గా, వసుదేంద్ర, గిరిష్ కాసరవల్లి, వాడ్రేవు చినవీరభద్రుడు, అక్కినేని కుటుంబరావు, ప్రకాష్ రాజ్, సి. మృణాళిని, జూపాక సుభద్ర, ఎమ్.ఎమ్. వినోదిని, కాత్యాయనీ విద్మహే, సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డి, మహమ్మద్ ఖదీర్ బాబు, మల్లిపురం జగదీష్, వేంపల్లె షరీఫ్, ఉణుదుర్తి సుధాకర్, కె.ఎన్. మల్లీశ్వరి, కుప్పిలి పద్మ, వివిన మూర్తి, పూర్ణిమ తమ్మిరెడ్డి, మానస ఎండ్లూరి, రమేష్ కార్తీక్ నాయక్... ఇంకా అనేకమంది దక్షిణ భారత భాషల ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమంలో సాహిత్యకారుల సమావేశాలతోపాటు ప్రచురణ కర్తల సమావేశాలు, సాంస్కృతిక కళా ప్రదర్శనలు ఉంటాయి. ఈ ఉత్సవంలో పాల్గొనదలచిన వారు www.bookbrahmalitfest.com వెబ్‌సైట్‌కు వెళ్ళి మీ పేర్లను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకున్న డెలిగేట్స్‌కు ఎంట్రీపాస్ లభిస్తుంది. వారికి మాత్రమే ఫెస్టివల్ గ్రౌండ్స్‌లో ప్రవేశం ఉంటుంది.

ఔషధం వంటి గుణమున్న మనిషి

ఎప్పుడు ఫోన్ చేసినా "ఎవురూ.. షరీఫా.. ఏం నాయనా.. బావుండావా.. భార్యా పిల్లోల్లు.. బావుండారు గదా.." అంటారు కేతు గారు. ఆయన ఆత్మీయ పలకరింపులు ఆయనతో స్నేహం చేసిన ఎవరికైనా అంత సులువుగా మరుపుకు రావు.

"ఈ ముండాకొడుకులు సాహిత్య రంగాన్ని గబ్బు పట్టిచ్చాండారు నాయనా.. నువ్వేమి పట్టించుకోగాకు, నీ పని నువ్వు జేసుకో.. రాసుకుంటా పోతా ఉండు... ఏమి మాట్లాడేదానికి కాలం గాదు.." అని ఆయన ఆవేదనతో చేసిన సూచనలు ఇంకా నన్ను కలవరపెడుతూనే ఉన్నాయి.

ఎప్పుడో 2011లో 'జుమ్మా' కథల పుస్తకం వేసుకుంటున్నప్పుడు ముందుమాట కోసం హైదరాబాద్‌లోని సంజీవరెడ్డినగర్‌లో ఉండే ఆయన్ని వెతుక్కుంటూ వెళ్లి కలిశాను. అంతకుముందు ఆయన కథలతో పరిచయం కానీ ఆయనతో కాదు. కథలు ఒక దమ్ముతో రాసేవాళ్లను కలవాలంటే నాకు భయం. వాళ్లముందు తేలిపోయే ముఖం పెట్టుకుని ఎక్కడ కూర్చునేది? ఇక అప్పుడంటే తప్పదు కాబట్టి, అవసరం నాది కాబట్టి వెళ్లి కలిశాను. చక్కగా డిటిపి చేసిన కథల ప్రతిని ఆయనకిచ్చి వచ్చేశాను.

మళ్లీ ఆర్నెల్లకు ఆయనింటి ముందుకెళ్లి నసిగితే అప్పుడు ఆయన "నాకు రాసే ఓపిక లేకుండా పోతాండాది నాయనా. సెప్తాంటే రాసుకుంటావా?" అన్నారు. ఇదే భాగ్యం అనుకుని పెన్నూ, పేపర్ అడిగి తీసుకున్నాను. నన్ను తీసుకెళ్లి ఆయన బెడ్ రూము పక్కనున్న వరండాలో కుర్చీ వేసి కూర్చోబెట్టారు. ఒక పక్కన ఆయన కూడా కూర్చోని సిగరెట్టు వెలిగించారు. అప్పుడప్పుడు కాగితంలో నా కథల పక్కన రాసుకున్న నోట్సు చూసుకుంటూ చెప్పడం మొదలుపెట్టారు. ఒక గంటన్నర తర్వాత "పిల్లోల్లు నాయనా మీరు.. ఇంకా చెబితే పాడైపోతారు.. సాల్లే.." అని ముసిముసిగా నవ్వుతూ ముగించారు. "అప్పటికే ఎక్కువ చెప్పేశారు సార్" అని నేను నవ్వుతూనే చెప్పి అక్కడి నుంచి వచ్చేశాను. ఈ కాలం కుర్రాళ్ల ప్రతిభను ఏ కొద్దిగా కూడా అతిశయోక్తి లేకుండా ఎంత మెచ్చుకోవాలో అంత మాత్రమే మెచ్చుకుని మేలు చేసే ఔషధం వంటి గుణం ఆయనది.



నా కథల పుస్తకానికి ఒకింత గుర్తింపు రావడం మొదలయ్యాక నేను ఆయన్ని తరచూ కలవడం మొదలుపెట్టాను. వెళ్లినప్పుడల్లా నా పుస్తకానికి సంబంధించిన సంగతులు చెప్పేవాణ్ని. ఆయన కూడా తనకు తెలిసిన మిత్రులకు పుస్తకం పంపారు. నా కథలను ఇంగ్లీషులోకి అనువాదం చేసిన దాసు కృష్ణమూర్తి గారు ఆయన ద్వారా పరిచయమైన వారే. ఇలా ఇంకొకరికి పరిచయం చేసేంత ప్రేమ నా కథల మీద ఆయనకుందని నేరుగా ఎప్పుడూ చెప్పలేదు. తనకు నచ్చిన పని మౌనంగా చేసుకుపోతారని, నచ్చిన సాహిత్యాన్ని కూడా అంతే మౌనంగా ప్రచారం చేస్తారని తర్వాత నాకు అర్థమైంది.

ఆయనకెప్పుడూ నా ఉద్యోగ జీవితానికి సంబంధించిన బెంగ ఉండేది. జర్నలిజంలో పిహెచ్‌డి చేస్తున్నానని చెబితే సంతోషించి అంబేద్కర్ యూనివర్సిటీలో ఆయన సంపాదకత్వం వహించిన ప్రచార, ప్రసార మాధ్యమాల పుస్తకాల సెట్టును బహూకరించారు. "కతలు అన్నం పెట్టవని ఈ కీర్తికి బానిస కావొద్దని" ఆయన పదే పదే చెప్పే మాటలు నన్ను నిత్యం వెంటాడుతూనే ఉన్నాయి.

మాటల సందర్భంలో ఒకసారి ఆయనకు 'మటన్ ఖీమా' ఇష్టమని తెలిసి తీసుకెళ్తే ఆ ఖీమా డబ్బులకు తోడు బోనస్‌గా పిల్లలకు చాక్లెట్ ప్యాకెట్ తీసుకోకుండా వెనక్కి రాలేకపోయాను. ఎదుటివాళ్ల అభిమానాన్ని ఎప్పుడూ తన వ్యక్తిగత అవసరాలకు వాడుకోవాలని ఆలోచించని ఉత్తముడు ఆయన.

హైదరాబాద్ వంటి నగరంలో ఎవరికి ఎవరూ కారు. ఒకర్నొకరు నిత్యం కలుసుకోవడం సాధ్యం కాదు. కాకపోతే మనకు తెలిసిన ఫలాన వ్యక్తి ఒకరు ఈ నగరంలోనే ఎక్కడో ఒక చోట ఉంటున్నారంటే అదో తెలీని భరోసా. ఆ భరోసాకు దెబ్బ తగిలింది. హైదరాబాద్ వదిలేసి ఆయన సొంత ప్రాంతం కడప చేరారు. అది నాకు కొంత వెలితిగా అనిపించినా.. ఇక నాదీ కడప ప్రాంతమే కాబట్టి.. ఊరెళ్లినప్పుడల్లా కలిసేవాణ్ని. కడప కేంద్రంగా ఆయన సాహితీ సేద్యం మొదలుపెట్టారు. అడపాదడపా సిపి బ్రౌన్ కార్యక్రమాల్లోనూ, యూనివర్సిటీ వ్యవహారాల్లోనూ పాల్గొనేవారు. కొన్ని కార్యక్రమాలకు నేనూ హాజరయ్యేవాణ్ని. కనిపించినప్పుడల్లా ఆప్యాయంగా పలకరించి పక్కన కూర్చోబెట్టుకుంటారు కానీ ఏమీ మాట్లాడరు. మాట్లాడకుండా పక్కన కూర్చోని ఉండటం నాకు ఇబ్బందే అయినా ఆయన అభిమానం చూపించే తీరే.. ఇలా ఉంటుందని గ్రహించి మౌనంగా ఉండిపోయేవాణ్ని.

కడపలో రెండేళ్ల కిందట 'రాయలసీమ కథా కార్యశాల' పెట్టినప్పుడు చివరిసారిగా కలిశాను. ఆ కార్యక్రమం పోస్టర్లు ఆయనే ఆవిష్కరించారు. తగిన సలహాలు ఇచ్చారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై 'రాయలసీమ యువత ఎక్కువగా సాహిత్యంలోకి రావాలని, సమాజంలో ప్రతిపక్షపాత్ర పోషించాలని' మాట్లాడారు. రెండు రోజుల శిక్షణా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినందుకు అభినందనలు తెలిపారు.

నాలుగు నెలల తర్వాత కడపలో శాంతి నారాయణ గారి 'సాధన' నవల పరిచయ సభలో ఆయన మాట్లాడాల్సి ఉంది. నేనూ వక్తనే కాబట్టి కడప వెళ్లాను. కానీ కేతు గారు రావడం లేదని ఆయన సతీమణికి ఆరోగ్యం బాగాలేక కూతురి దగ్గరికి ఒంగోలు వెళ్తున్నారని తెలిసింది. సాధన నవల పరిచయ సభను ముగించుకుని మరుసటి రోజు ఉదయానే ప్రస్తుతం నేను నివాసం ఉంటున్న ఊరు విజయవాడ చేరుకున్నానో లేదో జీర్ణించుకోలేని వార్తను పాలగిరి విశ్వప్రసాద్ అన్న ఫోన్ చేసి తెలిపాడు. అట్నుంచటే ఒంగోలు వెళ్లి ఆస్పత్రిలో ఉన్న ఆయన భౌతిక కాయాన్ని సందర్శించాను. ఆయన నిర్జీవ దేహాన్ని చూశాకైనా నేను ఆయన లేడనే వార్తను నమ్మాలి కదా.. ఎందుకనో నమ్మకలేకపోతున్నాను.

అయితే కడపలో సాహితీ ధర్మానికి విరుద్ధంగా ఏదైనా జరుగుతోందంటే 'పెద్దాయన ఉండాడు.. ఏమంటాడో..' అని భయం ఒకటి ఉండేది. ఆ భయం ఇప్పుడు లేనందుకు మాత్రం నేను నిజంగానే దు:ఖిస్తున్నాను.

(జూలై 10న కేతు విశ్వనాథరెడ్డి జయంతి)

వేంపల్లె షరీఫ్



సాధారణ చరిత్ర, సాహిత్య చరిత్ర కలిసి నడవాలి

- వకుళాభరణం రామకృష్ణ

మానవ ప్రయాణ కథనమే చరిత్ర అని స్థూలంగా అనుకుంటే, అందులో సాహిత్య ప్రయాణ కథనమే సాహిత్యచరిత్ర. అనేక శాస్త్రాల అన్వయం అవసరమయ్యే ప్రక్రియ సాహిత్యచరిత్ర. తెలుగు సాహిత్యచరిత్రకు చాలా చరిత్ర ఉంది. అందులో చాలా పాయలు, కోవలు ఉన్నాయి. ప్రాధాన్యాలున్నాయి. వివక్షలున్నాయి. ఉల్లేఖనలకు, విస్మరణలకు సామాజిక, రాజకీయ కోణాలున్నాయి. ఆధునిక సాహిత్య ఉద్యమాలన్నిటిలోను చరిత్ర ఒక ప్రధాన సంవాదాంశంగా ఉంటూ వచ్చింది. తెలుగు సాహిత్య చరిత్ర ప్రస్థానాన్ని సమీక్షించుకోవడానికి, కొత్త చూపులు జోడించడానికి, ఖాళీలు పూరించడానికి ఉపయుక్తమయ్యే ప్రయత్నంగా, సాహిత్య, సామాజిక చరిత్రకారులతో చేస్తున్న సంభాషణలలో మొదటిది వకుళాభరణం రామకృష్ణతో ఈ ఇంటర్వ్యూ. బ్రిటిషాంధ్ర సాంఘికోద్యమాల చరిత్రపై సాధికారమైన పరిశోధన చేసి, ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్‌తో గాఢానుబంధం కలిగి, ఆంధ్రప్రదేశ్ సమగ్రచరిత్ర సంపుటాల రూపకల్పనకు సారథ్యం వహించిన రామకృష్ణ, సాహిత్య, సాధారణ చరిత్రల మధ్య సంబంధం గురించి ఈ ఇంటర్వ్యూలో మాట్లాడారు.

చరిత్ర రచన భారతీయులకు అలవాటు లేని విషయమని, వలసవాదులతోనే అది మొదలయిందని అనుకోవడం ఇప్పటికీ సరిఅయినదేనా?

మనం యివ్వాళ చరిత్రగా పరిగణించే రీతిలో, చరిత్ర రచన వలసపాలనకు ముందు లేని మాట, ఒప్పుకోడానికి కష్టమైనా, నిజమే! అంతకు ముందు చారిత్రక గ్రంథాలంటూ ప్రత్యేకించి లేవు. శాసనాలు (అశోకుడు, సముద్రగుప్తుడి కాలంలో వెలువడ్డ శాసనాలు- ప్రధానంగా, చరిత్రకు ఉపకరించే (గుప్తుల చరిత్ర), అలహాబాద్ స్తంభ శాసనం, సాహిత్యపరంగా బాణుడి "హర్ష చరిత్రము" (ఇందులో ప్రశస్తి, పొగడ్తలు, అతిశయోక్తులున్నాయి), మొగలుల కాలంలో వెలువడ్డ విదేశీయాత్రికుల రచనలు, అప్పటి ప్రభుత్వాలు జారీ చేసిన ఉత్తర్వులు లభిస్తున్నాయి. ఆ తర్వాత వచ్చిన వలసవాదులు జారీచేసిన ఉత్తర్వులు, వారి వాణిజ్య కార్యకలాపాలు రికార్డయ్యాయి. శాస్త్రీయ రచనా పద్ధతికి ఇదే మొదలు.

తెలుగువారి చరిత్ర రచన ప్రారంభం ఎట్లా జరిగింది? మొదటి ఆధునిక తెలుగు చరిత్ర రచనగా దేనిని పరిగణించవచ్చు?

19వ శతాబ్దంలో ఆవిర్భవించిన సాంస్కృతిక పునరుజ్జీవనంలో తెలుగువారి చరిత్ర మొదలైంది. జాతీయస్థాయిలో వచ్చిన మేధో మథనంలో భాగంగా, తెలుగు మేధావులు తెలుగు జాతి చరిత్ర, సంస్కృతులపై దృష్టి సారించారు. జాతీయోద్యమ భావజాలానికి మరింత బలం చేకూరుతుందన్న భావంతో, చరిత్రకారులు, జాతీయ వాద చరిత్ర రచన అనే ఆలోచనా సరళిని ప్రోత్సహించారు. ఈ క్రమంలో విద్వాంసులు, సాహిత్యకారులైన కల్నల్ మెకంజీ, చార్లెస్ బ్రౌన్, జిల్లా మాన్యుయల్స్ గెజిటీర్లను వెలికితీసి చరిత్రనిర్మాణానికి పూనిక చేశారు.

1900 సంవత్సరంలో లండన్ నుంచి ప్రచురితమైన రాబర్ట్ సీవెల్ రాసిన విస్మృత సామ్రాజ్యం (Forgotten Empire), ఆంధ్రుల చరిత్రరచనకు దోహదం చేసింది. కొమర్రాజు లక్ష్మణరావు విజ్ఞాన చంద్రికా గ్రంథమండలిని స్థాపించారు. ఈసంస్థ ద్వారా 1910-36 మధ్య కాలంలో, కొమర్రాజు వారి ప్రోత్సాహంతో, మద్యాంధ్ర దేశ చరిత్రపై విజయనగర సామ్రాజం వరకు, మూడు సంపుటాలు వెలువరించారు. 1925లో చిలుకూరి, కొమర్రాజు, మల్లంపల్లి, భావరాజు ప్రభృతులు కలిసి 'ఆంధ్రా హిస్టారికల్ రిసెర్చి సొసైటీ' ని స్థాపించారు. ఒక త్రైమాసిక పరిశోధక సంచికను ప్రారంభించారు. ఆంధ్రదేశ చరిత్ర రచనలో యిదొక పెద్ద మలుపు.

ఆంధ్రుల చరిత్ర సాధికారికంగా విజ్ఞానచంద్రికాగ్రంథమండలి ఆధ్వర్యంలో, కొమర్రాజు లక్ష్మణరావు రచనతో ఆరంభమైందని భావించడం కద్దు. నిజమే! కానీ, ఆ ప్రచురణకు ముందు, కొన్ని ప్రయత్నాలు జరిగాయి. గంగాదేవి రాసిన 'మధురా విజయం' (వీరకంపరాయ చరిత్ర) సంస్కృతంలో రాసిన సాహిత్యగ్రంథం. విజయనగర సామ్రాజ్య స్థాపకులైన హరిహర రాయ, బుక్కరాయల వంశానికి చెందిన వీరకంపరాయ జీవితం, అందులో వస్తువు. గంగాదేవి వీరకంపరాయని భార్య. వీరకంపరాయడు మధురను క్రీ.శ. 1371లో జయించాడు. ఆ చారిత్రక సందర్భంలో చోటు చేసుకొన్న ముఖ్యఘటనలను ఈ గ్రంథంలో గంగాదేవి పేర్కొంది.

19వ శతాబ్ది ప్రథమభాగంలో, కావలి సోదరుల (వెంకట బొర్రయ్య, వెంకట రామశాస్త్రి) పూనికతో, విస్తారమైన, ముఖ్యమైన చారిత్రక ఆధారాలను, స్థానికంగా లభిస్తున్న ప్రాచీన, ఇతిహాస, పురాణ వ్యాఖ్యలను, వివరణలను, వాటితో పాటు తాటాకులపై రాసిన సమాచారాన్ని, అనువాదాలు, పటాలు (Maps), చిత్రలేఖనాలు, పురావస్తు ఆధారాలు, శిల్పాలు, రాగి రేకులపై లభించిన శాసనాలను, తాటియాకులపై రాసి భద్రపరిచిన చారిత్రక, సామాజిక అంశాలను, నాణేలను సేకరించి భద్రపరిచారు. అనేక లిపులను వెలికితీసి, సరిచేసి, తుదిరూపాన్నిచ్చారు.

కావలి సోదరులు రాసిన దక్కన్ కవుల చరిత్ర, దక్షిణదేశ చారిత్రక పరిణామాల ఆనవాళ్లను సేకరించి భద్రపరిచారు. కావలి వెంకట బొర్రయ్యను శాసన సాహిత్య ప్రముఖుడిగా, వాస్తవానికి తెలుగు ప్రజల చరిత్రకు ఆద్యుడిగా పరిగణించాలి.

కావలి వెంకట బొర్రయ్య తర్వాత, బుక్కపట్నం రాఘవాచార్యులు రచించిన 'History of Andhras' గ్రంథంలో కళింగ రాజవంశాల గూర్చిన సమాచారం లభ్యమవుతున్నది. మద్రాసులోని 'ప్రాచీన చరిత్ర, సంస్కృతికి సంబంధించిన ప్రతుల గ్రంథాలయం (Manuscripts Library)లో దీనికి సంబంధించి రాతప్రతులు లభ్యమవుతున్నాయి.

ఓరియంటలిస్టులు మొదలైనవారు భారతదేశం మీద కల్పించిన దృక్పథ చట్రం ప్రభావంతోనే, దానికి ప్రతిక్రియగానో భారతీయ చరిత్ర రచన మొదలైందనుకుంటే, తెలుగువారి చరిత్ర రచనను ఎజెండా మీదకు తెచ్చినవి ఏ కారణాలు?

మీరన్నట్లు, భారతీయ చరిత్ర విషయంలో జరిగిందదే! తెలుగువారి చరిత్ర భారతదేశ చరిత్రలో అంతర్భాగంగా, అదే నేపథ్యంలో ప్రారంభమైంది. యూరోపియన్ సాహిత్యం ద్వారా పాశ్చాత్య సంస్కృతిని ఆకళింపు చేసుకొన్న తెలుగు రచయితలు, నూతన సాహిత్యసృష్టిలో భాగంగా తెలుగు కవుల చరిత్రను ఆధునిక దృక్పథంతో రాయనారంభించారు. పత్రికారచనలో కూడ కొత్త పుంతలు, దీని ప్రభావంతో ఏర్పడ్డాయి. కందుకూరి సాహిత్య కృషికి, గురజాడ, గిడుగులు మరింతగా దోహదం చేసి, వస్తుపరంగా, భాషా పరంగా తెలుగు సాహిత్యసంస్కృతులను ముందుకు తీసుకెళ్లారు. గురజాడ స్థానిక చరిత్రల రచనకు కూడా శ్రీకారం చుట్టారు. విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి స్థాపన ద్వారా కొమర్రాజు లక్ష్మణరావు చరిత్ర, సంస్కృతులపై పరిశోధనా దృక్పథాన్ని జోడించి రచనలు చేశారు. 1912లో ఆంధ్రమహాసభ ఏర్పడింది. ఒక పరిశోధనా త్రైమాసిక పత్రిక ప్రారంభమైంది. కాలగర్భంలో కలిసిపోయిన శాసనాలను వెలికితీసి, వాటిలోని సారాంశాన్ని చరిత్ర రచనకు పనిముట్టుగా ఉపయోగించుకున్నారు. అప్పుడు వెలువడ్డ ముఖ్యమైన రచనల్లో, ఈ ప్రశ్నకు సమాధానంగా చెప్పుకోదగ్గవి- మారేమండ రామారావు రాసిన 'కాకతీయ చరిత్ర', నేలటూరు వెంకట రమణయ్య రాసిన 'విజయనగర మూడవ రాజవంశములోని పతనములు', సురవరం ప్రతాపరెడ్డి 'ఆంధ్రుల సాంఘికచరిత్ర' మొదలైనవి.

> **సాహిత్య చరిత్ర కారులకు సామాజిక, మానవీయ శాస్త్రాలతో, కొద్దిమందిని వినహాయిస్తే, పరిచయం, పరిజ్ఞానం తక్కువ. ఇది సాహిత్య కారుల లోపం కాదు. సాహిత్య చరిత్రను బోధించే ప్రక్రియలోనే లోపం వుంది. సాహిత్యకారులకు ఇతర సామాజిక శాస్త్రాల విషయాలు బోధించే, పరిశోధించే విధానాల్లో మార్పు రావాలి. ఈ విషయంలో విశ్వవిద్యాలయాల్లో తగు మార్పులు చేయాలి.**

సాధారణ చరిత్రకు, సాహిత్య చరిత్రకు ఉండే సంబంధం ఏవిఽటి? సామాజిక, రాజకీయ, సాంస్కృతిక చరిత్రరచనకు అనేక దినుసులను సాహిత్యం సమకూరుస్తున్నది, మరి సాహిత్యచరిత్ర కారులు సాధారణ చరిత్ర నుంచి తీసుకోవలసినంత తీసుకుంటున్నారా?

సాధారణ చరిత్ర అన్ని అంశాలను (చారిత్రక, సామాజిక, రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక) సవివరంగా వ్యక్తీకరిస్తుంది. ఈ కృషికి దోహదం చేస్తూ, సాహిత్యం, ఆయా కాలాల్లో, అప్పటి సమాజాల్లో నెలకొన్న పరిస్థితుల్ని వ్యక్తపరుస్తుంది. ఈ వ్యక్తీకరణ నేరుగా, సరళరేఖలా వుండదు.

సాహిత్య చరిత్రకారులు, కొద్దిమందిని మినహాయిస్తే, సాధారణ చరిత్రాంశాలను తీసుకోడం లేదు. దీనికి ఈ రెంటిమధ్య వున్న ముఖ్య సంబంధం తెలియకపోవడం ఒక కారణమైతే, సాధారణ చరిత్రపొరలలో దాగివున్న సాహిత్యాంశాలను గ్రహించగలిగిన శిక్షణ, నైపుణ్యం లేకపోవడం మరో కారణం. ఇలా జరగనప్పుడు, సాహిత్య చరిత్ర సమగ్రం కాదు.

సాధారణ చరిత్ర రచన కేవలం పాలకుల వంశావళులు, దండయాత్రలు యుద్ధాల జాబితాలను దాటి జనజీవనంలోని స్థితిగతులను సూక్ష్మస్థాయి దాకా పట్టుకోగలుగుతోంది. సాహిత్య చరిత్ర రచన కవుల, రచయితల, ప్రక్రియల, ఉద్యమాల కాలక్రమ చరిత్రగానే కొనసాగుతోందా? ఇతర సామాజిక, మానవీయ శాస్త్రాలతో సమన్వయం ఎంత వరకు జరుగుతోంది?

అవును. అంతర్ సామాజిక శాస్త్ర అధ్యయనం (inter- social sciences disciplinary studies) ప్రక్రియ ఈనాడు ప్రాముఖ్యంలోకి వచ్చింది. దీని వల్ల చరిత్ర అధ్యయనంలో విషయ పరిజ్ఞానం పెరిగింది. సాహిత్య చరిత్రలో ఈ ప్రక్రియ జరుగుతున్నది కానీ, ఊపందుకోలేదు. సాహిత్య చరిత్ర కారులకు సామాజిక, మానవీయ శాస్త్రాలతో, కొద్దిమందిని మినహాయిస్తే, పరిచయం, పరిజ్ఞానం తక్కువ. ఇది సాహిత్యకారుల లోపం కాదు. సాహిత్య చరిత్రను బోధించే ప్రక్రియలోనే లోపం వుంది. సాహిత్యకారులకు ఇతర సామాజిక శాస్త్రాల విషయాలు బోధించే, పరిశోధించే విధానాల్లో మార్పు రావాలి. ఈ విషయంలో విశ్వవిద్యాలయాల్లో తగు మార్పులు చేయాలి. తెలుగు భాష, బోధన, సాహిత్యం, పరిశోధన రంగాల్లో కొనసాగుతున్న మునుపటి, కాలం చెల్లిన సంప్రదాయాలు, పద్ధతులు మారాలి.

ఆంధ్రలో సామాజికోద్యమాల చరిత్ర రచనలో మీది ప్రత్యేకమైన కృషి. అందులో సాహిత్యంతో సహా రకరకాల వాఙ్మయాన్ని ఆధారాలుగా తీసుకున్నారు. తెలుగు సాహిత్యచరిత్ర కారులకు తప్పనిసరిగా అవసరమయ్యే వాచక, వాచకేతర వనరుల గురించి మీ సూచనలు, సలహాలు..?

'వాచక', 'వాచకేతర' వనరుల గూర్చి ఒక పట్టిక ఇక్కడ ఇవ్వలేను. కొన్ని సూచనలు, సలహాలు: 1) చారిత్రక దృక్పథంతో, కొద్దోగొప్పో, చారిత్రక అంశాలతో కూడిన సాహిత్యం. 2) ఏ అంశంపై పరిశోధన చేస్తున్నారో, దానిపై లభ్యమయ్యే రచనలు సేకరించడం. 3) యాత్రా చరిత్రలు; స్వీయ చరిత్రలు; రచయితల, సామాజిక, రాజకీయ వేత్తల ఆత్మకథలు, అనుభవాలు, జ్ఞాపకాలు. 4) వాచకేతర వనరుల్లో... ఇంటర్వ్యూలు 5) ఆయా కాలాలపై, అప్పటి కాలంలో ప్రచురించిన సమకాలీన అనుభవాలతో కూడిన రచనలు.. ఇలా ఎన్నైనా చెప్పుకుంటూ పోవచ్చు. సాహిత్యచరిత్ర కారులు విస్తారంగా, తమ పరిశోధనకు సంబంధించి లభ్యమయ్యే సామాజిక శాస్త్రాల్లోని విషయాలను సంప్రదించడం చేయాలి. ఇక, వనరుల గూర్చి ఇతమిత్థంగా, ఫలానా అని చెప్పలేము. అవి పరిశోధించే విషయాలను బట్టి, ఒక ఆధారాన్ని సంప్రదిస్తే, అది మరొక వనరుకు దోహదం చేస్తుంది. ఇది, ఈ ప్రక్రియ, పరిశోధన మొదలై ఆఖరు దాకా అవిచ్ఛిన్నంగా కొనసాగాలి.

చరిత్రకారుడిగా మీరు అభిమానించే తెలుగుసాహిత్యచరిత్ర కారులెవరు?

అందరి పేర్లూ ఇక్కడ ఉటంకించలేను. ముఖ్యంగా ఇంకా రాస్తున్నవారిని ఎంచి చెప్పలేను. పూర్వులలో గురజాడ, కె.వి. రమణారెడ్డి తరువాత కె.వి. రమణారెడ్డి, జి.యస్. రెడ్డి, ఆరుద్ర, వెల్చేరు నారాయణరావు, కె.కె. రంగనాథాచార్యులు... వీరి చరిత్ర రచనను నేను అభిమానించాను.

(ఇంటర్వ్యూ **కె. శ్రీనివాస్**)

పురిటిల్లు

చిన్నారి నవ్వింది
బాంబు ఫ్యూజ్ మాడిపోయింది
కొండ మీది సూర్యుడు
కోటి చేతులతో మందుగుండు గుప్పిస్తున్నాడు
పాల బువ్వతో తల్లి నిప్పును
నీరు గార్చింది


నేల మాళిగలు
జన హృదయాలను
అస్త్రాలుగా మలుస్తున్నాయి
అవి తెల్ల మేడ గుండెల్లో పేలుతున్నాయి

చెట్లు ఆయుధాలను పూస్తున్నాయి
ఆత్మీయతలను కాస్తున్నాయి
సామూహిక బలిదానాలు
భూగర్భాన్ని మానవీకరిస్తున్నాయి

కలిసి బతికేచోట కలలు పూలవనాలవుతాయి
దాడులను దండలుగా ధరించిన నేలలో
ప్రాణాలు పోరు బాణాలవుతున్నాయి
నేటి నెత్తుటి మడుగులు
రేపటి రెక్కల వినువీధి విహారాలు

విశ్వం నిరంతర యుద్ధ భూమి
మానుష అమానుషాల సమర క్షేత్రం
ప్లస్ మైనస్సుల కదన సీమ
రక్త ప్రసవంలో మనిషిని కనే పురిటిల్లు

నిజం



'నల్లకొడిసె వన్నెకాడు' కవిత్వం

నాగిళ్ళ రమేష్ కవితాసంపుటి 'నల్లకొడిసె వన్నెకాడు' ఆవిష్కరణ జూలై 14 సా.6గంటలకు రవీంద్రభారతి మినీహాల్, హైదరాబాద్‌లో జరుగుతుంది. అధ్యక్షత- కవి యాకూబ్, ఆవిష్కరణ- కె. శివారెడ్డి, తొలిప్రతి స్వీకర్త- నాగిళ్ళ సదానందం, అంకితం- జబ్బు వెంకటేష్, ముఖ్య అతిథి- మామిడి హరికృష్ణ, వక్త- కోయి కోటేశ్వరరావు. ఆత్మీయ స్పందనలు- పల్లిపట్టు నాగరాజు, తగుళ్ళ గోపాల్, నరేష్కుమార్ సూఫీ, వనపాకల దిలీప్, పేర్ల రాము, గుర్రాల అనూష, లిఖిత్ కుమార్ గోదా.

కవిసంగమం

'గ్రేయిన్ చైన్స్' ఆంగ్ల అనువాద కవిత్వం

అన్నవరం దేవేందర్ ఆంగ్ల అనువాద కవితా సంపుటి 'గ్రేయిన్ చైన్స్' ఆవిష్కరణ సభ జూలై 14 ఉ.10 గంటలకు కరీంనగర్ ఫిలిం భవన్‌లో జరుగుతుంది. ఆవిష్కర్త- బి. నరసింగరావు, అధ్యక్షత- బూర్ల వెంకటేశ్వర్లు. నలిమెల భాస్కర్, ఎనిశెట్టి శంకర్, జీవి శ్యాం ప్రసాద్ లాల్, నగునూరి శేఖర్, పొన్నం రవిచంద్ర, సవ్యసాచి గాజోజు నాగభూషణం, నంది శ్రీనివాస్ తదితరులు పాల్గొంటారు. వివరాలకు: 94402 38852.

మాడిశెట్టి గోపాల్

'అన్వేషణ' సాహిత్య వ్యాసాలు

తూర్పు మల్లారెడ్డి సాహిత్య వ్యాసాల పుస్తకం 'అన్వేషణ' ఆవిష్కరణ సభ జూలై 12 సా.6గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. ముఖ్య అతిథి, ఆవిష్కర్త- నందిని సిధారెడ్డి, సభాధ్యక్షులు నాళేశ్వరం శంకరం, గ్రంథ సమీక్ష- వి. శంకర్, ఆప్త వాక్యం- ఏనుగు నరసింహారెడ్డి, మామిడి హరికృష్ణ.

కందుకూరి శ్రీరాములు

మీకేమైనా ఒక పిడికెడు స్వప్నాలు కావాలా?

మీకేమైనా
ఓ పిడికెడు స్వప్నాలు కావాలా?
ఎందుకో ఒకందుకు వాడుకుందురు
ఉచితంగానే ఇచ్చేస్తా

ఎందుకలా క్షణంలో నా మీద
ఎర్రెర్రని అసూయ వర్షం గుమ్మరిస్తారు
సముద్రాలను నింపుకున్న
మేఘపు సంచులు చిరిగినట్టు
నాకేమీ పుట్టుకతో వసంతాలు పట్టం కట్టలేదు
పదపల్లవాలు హరివిల్లు జలపాతాల్లో జలకాలాడి
ఎగిరివచ్చి నా ముంగిట మువ్వన్నెల
రామచిలకలై వాల లేదు
శిశిరాలు చేతులుకట్టుకు తలలు వాల్చి
వినయంగా తమ ఆజ్ఞ అంటూ
విన్నపాలు పంచుకోలేదు

కన్నీటి కడలిని వెయ్యిన్నొక్కసార్లు ఈది, మునిగి తేలుతూ
మెరుపుల మాణిక్యాలను ఏరుకున్నాను
కార్చిచ్చు అడవుల్లో పరుగులు తీసి
పిడికెడు నిప్పుకణికలను ఊది ఊది చల్లార్చుకు
కొంగున కట్టుకున్నాను
ఊపిరి దారిని ఎగసిపడే భావోద్వేగాలకు
పుప్పొడి సుగంధాలనద్ది
స్వప్నాలను పరిమళభరితం చేసుకున్నాను

బాధకు చిరునామాగా మారిన ఉనికిని
భాషకు దాసోహం చేసి
నా మనసు కిటికీ పక్కన పారిజాతంగా
నాటుకున్నాను
సమయం విస్మయమై
నా వాకిట రంగుల స్వప్నమయూరమై నర్తిస్తుంది

భళ్ళున పగిలి బద్దలైన ఊహలూ
ఖాళీ లేకుండా రాలిపడిన శుష్క పలవరింతలూ
చిరిగిన గాలిపటాలై నేల బారున



ఎగరలేక సోలిపోయే కథలూ
ముళ్ళకిరీటాలైన మొహమాటాల
చెత్తాచెదారం ఊడ్చిపారేసిన క్షణం

భయసందేహాలు బాధించని
పచ్చని మైదానాలు ఊహల్లో పరచుకున్నాయి
నింగి దిగి వచ్చే రంగురంగుల పిడికెడంత పిట్టలు
సరిగమలను కాచివడబోసి మధుపాత్ర నింపుతాయి
పండి పరిమళిస్తున్న వేకువ చుట్టూ
హరివిల్లు చారలను అతికించి
సీతాకోక చిలుకలు సొగసుల ఊయలలెక్కుతాయి

ఇంటిపక్కనే ఉబికి వస్తున్న స్వప్న ప్రవాహం
జీవనదిగా కదులుతూనే ఉంది
రెల్లుపూలై తూలిసోలే వయ్యారాలు
సుదూరతీరాలకు మోస్తున్న రంగులు
రండి
ఓ పిడికెడు స్వప్నాలు అందుకోండి
మీ మనసు వాకిట అలంకరించుకుందుకైనా.

స్వాతి శ్రీపాద

దళిత సంస్కృతి, సాహిత్యాలపై సదస్సు

'దళిత చరిత్ర - సంస్కృతి - సాహిత్యం - పునర్మూల్యాంకనం - ఖాళీల పూరింపు' అంశంపై రౌండ్ టేబుల్ సదస్సు జూలై 14 ఉ.10గంటల నుంచి 2 గంటల వరకు తెలుగు యూనివర్సిటి కాన్ఫరెన్స్ హాల్, హైదరాబాద్‌లో జరు గుతుంది. గుడిపల్లి నిరంజన్, దార్ల వెంకటేశ్వరరావు, ఘంటా చక్రపాణి తదితరులు పాల్గొంటారు ఈ సందర్భంగా సంగిశెట్టి శ్రీనివాస్ రచించిన 'ఇమానం' విస్మృత దళిత చైతన్యం, 'దళితోద్యమ వేగుచుక్క భాగ్యారెడ్డి వర్మ పుస్తకాల ఆవిష్కరణ ఉంటుంది.

పూలే అంబేద్కర్ అధ్యయన వేదిక

కథా సంధి

సాహిత్య అకాడెమీ, సాహితీ స్రవంతి సంయుక్త ఆధ్వర్యంలో 'కథా సంధి' కార్యక్రమంలో గంటేడ గౌరునాయుడు తమ కథ చదివి ఆహూతులతో ముచ్చటిస్తారు. ఈ కార్యక్రమం జూలై 14 సా.5.30గంటలకు జిల్లా పరిషత్ మినిస్టీరియల్ హాల్, విజయనగరంలో జరుగుతుంది.


సాహితీ స్రవంతి

'వీధిచుక్కలు' కవితా సంకలనం

కొసరాజు సామ్రాజ్యం సంపాదకత్వంలో ప్రచురించిన 'వీధి చుక్కలు' కవితా సంకలనం ఆవిష్కరణ జూలై 14న హైదరాబాద్ మోహన్ నగర్‌లోని కొసరాజు ఆర్ట్ & జాహ్నవి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ హాల్లో జరుగుతుంది. సభలో యస్.వి. రామారావు, రమణ వెలమకన్ని, వై. రామకృష్ణారావు తదితరులు పాల్గొంటారు.

పొత్తూరి సుబ్బారావు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
సోమవారం 8 జూలై 2024



దేవుడి భూములకు.. మరింత రక్షణ

పట్టాదార్ పాస్‌పుస్తకాలు జారీ చేసేందుకు యత్నాలు



- అడ్డుతగులుతున్న సాంకేతిక కారణాలు
- ఆధార్ కార్డు ఉంటేనే పాస్‌బుక్‌ల జారీకి అవకాశం
- దేవుడికి ఆధార్ కార్డు ఇచ్చేది ఎవరు?
- ధరణిలో సవరణలు చేస్తే తప్ప అసాధ్యం
- అధికారుల సమీక్షలో దేవాదాయశాఖ మంత్రి చర్చ
- సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్న అధికారులు
- పట్టా ఉంటే విలువైన మాన్యాలు పదిలం

"ఆలయ భూములకు పట్టాదారు పాసు పుస్తకాలు జారీ అంశంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. సాంకేతిక సమస్యలు లేకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలన్నది చర్చిస్తోంది. దీనిపై విధివిధానాలు వచ్చిన తర్వాత అన్ని భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేసే అవకాశం ఉంది. ఆలయాల పేరు మీద ఉన్న భూమికి పట్టాదారు పాసు పుస్తకం ఎవరి పేరు మీద జారీ చేయ్యాలన్నదే సమస్యగా మారింది. ధరణి పోర్టల్ నిబంధనల ప్రకారం ఆధార్ ఉంటేనే పాసు పుస్తకం ఇవ్వడం కుదురుతుంది. ఒక వేళ కస్టోడియన్‌గా దేవాదాయ అధికారులపేరుతో పాసు పుస్తకాలు ఇవ్వాలంటే నిబంధనల మేరకు కుదరదు. అయితే ఆలయాలన్నింటికీ పాన్‌కార్డు ఉంది. ఇది ఆయా ఆలయ బ్యాంకు ఖాతాలతో అనుసంధానమై ఉంటుంది. ఈ అంశాన్ని ఉన్నతాధికారులు పరిశీలించాలని కొందరు అధికారులు అభిప్రాయపడుతున్నారు. జిల్లా పాలనాధికారులకు బాధ్యతలు అప్పగించి భూములకు కస్టోడియన్‌గా వాళ్ల పేరుమీద పాసు పుస్తకం జారీ చేస్తే ఎలా ఉంటుందన్న అంశం కూడా అధికారులు చర్చిస్తున్నారు. ఏదీ ఏమైనా సాంకేతిక సమస్యలు అధిగమిస్తేనే ఆలయ భూములకు పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేసే అవకాశం ఉంది."

హనుమకొండ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ శాఖకు చెందిన భూము లకు పాస్‌బుక్‌ల జారీలో అనేక చిక్కులు ఎదురవుతున్నాయి. దేవుడి మాన్యాలు అన్యాక్రాంతం కాకుండా కాపాడేందుకు వాటికి వీలైనంత త్వరగా పాస్‌బుక్‌లు పొందేలా చూడాలని ఇటీవల రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ఉన్నతాధికారులతో జరిపిన సమీక్షా సమావేశంలో ఆదేశించారు. ఆలయ భూములు, రెవెన్యూ ఆదాయ వ్యయాలపై నిర్వహించిన ఈ సమావేశంలో ఆలయ భూముల రక్షణకు పట్టాదార్ పాస్‌పుస్తకాలు పొందే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అయితే ఇది సులభం కాదని తెలుస్తోంది. ధరణి పోర్టల్‌లో సాధారణ భూములకు పాస్ పుస్తకాలు జారీ చేసేందుకు వీలుగా మాడ్యుల్స్ ఉన్నాయి. ఇందులో పొందుపరిచిన నిబంధనల ప్రకారం అన్నీ సవ్యంగా ఉంటే సదరు భూములకు పాస్‌పుస్తకాలు జారీ అవుతాయి. అది కూడా అంత సులభంగా జరగడం లేదు. అన్నీ ఉండీ కూడా ఏదో ఒక సాంకేతిక కారణంతో అనేక మంది రైతులకు పట్టాదార్ పాస్‌పుస్తకాలు జారీ కాకపోవడంతో వారంతా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. అలాంటిది దేవుడి భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేయడం కష్టమని రెవెన్యూ అధికారులే చెబుతున్నారు.

సాధారణంగా పట్టాదార్ పాస్ పుస్తకం జారీ కావాలంటే ఆధార్ కార్డు తప్పనిసరి. ఆధార్ నెంబర్ లేకుండా ధరణి ద్వారా పాస్ పుస్తకం పొందడం అసాధ్యం. రైతులకు అయితే ఆధార్ కార్డులు ఉంటాయి. మరీ దేవాలయాల భూములకు ఆధార్‌కార్డు ఎక్కడి నుంచి తెచ్చేది. దేవుడి పేరు మీద ఆధార్ కార్డు ఇచ్చేదెవరు?. ఇదే ఇప్పుడు ఎదురవుతున్న పెద్ద సమస్య. ఈ సాంకేతిక అడ్డంకివల్ల ఆలయ భూములకు పట్టాదార్ పాస్ పుస్తకాలు పొందడం సాధ్యం కాదన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఆలయ భూములన్నిటికీ పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వాలని సమీక్షలో మంత్రి జారీ చేసిన ఆదేశాలతో ఆలయ భూములు ఆక్రమించినవారిలో ఆందోళన మొదలైంది. ఒక వేళ సాంకేతిక అడ్డంకులు తొలగి ఆలయ భూములకు పాస్ పుస్తకాలు జారీ అయ్యేందుకు అవకాశం ఏర్పడిన పక్షంలో ఇప్పటి వరకు అన్యాక్రాంతం అయిన భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు మార్గం సుగమం అవుతుంది.

ధరణిలో నమోదు

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో 670 వరకు రిజిస్టర్డ్ దేవాలయాలు ఉన్నాయి. వీటితో పాటు రిజిస్టర్ కానీ దేవాలయాలు మరో 400వరకు ఉన్నాయి. ఈ దేవాలయాల కింద సుమారు 6వేల ఎకరాలకుపైగా విలువైన భూములు ఉన్నాయి. వీటిలో 3వేల ఎకరాల వరకు ఆలయాల పేరు మీద ధరణిలో నమోదు చేశారు. మిగతా భూములు నమోదు కావలసి ఉంది. ఆలయ భూములను ధరణిలో నమోదు చేసే ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. ఈ వ్యవహారాన్ని చూడడానికి రాష్ట్ర వ్యాప్తంగా నలుగురు తహసీల్దార్ స్థాయి అధికారులను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన వీరిని నియమించారు. ఒక్కొక్కరికి మూడు జిల్లాల చొప్పునే బాధ్యతలను అప్పగించారు. వీరు తమ పరిధిలోని వివిధ ఆలయాల కింద ఉన్న భూముల రెవెన్యూ రికార్డులను పరిశీలించి అన్ని వివరాలతో ధరణిలో నమోదు చేయిస్తున్నారు. ఆలయాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ శాఖ, ధరణిలో పొందుపరిచిన వివరాల తేడాలను గుర్తించేందుకు అన్ని మండలాల్లోని రెవెన్యూ అధికారుల నుంచి నివేదికలను తెప్పించుకుంటున్నారు. వందల ఏళ్ల కిందట అప్పటి దాతలు దేవాలయాల నిర్వహణకు వీటిని దానం చేశారు. తరాలు మారినా ఇప్పటికీ దేవాలయాల ఆధీనంలోనే ఉన్నాయి, కొన్ని భూముల వంశపారంపర్య అర్చకుల చేతిలో ఉన్నాయి.

రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని దేవాదాయ శాఖలో ఆలయ భూ రికార్డుల నిర్వహణ ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురవుతోంది. దీంతో ఆయా ఆలయాల భూములను ఇతరులు సాగు చేసుకుంటున్నారు. అందులో రాజకీయ పలుకుబడి ఉన్న నేతలు పట్టాపాసు పుస్తకాలను పొంది ఏకంగా రైతు బంధు సైతం తీసుకుంటున్నారు. ఫలితంగా పలు ఆలయాలకు భూములు ఉన్నా.. ఆదాయం లేక వాటి నిర్వహణ అగమ్యగోచరంగా మారిందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరణి పోర్టల్ రాకముందు ఆలయ భూములు, మిగులు భూములుగా రికార్డుల్లో ఉండేవి. కొన్ని ఆక్రమణదారులు, అర్చకులు, సంరక్షకులు,

మిగతా 7వ పేజీలో..





ఆలయ భూముల్లో సోలార్ ప్లాంట్లు

- మంత్రి కొండా సురేఖ ఆదేశాలు
- ప్రతిపాదనలు పంపిన దేవాదాయశాఖ అధికారులు
- ఎకరానికి రూ.15వేలు చెల్లింపు
- భద్రకాళి ఆలయంపై రూఫ్‌టాప్ సోలార్ ప్యానెల్స్

హనుమకొండ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో దేవాదాయ శాఖ పరిధిలోని భూముల్లో సోలార్‌ప్లాంట్ల ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు పంపారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశం మేరకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. బీడుగా ఉన్న భూముల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసి ఆదాయం సమకూర్చుకోవాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. అన్ని జిల్లాల్లో అనువుగా ఉన్న భూములను ఎంపిక చేసి ప్రతిపాదనలు పంపాలని కోరింది. ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే కొన్ని నిబంధనలు ప్రతిబంధకంగా మారుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు ఆరువేల ఎకరాల మేరకు ఆలయ భూములు ఉన్నాయి.

సుమారు 11 ఎకరాల్లో..

ఉమ్మడి జిల్లాలో సుమారు 11 ఎకరాల్లో సోలార్ ప్లాంట్ల ఏర్పాటు చేయొచ్చని దేవాదాయ శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపారు. సోలార్ కంపెనీ సంస్థ ఈ భూములకు 15 ఏళ్లకు పైగా లీజుకు తీసుకుంటుంది. ఎకరాకు లీజుకు రూ. 15వేల వరకు చెల్లించే అవకాశం ఉంది. సబ్ స్టేషన్‌కు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న భూమినే తీసుకోవాలని భావిస్తున్నారు. ఈ భూముల్లో ఎలాంటి నిర్మాణాలు ఉండరాదు. భూమి చదునుగా ఉండాలి. గట్టి నేలా అయి ఉండాలి. ఉమ్మడి జిల్లాలో సాధారణంగా బీడుగా ఉన్నవి, సబ్‌స్టేషన్‌కు ఎక్కువ దూరంలో ఉన్న భూములే అధికంగా ఉన్నాయి. భవిష్యత్తులో వాణిజ్య పరంగా అభివృద్ధి చేసే భూములను పరిగణలోకి తీసుకోకుండా ప్రతిపాదనలు పంపించారు. మూడు దేవాలయాల పరిధిలో ఉన్న ఈ 11 ఎకరాలు అనుకూలంగా ఉన్నట్టు గుర్తించారు.

ఏ భూములంటే...?

హనుమకొండ రాగన్న దర్వాజలోని సీతారామచంద్రస్వామి దేవాలయానికి చెందిన భూమి పెద్దమ్మగడ్డ వద్ద ఉంది. ఇది సుమారు మూడు ఎకరాలు ఉంటుంది. ఇది విద్యుత్ సబ్ స్టేషన్‌కు 5కిలో మీటర్ల దూరంలోనే ఉంది. సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు ఈ స్థలం అనువుగా ఉంటుందని దేవాదాయశాఖ అధికారులు భావించారు. మొదటి విడతగా ఈ స్థలంలో ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీంతోపాటు భట్టుపల్లి దగ్గర మల్లికార్జునస్వామికి చెందిన మూడు ఎకరాల స్థలాన్ని కూడా ప్లాంట్ ఏర్పాటుకు అనువుగా ఉంటుందని ప్రతిపాదించారు. అలాగే వరంగల్‌లోని దేశాయిపేటలో గల రంగనాయక స్వామి దేవాలయాలనికి చెందిన 5ఎకరాల స్థలం కూడా అధికారులు పంపిన ప్రతిపాదనల్లో ఉంది. ఈ రెండు స్థలాలు కూడా సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు అనువుగా ఉంటాయని సూచించారు.

భద్రకాళి గుడిపై సోలార్ రూఫ్ టాప్

ఆలయాల మీద సోలార్ రూఫ్ టాప్‌ల ఏర్పాటును కూడా

మిగతా 7వ పేజీలో..



నారక్కపేట రహదారిపై ఎస్సై శ్రీనివాస్ మృతదేహంతో ఆందోళన చేస్తున్న దృశ్యం

పెల్లుబికిన ఆగ్రహావేశాలు

- అశ్వరావుపేట ఎస్సై మృతితో నారక్కపేటలో విషాదఛాయలు
- మృతదేహంతో జాతీయ రహదారిపై రాస్తారోకో
- కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ హామీతో విరమణ

నర్సంపేట టౌన్, జూలై 7: సీఐ, కానిస్టేబుల్ వేధింపులతో మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నం చేసుకున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ (38) ఆదివారం తెల్లవారు జామున మృతిచెందడంతో స్వస్థలం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నారక్కపేటలో విషాదం అలుముకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. ఎస్సై శ్రీనివాస్ గత నెల 30న అశ్వరావుపేట పోలీస్‌స్టేషన్‌లోని సహచర సిబ్బంది వేధింపులతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్న విషయం విదితమే. శ్రీనివాస్‌ను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందారు. కాగా, మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ భార్య కృష్ణవేణి, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువులు, నారక్కపేట గ్రామస్థులు, ప్రజా, దళిత సంఘాలు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ రహదారి (ఎన్‌హెచ్-365)పై ఆదివారం రాస్తారోకో చేపట్టారు. ఉన్నతాధికారులు వచ్చి తమకు న్యాయం చేయాలంటూ ప్రజా ప్రతినిధులు, కుటుంబ సభ్యులు, వివిధ సంఘాలు ఆదివారం జాతీయ రహదారిపై ఆందోళనకు దిగడంతో ఉద్రిక్తత నెలకొంది.

ఎస్సై శ్రీనివాస్ మృతదేహాన్ని హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి మధ్యాహ్నం తీసుకురాగా, గ్రామస్థులు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, ప్రజాసంఘాలు, దళిత సంఘాల నాయకులు డాక్టర్ సారంగపాణి, భట్టు సాంబయ్య, బొట్ల నరేష్, ప్రతాప్, విష్ణు, వైనాల కార్తీక్ తదితరులు నారక్కపేటకు చేరుకున్నారు. అనంతరం జాతీయ రహదారిపై టెంట్ వేసి మృతదేహంతో రాస్తారోకో చేపట్టారు. శ్రీనివాస్ మృతికి కారణమైన సీఐని, సహచర సిబ్బందిని విధుల నుంచి తొలగించాలని, ఎస్సై మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలంటూ డిమాండ్ చేశారు. ఒంటిగంట నుంచి సాయంత్రం 4.30గంటల వరకు ఆందోళన సాగింది. పెద్దసంఖ్యలో జనం చేరు కోవడంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్, నర్సంపేట, నల్లబెల్లి పోలీసు బలగాలు మోహరించాయి.



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న రోహిత్ రాజ్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ హామీ

విషయం తెలుసుకున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఘటనాస్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. మృతికి కారణమైన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, శ్రీనివాస్ కుటుంబానికి ఆసరాగా ఉంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం మృతదేహానికి నివాళులర్పించారు. ఆందోళన అనంతరం ఎస్సై శ్రీనివాస్ మృతదేహానికి నారక్కపేటలోని శ్మశానవాటికలో ప్రజలు, కుటుంబ సభ్యులు అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు.

ఎప్పుడు, ఏం జరుగుతుందోనన్న పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో జాతీయ రహదారి కావడంతో పెద్ద ఎత్తున వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.



రాజమ్మ (ఫైల్)

ఆగిన మేనత్త గుండె

ఎస్సై మరణ వార్త విని హఠాన్మరణం

వివరాలు 6లో..



కపాలిని మాతగా భద్రకాళి

రెండో రోజుకు చేరిన శాకంబరీ ఉత్సవాలు

వరంగల్ కల్చరల్, జూలై 7: వరంగల్ మహా నగరంలోని భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో రెండో రోజు (ఆదివారం) శాకంబరీ ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఉదయం 4 గంటలకు నిత్యాహ్నికం నిర్వహించిన అనంతరం దీక్షా హోమం జరిపి చతుష్టానార్చనను పూర్తిచేశారు. అనంతరం తిథి మండల దేవత యజనంలో భాగంగా జ్ఞానశక్తిని కాళీక్రమాన్ని అనుసరించి కపాలి మాతగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. భగమాలిని మాత(బ్రాహ్మీ శక్తి)గా ఉత్సవమూర్తులను అలంకరించారు. కపాలిని మాత సృష్టిని అసుర శక్తుల విధ్వంసం నుంచి కాపాడుతుందని, పైశాచిక శక్తులను సంహరించి అసుర శక్తులపై దైవీ శక్తుల విజయ సంకేతంగా రాక్షసుల కపాలాలను మాలగా ధరిస్తుందని ప్రధానార్చకుడు భద్రకాళి శేషు వెల్లడించారు. భగమాలిని మాతను బ్రాహ్మీ శక్తి అని కూడా అంటారు. భగమాలిని మాతను ఉపాసన చేస్తే సంతానం, సౌభాగ్యాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. విదియ తిథికి అధిదేవత అయిన బ్రహ్మ ఉపాసన కూడా జరుపబడింది. ఆదివారం కావడంతో దూర ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనానికి వేలాది మంది భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకు తరలివచ్చారు. అమ్మవారిని నగరంలోని పలు వ్యాపారులు, ప్రముఖులు, భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ ఈవో శేషు భారతి, ఆలయ సూపరింటెండెంట్ విజయ్, సీనియర్ అసిస్టెంట్ కూచన హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

శవంతో జాగారం

- అనంతసాగర్‌లో రెండు రోజులుగా కొనసాగుతున్న ధర్నా
- మహేందర్‌రెడ్డి మృతదేహంతో కుటుంబసభ్యుల ఆందోళన
- భూమి ఇస్తేనే కదులుతామన్న బాధితులు.. రంగంలోకి పోలీసులు



మహేందర్‌రెడ్డి మృతదేహం

వరంగల్ క్రైం, జూలై 7: భూ వివాదంలో ఆత్మహత్య చేసుకున్న బండ మహేందర్‌రెడ్డి మృతదేహంతో రెండు రోజులుగా కుటుంబ సభ్యులు ఆందోళన చేస్తున్నారు. మహేందర్‌రెడ్డి మృతికి సోదరుడు బండ ప్రభాకర్‌రెడ్డి కారణమంటూ ఆయన ఇంటి ఎదుట మృతదేహాన్ని పెట్టి న్యాయం చేయాలని జాగరణ చేస్తున్నారు. శనివారం ఉదయం నుంచి ఆదివారం అర్ధరాత్రి వరకు అక్కడే ఉన్నప్పటికీ అధికార యంత్రాంగం నుంచి ఎలాంటి హామీ లభించలేదు. స్పష్టమైన హామీ ఇవ్వకుండా సర్దిచెప్పి ఆందోళన విరమింప చేయాలని పోలీసులు చేస్తున్న ప్రయత్నం ఫలించడం లేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కాజీపేట ఏసీపీ తిరుమల్ సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామ పెద్ద మనుషులను పిలిపించి అర్ధరాత్రి వరకు చర్చలు కొనసాగించారు. అర్ధరాత్రి తర్వాత ఆందోళన విరమింప చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

కాగా, హసన్‌పర్తి మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన బండ మహేందర్‌రెడ్డి, బండ ప్రభాకర్‌రెడ్డిలు అన్నదమ్ములు. వీరి మధ్య భూ వివాదం నెలకొంది. మహేందర్‌రెడ్డికి చెందిన మూడెకరాల స్థలం.. అతడి తమ్ముడు ప్రభాకర్‌రెడ్డి సాదాబైనామా సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. ఇది తెలుసుకున్న మహేందర్‌రెడ్డి.. తన భూమి తనకు ఇవ్వాలని తమ్ముడిని వేడుకున్నాడు. అయినా ఫలితం లేకపోవడంతో గ్రామంలోని పెద్ద

మిగతా8వ పేజీలో..



ఉప్పొంగిన జలపాతం.. తరలొచ్చిన జనవాహం..

బొగత జలపాతం పర్యాటకులతో ఆదివారం కిక్కిరిసిపోయింది. ఓ వైపు జల హోరు సవ్వడి చేస్తుండగా, మరో వైపు జనహోరు ఉర్రూతలూగింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జలపాతం ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో బొగత అందాలు సందర్శకులను మంత్రముగ్ధులను చేస్తోంది. పచ్చని కొండలు, పక్షుల కిలకిలారావాల నడుమ ప్రకృతి అందాలు పర్యాటకులను కట్టిపడేస్తున్నాయి. వారాంతం కావడంతో ఇతర జిల్లాల నుంచి పర్యాటకులు భారీగా తరలివచ్చారు. జలపాతం అందాలను కెమెరాల్లో బంధిస్తూ మురిసిపోయారు. ముందు భాగంలో ఉన్న ఈత కొలనులో జలకాలాడుతూ ముచ్చటపడ్డారు. సుమారు 5వేలకు పైగా పర్యాటకులు జలపాతాన్ని సందర్శించి ఉంటారని అధికారులు అంచనా వేశారు.

- వాజేడు

మోడల్ బస్టాండ్ కలేనా?

శిథిలావస్థలో హనుమకొండ బస్‌స్టేషన్ - ప్రకటనలకే పరిమితమైన కొత్త బస్టాండ్ - ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, సిబ్బంది


గుంతలమయమైన ఆర్టీసీ బస్టాండ్


పగుళ్లతో ప్రమాదకరకంగా భవనం


హనుమకొండ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం

బాలసముద్రం, జూలై 7 : హనుమకొండ ఆర్టీసీ బస్‌స్టేషన్ శిథిలావస్థలో ఉంది. దశాబ్దాల కిందట నిర్మించిన హనుమకొండ ఆర్టీసీ బస్‌స్టేషన్ భవనం పెచ్చులూడి ప్రయాణికులపై పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఒకవైపు మరమ్మతులు చేస్తున్నా.. కురుస్తున్న వర్షాలకు బిల్డింగ్‌పై నీరు నిలిచి పైకప్పు ఊడిపోయి ప్రయాణికులపై పడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. భారీ వర్షాలు కురిస్తే ఆర్టీసీ భవనం కూలిపోయే ప్రమాదం ఉందని ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది చెబుతున్నారు. ఈ బస్టాండ్‌ను కూలగొట్టి మోడల్ బస్టాండ్‌ను నిర్మించి సకల సౌకర్యాలతో తీర్చిదిద్దుతామని రెండేళ్లుగా అధికారులు, పాలకులు ప్రకటిస్తున్నారు తప్ప.. ఆచరణలో చూపడం లేదు.

అస్తవ్యస్తంగా ఆర్టీసీ ప్రాంగణం

హనుమకొండ బస్టాండ్ ఆవరణలో నిర్మించిన సీసీ రోడ్డు అంతా పగుళ్లు పడి బస్సులు పోలేని పరిస్థితి దాపురించింది. బస్టాండ్ నలుమూలలా ఎక్కడ చూసినా గుంతలు దర్శనమిస్తాయి. బస్సులు బస్టాండ్ లోపలికి వెళ్లేటప్పుడు, బయటకు వచ్చేటప్పుడు ఆ గుంతల బాధ తప్పడం లేదు. ఈ క్రమంలో బస్సులు సైతం మరమ్మతులకు గురవుతున్నట్లు డ్రైవర్లు వాపోతున్నారు. నిత్యం వందలాది బస్సులు వచ్చే బస్టాండ్ ఇంత దుర్భరంగా తయారవడంపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రెండేళ్లుగా కాలయాపన

వరంగల్ రీజినల్ పరిధిలో కొత్త బస్సులు త్వరలోనే వస్తాయని అధికారులు చెబుతున్నప్పటికీ రెండేళ్లుగా హామీలకే పరిమితమైంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సరిపోను బస్సులు లేక ఒక్క బస్సులోనే మూడు బస్సుల్లో ప్రయాణించే జనం వెళ్తున్నట్లు ఆర్టీసీ ఉద్యోగులు చెబుతున్నారు. మహాలక్ష్మి పథకం కింద బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో మహిళల ప్రయాణం పెరిగిపోయింది. పదేళ్ల కిందట ఉన్న బస్సులే ఇప్పుడు వినియోగించడంతో పెరిగిన ప్రయాణికులకు బస్సులు సరిపోక ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేటు హైర్ బస్సులు వచ్చినా కొందరు ప్రైవేటు డ్రైవర్లు స్టేజీల వద్ద ఆపడం లేదని మహిళలు వాపోతున్నారు. పదేళ్లుగా ఆర్టీసీకి కొత్త బస్సులు కొనుగోలు చేయకపోవడంతో పాడబడిన బస్సులతోనే సర్వీసులు నడుపుతున్నట్లు ఆర్టీసీ ఉద్యోగులు చెబుతున్నారు.

జాడలేని ఎలక్ట్రిక్ బస్సులు

హనుమకొండ సిటీలో ఎలక్ట్రిక్ బస్సులు వినియోగంలోకి తీసుకొస్తే ప్రైవేటు వాహనాల రద్దీ తగ్గుతుందని, ప్రయాణం కూడా సులభంగా మారుతుందని అధికారులు చెబుతున్నారు. ఎలక్ట్రిక్ బస్సులు రావడం వల్ల కాలుష్యం తగ్గి, డీజిల్ ఖర్చు తగ్గి ఆర్టీసీకి లాభం చేకూరుస్తుందని పలువురు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. హనుమకొండ -2 డిపో పరిధిలో ఎలక్ట్రిక్ బస్సుల కోసం చార్జింగ్ పాయింట్లు, గ్రౌండ్ ఫ్లోరింగ్ పనులు చేపట్టారు. ప్రస్తుతం ఎలక్ట్రిక్ బస్సులు రాకపోవడంతో ఆర్టీసీకి కొత్త బస్సులు లేక ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. అధికారులు, ప్రభుత్వం నూతన బస్సులు కొనుగోలు చేసి ప్రయాణికులకు ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

మూడు నెలల్లో 83 బస్సులు
విజయభాను, ఆర్టీసీ ఆర్ఎం



హనుమకొండ రీజినల్ పరిధిలో మరో మూడు నెలల్లో 83 ఎలక్ట్రిక్ కొత్త బస్సులు వస్తాయి. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఇబ్బందులు కలుగకుండా బస్సు సర్వీసులు పెంచి త్వరలోనే కొత్త బస్సులు వినియోగంలోకి తీసుకొస్తాం.

ఆర్టీసీ డిస్పెన్సరీలో ఇష్టారాజ్యం

వైద్యులు, నర్సుల ప్రవర్తనతో సిబ్బంది ఇబ్బందులు - ఎం.డికి ఫిర్యాదు చేసినా పట్టింపులేదని ఆవేదన

బాలసముద్రం, జూలై 7 : హనుమకొండ ఆర్టీసీలో అధికారుల అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో ఆర్టీసీ డిస్పెన్సరీలో ఔవుట్ సోర్సింగ్ విధులు నిర్వహిస్తున్న వైద్యులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అడిగేవారు లేకపోవడంతో కొందరు ప్రైవేట్ బస్సుల ఓనర్ల నుంచి, ఆర్టీసీ కార్మికుల నుంచి డబ్బులు వసూలు చేసిన ఆరోపణలతో కొందరు అధికారులపై చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే ఆర్టీసీ అకౌంట్ ఆఫీసర్‌గా ఉన్న లావణ్యను ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాలతో హైదరాబాద్‌లోని బస్‌భవన్‌కు పంపించారు. డిస్పెన్సరీలో కొందరు అవుట్‌సోర్సింగ్ వైద్య సిబ్బంది డ్యూటీకి రాకున్నా వచ్చినట్లు రిజిస్ట్రర్‌లో అటెండెన్స్ వేసినట్లు గత నెల 20న శ్రీనివాస్ అనే ఉద్యోగి ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. కరీంనగర్ విజిలెన్స్ అధికారులు విచారణ చేయకుండానే తప్పుడు నివేదిక ఇచ్చినట్లు విలేకరులకు తెలిపాడు. డ్యూటీలో ఉండాల్సిన వైద్యులు విధులకు హాజరు కాకున్నా వచ్చినట్లు మూడు రోజుల తరువాత వచ్చి రిజిస్టర్‌లో నమోదు చేసుకొని వేతనాలు తీసుకుంటుంన్నట్లు ఫిర్యాదు చేశారు. అటెండెన్స్ రిజిస్ట్రర్‌కు సంబంధించి పూర్తి ఆధారాలు ఉన్నా అధికారులు వైద్య సిబ్బందిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే అనుమానాలు వ్యక్త మవుతున్నాయి. వారిపై ఫిర్యాదు చేస్తే విజిలెన్స్ అధికారులు మామూళ్లు తీసుకుని పట్టించుకోవడం లేదని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హనుమకొండ బస్టాండ్‌లో డిస్పెన్సరీ ఆస్పత్రిలో ఆర్టీసీ ఉద్యోగులకు, రిటైర్డు ఉద్యోగులకు వైద్య సేవలు అందించాల్సి ఉంది, ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు అనారోగ్యంతో ఉన్న వారికి ఓపి చూసి అవసరమైన సిబ్బందికి సిక్‌లీవ్‌లు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ సిబ్బంది డబ్బులు ముట్టచెబితేనే సిక్‌లీవ్‌ను ఇస్తున్నట్టు పలువురు పేర్కొంటున్నారు. గతంలో రికార్డు క్లర్కుగా పనిచేసిన ఉద్యోగి డాక్టర్ రాకపోయినా అటెండెన్స్ వేసినట్లు మే 9న రిటైర్డు ఉద్యోగి శ్రీనివాసరావు ఎం.డి. సజ్జనార్‌కు, విజిలెన్స్ డైరెక్టర్‌కు, ఈడీకి ఫిర్యాదు చేశారు. అయినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరంగల్ ఆర్టీసీలో ఉన్న డిస్పెన్సరీపై విచారణ జరిపి నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఉద్యోగులు కోరుతున్నారు.

పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో మెరిసిన సుకన్య

76 కిలోల విభాగంలో స్వర్ణం సాధించిన గిరిజనబిడ్డ



సీరోలు, జూలై 7 : మండలంలోని జగ్యతండాకు చెందిన తేజావత్ సుకన్య పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తాచాటింది. దక్షిణాఫ్రికాలో ఈనెల 3వ తేదీ నుంచి 9 వరకు జరుగుతోన్న 76 కిలోల విభాగంలో ఆసియా, ఆఫ్రికా పవర్ లిఫ్టింగ్ అంతర్జాతీయ పోటీల్లో ఆమె స్వర్ణం సాధించి, దేశఖ్యాతిని చాటింది. ఆసియా ప్రపంచ దేశాల నుంచి వచ్చిన క్రీడాకారులతో పోటీపడి ఆదివారం జరిగిన 76 కేజీల బరువునెత్తి ప్రథమ స్థానంలో నిలిచింది. కాగా, గత నెలలో అమెరికాలో జరిగిన ప్రపంచ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఇండియా తరపున పాల్గొన్న సుకన్య 8వ స్థానంలో నిలిచింది. ఈ విజయాలకు సహకరించిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన కోచ్ వీఎస్ రాజశేఖర్‌సాయికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తాను అమెరికాలో ప్రపంచపోటీల్లో, దక్షిణాఫ్రికాలో ఆసియా, ఆఫ్రికా పోటీల్లో పాల్గొనడానికి సహకరించిన కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. సుకన్య పవర్ లిఫ్టింగ్‌లోనే కాకుండా వెయిట్‌లిఫ్టింగ్‌లో కూడా అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించారు. మున్ముందు మరెన్నో విజయాలు సాధించి దేశఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్తానని క్రీడాకారిణి సుకన్య తెలిపారు. కాగా, ప్రపంచ స్థాయిలో పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో విజేతగా సుకన్య స్వర్ణం సాధించడం పట్ల సీరోలు మండలం జగ్యతండా గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆగిన మేనత్త గుండె

ఎస్సై మరణ వార్త విని హఠాన్మరణం


దార రాజమ్మ (ఫైల్)

దుగ్గొండి, జూలై 7: ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ మరణ వార్త విని ఆమె మేనత్త గుండెపోటుతో మృతి చెందింది. ఈ ఘటన వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని నాచినపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. నాచినపల్లికి చెందిన దార రాజమ్మ (66) సోదరుడు కుమారుడైన శ్రీరాముల శ్రీనివాస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నాడు. జూన్ 30న ఎస్సై శ్రీనివాస్ పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మేనల్లుడి మరణవార్త విన్న రాజ మ్మ ఒక్కసారి గుండె పోటుకు గురై మృతిచెందినట్లు గ్రామస్థులు వెల్లడించారు. దార రాజమ్మకు భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, మాజీ ఎమ్మెల్యే పెద్దిసుదర్శన్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

'రణధీర సీతక్క' పుస్తకావిష్కరణ


రణధీర సీతక్క పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క, ఎంపీ కడియం కావ్య, తదితర నాయకులు

హనుమకొండ కలెక్టరేట్, జూలై7: హనుమకొండలోని జడ్పీ సెమినార్ హాల్‌లో ఆదివారం తెలంగాణ తొలితరం సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, వరంగల్ ఎంపీ కడియం కావ్య దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆస్నాల శ్రీనివాస్ రచించిన రణధీర సీతక్క పుస్తకాన్ని మంత్రి సీతక్క, ఎంపీ కడియం కావ్య ఆవిష్కరించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. దొడ్డి కొమురయ్య తెలంగాణ సాయుధ పోరాటాన్ని ముందుండి నడిపించారన్నారు. మంత్రి సీతక్కపై ఎంపీ కడియం కావ్య కవిత రాసి చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్‌తో పాటు తేజావత్ బెల్లయ్య నాయక్, తీగల జీవన్ గౌడ్, సంగోజు రవి తదితరులు పాల్గొన్నారు.

మాడిఫైడ్ సైలెన్సర్ కలిగిన వాహనాలు సీజ్


సీజ్ చేసిన వాహనాలు

వరంగల్ క్రైం, జూలై 7: మాడిఫైడ్ సైలెన్సర్లను బిగించుకుని వాడుతున్న 10 బుల్లెట్స్‌ను ట్రాఫిక్ పోలీసులు సీజ్ చేశారు. ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ట్రైసిటీలో ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వాహనాలతో వచ్చిన సైలెన్సర్లను మార్చి నగరంలో శబ్ద కాలుష్యానికి కారకులవుతున్న వాహనదారులను పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ సత్యనారాయణ మాట్లాడుతూ.. మెకానిక్‌లు సైలెన్సర్లను మార్చితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లలకు వాహనాలు ఇచ్చేటప్పుడు తల్లిదండ్రులు జాగ్రత్తలు చెప్పాలని ఆయన సూచించారు. వాహనాలకు పేపర్లకు లేకున్నా, సైలెన్సర్లు మాడిఫైడ్ చేసినా, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపినా వాహనాలు సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని సత్యనారాయణ తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌లో ట్రాఫిక్ సీఐలు నాగబాబు, రామకృష్ణ, ఎస్ఐలు పాల్గొన్నారు.

మేడిగడ్డ బ్యారేజీ వద్ద నిలకడగా గోదావరి

▸▸ బ్యారేజీలోకి 20,265 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మహదేవపూర్ రూరల్, జూలై 7 : కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీ వద్ద గోదావరి నది నిలకడగా ప్రవహిస్తోంది. ఆదివారం బ్యారేజీలోకి వచ్చే ఇన్‌ఫ్లో 20,265 క్యూసెక్కులుగా ఉండగా, 85 గేట్లను ఎత్తి అంతే నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. గురు, శుక్రవారాల్లోను ఇదే ప్రవాహం కొనసాగగా వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు విడుదల చేశారు.

అన్నారం బ్యారేజీకి చేరుకున్న నిపుణుల బృందం

మహదేవపూర్, జూలై 7: కాళేశ్వరం ప్రాజెక్టులోని సరస్వతీ బ్యారేజీకి గతంలో బుంగలు రావడంతో ప్రభుత్వం నిపుణుల బృందంతో పరీక్షలు నిర్వహిస్తోంది. అందులో భాగంగా జూన్ నెలలో పూణేకు చెందిన ఓ నిపుణుల బృందం వచ్చి పరిశోధనలు చేసి వెళ్లింది. ఆదివారం డాక్టర్ మందిరా మజుందార్, సంతోష్‌కుమార్ రంగా, రమేష్ బాస్కే నేతృత్వంలోని మరో బృందం వచ్చింది. ఆదివారం పరీక్షలు మొదలు పెట్టాల్సి ఉండగా భారీ వర్షం కారణంగా ఆదివారం పరీక్షలు నిర్వహించలేదు. మొత్తం 42 పరీక్షలకు గానూ 14 మాత్రమే మొదటి బృందం చేయగా, ప్రస్తుతం వచ్చిన బృందం మరి కొన్ని పరీక్షలు చేపట్టనుంది. వీరు ఈ నెల 16 వరకు పరీక్షలు చేయనున్నారు.

గుట్కా పట్టివేత

వరంగల్ క్రైం, జూలై 7: ఐనవోలు మండలం పంథిని గ్రామంలో రూ.33వేల విలువ కలిగిన గుట్కాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. పంథిని గ్రామంలో టి.లక్ష్మీనారాయణ అనే వ్యక్తి నిషేధిత గుట్కా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో ఆదివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. గుట్కాను స్వాధీనం చేసుకుని విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని స్థానిక స్టేషన్‌లో అప్పగించారు. ఈ విషయాన్ని సీఐలు కె.శ్రీధర్, పి.దయాకర్ ధ్రువీకరించారు.

10న ఉపాధి కార్యాలయంలో ఉపాధి మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 7 : ములుగురోడ్‌లోని ఉపాధి, శిక్షణ కార్యాలయంలో ఈ నెల 10న జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా ఉపాధి నోడల్ అధికారి ఎం.మల్లయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరాం లైఫ్ ఇన్సూరెన్స్‌తో పాటు ఆమెజాన్ లాజిస్టిక్ సర్వీసెస్‌లో సుమారు 82 ఉద్యోగాల కోసం ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. శ్రీరామ్‌లో బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్, ఎగ్జిక్యూటివ్స్‌కు డిగ్రీ ఆపై అర్హత, అమెజాన్‌లో హెచ్‌ఆర్‌కు ఎంబీఏ, అకౌంటెంట్‌కు బీకాం, డెలివరీ అసోసియేట్స్‌కు 10 నుంచి ఆపై అర్హతలు కలిగి ఉండి 18 నుంచి 35 యేళ్ల వయస్సు ఉన్న అభ్యర్థులు మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు జిరాక్స్ కాపీలతో ఉదయం 11 గంటల వరకు ములుగురోడ్‌లోని ఉపాధి కార్యాలయంలో హాజరు కావాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 9848895937 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అరుణాచలం భక్తుల కోసం సూపర్ లగ్జరీ బస్సు

బాలసముద్రం, జూలై 7 : గురుపౌర్ణమిని పురస్కరించుకొని తమిళనాడులోని అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షణలకు వరంగల్ డిపో-1 నుంచి జూలై 19వ తేదీన ప్రత్యేకంగా సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ ఆర్‌ఎం డి.విజయభాను ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సూపర్ లగ్జరీ సర్వీస్ నెంబర్ 92222 గల బస్సు జూలై 19వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు హనుమకొండ బస్టాండ్ నుంచి బయలుదేరి జూలై 20వ తేదీన ఉదయం 6 గంటలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కాణిపాకంలోని విఘ్నేశ్వరుడి ఆలయ దర్శనం చేసుకుంటుందన్నారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు వెల్లూరులోని శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి దర్శనం అనంతరం సాయంత్రం 7 గంటలకు అరుణాచలగిరికి చేరుకొని జూలై 21వ తేదీన అరుణాచలేశ్వర స్వామి గిరి దర్శనం చేసుకుంటుందన్నారు. జూలై 22వ తేదీ శ్రీ జోగులాంబ అమ్మవారి శక్తిపీఠం దర్శనానంతరం హనుమకొండకు తిరిగి బయలుదేరనున్నట్లు ఆర్‌ఎం డి.విజయభాను తెలిపారు. ఈ ప్యాకేజీ పెద్దలకు ఒకరికి రూ.4,500, పిల్లలకు రూ.2,500 అన్ని చార్జీలు కలిపి వేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇతర వివరాలకు సెల్ నంబర్ 9866373825, 7382855492లను సంప్రదించాలని ఆయన కోరారు.

ఆస్తిలో వాటా ఇప్పిస్తానని మోసం

▸▸ న్యాయం చేయాలని మాజీ సర్పంచ్ వేడుకోలు



మాట్లాడుతున్న తోటకూరి లక్ష్మి

వడ్డెపల్లి, జూలై 7: తన భర్త ఆస్తిలో వాటా ఇప్పిస్తానని మోసం చేసిన కరీమాబాద్ ప్రాంతానికి చెందిన బండి సుభాష్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని సంగెం మండల కాపుల కనపర్తి మాజీ సర్పంచ్ తోటకూరి లక్ష్మి సీపీ అంబర్ కిశోర్ ఝాను వేడుకున్నారు. ఆదివారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలో విలేకరులతో ఆమె మాట్లాడారు. కాపులకనపర్తి గ్రామానికి చెందిన తోటకూరి చక్రపాణి.. తన మొదటి భార్య మరణించాక తనను రెండో వివాహం చేసుకున్నారని తెలిపారు. తాను 2015 నుంచి 2019 వరకు కాపులకనపర్తి గ్రామ సర్పంచ్‌గా పనిచేశానని పేర్కొన్నారు. తనకు కూతురు జన్మించిందని చెప్పారు. తన భర్త చక్రపాణి 2018 జూన్ 10న మృతి చెందారని తెలిపారు. ఆస్తిలో వాటాలేదని మొదటి భార్య కుమారుడు ఇంటి నుంచి వెళ్లగొట్టాడని, అప్పటి నుంచి తాను హనుమకొండలో నివాసం ఉంటున్నానని చెప్పారు. తన భర్త నుంచి వచ్చే ఆస్తి నుంచి వాటా ఇప్పిస్తానని కరీమాబాద్ ప్రాంతానికి చెందిన సుభాష్ రూ.6లక్షలపై చిలుకు డబ్బులతోపాటు బంగారు ఆభరణాలు, వెండి తీసుకొని మొఖం చాటేశాడని తోటకూరి లక్ష్మి కన్నీటి పర్యంతమయ్యారు. పోలీసు ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

రెవెన్యూ ఎంప్లాయీస్ జిల్లా కమిటీ ఎన్నిక

▸▸ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎం.మల్లయ్య, మేకల రమేష్



మరుపట్ల మల్లయ్య



మేకల రమేష్

వడ్డెపల్లి, జూలై 7: తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్(టెంగా)హనుమకొండ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మరుపట్ల మల్లయ్య(ఐనవోలు) గౌరవ అధ్యక్షుడిగా పొట్లపల్లి రవీందర్ రావు, ప్రధాన కార్యదర్శిగా మేకల రమేష్, కోశాధికారిగా పొలుసారి దామోదర్, ప్రచార కార్యదర్శిగా గడెపు వీర స్వామిలు ఎన్నికయ్యారు. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నికలు జరిగినట్లు ఆయన ప్రకటించారు. అదేవిధంగా వరంగల్ జిల్లా కమిటీని సైతం ఎన్నుకున్నట్లు తెలిపారు.

వరంగల్ జిల్లా ట్రెంగా కమిటీ..

వరంగల్ జిల్లా ట్రెంగా కమిటీ అధ్యక్షుడిగా భూక్య కస్నా నాయక్, ప్రధాన కార్యదర్శిగా నాలిక ఆనంద్‌కుమార్, ఉపాధ్యక్షులు హంస నరేందర్, మహ్మద్ రజాక్, ప్రచార కార్యదర్శిగా పెండ్లి రంజిత్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా లక్ష్మినారాయణ, ఐలేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకోగా మిగిలిన కార్యవర్గం అలాగే కొనసాగుతుందని తెలిపారు. ఈ ఎన్నికల కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కోశాధికారి మహ్మద్ సలీంపాషా, జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి మిట్టపెల్లి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు ఖదీర్‌ఖాన్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బల్దియా ఆవరణలో దొంగల బెడద

▸▸ పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు చోరీ

▸▸ కొన్ని వాహనాల నుంచి పెట్రోల్ మాయం

▸▸ సీసీ కెమెరాలు లేని వైనం

▸▸ చోద్యం చూస్తున్న పోలీసులు, బల్దియా అధికారులు



బల్దియాలో చోరీకి గురైన ద్విచక్ర వాహనం

వరంగల్ కార్పొరేషన్, జూలై 7 : గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం చుట్టుపక్కల కనీస భద్రత కరువైంది. కార్యాలయ ఆవరణలో వాహనాలకు భద్రత లేకుండా పోయింది. బైక్ పార్కింగ్ చేసి తిరిగి వచ్చే సరికి వాహనం ఉంటుందా? అనే అనుమానం నెలకొని ఉంటోంది. మూడు నెలలుగా ఆరు ద్విచక్ర వాహనాలు చోరీకి గురికాగా, తాజాగా గత మంగళవారం శానిటేషన్ విభాగంలో పనిచేసే చాగంటి నవీన్ అనే మునిసిపల్ జవాన్ ద్విచక్ర వాహనం దొంగిలించబడింది. వరంగల్ రంగశాయిపేటకు చెందిన నవీన్ బైక్‌పై కార్యాలయానికి వచ్చాడు. పని చేసుకుని బయటకు వచ్చి చూడగా ద్విచక్ర వాహనం కనిపించ లేదు. లబోదిబోమంటూ అక్కడి వారిని విచారించినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో వెంటనే మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

పోలీసుల నిఘా శూన్యం

వరంగల్ బల్దియా కార్యాలయానికి రోజుకు సుమారు 300 నుంచి 500 వరకు ద్విచక్ర వాహనాలతో సిబ్బంది, అధికారులు, ప్రజలు పనుల కోసం ఉదయం 9 గంటల నుంచే జీడబ్ల్యుఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకుంటారు. సాయంత్రం 5 గంటల వరకు ఎవరి పనుల్లో వారు బిజీబిజీగా ఉంటారు. అయితే నిత్యం బల్దియా పార్కింగ్ ప్రాంతం కార్లు, ద్విచక్రవాహనాలతో రద్దీగా ఉంటుంది. కానీ ఆ ప్రాంతంలో ఒక్క సీసీ కెమెరా కూడా అమర్చలేదంటే అతిశయోక్తికాదు. కార్యాలయానికి వివిధ రకాల మనుషులు పనుల కోసం వస్తుండడంతో ఎవ్వరికీ అనుమానం రాదు. ఇదే అదునుగా భావిస్తున్న దొంగలు.. వాహనాలను చోరీ చేస్తున్నారు. అంతే కాకుండా ఇటీవల ద్విచక్రవాహనాల పెట్రోల్ సైతం తీస్తున్నట్లు బాధితులు తెలిపారు.

ఇంజనీరింగ్ విభాగంలో పని చేసే ఓ అధికారి రెండు రోజుల కిందట రూ.500 పెట్రోల్ పోసుకుని కార్యాలయానికి రాగా, ఒక్క రోజుకే పెట్రోల్ అయిపోయింది. అనుమానం వచ్చి బైక్‌ను పరిశీలించగా పెట్రోల్ పైప్ నుంచి తీసినట్టు ఆనవాళ్లు కనిపించాయి. ఇలా చాలా వాహనాల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ చోరీకి పాల్పడుతున్నట్టు బాధితులు తెలిపారు. బల్దియా పార్కింగ్ ప్రదేశంలో సీసీ కెమెరాలతో పాటు మట్టెవాడ, వరంగల్ సీసీఎస్ పోలీసులు పర్యవేక్షించి నిఘా పెంచాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

వీధి కుక్కలకు అడ్డా.. బల్దియా..

▸▸ కుక్కల స్వైరవిహారంతో సిబ్బంది ఇబ్బందులు

▸▸ పట్టించుకోని సంబంధిత అధికారులు



టౌన్ ప్లానింగ్ కార్యాలయం ముందు సేదతీరుతున్న శునకం

వరంగల్ కార్పొరేషన్, జూలై 7 : బల్దియా కార్యాలయం వీధి కుక్కలకు అడ్డాగా మారింది కొన్ని శునకాలకు కార్పొరేషన్ కార్యాలయాలు సేదతీర్చే నిలయంగా మారుతున్నాయి. కార్పొరేషన్ వెటర్నరీ విభాగం సిబ్బంది నగరంలోని వీధికుక్కలను పట్టి ఏబీసీ (యానిమల్ బర్త్ అండ్ కంట్రోల్ సెంటర్)కు తరలిస్తుండగా.. వారి కార్యాలయాల వద్ద సంచరిస్తున్న కుక్కలను పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. వరంగల్ బల్దియా ప్రధాన కార్యాలయంలో ఆవరణలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. కార్యాలయానికి వచ్చిపోయే ఉద్యోగులు, పనికోసం వచ్చే ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. వీధి కుక్కలు ఏకంగా బల్దియాలోని పైఅంతస్తులలోని కార్యాలయాలకు సైతం వెళ్లి తిరుగుతున్నా ఏఅధికారి పట్టించుకున్న పాపాన పోలేదు. కొన్ని కార్యాలయాల ముందు గజ్జి, చర్మవ్యాధులు సోకిన కుక్కలు దుర్వాసనతో తిరుగుతుండగా సిబ్బంది ముక్కులు మూసుకుని విధులు నిర్వర్తిస్తున్నారు. కొందరు మహిళా సిబ్బంది మాస్కులు ధరించి పని చేస్తున్నట్టు చెప్పారు.

కుక్కలకు అడ్డాలుగా..

బల్దియా ప్రధాన కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్, వెటర్నరీ, హార్టికల్చర్, ఇంజనీరింగ్ విభాగం కార్యాలయాలతో పాటు క్యాంటీన్ వద్ద వీధీ కుక్కలు సంచరిస్తున్నారు. కుక్కలతో ఇబ్బంది పడుతున్న బల్దియా సిబ్బంది.. వెటర్నరీ విభాగం అధికారులకు ఫోన్‌లో ఫిర్యాదు చేసినా పట్టనట్టు వ్యవహరిస్తున్నట్టు ఆరోపిస్తున్నారు. బల్దియాలో ప్రజలను, ఉద్యోగులను ఇబ్బందికి గురి చేస్తున్న వీధి కుక్కలను సంబంధిత అధికారులు పట్టి ఇతర ప్రాంతాల్లో వదిలి వేయాలని డిమాండ్ చేస్తున్నారు.

తెలుగు రాష్ట్రాల సమస్యలకు

శాశ్వత పరిష్కారం చూపాలి

▸▸ కేంద్ర విభజన హామీలు నెరవేర్చాలి ▸▸ సీపీఐ జాతీయ నాయకుడు చాడా వెంకట్‌రెడ్డి



ముల్కనూర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న చాడా వెంకట్‌రెడ్డి

భీమదేవరపల్లి, జూలై 7: తెలుగు రాష్ట్రాల మధ్య పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యలను ముఖ్యమంత్రుల సమావేశం శాశ్వత పరిష్కారం చూపాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో హనుమకొండ జిల్లా సీపీఐ నిర్మాణ కౌన్సిల్ సమావేశం సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆదరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. పదేళ్లలో పెండింగ్‌లో ఉన్న తెలుగు రాష్ట్రాల సమస్యల పరిష్కారానికి ఇరురాష్ట్రాల ముఖ్యమంత్రులు చొరవ తీసుకొని సమావేశం కావడం హర్షణీయమన్నారు. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో అన్ని సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. అలాగే రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత కూడా కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. తెలంగాణకు రావాల్సిన కాజీపేట కోచ్‌ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ, యువతకు ఉపాధి, భారీ పరిశ్రమల నాటి హామీలు అమలు చేయాలన్నారు. తెలంగాణలోని బొగ్గు గనులను సింగరేణికి కేటాయించాలన్నారు. బొగ్గు గనులను ప్రైవేట్‌పరం చేయబోమని ఎన్నికల ముందు చెప్పిన కేంద్ర ప్రభుత్వం.. నేడు టెండర్లను పిలుస్తోందన్నారు. తెలంగాణలోని సహజ వనరులను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు టెండర్లను పిలుస్తోందని విమర్శించారు. నేడు కేంద్రంలో ఉన్న ప్రభుత్వానికి ముక్కు తాడు వేసే విధంగా గట్టిగా ప్రతిపక్షం ఉందన్నారు. దేశంలో మతం పేరుతో ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టిస్తున్న బీజేపీ ఆగడాలను అరికట్టేందుకు వామపక్షాల లౌకిక శక్తులను కాంగ్రెస్ కలుపుకుపోవాలని సూచించారు. ప్రజలకు మెరుగైన విద్య, వైద్యం, కూడు, గూడు, గుడ్డ అందేలా కృషి చేయాలన్నారు.

అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దాలను నెరవేర్చాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాపాలన దరఖాస్తులను పరిష్కారం చూపాలని, పేదలకు ఇళ్లు, ఇళ్లస్థలాలు, పెంచిన పింఛన్లు, పెండింగ్‌లో ఉన్న రేషన్‌కార్డులను అందించాలన్నారు. రైతు భరోసాపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి త్వరగా రైతులకు రైతు భరోసా అందించాలన్నారు. కౌలు రైతులకు కూడా రైతు భరోసా వర్తింపజేయాలని సూచించారు. అలాగే రైతు రుణమాఫీ, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు, సీపీఐ నాయకులు ఉట్కూరి రాములు, మంచాల తిరుపతి, మంచాల రమాదేవి పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే ధ్యేయం కావాలి

▸▸ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 7 : ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వ ఉపాధ్యాయులంతా కృషి చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. హనుమకొండలోని యూటీఎఫ్ కార్యాలయంలో వరంగల్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే ధ్యేయంగా ఉపాధ్యాయులంతా ముందుకు సాగాలన్నారు. సంఘటితంగా పోరాడటంతోనే ఉపాధ్యాయుల హక్కులు, ఫలితాలను అనుభవిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఉపాధ్యాయులు పదోన్నతులు సాధించడంతో యూటీఎఫ్ కీలకపాత్ర పోషించిందన్నారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనప్పటికీ ప్రభుత్వం కృతనిశ్చయంతో బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టిందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఖాళీ పోస్టులు, లెఫ్టోవర్ వేకెన్సీలను త్వరలోనే ప్రభుత్వం పదోన్నతుల ద్వారా భర్తీ చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులందరిపై ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.సోమశేఖర్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.కుమార్, సి.సుజన్ ప్రసాదరావు, ఉపాధ్యక్షులు ఎం.దామోదర్, అన్నాదేవి, కోశాధికారి ఎస్‌ఏ.రావూఫ్, కార్యదర్శులు లింగమూర్తి, శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రావు, కుమారస్వామి, రమేష్, కరుణాకర్, సమ్మక్క, నరసింహారావు, కుమారస్వామి, సత్యనారాయణ, మల్సూర్, రవీందర్, శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

నెరవేరిన మునిసిపాలిటీ కల

▸▸ ఎట్టకేలకు 'ములుగు మునిసిపాలిటీ' బిల్లుకు ఆమోదం



ములుగు, జూలై 7 : జిల్లా కేంద్రమైనా.. మేజర్ గ్రామ పంచాయతీగా కొనసాగుతున్న ములుగు మునిసిపాలిటీగా అవతరించింది. మునిసిపాలిటీ చట్ట సవరణ బిల్లుకు రాష్ట్ర గవర్నర్ ఆమోదం పొందడంతో త్వరలో చారిత్రక ములుగు మునిసిపాలిటీగా మారబోతోంది. 2022 సెప్టెంబర్ 12వ తేదీన అప్పటి ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన మునిసిపాలిటీ చట్టసవరణ బిల్లులో ములుగును అప్‌గ్రేడ్ చేస్తూ తీర్మానించింది. అయితే ఆ తర్వాత అమలులో జాప్యం జరిగింది. కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ములుగు మునిసిపాలిటీ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. ఫైల్ గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉండడంతో ఇక్కడి నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న మంత్రి సీతక్క చొరవ తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 6న గవర్నర్ ఆమోదం తెలుపడంతో లాంఛనం పూర్తయింది. ములుగు, బండారుపల్లి, జీవంతరావుపల్లి గ్రామ పంచాయతీలు కలిపి మునిసిపాలిటీగా ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే పంచాయతీల పదవికాలం పూర్తికాగా, త్వరలో జరిగే ఎన్నికల్లో ములుగులో మునిసిపల్ ఎన్నికలు జరుగనున్నాయి. ప్రస్తుతం ఉన్న గ్రామ పంచాయతీల్లో ఉన్న వార్డులను విభజించడానికి అధికారులు చర్యలు తీసుకోనున్నారు. ఇటీవలే జిల్లా కలెక్టర్ దివాకర మునిసిపాలిటీ అంశాన్ని ప్రస్తావించగా, నాలుగురోజుల వ్యవధిలోనే శుభవార్త వినిపించడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

వార్డుల వివరాలు..

ములుగు గ్రామ పంచాయతీలోని 16 వార్డులు, బండారుపల్లిలోని 12, జీవంతరావుపల్లిలోని 8 వార్డులు ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం 12,135 మంది ఉండగా 9,422 మంది ఓటర్లు ఉన్నారు. బండారుపల్లిలో 3,187 మంది ఉండగా 2436 ఓటర్లు ఉన్నారు. జీవంతరావుపల్లిలో 1211 మంది నివసిస్తుండగా 628 ఓట్లు ఉన్నాయి.



వరంగల్‌లోని వేణుగోపాలస్వామి దేవాలయం

దేవుడి భూములకు మరింత రక్షణ

(5వ పేజీ తరువాయి)

కౌలుదారుల పేరు మీద కొనసాగుతున్నాయి. ధరణి రావడంతో గత ప్రభుత్వం సైన్‌బోర్డులు ఏర్పాటు చేయించింది. దేవాదాయ శాఖ అధికారులు ఈ పనిని కూడా పూర్తి స్థాయిలో చేయలేదు. బోర్డులు ఏర్పాటు చేసినా ఆ తర్వాత అవి ఉన్నాయా? లేవా పట్టించుకోవడం లేదు. అక్రమార్కులు వాటిని ఆ వెంటనే తొలగించి వేస్తున్నారు. కొన్ని చోట్ల ఆ భూముల పక్కనే ఉన్న రైతులు వాటిని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నారు. దున్నే క్రమంలో హద్దులను వారి భూముల్లో కొద్ది కొద్దిగా కలుపుకుంటున్నారు. రికార్డుల పరంగా చూస్తే భూములు వివరాలు సరిగానే ఉంటున్నాయి. కానీ, సర్వే చేస్తే గానీ వ్యత్యాసం తెలిసేది. ఆ పని అధికారులు చేయడం లేదు.

ఆలయ భూముల్లో సోలార్ ప్లాంట్లు

(5వ పేజీ తరువాయి)

పరిశీలించాలని అధికారులను మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. ఇందులో భాగంగా ముందుగా వరంగల్‌లోని భద్రకాళి ఆలయం, యాదగిరిగుట్ట టెంపుల్‌పై ఎన్టీపీసీ ఆధ్వర్యంలో సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటు దిశగా కార్యాచరణ వేగం పుంజుకున్నది. దీంతో ఆలయానికి అవసరమైన కరెంట్ ఉచితంగా లభిస్తుందని, ఆదాయం కూడా సమకూరుతుందని అధికారులు చెబుతున్నారు. ఇలా వచ్చే ఆదాయాన్ని ఆలయ అభివృద్ధి కోసం ఉపయోగించనున్నట్టు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను అనుసరించి ఆలయ భూముల్లో సోలార్ ప్లాంట్ల ఏర్పాటు, ఆలయాలపై సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుపై పంచాయతీరాజ్ శాఖ, రెడ్కో, డిస్కమ్స్‌తో దేవాదాయ శాఖ అధికారులు చర్చించి ఈ మేరకు మార్గదర్శకాలను రూపొందిస్తారు.

సిద్ధం కాని మార్గదర్శకాలు

దేవాలయాల భూముల్లో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు సంబంధించిన మార్గదర్శకాలు ఇంకా సిద్ధం కాలేదు. ఇప్పటి వరకైతే సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ఈ భూములను లీజుకు తీసుకోనున్నట్టు తెలుస్తోంది. ఈ భూముల్లో సోలార్ ప్లాంట్లను ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందా? వాటి నిర్వహణను ఎవరు చూస్తారు? ప్లాంట్ల ద్వారా ఉత్పత్తి అయిన సోలార్ విద్యుత్‌ను డిస్కమ్‌లే తీసుకుంటాయా? తదితర అంశాలపై స్పష్టత రావలసి ఉంది.

మార్గదర్శకాలు రావాల్సి ఉంది

రామల సునీత, అసిస్టెంట్ కమిషనర్, దేవాదాయ శాఖ, వరంగల్

ప్రభుత్వ ఆదేశాల మేరకు సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అనువైన మూడు స్థలాలను గుర్తించి ప్రతిపాదనలను పంపించాం. ఇందులో తొలి విడతగా ఒక స్థలంలో ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నారు. ప్లాంట్ ఏర్పాటు, నిర్వహణ తదితర అంశాలకు సంబంధించిన సమాచారం ఏదీ లేదు. మార్గదర్శకాలు జారీ కావలసి ఉంది.

పిల్లలు కావడం లేదని యువకుడి ఆత్మహత్య

బాలసముద్రం, జూలై 7 : సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధి న్యూశాయం పేటలో జీవితంపై విరక్తి చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘట న ఆదివారం చోటుచేసుకుంది. సుబేదారి సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ న్యూశాయంపేటకు చెందిన చల్ల లక్ష్మీ-పోశాలు దంపతుల కుమారుడైన చల్ల సారంగం(34) సౌమ్యతో మూ డు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. మూడు సంవత్సరాలైనా పిల్ల లు కాకపోవడంతో మృతుడి సౌమ్య మూడు నెలల క్రితం తన తల్లి గారిం టికి వెళ్లి మళ్లీ తిరిగి రాలేదు. దీంతో సారంగం మానసికంగా కృంగి పోయి ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ తెలి పారు. మృతుడు సారంగం తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

విద్యుత్ సమస్యలపై లోకల్ కోర్టులు

హనుమకొండ టౌన్, జూలై 7 : విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు రేపు (మంగళవారం) నుంచి ఎన్పీడీసీఎల్ పరిధిలో లోకల్ కోర్టులు నిర్వహిస్తున్నట్లు సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9వ తేదీన సత్తుపల్లి డివిజన్‌లో, 10న అశ్వరావుపేట సబ్ డివిజన్, 12న కురవి సబ్ డివిజన్, 19న ములుగు సబ్ డివిజన్, 20న మంథని సబ్ స్టేషన్ పరిధిలో వినియోగదారుల నుంచి ఫిర్యాదు స్వీకరించి అప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించబడునని సీజీఆర్ఎఫ్ చైర్మన్ పేర్కొన్నారు.

ఏటేటా తగ్గుతున్న డిగ్రీ విద్యార్థుల ఉత్తీర్ణత

▸▸ ఆఖరు సెమిస్టర్‌లో 50 శాతమే పాస్

▸▸ డిగ్రీ విద్య ప్రమాణాలపై నీలినీడలు

కేయూ క్యాంపస్, జూలై 7 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని విద్యార్థుల ఉత్తీర్ణత ఏటేటా తగ్గుతోంది. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో విస్తరించి ఉన్న కేయూలో విద్యార్థుల ఉత్తీర్ణత 50 శాతం దాటడం లేదు. సంప్రదాయ కోర్సులైన బీఏ, బీకాం, బీఎస్సీ, బీఏ లాంగ్వేజెస్, బీసీఏ కోర్సులను కేయూ డిగ్రీలో అందిస్తోంది. కొన్నేళ్ల నుంచి డిగ్రీలో విద్యార్థుల ఉత్తీర్ణత పడిపోతోంది. ప్రధానంగా బీఎస్సీ మ్యాథ్స్ సబ్జెక్టులో ఇటీవల విడుదలైన ఆరో సెమిస్టర్ పరీక్షల్లో 37 శాతమే విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఒక్కో కళాశాలలో సైన్స్ గ్రూపుల్లో ఉత్తీర్ణత మరీ దారుణంగా ఉన్నట్లు వర్సిటీ పరీక్షల అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

ఆరో సెమిస్టర్‌లో ఉత్తీర్ణత ఇదే..

- కేయూ ఆరో సెమిస్టర్‌లో బీఎస్సీ లైఫ్‌సైన్స్‌లో అమ్మాయిలు 7,728 మంది పరీక్షలు రాయగా, 4,527 (58.58 శాతం), అలాగే అబ్బాయిలు 2,979 మంది పరీక్షలు రాయగా, 965 (32.39 శాతం)మంది ఉత్తీర్ణత సాధించారు.
- బీఎస్సీలో అమ్మాయిలు 6,763మంది పరీక్షలు రాయగా, 3,487 (51.56 శాతం), అలాగే అబ్బాయిలు 6,726 మంది పరీక్షలు రాయగా, 1,609 (23.92 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు.
- బీకామ్‌లో అమ్మాయిలు 6,563 మంది పరీక్షలు రాయగా, 4,661 (71.02 శాతం), అలాగే అబ్బాయిలు 8,258 మంది పరీక్షలు రాయగా, 3,510 (42.50 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు.
- బీఏలో అమ్మాయిలు 2,341 మంది పరీక్షలు రాయగా, 1,636 (69.88 శాతం), అలాగే అబ్బాయిలు 3,589 మంది పరీక్షలు రాయగా, 1,841 (51.30 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు.
- బీసీఏలో అమ్మాయిలు 149 మంది పరీక్షలు రాయగా, 141 (94.63 శాతం), అలాగే అబ్బాయిలు 212 మంది పరీక్షలు రాయగా, 170 (80.19 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు.
- బీబీఏలో అమ్మాయిలు 221 మంది పరీక్షలు రాయగా, 188 (85.07 శాతం), అలాగే అబ్బాయిలు 580 మంది పరీక్షలు రాయగా, 368 (63.45 శాతం)మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తంగా 23,784 మంది అమ్మాయిలకు గాను 14,649 (61.59శాతం), అబ్బాయిలు 22,355 మందికి గాను 8465(37.87శాతం) ఉత్తీర్ణత సాధించారు.

46వేలకు 23వేల మందే ఉత్తీర్ణత

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బీఏ, బీకాం, బీఎస్సీతో పాటు అన్ని గ్రూపుల్లో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో 46,139 మంది అభ్యర్థులు పరీక్షలు రాయగా, వారిలో 23,114మందే ఉత్తీర్ణతసాధించడం గమనార్హం.

ఉత్తీర్ణతలో ఆదిలాబాద్ లాస్ట్

ఇటీవల విడుదలైన డిగ్రీ ఆరోసెమిస్టర్ పరీక్షల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అఖరు స్థానంలో నిలువగా, ఉమ్మడి ఖమ్మం మొదటి స్థానంలో నిలిచింది. వరంగల్ రెండో స్థానంలో నిలిచింది. ఆదిలాబాద్‌లో బీఏ, బీకామ్, బీఎస్సీ, బీఏ లాంగ్వేజెస్, బీఏ, బీసీఏ, బీబీఏ, బీ ఒకేషనల్ కోర్సులలో 15,449 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 7,105 (45.99శాతం)మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే ఖమ్మం జిల్లాలో అన్ని గ్రూపుల్లో 11,809 మంది పరీక్షలకు రాయగా, 6,352 (53.79శాతం)తో మొదటి స్థానంలో నిలిచింది. రెండో స్థానంలో నిలిచిన వరంగల్ అన్ని గ్రూపుల్లో 18,881 మందికి గాను 9657 (51.15శాతం)తో నిలిచింది.

డిగ్రీ విద్య ప్రమాణాలపై నీలినీడలు

డిగ్రీవిద్య ప్రమాణాలు ఏటేటా పడిపోతున్నాయి. విద్యార్థులకు సాధారణ డిగ్రీ కోర్సులపై మక్కువ తగ్గిపోతోంది.



చదువులపై శ్రద్ధ సన్నగిల్లుతోంది. దీనికితోడు కొన్ని కళాశాలల్లో కనీసం సబ్జెక్టులకు అధ్యాపకులు కూడా లేకపోవడం గమనార్హం. స్కాలర్‌షిప్‌లు, ఇతర ఫీజుల కోసం విద్యార్థులను కళాశాలల్లో చేర్పించుకుని వారి తరగతులను మేనేజ్‌మెంట్ పట్టించుకోకుండా వదిలివేస్తున్నారు. విద్యార్థులు స్వతహాగా చదువుకుని రాస్తే ఉత్తీర్ణత సాధించినట్లు లేకపోతే అంతే సంగతులు. ఇటీవల డిగ్రీ కోర్సుల్లో మాల్ ప్రాక్టీస్ కేసులు పెరుగుతున్నాయి. కొన్ని కళాశాలల్లో కనీస సౌకర్యాలేకుండా డిగ్రీ కోర్సులను మమ అనిపిస్తున్నారు. వర్సిటీ అధికారులు తనిఖీలు చేసినప్పుడు డూప్లికేట్ ల్యాబ్‌లు, తాత్కాలిక సిబ్బందితో కళాశాల లూక్‌ను చూపించి కళాశాలల అఫిలియేషన్ పర్మిషన్లు పొందుతున్నారు. వర్సిటీ అధికారులు కూడా డబ్బులకు ఆశపడి చూసీచూడనట్లుగా వ్యవహరించి కళాశాలలకు అఫిలియేషన్ అనుమతులిస్తున్నారనే విమర్శలున్నాయి. సైన్స్ కోర్సుల్లో విద్యార్థులకు ల్యాబ్‌లు, క్లాస్‌లు జరుగగా ఒక్కరు కూడా ఉత్తీర్ణత సాధించని కళాశాలలు అనేకం వర్సిటీ పరిధిలో ఉన్నాయి.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, జూలై 7: టీఎస్ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని వరంగల్ డివిజన్ 11కేవీ మెయింటెనెన్స్‌లో భాగంగా స్టేషన్‌రోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాలలో సోమవారం ఉదయం 9:00 గంటల నుంచి 11:00గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నారు. అదేవిధంగా జీఆర్ గుట్ట, స్టేషన్ రోడ్డు, క్రిష్ణకాలనీ, జేపీఎన్ రోడ్డు చౌరస్తా, బీట్‌బజార్, నిజాంపుర, రామోళ్లవాడ, గిర్మాజిపేట ప్రాంతాల్లో ఉదయం 9:00 గంటల నుంచి 12:00 గంటల వరకు, వసంతాపూర్, దూపకుంట, పాపయ్యపేట చమన్, జ్యోతి కాలనీ, మట్టెవాడ ప్రాంతాల్లో ఉదయం 8:30 నుంచి 11:30 వరకు విద్యుత్తును నిలిపివేయనున్నారు.

ఈ మేరకు వరంగల్ టౌన్ డివిజనల్ ఇంజనీర్ ఎలక్ట్రికల్, ఆపరేషన్స్ శంకేశి మల్లికార్జున్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.



సభలో మాట్లాడుతున్న డాక్టర్ కడియం కావ్య

మహిళలు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

వడ్డెపల్లి, జూలై 7: మహిళలు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో ఆదివారం అఖిలగాండ్ల తెలికుల రాష్ట్ర మహిళా కమిటీ ప్రథమ వార్షికోత్సవం కమిటీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బొల్లెపల్లి అన్నపూర్ణ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. గాండ్ల కార్పొరేషన్ ఏర్పాటు విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. గాండ్ల కులస్తుల కోసం కమ్యూనిటీ హాల్‌ను హనుమకొండ నగరంలో నిర్మించేందుకు తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. మహిళలు ఇంటి పనులకే పరిమితం కాకుండా స్వయం కృషితో విద్యనభ్యసించి అన్నిరంగాల్లో పురుషులతో దీటుగా రాణించాలని కోరారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు కడియం కావ్యను ఘనంగా సత్కరించారు. అఖిల గాండ్ల తెలికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూతురు లక్ష్మణ్, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు అమనగంటి శ్రీనివాస్, రాష్ట్ర మహిళా కార్యనిర్వాహక అధ్యక్షురాలు పిల్లలమర్రి పుష్పలత, ఆహ్వాన కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గుండ్ల సాహితి, ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ అనంతలక్ష్మి, ప్రత్యేక ఆహ్వానితులు జక్కం ఉమ, కన్నం రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉద్యోగికి గాయాలు

మడికొండ, జూలై 7: రోడ్డు ప్రమాదంలో మునిసిపల్ ఉద్యోగికి గాయాలైన ఘటన మడికొండలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మునిసిపల్ ఉద్యోగి బత్తుల కొమురయ్య తన భార్యతో కలిసి బైక్‌పై మడికొండ నుంచి కాజీపేట వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో స్థానిక వైన్స్ షాపు ముందుకు రాగానే ముందు వెళ్తున్న కారు పక్కన పార్కింగ్ చేసి కారు డోర్ తీశాడు. దీంతో కారు డోర్ ఢీకొని కొమురయ్యకు, అతడి భార్యకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108లో ఆస్పత్రికి తరలించారు.

పండ్ల తోటలకు భారీ రాయితీలు

లాభాలు అధికంగా ఉండడంతో ఆసక్తి చూపుతున్న రైతులు

జిల్లాలో 600 ఎకరాల్లో పండ్లతోటల పెంపకం లక్ష్యం

ఇప్పటికే 417 ఎకరాల్లో సాగుకు ముందుకు వచ్చిన రైతులు

హనుమకొండ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉద్యాన తోటలకు భారీగా రాయితీలను కల్పించి సాగును ప్రోత్సహిస్తోంది. ఉద్యానవన శాఖ, ఉపాధి హామీ పథకంతో ఈ తోటల పెంపకానికి రైతుల నుంచి అధికారులు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. పండ్లతోటల పెంపకంపై గ్రామాల్లో రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వం ఉద్యాన పంటల సాగుకు పెద్ద పీట వేస్తున్నది. కూరగాయలు, పండ్లు, ఇతర ఉద్యానవన పంటలకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని రాయితీలతో కూడిన ప్రోత్సాహాన్ని అందిస్తోంది. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో తోటల పెంపకం చేపట్టవచ్చు. తద్వారా చిన్న, సన్నకారు రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. నీటి వనరులున్న రైతులు వరి సాగు చేస్తుండడంతో ఏటా సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతున్నది. వరికి ప్రత్యామ్నాయంగా అధిక ఆదాయాన్ని ఇచ్చే పండ్లు, ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించి రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈజీఎస్ ద్వారా రాయితీలు ప్రకటించింది. పండ్ల తోటలను పెంచేందుకు రైతులు కూడా పెద్ద ఎత్తున ముందుకు వస్తున్నారు. వడగళ్ల వానలు, వాతావరణ మార్పుల సమస్యల కారణంగా రైతులు పండ్ల తోటల వైపు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. కేంద్ర ప్రభుత్వ ఉపాధి హామీలో రైతులను ప్రోత్సహించేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ పథకం కింద పండ్ల తోటను వేయాలని నిర్ణయించుకున్నది. మామిడి తోటల సాగుకు రైతులు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. ఆయిల్‌పామ్ తోటల పెంపకానికి కూడా ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు.

ఏ తోటలంటే..?

ఉపాధి హామీ పథకంలో భాగంగా మామిడి, జామ, మునగ, సీతాఫలం, సపోటా, బత్తాయి, అల్లనేరేడు, నారింజ, కరోండ, ఆయిల్‌పామ్ తోటలకు అవకాశం కల్పించారు. బ్లాక్ ప్లాంటేషన్, గట్లపై పెంచేందుకు నేరేడు, కొబ్బరి, చింత, సీతాఫలం, కరోండకు కూడా మంజూరు ఇచ్చారు. పండ్ల తోటల సాగు కోసం గుంతలు తీయడం, మొక్కల కొనుగోలుకు, వాటిని నాటడానికి, ఊతకర్రలు కట్టడానికి, ఎరువులకు, నెలనెలా పర్యవేక్షణకు ఇలా ఏడాది నుంచి మూడేళ్లపాటు ఉపాధి హామీ పథకం నుంచే నిధులు ఇస్తారు. అలాగే ఆయిల్‌పామ్‌కు బిందు సేద్యం సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వమే కల్పిస్తుంది. మొక్కకు నెలకు రూ.12.25 పైసలతో ఒక రోజుకు రూ.300చొప్పున సంవత్సరానికి రైతుకు 100 రోజులు చెల్లిస్తారు. తర్వాత ఆ సంవత్సరంలో రైతుకు 100 రోజులు పూర్తి అయినట్లయితే ఇతర కూలీలతో గడ్డి తొలగింపు, నీళ్ల పెట్టడం, ఇతర సంరక్షణ పనులు చేయించి వారికి డబ్బులు చెల్లిస్తారు. ఎరువులు, పురుగు మందులకు సంవత్సరానికి ఒక మొక్కకి రూ.50 చొప్పున ఉపాధి హామీ పథకం నుంచి రైతులకు చెల్లిస్తారు.



భీమదేవరపల్లి మండలం గాంధీనగర్‌లో సాగవుతున్న పండ్లతోట

లక్ష్యం

జిల్లాలో 2024-25 సంవత్సరానికి మొత్తం 12 మండలాల్లో మండలానికి 50 ఎకరాల చొప్పున 600 ఎకరాల్లో ఈ పండ్ల తోటల పెంపకాన్ని అమలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటి వరకు 417.9 ఎకరాల్లో సాగుకు 237 మంది రైతులను గుర్తించారు. ఆత్మకూరు మండలంలో 33.75 ఎకరాల్లో 12 మంది రైతులు, భీమదేవరపల్లిలో 52 ఎకరాల్లో 26 మంది రైతులు, దామెరలో 41.5 ఎకరాల్లో 24 మంది రైతులు, ధర్మసాగర్‌లో 29.35 ఎకరాల్లో 17 మంది రైతులు ఎల్కతుర్తిలో 17.5 ఎకరాల్లో 12 మంది రైతులు హసన్‌పర్తిలో 19.5 ఎకరాల్లో 12 మంది రైతులు, ఐనవోలులో 4.43 ఎకరాల్లో 3 రైతులు, కమలాపూర్‌లో 8 ఎకరాల్లో 6 రైతులు నడికుడలో 47 ఎకరాల్లో 18 మంది రైతులు, పరకాలలో 23.5 ఎకరాల్లో 22 మంది రైతులు, శాయంపేటలో 84 ఎకరాల్లో 49 మంది రైతులు, వేలేరులో 57.41 ఎకరాల్లో 36 మంది రైతులను గుర్తించారు. ఇప్పటి వరకు 49.05 ఎకరాల్లో 23 మంది రైతులు పండ్ల మొక్కలను నాటారు. 2023-24 సంవత్సరంలో 166.72 ఎకరాల్లో పండ్ల తోటలను సాగు చేశారు. వాస్తవంగా 1600 ఎకరాల్లో పండ్ల తోటలను పెంచాలని లక్ష్యంగా నిర్ణయించారు. పండ్లతోటల పెంపకానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం బిందు సేద్యం సౌకర్యం కల్పిస్తానని చెప్పి ఆ తర్వాత చేతులు ఎత్తేసింది. పండ్ల తోటల పెంపకానికి 800 ఎకరాలను ఇది వరకే గుర్తించి ఉంచారు. కానీ బిందు సేద్యం సౌకర్యం లేకపోవడం రైతులు పెద్దగా ముందుకు రాలేదు. దీనితో 166 ఎకరాల వరకే పండ్ల తోటలు సాగయ్యాయి.

అర్హులు

ఉపాధి కూలీలుగా నమోదు చేసుకున్న ఐదెకరాల భూమి ఉన్న ఎస్సీ, ఎస్టీ చిన్న, సన్నకారు రైతులు ఈ పథకం కింద అర్హులు. ఉపాధి హామీ జాబ్ కార్డు తప్పనిసరి. జాబ్‌కార్డు లేనివారు కూడా ముందుకు వస్తే వారికి అధికారులు జాబ్ కార్డు ఇప్పిస్తారు. అయిదెకరాల్లోపు ఉన్న సన్నకారు రైతులు అర్హులు. ముఖ్యంగా సాగునీటి వసతి ఉండాలి. తోటలు పెంచేందుకు బిందు సేద్యంపై రాయితీ ఇస్తారు. ఎస్సీ, ఎస్టీలకు శతశాతం, మిగతా వారికి 90 శాతం రాయితీపై పరికరాలు ఇవ్వనున్నారు. పండ్ల తోటలను పెంచేందుకు ఆసక్తి ఉన్న రైతులు స్థానిక ఎంపీడీవో కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. సమయం అంటూ ఏదీ లేదు.

మొక్కలకు చెల్లించే ధర

ఉపాధి హామీ పథకంలో వివిధ రకాల మొక్కలకు నిర్ణయించిన మేరకు ధరలను చెల్లిస్తుంది. మార్కెట్‌లో రైతులు తమకు నచ్చిన మొక్కలను కొనుగోలు చేసుకోవచ్చు. వాటి ధర ఎక్కువ ఉంటే ఆ మేరకు కొనుగోలు చేసినా ప్రభుత్వం నిర్ణయించిన ధరనే చెల్లిస్తుంది. మిగతాది రైతులే భరించాల్సి ఉంటుంది. మామిడి మొక్కకు రూ.30, బత్తాయి రూ.44, సపోట రూ.37, కొబ్బరి రూ.36, జామ రూ.31, డ్రాగన్ ఫ్రూట్ రూ.30, సీతాఫలం రూ.26. నిమ్మ రూ.25, అల్లనేరేడు రూ.25, దానిమ్మ రూ.24, మునగ రూ.15, ఆయిల్‌పామ్ రూ.20 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుంది. ఆయా పండ్ల తోటలు పెంచడానికి ఒక ఎకరానికి మామిడి 70 మొక్కలు, బత్తాయి 100 మొక్కలు, సపోట 60 మొక్కలు, కొబ్బరి 110 మొక్కలు, జామ 110 మొక్కలు, డ్రాగన్ ఫ్రూట్ 900 మొక్కలు, సీతాఫలం 160 మొక్కలు, నిమ్మ 110 మొక్కలు అల్లనేరేడు 40 మొక్కలు దానిమ్మ 265 మొక్కలు, మునగ 1000 మొక్కలు ఆయిల్ ఫామ్ 57 మొక్కలు అవసరమవుతాయి.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

ఐనవోలు, జూలై 7: ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణామాదిగ జన్మదిన వేడుకలను ఆదివారం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. ఐనవోలు, కొండపర్తి, వెంకటాపూర్, నందనం తదితర గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం కేకులు కట్‌చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొక్కల నారాయణమాదిగ, జిల్లా, మండల నాయకులు సింగారపు చంద్రమౌళి, కట్కూరి ప్రవీణ్‌మాదిగ, దర్గా సొసైటీ వైస్ చైర్మన్ మాదాసు బాబుమాదిగ, బీజేపీ నాయకుడు మాదాసు ప్రణయ్, నాయకులు గద్దల బాబు, ప్రభాకర్, అల్లందాసు, యూత్ అధ్యక్షుడు తరుణ్, రహీం, రజిని, ఆత్మ డైరెక్టర్ రాజు, సుమన్, అరుణ్, సునిల్, ఇంద్రసేన, చంటి, పరమేష్, శ్రీనివాస్, ఉదయ్‌సింహం, అశోక్, ఐలయ్య మాదిగ పాల్గొన్నారు.

● కాజీపేట: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం కాజీపేట చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ నాయకులు జెండా ఆవిష్కరించారు. అనంతరం మందకృష్ణ మాదిగ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రైల్వే స్టేషన్‌లో పండ్లు పంపిణీ చేశారు. ఏబీసీడీ వర్గీకరణ కోసం ప్రారంభమైన ఉద్యమం 30 ఏళ్లుగా చేస్తున్న పోరాటాన్ని పలువురు గుర్తు చేశారు. బండారి సురేందర్ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కుమార్, రాజయ్య, మల్లేశ్, మహేశ్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

● న్యూశాయంపేట: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ఎమ్మార్పీఎస్ బలమైన శక్తిగా ఎదిగిందని ఎమ్మెస్పీ జాతీయ నాయకులు మంద కుమార్ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం, మంద కృష్ణ జన్మదిన వేడుకలు న్యూశాయంపేటలోని బస్‌స్టేషన్ కూడలిలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా మంద కుమార్ మాదిగ ఎమ్మార్పీఎస్ జెండా ఎగురవేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ... ఎమ్మార్పీఎస్ మాదిగల కోసం సంఘటితమైనప్పటికీ సమాజంలో ఉన్న అన్ని వర్గాల ప్రజలకు, కులాలకు ఎన్నో ఫలాలు అందించిందన్నారు. ఎస్సీల వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ పోరాటం చేస్తూనే అన్ని వర్గాల ప్రజలకు రావాల్సిన అభివృద్ధి ఫలాల కోసం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు గద్దల సుకుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జన్ను దినేష్ మాదిగ, ఎమ్మెస్పీ రాష్ట్ర నాయకులు మంద రాజు మాదిగతో పాటు శివ, చిన్నరాజు, శ్యామ్, రవి, బాబు తదితరులు పాల్గొన్నారు.



కేయూ వద్ద కేక్ కట్ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, వర్సిటీ అధ్యాపకులు

● కేయూ క్యాంపస్: ఎస్సీ వర్గీకరణ కోసం దృఢ సంకల్పంతో పోరాడుతూ సమానత్వం, సమాజహితం కోసం ఎమ్మార్పీఎస్ పనిచేస్తుందని ఎమ్మార్పీఎస్ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొడ్డు దయాకర్, కేయూ బయోటక్నాలజీ ప్రొఫెసర్ డాక్టర్ పొడేటి శ్రీనివాస్‌లు అన్నారు. ఆదివారం కేయూలో ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం కేయూ ఎంఎస్ఎఫ్ అధ్యక్షుడు కుమ్మరి శ్రీనాథ్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతనిధి బొర్ర భిక్షపతి, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొచ్చు తిరుపతి, కేయూ ఇన్‌చార్జి డాక్టర్ వడ్డెపల్లి మధు, అంబేద్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షడు మంద నరేశ్, యువసేన నాయకులు పుట్ట భిక్షపతి, స్వేరో స్టూడెంట్ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలో ఆందోళన చేస్తున్న డీబీఎఫ్ నేతలు

సీఐ జితేందర్‌రెడ్డిపై హత్యానేరం నమోదు చేయాలి

డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్

వడ్డెపల్లి, జూలై 7: అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్యకు కారకుడైన సీఐ జితేందర్‌రెడ్డితో పాటు కానిస్టేబుళ్లపై హత్యానేరం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ డిమాండ్‌చేశారు. ఆదివారం హనుమకొండలోని అంబేద్కర్ సర్కిల్‌లో డీబీఎఫ్ ఆధ్వర్యంలో ఎస్సై శ్రీనివాస్ ఆత్మహత్యకు నిరసనగా ధర్నా చేశారు. కార్యక్రమంలో అసైన్డ్ భూమి సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కలకోటి మహేందర్, డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, జిల్లా నాయకులు మంద నవీన్, చుంచు నరేష్, వేల్పుగొండ నర్సింగరావు, మోరె ఐలయ్య, సిలువేరు నరేందర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే దళిత ఎస్సై శ్రీనివాస్ ఆత్మహత్యకు కారకుడైన సీఐ జితేందర్‌రెడ్డిని వెంటనే సస్పెండ్ చేసి కఠినంగా శిక్షించాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ (బొజ్జాతారకం)రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వడ్డెపల్లి, జూలై 7: అభివృద్ధిలో ప్రజలు, ఉద్యోగులు భాగస్వాములు కావాలని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని కేయూ ఎంప్లాయిస్ కాలనీలోని ఆచార్య జయశంకర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన కేయూ ఎంప్లాయిస్ హౌసింగ్ సొసైటీ సమావేశానికి ప్రొఫెసర్ కె.సాయిలు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. నగరంలో శాశ్వత పరిష్కారం కోసం సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే వరంగల్ నగరంలో అండర్ డ్రెయినేజీ సిస్టంను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కేయూ ఎంప్లాయిస్ కాలనీ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులను మంజూరు చేస్తానని తెలిపారు. కేయూ ఎంప్లాయిస్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు పి.కొండల్‌రెడ్డి, ఎం.భాస్కర్, పి.లక్ష్మినారాయణ, జి.రాజసుధాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నారాయణ, సుందర్‌తోపాటు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఎనుకొంటి నాగరాజు, తేళ్ల సుగుణ కిశోర్, కేతిరి దీపక్‌రెడ్డి, తాళ్లపెల్లి సుధాకర్, ఎం. ధన్‌రాజ్, ఎనుకొంటి పున్నంచందర్, పూరెళ్ల రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయిని రాజేందర్‌రెడ్డి

పాలక మండలి నియామకంపై అభ్యంతరం

కేయూ క్యాంపస్, జూలై 7: కాకతీయ యూనివర్సిటీ పాలక మండలి సభ్యుల నియామకంపై పలు అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి ఆదివారం ఫిర్యాదు చేసినట్లు కేయూ జువాలజీ రిటైర్డు అధ్యాపకురాలు డాక్టర్ వినతరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పాలక మండలి జీవో రద్దు చేయాలని, 9 మంది సభ్యులలో గతంలో ఉద్యోగం నుంచి తొలగించిన వారిని నియమించారని పేర్కొన్నారు. ఈసీ తొలగించిన వారిని ఈసీ సభ్యులుగా ఎలా నియమిస్తారని ఫిర్యాదులో వెల్లడించారు. ఈసీ నియామకంపై సీఎం, ప్రిన్సిపాల్ సెక్రటరీలకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

హనుమకొండ కల్చరల్, జూలై 7: హనుమకొండ సుబేదారి జులైవాడలోని లోటస్ పాఠశాల పదో తరగతి విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. పూర్వ విద్యార్థులంతా ఈ సందర్భంగా తమ స్మృతులను నెమరువేసుకున్నారు. హనుమకొండ పెండం ఇన్‌ఫ్రా డెవలపర్స్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి 30 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. వీరితోపాటు కరస్పాండెంట్ వేణుమాధవ్, బి.రమాదేవి, ఉపాధ్యాయులు శ్రీకాంత్, రమేష్ విద్యార్థులు పాల్గొన్నారు. తదుపరి సమావేశానికి పెద్ద సంఖ్యలో హాజరుకావాలని తీర్మానించారు.

ఓరుగల్లు కళాకారులకు జీవితకాల సాఫల్య పురస్కారాలు



శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న రోజా క్రియేషన్స్ ప్రతినిధులు

న్యూశాయంపేట, జూలై 7: కొన్నేళ్లుగా జాతీయ, అంతర్జాతీయ ప్రదర్శనలతో ఓరుగల్లు కీర్తిని చాటిన ఓరుగల్లు కళాకారులు కూనూరు శ్రీనివాస్, నవీన్‌లను రోజా క్రియేషన్స్ ప్రతినిధులు ఆదివారం హనుమకొండలోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో ప్రతిభా పురస్కారాలు అందజేసి సత్కరించారు. 30 ఏళ్లుగా శ్రీనివాస్ జానపద కూచిపూడి నృత్య కళాకారుడిగా, నృత్య శిక్షకుడిగా విశేష సేవలు అందించినందుకుగాను సత్కరించినట్లు రోజా క్రియేషన్స్ ప్రతినిధులు తెలిపారు.

ఆదర్శకాలనీ నూతన కమిటీ ఎన్నిక

హనుమకొండ టౌన్, జూలై 7: గ్రేటర్ 53వ డివిజన్ ఆదర్శకాలనీ అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం సాయంత్రం జరిగింది. ఆదర్శ కాలనీలోని అభినిలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆదర్శ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా తూడి విద్యాసాగర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రాష్ట్రపతి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పరికిపండ్ల వేణులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా కోశాధికారిగా తౌటం నరిసింహస్వామి, సహయ కోశాధికారిగా రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా పాశం సంజీవరెడ్డి, కర్రె తిరుపతిరెడ్డి, మహిళా ఉపాధ్యక్షురాలిగా ఎం.స్వప్న, సాంస్కృతిక కార్యదర్శిగా పైడిపాల రమేష్, మహిళ సహాయ కార్యదర్శులుగా కె.రజిని, పి.రజిత, ఆడిటర్‌గా సురభి వినోదరావు, గౌరవ అధ్యక్షులుగా దొండపాటి వేణుగోపాల్ రెడ్డి, ఏనుగుల రామ్‌రెడ్డిలతో పాటు ముఖ్యసలహాదారులను, 11మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.



అధ్యక్షుడు
తూడి విద్యాసాగర్‌రెడ్డి



ప్రధాన కార్యదర్శి
పరికిపండ్ల వేణు

శవంతో జాగారం

(5వ పేజీ తరువాయి)

మనుషులను ఆశ్రయించాడు. ఆరేళ్లుగా పెద్ద మనుషులు, పోలీసుల చుట్టూ తిరిగి విసిగిపోయిన మహేందర్‌రెడ్డి.. మనస్తాపానికి గురై ఈనెల 4న పురుగుల మందు తాగాడు. చికిత్స పొందుతూ 5వ తేదీ రాత్రి మృతి చెందాడు. మహేందర్ రెడ్డి మృతికి ప్రభాకర్‌రెడ్డి కారణమని ఆరోపిస్తూ శనివారం ఉదయం కుటుంబ సభ్యులు మృతదేహాన్ని తీసుకువచ్చి ఆయన ఇంటిముందు ఆందోళనకు దిగారు. ప్రభాకర్‌రెడ్డిని అరెస్టు చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా, ఆందోళన విరమింప చేసేందుకు పోలీసులు తీవ్ర ప్రయత్నాలు సాగించారు. ఏసీపీ తిరుమల్‌తో పాటు హసన్‌పర్తి, కమలాపూర్, ఎల్కతుర్తి పోలీసులు, సీఆర్‌పీఎఫ్ పోలీసులు ఆందోళన స్థలంలో మోహరించారు. ఏ క్షణంలోనైనా ఆందోళన విరమింప చేసే అవకాశాలున్నాయి.

ఇద్దరు పెద్ద మనుషుల అరెస్టు

తన భర్త చావుకు బండ ప్రభాకర్‌రెడ్డి, అతని భార్య జ్యోతి, కుమారుడు సాయినాథ్‌రెడ్డితో పాటు పెద్ద మనుషులు బండ రత్నాకర్‌రెడ్డి (మాజీ వైస్ ఎంపీపీ), రామంచ సాయిలు (మాజీ ఉప సర్పంచ్) కారణమని ఆరోపిస్తూ మృతుడు మహేందర్‌రెడ్డి భార్య పద్మ హసన్‌పర్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మాజీ వైస్ ఎంపీపీ బండ రత్నాకర్‌రెడ్డి, గ్రామ మాజీ ఉప సర్పంచ్ రామంచ సాయిలును పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు.

ఆంధ్రజ్యోతి 9
నవ్య
కుటుంబ కదంబం
సోమవారం • 8 జూలై 2024

విన్నర్



సంకల్ప బలం

ఎంబీబీఎస్ చదివి డాక్టర్ కావాలనుకుంది. అందుకు కుటుంబ ఆర్థిక పరిస్థితులు సహకరించలేదు. కానీ కెరీర్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకొని... అమ్మానాన్నలను అపురూపంగా చూసుకోవాలనుకుంది. వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకొని... బీఎస్సీ కార్డియాలజీ పూర్తి చేసింది. అదే ఇప్పుడు ఆమెకు అద్భుత అవకాశాన్ని తెచ్చి పెట్టింది. ముప్పై ఏడు లక్షల అరుదైన ప్యాకేజీతో బ్రిటన్‌లో కొలువు సంపాదించింది. కార్డియాక్ ఫిజియాలజిస్ట్‌గా సేవలు అందిస్తున్న తెలుగు అమ్మాయి... 23 ఏళ్ల నిస్సీ లియాన్... ఆ విశేషాలను 'నవ్య'తో పంచుకుంది.

"ఎన్నో కలలు కంటాం. అవన్నీ నెరవేరితే అది జీవితం ఎందుకు అవుతుంది! అలాగని అనుకున్నది అవ్వలేదని కుంగిపోతే జీవితానికి అర్థమే లేకుండా పోతుంది. ఈ సత్యం నాకు కాలేజీ రోజుల్లోనే బోధపడింది. మొదటి నుంచి నేను చదువులో ముందుండేదాన్ని. టెన్త్‌లో 9.7 జీపీఏ వచ్చింది. ఇంటర్‌లో వెయ్యికి 915 మార్కులు సాధించాను. డాక్టర్ కావాలని కలలు కన్నాను. దాని కోసమే ఇంటర్‌లో బైపీసీ తీసుకున్నాను. కానీ మా కుటుంబ ఆర్థిక పరిస్థితులు ఎంబీబీఎస్ చేయడానికి సహకరించలేదు. మా స్వస్థలం గుంటూరు జిల్లా తెనాలి. మా నాన్న జార్జ్, అమ్మ సునీత చర్చి మినిస్ట్రీలో చేస్తుంటారు. నాకు ఒక తమ్ముడు. వాడు ఇంజనీరింగ్ చదువుతున్నాడు. మా ఇద్దరినీ చదివించడం అమ్మానాన్నలకు శక్తికి మించిన భారమే. అయినా వాళ్లు మా కోసం ఎన్నో త్యాగాలు చేశారు. ఇక నన్ను మెడిసిన్‌లో చేర్పించేటంత స్తోమత వారికి లేదు. దానికి నేను బాధపడలేదు. కాకపోతే నా కాళ్లపై నేను నిలబడి, అమ్మానాన్నలను బాగా చూసుకోవాలని ఆశ పడ్డాను.

అనుకోకుండా అటువైపు...

అదే సమయంలో బీఎస్సీ కార్డియాలజీ లాంటి కోర్సు ఒకటి ఉంటుందని నాకు తెలిసింది. 'ఎన్టీఆర్ యూనివర్సిటీ' కౌన్సెలింగ్ నిర్వహిస్తే... నేను వెళ్లాను. కన్వీనర్ కోటా కింద శ్రీకాకుళం 'బొల్లినేని మెడ్‌స్కిల్స్' కాలేజీలో సీటు వచ్చింది. శ్రీకాకుళం వెళ్లి చదివాను. మూడేళ్ల కోర్సు అది. 2022లో బీఎస్సీ అవ్వగానే హైదరాబాద్ 'కిమ్స్' ఆసుపత్రిలో ట్రైనీగా చేరాను. అందులో పని చేస్తున్నప్పుడు ఇలా యూకే (యునైటెడ్ కింగ్‌డమ్)లో కార్డియాక్ ఫిజియాలజిస్ట్ ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిసింది. బీఎస్సీ కార్డియాలజీలో డిగ్రీ చేసినవారు దీనికి అర్హులు. హైదరాబాద్‌లో 'ప్రకార' అనే సంస్థ ద్వారా మా కాలేజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగేశ్వరరావు సర్‌కు ఈ సమాచారం అందింది. నాతో పాటు ఆయన మా కాలేజీలో మరో ఇద్దరికి చెప్పారు. వేరే కాలేజీల నుంచి వచ్చిన ఇద్దరితో కలిపి మొత్తం ఐదుగురం హైదరాబాద్‌లో మూడు నెలల శిక్షణ తీసుకున్నాం.

ఎన్నో వడపోతలు...

శిక్షణ తరువాత జాతీయ స్థాయిలో 'బ్రిటిష్ సొసైటీ ఆఫ్ థొరాసిక్ ఎకోకార్డియోగ్రఫీ' (బీఎస్ఈ) వారు నిర్వహించిన ఈ 'ట్రాన్స్ థొరాసిక్ ఎకోకార్డియోగ్రఫీ' (టీటీఈ) పరీక్ష రాశాను. అందులో అర్హత సాధించాను. యూకే నుంచి ఒక డాక్టర్, కార్డియాలజిస్ట్ వచ్చి మమ్మల్ని ఇంటర్వ్యూ చేశారు. అది అయ్యాక ఆన్‌లైన్ ఇంటర్వ్యూ. ఇలా వడపోతల అనంతరం నేను, మరొకతను ఎంపికయ్యాం. ఇప్పటివరకు తెలుగు రాష్ట్రాల నుంచి ఈ అవకాశం అందుకున్న తొలి మహిళను నేనే. నాలాగా కార్డియాలజీ డిగ్రీ చదివినవారికి ఇలాంటి ఉద్యోగాలు రావడం చాలా కష్టం. దీని కోసం యూకే వెళ్లి, లక్షలు ఖర్చు పెట్టి ఎంఎస్ చేస్తుంటారు. అలాంటి వారికి కూడా ఇది తెచ్చుకోవడం కష్టమే. గతంలో ఈ పరీక్ష రాసినవారు కూడా 'ఇది చాలా కఠినంగా ఉంటుంది. చాలామంది ప్రయత్నించి విఫలమయ్యారు' అన్నారు. కానీ నేను పట్టు వదల్లేదు. ఆసుపత్రిలో పని చేస్తూనే... ఖాళీ సమయాల్లో సన్నద్ధమయ్యాను. ఇంటర్వ్యూలో వారి ఆంగ్ల ఉచ్చారణ అర్థంకాక కొంత ఇబ్బంది పడ్డాను. ఒకసారి ఇంటర్వ్యూ వరకు వెళ్లి వెనుదిరిగాను. అన్నిటినీ దాటి చివరకు అనుకున్నది సాధించగలిగాను. ఒక లక్ష్యం పెట్టుకొని... దాన్ని సాధించాలన్న పట్టుదల, అంకిత భావం ఉంటే అసాధ్యం ఏదీ ఉండదనేది నాకు అర్థమైంది. యూకేలో కార్డియోగ్రాఫర్‌గా ఉద్యోగం చేయాలంటే ఈ పరీక్షలో ఉత్తీర్ణత తప్పనిసరి. మనకు డాక్టర్లు, నర్సులు ప్రాక్టీస్ లేదా ఉద్యోగం చేయాలంటే లైసెన్స్‌లాగా. యూకేలో నేను రాసిన పరీక్ష థియరీ, ప్రాక్టికల్స్ అని రెండు అంచెల్లో ఉంటుంది. థియరీ అయిపోయింది. రెండేళ్లల్లో ప్రాక్టికల్స్ కూడా పూర్తి చేయాలి. దాని కోసం సన్నద్ధమవుతున్నా.

> **ఒకటే లక్ష్యం...**
>
> అనుభవం, నైపుణ్యం పెంచుకొని తిరిగి భారత్‌కు రావాలన్నది నా ఆలోచన. దాని కోసం ఇక్కడ కొన్ని కోర్సులు చదవాలి. అవి పూర్తి కావడానికి తొమ్మిదేళ్లు పడుతుంది. డబ్బు కూడబెట్టి... భారత్‌కు వచ్చి ఒక డయాగ్నస్టిక్ సెంటర్ ప్రారంభించాలని అనుకొంటున్నా. దాని ద్వారా పేదలు, మధ్యతరగతి వారికి అందుబాటు ధరల్లో సేవలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నా. ఎందుకంటే రెండొందలు పెట్టి థైరాయిడ్ టెస్ట్ చేయించుకోవాలంటేనే ఒకటికి పదిసార్లు ఆలోచించిన రోజులున్నాయి. అలాంటి కుటుంబాలకు చేయూతనిచ్చి, ఆ పరిస్థితిలో కొంతైనా మార్పు తేగలిగితే అదే నేను సాధించే పెద్ద విజయం.

అస్సలు ఊహించలేదు...

'ఎన్‌హెచ్‌ఎస్' (నేషనల్ హెల్త్ సర్వీస్) అనేది యూకేలోని హెల్త్ ఆర్గనైజేషన్. 'ఎన్‌హెచ్‌ఎస్' కింద ట్రస్టులు ఉంటాయి. ఒక్కో ట్రస్టు ఆధ్వర్యంలో మూడు నాలుగు ఆసుపత్రులు పని చేస్తాయి. మాంచెస్టర్ నగరంలోని అలాంటి ఒక ఆసుపత్రి... 'ఫెయిరీఫీల్డ్ జనరల్ హాస్పిటల్‌'లో కార్డియాక్ ఫిజియాలజిస్ట్‌గా నాకు పోస్టింగ్ వచ్చింది. అంటే మన దగ్గర ప్రభుత్వ ఆసుపత్రిలో కొలువులాగా. ఇక్కడికి రావడానికి నాకు అయిన ఖర్చు కూడా లక్షన్నర లోపే. అందులో సగం వరకు తిరిగి వస్తుంది. నా జీతం మన కరెన్సీలో ఏడాదికి 37 లక్షల రూపాయలు. భారత్‌లో ఒక కార్డియాక్ ఫిజియాలజిస్ట్‌కు ఇంత పెద్ద ప్యాకేజీ రావడం అరుదైన విషయం. అపార అనుభవం ఉన్నవారికి కూడా నెలకు లక్షన్నరకు మించి నేను చూడలేదు. గత నెల పదిన యూకే వచ్చాను. ఉద్యోగంలో చేరాను. చాలా సంతోషంగా ఉంది. కెరీర్ ప్రారంభంలోనే ఇంతటి విజయం అస్సలు ఊహించలేదు.

తెలుగు రాష్ట్రాలు దాటలేదు...

ఇప్పటివరకు నేను ఏపీ, తెలంగాణ దాటి ఎక్కడికీ వెళ్లలేదు. అలాంటిది ఏకంగా దేశం దాటి ఇక్కడకు వచ్చాను. మా కుటుంబంలో ఇలా బయటి దేశంలో అడుగుపెట్టిన తొలి వ్యక్తిని నేనే. తలుచుకొంటేనే ఎంతో గొప్పగా అనిపిస్తోంది. అమ్మానాన్నల ప్రోత్సాహం, మా నాగేశ్వర్ సార్ సహకారంతోనే ఇది సాధించగలిగాను. ముఖ్యంగా నా మీద నాకంటే మా అమ్మానాన్నలకు నమ్మకం ఎక్కువ. ఆ నమ్మకం నిలబెట్టుకున్నందుకు సంతృప్తిగా ఉంది. ముందే చెప్పాను కదా... ఇది ఊహించని కొలువని. కాలేజీలో ఉన్నప్పుడు నా లక్ష్యం ఎంఎస్సీ చదవాలని. కుదిరితే పీహెచ్‌డీ చేయాలనుకున్నా. అలా నా కెరీర్‌ను నిర్మించుకోవాలని ప్రణాళికలు వేసుకున్నా. ఏ దారిలో నడిచినా ఉన్నత స్థానంలో నిలవాలన్నది నా సంకల్పం.

సేవ చేయాలి...

ఇక్కడికి వచ్చాక ఎదగడానికి ఎలాంటి అవకాశాలు ఉన్నాయనేదానిపై కొంత అవగాహన కలిగింది. నా ప్రాక్టికల్ ఎగ్జామ్ అవ్వగానే సైంటిస్ట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ లాంటివి పూర్తి చేసి, విజ్ఞానం, నైపుణ్యం సంపాదించాలి. ఆ విజ్ఞానం అందరికీ పంచి... సాధ్యమైనంతమందికి సేవ చేయాలి. మాది మధ్యతరగతి కుటుంబం కనుక ఉన్నత చదువులకు వెళ్లాలంటే ఎన్ని అవరోధాలను అధిగమించాలో నాకు తెలుసు. చర్చి మినిస్ట్రీలో చేరక ముందు మా నాన్న పెయింట్ వర్క్ చేసేవారు. అమ్మ కొన్నాళ్లు టీచర్‌గా చేసి మానేశారు. నాన్న సంపాదనతో ఇల్లు కూడా కష్టంగానే గడిచేది. అయితే మా చదువు విషయంలో ఆయన ఏనాడూ రాజీ పడలేదు. తన పిల్లలను తనకంటే ఉన్నతంగా చూడాలనుకున్నారు. ఇవాళ అమ్మానాన్నల ఆకాంక్షను నెరవేర్చినందుకు ఎంతో ఆనందంగా ఉంది. నా కష్టానికి దేవుడు ఇచ్చిన ప్రతిఫలం ఇది. అలాగని మన ప్రయత్నం లేకుండా భారమంతా దేవుడిపై వేసి కూర్చొంటే ఏదీ సాధించలేం. మనం కష్టపడాలి. ఫలితం ఆ పైవాడికి వదిలేయాలి.

• హనుమా

పోరు బాట... గెలుపు బావుటా

బ్రిటన్ పార్లమెంటరీ ఎన్నికల్లో గెలిచిన తొలి తమిళ సంతతి మహిళగా చరిత్ర సృష్టించారు ఉమా కుమరన్. నలభై రెండేళ్ళ క్రితం... శ్రీలంక నుంచి బ్రిటన్‌కు వలస వెళ్ళిన కుటుంబానికి చెందిన ఆమె సామాజిక సమస్యలపై తన స్వరాన్ని గట్టిగా వినిపిస్తూ ఉంటారు. "తిరుగుబాటు, ఉద్యమశీలత నా రక్తంలోనే ఉన్నాయి" అంటున్న ఉమ మార్పు సారథిగా తనను తాను నిరూపించుకోవడానికి సిద్ధమవుతున్నారు.



"గెలిచినా, ఓడినా నేను ఎప్పుడూ మీ ప్రతినిధినే. ఎప్పటికీ మీ గళాన్నే. ఇప్పుడు నన్ను ఎన్నుకొని నా బాధ్యత మరింత పెంచారు. నా ద్వారా సమాజంలో మీరు కోరుకుంటున్న మార్పును సాధించడమే లక్ష్యంగా పని చేస్తాను"... ఇటీవల ముగిసిన బ్రిటన్ పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా గెలిచిన ఉమా కుమరన్... ఓటర్లకు కృతజ్ఞతలు చెబుతూ అన్న మాటలివి. బ్రిటన్ పార్లమెంట్‌కు ఎన్నికైన తొలి తమిళ సంతతి మహిళగా ఆమె చరిత్రలో నిలిచారు. అంతేకాదు, కిందటి ఏడాది కొత్త పార్లమెంటరీ స్థానంగా ఏర్పాటైన స్ట్రాట్‌ఫోర్డ్ అండ్ బౌ నుంచి ఎన్నికైన తొలి ఎంపీ కూడా ఆమే కావడం విశేషం.

వాతావరణ మార్పులపై అవగాహన అత్యవసరం...

ముప్పై ఆరేళ్ళ ఉమ పుట్టిందీ, పెరిగిందీ లండన్ నగరంలోనే. ఆమె పూర్వీకులు శ్రీలంకలోని జాఫ్నాలో ఉండేవారు. శ్రీలంకలో అంతర్యుద్ధం కారణంగా కల్లోల పరిస్థితులు ఏర్పడడంతో... నలభై రెండేళ్ళ కిందట ఆమె కుటుంబం బ్రిటన్‌కు వలస వెళ్ళింది. "మా తాతయ్య జాఫ్నాలో ప్రభుత్వోద్యోగి. అలాగే తొలి ట్రేడ్ యూనియన్ నాయకుల్లో ఒకరు. అప్పట్లో శ్రీలంకలోని గౌరవప్రదమైన కుటుంబాల్లో మాదీ ఒకటి. పారిశుధ్య కార్మికుల హక్కుల కోసం మా తాతయ్య ఆందోళనలు చేస్తున్నారని తెలుసుకున్న మా ముత్తాత... ఆయనను ఇంటినుంచి వెళ్ళగొట్టారు. అయినా తాతయ్య వెనక్కి తగ్గలేదు. ప్రజలకోసం ఏదైనా చెయ్యాలనే ఎంతో తపన పడేవారు. ఈ విధంగా తిరుగుబాటు, ఉద్యమశీలత నాకు వారసత్వంగా వచ్చాయి" అంటారు ఉమ. లండన్ క్వీన్ మేరీ యూనివర్సిటీ నుంచి పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశాక... 'నేషనల్ హెల్త్ సర్వీస్ (ఎన్‌హెచ్‌ఎస్) ప్రొఫెషనల్స్'లో రెండేళ్ళపాటు పని చేశారు. ఆ తరువాత లేబర్ పార్టీలో చేరారు. ఆ పార్టీ ఎంపీ డాన్ బట్లర్ దగ్గర పార్లమెంటరీ రీసెర్చర్‌గా, ఆ తరువాత పార్టీ నాయకులకు ప్రచార సలహాదారుగా, పార్టీ కమిటీలు, సంస్థల్లో పొలిటికల్ అడ్వైజర్, సీనియర్ అడ్వైజర్... ఇలా పలు బాధ్యతలు నిర్వహించారు. అదే సమయంలో... సామాజిక కార్యక్రమాల్లో పాల్గొని, స్థానికులతో మమేకమయ్యారు. వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడారు. వాతావరణ మార్పులపై ఐక్యరాజ్యసమితి ప్రణాళికా సంఘంలో కీలకమైన బాధ్యతలు నిర్వహించారు. 'సి40 సిటీస్ క్లైమెట్ లీడర్‌షిప్ గ్రూప్'నకు దౌత్య, అంతర్జాతీయ సంబంధాల డైరెక్టర్‌గా రెండేళ్ళు పని చేశారు. "వాతావరణ మార్పుల గురించి ప్రతి ఒక్కరిలో అవగాహన కలిగించడం అత్యవసరం. ప్రజలు చైతన్యవంతులైతేనే పాలకుల్లో, అధికారుల్లో క్రియాశీలత పెరుగుతుంది. ఇది ఏదో ఒక దేశానికి పరిమితమైన సమస్య కాదు. ఈ ప్రపంచం ఎదుర్కొంటున్న ముప్పు. ఆ కోణంలోనే దీనికి పరిష్కారాలను వెతకాలి" అని చెబుతారు ఉమ. చట్టసభల్లో తన వాణిని వినిపించాలనేది ఆమె ఆకాంక్ష. కానీ అది అంత త్వరగా నెరవేరలేదు.

వాళ్ళను ఏమనాలి?

ఉమ 2010లో... వాయవ్య లండన్‌లోని హారోలో... పిన్నెర్ సౌత్ వార్డు నుంచి పోటీ చేసి... పరాజయం పాలయ్యారు. ఆ తరువాత... 2015 సార్వత్రిక ఎన్నికల్లో హారో ఈస్ట్ నుంచి లేబర్ పార్టీ అభ్యర్థిగా నిలబడ్డారు. ప్రచార సమయంలో... కన్సర్వేటివ్ పార్టీ సభ్యుడైన ముఖేశ్ నాకెర్ నాయకత్వంలోని 'ధర్మ సేవా పూర్వపక్ష' అనే సంస్థ ప్రతినిధులు ఆమెపై దాడి చేశారు. కుల వివక్షను నిషేధించే (2013) చట్టానికి లేబర్ పార్టీ మద్దతు ఇవ్వడాన్ని ఆ సంస్థ తప్పు పడుతూ... దానివల్ల సమాజంలో ద్వేషం, వేర్పాటువాదం మరింత పెరుగుతాయనీ, కాబట్టి ఉమకు ఓటు వేయవద్దనీ ప్రచారం చేసింది. ఆ ఎన్నికల్లోనూ ఉమ ఓటమి చెందారు. మరోవైపు మత రాజకీయాలు చేస్తున్నారంటూ ముఖేశ్ నాకెర్ బృందం చేసిన ప్రచారం ఆమెను తీవ్ర మనస్తాపానికి గురి చేసింది. "ఆ సమయంలో నేను ఎంతో క్షోభ అనుభవించాను. 'అందరూ సమానమే' అనే భావనను వ్యతిరేకించేవాళ్ళను ఏమనాలి? నా మీద జరిగిన ప్రచారంతో నా కుటుంబం, నా స్నేహితులు ఆందోళనకు గురయ్యారు" అని గుర్తుచేసుకున్నారు ఉమ. దాంతో... రెండేళ్ళ తరువాత... 2017లో వచ్చిన ఎన్నికల్లో ఆమె పోటీకి దూరంగా ఉండిపోయారు. అయితే... ప్రజా సమస్యల పరిష్కారం దిశగా కృషిని కొనసాగించారు. లండన్‌లో... ముఖ్యంగా కిందటి ఏడాది నూతన నియోజకవర్గంగా ఏర్పాటైన స్ట్రాట్‌ఫోర్డ్ అండ్ బౌ నియోజకవర్గ పరిధిలో తమిళుల సంఖ్య గణనీయంగా ఉంది. ప్రత్యేకించి... శ్రీలంక నుంచి శరణార్థులుగా వచ్చిన ఎంతోమంది అక్కడ స్థిరపడ్డారు. కాబట్టి ఉమ సరైన అభ్యర్థి అని లేబర్ పార్టీ అధిష్ఠానం నిర్ణయించింది. "గతంలో ఎదురైన చేదు అనుభవాలను పక్కకునెట్టి... ఈసారి ఎలాగైనా గెలిచి చూపించాలనుకున్నాను" అని చెప్పిన ఉమ రెట్టించిన ఉత్సాహంతో ప్రచారంలో పాల్గొన్నారు. స్థానిక తమిళుల శ్రేయస్సు, నియోజక వర్గ ప్రజలకు అందుబాటులో గృహ వసతి, త్వరితమైన వైద్య సేవలు, మౌలిక సదుపాయాల కల్పన లాంటి హామీలతో ఓటర్లను ఆకట్టుకున్నారు. మరోవైపు పాలస్తీనా సమస్య, వాతావరణ మార్పులపై పార్లమెంట్‌లో గట్టిగా పోరాడతానని కూడా వాగ్దానం చేశారు. ఇటీవలి పోలింగ్‌లో... 40 శాతానికి పైగా ఓట్లతో విజయం సాధించారు. "ఇది 15 ఏళ్ళ ప్రజాక్షేత్రంతో నేను చేసిన పోరాటానికి గుర్తింపు. ఈ నియోజకవర్గ మొదటి ఎంపీగా సేవ చేసే అవకాశాన్ని ప్రజలు నాకు ఇవ్వడం గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. నా మీద వారు పెట్టుకున్న విశ్వాసాన్ని నిలబెట్టుకుంటాను" అని చెబుతున్న ఉమకు ప్రపంచవ్యాప్తంగా తమిళ వర్గాల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

ఈ ఫేజ్ బావుంది!

పాపులర్ వెబ్ సిరీస్ 'పంచాయత్'లో ప్రధాన భూమిక పోషించిన నటి శాన్విక. 'రింకి' పాత్రలో ఆమె ప్రతిభ అమోఘం అంటూ విమర్శకులు సైతం ప్రశంసిస్తున్నారు. శాన్విక గురించి కొన్ని విషయాలు..

ఇటీవలే 'పంచాయత్ 3' వెబ్ సిరీస్ విడుదలైంది. చాలామంది ఎప్పటిలానే మూడో సిరీస్‌లోనూ రింకి పాత్ర గురించే మాట్లాడుతున్నారు. సాధారణ పల్లెటూరు అమ్మాయి పాత్రలో అద్భుతంగా నటించిందని ప్రేక్షకులు కొనియాడుతున్నారు. అయితే 'ఇదంతా రింకీ పాత్ర.. ముఖ్యంగా కంటెంట్ గొప్పదనమే' అంటోంది శాన్విక.

చిన్నప్పటి నుంచే..

శాన్విక ఇపుడు నేషనల్ క్రష్‌గా మారింది. ఆమె నటించిన పంచాయత్‌లో రింకీగా గుర్తుండిపోతుంది. ఇక ఆమె విషయానికొస్తే.. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో పుట్టి పెరిగింది. బిటెక్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ చదివింది. చిన్నప్పటి నుంచీ ఆమె నటిని అవ్వాలనుకుంది. ఇంట్లో ఈమెతో కలసి ఐదు మంది ఆడపిల్లలు. వీరిలో శాన్విక చివరి అమ్మాయి. మాధురీ దీక్షిత్, ఇర్ఫాన్‌ఖాన్ లాంటి యాక్టర్స్‌ను ఇష్టపడేది. బిటెక్ తర్వాత బెంగళూరులో ఉద్యోగం వచ్చింది. అయితే ఉద్యోగం చేయలేనంది. 'యాక్టింగ్ చేయాలి' అంటూ తన కోరిక చెప్పింది.. చిన్నప్పటి నుంచి ఇతరులతో మాట్లాడే నేచర్ ఆమెది కాదు. దీంతో తల్లిదండ్రులు యాక్టింగ్ సెట్ కాదన్నారు. అయితే సెట్ అయితే వెళ్తా.. లేకుంటే జాబ్ చేస్తానని ప్రయోగం చేసింది. తన మిత్రురాలితో ముంబైకి వెళ్లింది. తన స్నేహితురాలు బాలీవుడ్ ఇండస్ట్రీకి చెందినది కావటంతో క్యాస్టూమ్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగం పెట్టించింది. అప్పుడే ఖాళీ సమయాల్లో సీరియల్స్, యాడ్స్ ఆడిషన్స్‌లో పాల్గొనేది. అలా తొలిసారి డామినోస్ పిజ్జా యాడ్‌లో నటించింది. అదే ఆమె తొలిసారిగా తెరమీద కనిపించటం.

ఇలా క్రేజ్ వస్తుందని అనుకోలేదు..

చిన్న పాత్రలైనా నటించేది. ఆమె బ్యాంక్ అకౌంట్ జీరో ఉన్న పరిస్థితుల్లో కూడా కాన్ఫిడెంట్‌గా ఉండేది. యూట్యూబ్ ఛానల్స్ తీసే వెబ్‌సిరీస్‌లో నటించటానికి ఆడిషన్‌కు వెళ్లింది. వాస్తవానికి ఈమె పేరు పూజా సింగ్ సినిమాకోసం శాన్వికగా మార్చుకుంది. అలా 'పంచాయత్' సిరీస్‌లో ఆమెకు అవకాశం వచ్చింది. తొలి సిరీస్‌లో ఆమెకు మంచి పేరు రావటంతో మరో రెండు వెబ్‌సిరీస్‌ల్లో నటించింది. 'పంచాయత్ 2' సిరీస్‌కు ఉత్తమనటిగా ఆమెకు అవార్డులు వచ్చాయి. ఇటీవలే మూడో సీజన్ విడుదలైంది. 'ఇంతలా క్రేజ్ వస్తుందని అనుకోలేదు. నేను పడిన శ్రమ ఊరికేపోలేదు. ఇండస్ట్రీలో నిలదొక్కుకోవటం కష్టం. ప్రతిభ ఉండాల్సిందే' అంటుంది శాన్విక.

సోషల్ మీడియాలో హవా..

సోషల్ మీడియాలో తన పెంపుడు జంతువుల ఫొటోలను షేర్ చేస్తుంది. దీంతో పాటు వ్యక్తిగత విశేషాలు, కెరీర్ అప్‌డేట్స్‌ను అందిస్తుంది శాన్విక. ఎక్కువగా ప్రకృతిలో గడిపే క్షణాలను నెటిజన్లతో పంచుకుంటుంది. ఇన్‌స్టాలో ఐదు లక్షల మంది ఫాలో అవుతున్నారు. 'ఇప్పుడిప్పుడే నమ్మకం కలుగుతోంది. సిల్వర్‌స్క్రీన్ మీద కూడా మంచి పాత్రల్లో నటించాలి. అభిమాన హీరోలతో నటించాలి' అంటోందీమె. ఇంట్లో టీ చేసుకోవటం, మంచి ఫుడ్ వండటం ఇష్టమంటుందామె. 'పంచాయత్ 2' సీజన్ విడుదలయ్యాక కూడా నెర్వస్‌గా ఉండేదాన్ని. ఇపుడలా లేను. ప్రస్తుతానికి ఈ ఫేజ్ బావుంది. ఎంతో ఎంజాయ్ చేస్తున్నా'నంటోంది శాన్విక.



నవ్య | చిత్రజ్యోతి



ట్రైలర్ ప్రామిసింగ్‌గా ఉంది

ప్రియదర్శి, నభానటేశ్ జంటగా నటిస్తున్న చిత్రం 'డార్లింగ్'. 'వై దిస్ కొలవెరీ' అనేది ఉపశీర్షిక. అశ్విన్ రామ్ దర్శకత్వంలో కె.నిరంజన్‌రెడ్డి, చైతన్య నిర్మిస్తున్నారు. ఈ నెల 19న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం ట్రైలర్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా విశ్వక్ సేన్ మాట్లాడుతూ "ట్రైలర్ చాలా ప్రామిసింగ్‌గా, హిలేరియస్‌గా ఉంది. 'డార్లింగ్' టీమ్ అందరికీ ఆల్ ద బెస్ట్' అని చెప్పారు. ప్రియదర్శి మాట్లాడుతూ "ఈ సినిమా అందరినీ అలరిస్తుంది" అని అన్నారు. డైరెక్టర్ అశ్విన్ రామ్ మాట్లాడుతూ "ప్రేక్షకులకు ఈ సినిమా చాలా ఫ్రెష్ ఫీల్‌ను ఇస్తుంది" అని చెప్పారు.

సైకలాజికల్ థ్రిల్లర్



ప్రిన్స్, నరేశ్ అగస్త్య హీరోలుగా శివ శేషు దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'కలి'. లీలా గౌతమ్ వర్మ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ను దర్శకుడు నాగ్ అశ్విన్ ఆదివారం ఆవిష్కరించారు. కలి పాత్ర నేపథ్యంలో సైకలాజికల్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నామని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుందని నిర్మాత చెప్పారు.

ఆరేళ్ల కష్టం భారతీయుడు 2



'ఇండియన్ 2' చిత్రం ఈ తరానికి నచ్చుతుంది. ఇది ప్రజల చిత్రం. 28ఏళ్ల తర్వాత మళ్లీ అదే పాత్ర, అదే దర్శకుడు నన్ను వెతుక్కుంటూ రావటం నా అదృష్టం. ఆరేళ్ల కష్టం ఈ సినిమా. ఇన్నేళ్లూ అభిమానులు నన్ను స్టార్‌గా నిలబెట్టారు. ఈ జన్మలో వారి రుణాన్ని తీర్చుకోలేను' అని కమల్ హాసన్ అన్నారు. ఆయన హీరోగా నటించిన చిత్రం 'భారతీయుడు 2'. 1996లో తెరకెక్కిన 'భారతీయుడు'కు సీక్వెల్‌గా శంకర్ దర్శకత్వం వహించగా, సుభాస్కరన్ నిర్మించారు. సిద్ధార్థ్, ఎస్.జే.సూర్య, రకుల్ ప్రీత్‌సింగ్ కీలక పాత్రల్లో నటించారు. ఈ నెల 12న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ఆదివారం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమల్ హాసన్ మాట్లాడుతూ "ఈ సినిమాలో మీకు కమల్ ఎక్కడా కనిపించడు. కేవలం 'సేనాపతి' మాత్రమే అందరికీ కనిపిస్తాడు" అని చెప్పారు. డైరెక్టర్ శంకర్ మాట్లాడుతూ "సినిమా సెట్‌లో కమల్‌ని సేనాపతిగా చూడగానే గూస్‌బంప్స్ వచ్చేవి. థియేటర్స్‌లో సినిమా చూసే ప్రేక్షకులకూ ఇదే ఫీలింగ్ కలుగుతుంది" అని అన్నారు.

తుఫాన్‌ను ఎంజాయ్ చేస్తారు



విజయ్ ఆంటోని హీరోగా నటిస్తున్న చిత్రం 'తుఫాన్'. మేఘా ఆకాశ్ కథానాయిక. విజయ్ మిల్టన్ దర్శకత్వంలో కమల్‌బోరా, డి.లలిత, బి.ప్రదీప్, పంకజ్ బోరా నిర్మిస్తున్నారు. ఈ నెల 26న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా శనివారం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు.విజయ్ ఆంటోని మాట్లాడుతూ "ఈ సినిమా నేపథ్యం చాలా కొత్తగా ఉంటుంది. సినిమాను అందరూ ఎంజాయ్ చేస్తారు" అని అన్నారు. విజయ్ మిల్టన్ మాట్లాడుతూ "ఈ సినిమా మీ అందరికీ తప్పకుండా నచ్చుతుంది" అని చెప్పారు. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్ కేఎల్, సంగీతం: అచ్చు రాజమణి, విజయ్ ఆంటోని.

నీ శవం కూడా దొరక్కుండా చేస్తామన్నారు

- హీరోయిన్ మాల్వీ మల్హోత్రాపై రాజ్‌తరుణ్ మాజీ ప్రేయసిగా చెబుతున్న లావణ్య ఆరోపణలు
- ఆమెపై పరువు నష్టం దావా వేస్తాను - మాల్వీ మల్హోత్రా





హీరో రాజ్‌తరుణ్, అతని ప్రేయసినని చెబుతున్న లావణ్య మధ్య మొదలైన వివాదం కాస్త రోజుకో కొత్త మలుపు తీసుకుంటోంది. హీరోయిన్ మాల్వీ మల్హోత్రా, ఆమె కుటుంబ సభ్యులపైన లావణ్య శనివారం సంచలన ఆరోపణలు చేశారు.

'నీకు డబ్బు ఇస్తాం. తీసుకొని రాజ్‌తరుణ్‌ను వదిలేసి వెళ్లిపో. లేదంటే నిన్ను చంపుతాం. హిమాచల్ ప్రదేశ్ సీఎం మా నాన్నకు స్నేహితుడు. నిన్ను చంపేసి ఇక్కడ లోయలో పడేస్తే నీ శవం కూడా దొరకదు ఏమనుకుంటున్నావో' అని మాల్వీ మల్హోత్రా, ఆమె సోదరుడు నన్ను బెదిరించారు. వీటన్నింటికీ నా దగ్గర ఆధారాలున్నాయి. దాంతో నేను కేసు పెట్టాను. వాళ్ల నుంచి నాకు ప్రాణహాని ఉంది. వారి బారి నుంచి నాకు పోలీసులు రక్షణ కల్పించాలి' అని లావణ్య డిమాండ్ చేశారు. "రాజ్‌తరుణ్ నీతో హ్యాపీగా లేడు, నాతోనే హ్యాపీగా ఉంటున్నాడు. అతన్నివదిలేయ్' అని మాల్వీ అడిగింది. కానీ నేను ఒప్పుకోకపోవడంతో 'రాజ్ నుంచి నిన్ను విడదీస్తాను, జైలుకు పంపుతాను' అని మాల్వీ సవాల్ చేసింది. తను అన్నట్లే నన్ను డ్రగ్స్ కేసులో ఇరికించి, 45 రోజులు జైల్లో మగ్గేలా చేసింది"ని లావణ్య వాపోయారు. ఈ వ్యవహారమంతా రాజ్‌తరుణ్ స్నేహితులు వరుణ్‌సందేశ్, నిఖిల్... ఆయన మేనేజర్ రాజా రవీంద్రకు తెలుసు. కానీ వాళ్లంతా ఏమీ పట్టనట్లు ఉంటున్నారని లావణ్య ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బు కోసం రాజ్‌ను బెదిరించాల్సిన అవసరం తనకు లేదన్నారు. 'గతంలో పలు ఇంటర్వ్యూల్లో రాజ్ 'విజయవాడ అమ్మాయిని పెళ్లి చేసుకుంటాను' అని చెప్పింది నా గురించే, అతను నన్ను గచ్చిబౌలిలోని ఎల్లమ్మ గుడిలో పెళ్లి చేసుకున్నాడు. సినిమాల్లో స్థిరపడ్డాక పెళ్లి విషయం బయటకు చెబుదామన్నాడు. ఇప్పుడు మాల్వీ మల్హోత్రా తన జీవితంలోకి ప్రవేశించడంతో నన్ను దూరం పెట్టాడు. వాళ్లిద్దరూ చెన్నైలో కలసి ఉన్నట్లు.. నా దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయి. 'బిగ్‌బాస్ ఫేం అరియానా గ్లోరీకి రాజ్‌తరుణ్ దగ్గరవుతున్నాడు, వచ్చి నీ సంసారాన్ని కాపాడుకో' అని రాజారవీంద్ర హెచ్చరించారు. రాజ్‌తరుణ్ లేకుండా నేను బ్రతకలేను. ఆయన ఆరోపించినట్లు నాకూ మస్తాన్‌కు మధ్య ఎలాంటి సంబంధం లేదు. అతను నా స్నేహితుడు మాత్రమే' అని లావణ్య చెప్పారు.

లావణ్యే బెదిరించింది

'మాల్వీ మల్హోత్రా, ఆమె సోదరుడు లావణ్యను బెదిరించలేదు. ఆమే మాల్వీని బెదిరించింది. ఆ ఆధారాలు అన్నీ మాల్వీ దగ్గర ఉన్నాయి. వాళ్లు కూడా కేసు పెడతారు' అని లావణ్య చేసిన ఆరోపణలపై రాజ్‌తరుణ్ వివరణ ఇచ్చారు.


లావణ్య ఎవరు?

లావణ్య చేస్తున్న కామెంట్స్‌పై నటి మాల్వీ మల్హోత్రా స్పందించారు. 'నాపై ఆరోపణలు చేస్తున్న లావణ్య ఎవరో కూడా నాకు తెలియదు. ఆమె నా కుటుంబ సభ్యుల ఫోన్ నంబర్స్ తీసుకున్నారు. అవి ఎలా రాబట్టుకున్నారో తెలియట్లేదు. దీనిపై సైబర్‌క్రైమ్ కేసు పెడతాను. నేను, రాజ్‌తరుణ్ కేవలం సినిమాల గురించే మాట్లాడుకుంటాం. మా మధ్య అంతకుమించిన రిలేషన్ లేదు. రాజ్‌తరుణ్‌తో నేను గతేడాది సెప్టెంబరులోనే మాట్లాడాను. ఆ తర్వాత మా మధ్య మాటలు కూడా లేవు. నాకు సంబంధం లేని విషయంలోకి ఆమె నన్ను నెడుతోంది. నేను ఇప్పుడిప్పుడే ఇండస్ట్రీలోకి వస్తున్నా. రాజ్‌తరుణ్‌తో నటించిన 'తిరగబడరా సామి' నా మొదటి సినిమా. సినిమా కెరీర్ దెబ్బతింటుందని ఇన్నాళ్లూ కేసు పెట్టకుండా ఆగాను. ఇలాంటి ఆరోపణలు నటిగా నా పరువును దెబ్బతీస్తాయి. ఆమెపై నేను పరువు నష్టం దావా వేస్తాను" అని హెచ్చరించారు. రాజ్ తరుణ్ ఈ వివాదంలోకి నా పేరు ఎందుకు తెచ్చాడో అర్థం కావడం లేదు, లావణ్యతో నాది స్నేహం మాత్రమే అని మస్తాన్ చెప్పాడు.

టీజీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

● ఎకానమీ

తెలంగాణ సేవల రంగం
ప్రభుత్వ పాత్ర



2016 ఏప్రిల్ మొదటి, 2021 నవంబరులో రెండో తెలంగాణ సమాచార సాంకేతిక పరిజ్ఞానం(ఐటీ)కు సంబంధించిన విధానాలను ప్రభుత్వం ప్రకటించింది. ఈ రెండు విధానాల్లో ప్రభుత్వం ఐటీ, ఐటీ సంబంధిత సేవల రంగానికి అనేక రకాల రాయితీలను, ప్రోత్సాహకాలను అందించింది. విద్యుత్ చార్జీల్లో పారిశ్రామిక రంగానికి ఇచ్చే ప్రోత్సాహకాలు, స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ రుసుము, పేటెంట్ దరఖాస్తు ఖర్చు, నాణ్యత సర్టిఫికెట్ పొందే ఖర్చులను తిరిగి చెల్లించడం, అద్దెలో సబ్సిడీ, నియామక సంబంధిత సహాయం, ప్రదర్శన అద్దెకు సంబంధించిన ఖర్చును తిరిగి ఇవ్వడం లాంటి అనేక రకాల ప్రభుత్వ ప్రోత్సాహకాలు ఇందులో ఉన్నాయి.

వృద్ధి వికేంద్రీకరణ విధానం

హైదరాబాద్ చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాలకు, రెండోస్థాయి పట్టణాలకు వృద్ధి విస్తరించడానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలను ప్రకటించింది. ఉప్పల్, పోచారం, కొంపల్లి, కొల్లాపూర్, శంషాబాద్‌లలో ఐటీ పార్కులు; మహేశ్వరం, రావిర్యాలలో ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ, క్లస్టర్ల నిర్మాణాలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలను ఇస్తున్నది. వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, మహబూబ్‌నగర్, సిద్దిపేట, నల్లగొండల్లో ఐటీ టవర్ల నిర్మాణం చేపట్టారు. వరంగల్‌లో మొదటిదశ పూర్తయి వర్క్ ప్రారంభం కాగా, రెండోదశ కూడా పూర్తయింది. కరీంనగర్‌లో కూడా ఐటీ టవర్ మొదటిదశ పూర్తయింది. ఖానాపూర్‌లో మొదటిదశ పూర్తయి, రెండోదశ పూర్తయ్యే దశలో ఉంది.

2022 జూలై నాటికి రాష్ట్రంలో 64 ప్రత్యేక ఆర్థిక మండళ్లు అనుమతి పొందగా, 57 నోటిఫై అయ్యాయి. 35 ప్రత్యేక ఆర్థిక మండళ్లలో కార్యక్రమాలు ఆరంభమయ్యాయి.

'ఇ' సేవల విధానం

ప్రభుత్వ పాలన/సేవల్లో పారదర్శకత, సమర్థత, బాధ్యతను పెంచడానికి 2015 డిసెంబరులో తెలంగాణ ప్రభుత్వం 'ఇ' కార్యాలయం ప్రాజెక్టును ఆరంభించింది. కాగిత రహిత కార్యాలయాల పనితీరును ఏర్పాటు చేయడం 'ఇ' కార్యాలయ ప్రాజెక్టు అంతిమ లక్ష్యం. అందులో భాగంగా ఇ-సేవా, మీ-సేవల ద్వారా ప్రభుత్వ సేవలను అందిస్తున్నారు. 2022 అక్టోబరు నాటికి 'ఇ' ప్రాజెక్టు 40 శాఖల్లో, 113 శాఖాధిపతి కార్యాలయాల్లో, 33 జిల్లాల్లో అమలవుతోంది. డిజిటల్ టెక్నాలజీని స్వీకరించి ముందుగా అమలుపరిచిన రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార, సాంకేతికశాఖ విశ్లేషణ ప్రకారం 2014 జూన్ 2 నుంచి 2022 మే 16 వరకు జరిగిన 'ఇ' కార్యాలయాల సంఖ్యను తీసుకుంటే ప్రతి వెయ్యి మందికి జరిగిన సగటు సం ఖ్యలో తెలంగాణ దేశంలోనే మొదటిస్థానంలో నిలిచింది.

ఎమర్జింగ్ టెక్నాలజీస్

సాంకేతికరంగంలో వస్తున్న నూతన పోకడలు, వాటి సామాజిక, ఆర్థిక ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకొని 2018లో పరిశ్రమలు, వాణిజ్యశాఖ ఆధ్వర్యంలో ఎమర్జింగ్ టెక్నాలజీస్‌ను స్థాపించారు. సాంకేతికరంగంలో వస్తున్న నూతన పోకడలైన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), బ్లాక్ చెయిన్, డ్రోన్స్, రోబోటిక్స్, ఆడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, స్పేస్ టెక్ లాంటి వాటిపైన ఎమర్జింగ్ టెక్నాలజీస్ దృష్టిపెడుతుంది. తెలంగాణ ఏఐ మిషన్, ఆడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్ జాతీయకేంద్రం, సైబర్ సెక్యూరిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, 'ఇ' వేస్ట్ మేనేజ్‌మెంట్ సహకారంతో ఎమర్జింగ్ టెక్నాలజీస్ తన కార్యకలాపాలు చేపడుతుంది. 2022లో రాష్ట్రంలోని లక్ష మంది పాఠశాల విద్యార్థులకు ఏఐలో శిక్షణనిచ్చే కార్యక్రమం 'ఏఐ ఫర్ ఆల్' కార్యక్రమం అమలుపరిచారు. ఏఐని మరింత వేగంగా, సవిస్మళితంగా, సుస్థిరంగా అభివృద్ధిపర్చడం/స్వీకరించడం కోసం తెలంగాణ ప్రభుత్వం జర్మన్ కార్పొరేషన్ ఫర్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకుంది.

రియల్ ఎస్టేట్

ధరణి: 2020 అక్టోబరు 29న ధరణి పోర్టల్‌ను ఆరంభించారు. వ్యవసాయ భూముల లావాదేవీలకు సంబంధించి ఏకైక పరిష్కార కేంద్రంగా ఉండేందుకు ప్రభుత్వం 'ధరణి'ని ఆరంభించింది. ముందుగానే సమయం(స్లాట్ బుకింగ్)ను ఎంచుకుని, వెనువెంటనే మ్యుటేషనయ్యే సౌకర్యం, రిజిస్ట్రేషన్ సౌకర్యం పౌరులకు ధరణి ద్వారా కల్పించారు.

స్టాంప్ డ్యూటీ కంప్యూటర్ ద్వారానే నిర్ణయించడం ద్వారా అధికారుల విచక్షణకు అవకాశం లేకుండా పోతుంది. 2023 జనవరి 27 నాటికి 23,20,233 లావాదేవీలు/ కార్యకలాపాలు ఈ పోర్టల్ ద్వారా జరిగాయి.

తెలంగాణ 'బి'పాస్: నూతన భవనాల నిర్మాణంలో ఉన్న పాలనాపరమైన భారాన్ని తొలగించడానికి 2020 నవంబరులో తెలంగాణ స్టేట్ బిల్డింగ్ పర్మిషన్ అప్రూవల్, సెల్ఫ్ సర్టిఫికేషన్(తెలంగాణ బి.పాస్)ను ఆరంభించారు. భవనాల నిర్మాణ అనుమతులకు ఇది ఏకగవాక్ష కేంద్రంగా ఉంటుంది.

నైపుణ్యం, నవకల్పన విధానం

ప్రభుత్వ, పరిశ్రమల, విద్యాసంస్థల నైపుణ్యాన్ని మెరుగుపర్చడానికి 2014లో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్(టాస్క్)ను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ యంత్రాంగ నైపుణ్యం, ఉద్యమిత్వం, సామర్థ్యాలను పెంచే మూడు రకాల సేవలను టాస్క్ అందిస్తుంది.

టాస్క్ ఆరంభం నుంచి 7,09,530 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకోగా, 14,683 మంది బోధన సిబ్బంది శిక్షణ పొందారు. గూగుల్ క్లౌడ్, ఒరాకిల్, ఇంటెర్న్‌శాల, స్మార్ట్ బ్రిడ్జ్‌లతో 2021-22 సంవత్సరంలో టాస్క్ కలిసి పని చేసింది. 2017లో తెలంగాణ రాష్ట్ర నవకల్పన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నవకల్పనను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ ఏర్పాటు జరిగింది. పాఠశాలల్లో, సామాజికరంగంలో నవకల్పనలను అందుబాటులోకి తెచ్చే కార్యక్రమాలు చేపడతారు. సాంఘిక, గిరిజన సంక్షేమ విద్యాలయాలు, ఇంజనీరింగ్ కళాశాలలు, ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన 60 వేలమంది విద్యార్థులకు నవీన నిర్మాణ ఆలోచన-నవకల్పనకు సంబంధించిన శిక్షణను నవకల్పన కేంద్రం ఇచ్చింది. 2019 నుంచి ఇంటింటా నవకల్పన కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన 500 మంది గ్రామీణ నవకల్పనదారులను ఎంపిక చేశారు.

టీ-హబ్

నవకల్పన మధ్యవర్తిగా, వ్యాపార ప్రోత్సాహ/ సహాయ(ఇంక్యుబేటర్) కేంద్రంగా టెక్నాలజీ హబ్(టీ-హబ్) మొదటి దశను 2015లో, రెండోదశను 2022లో ఆరంభించారు. నవకల్పన, ఉద్యమిత్వం, సాంకేతిక ఎకోసిస్టమ్‌ను టీ-హబ్ ప్రోత్సహిస్తుంది. ప్రత్యేకించి నూతన సంస్థల ఆవిర్భావం, అభివృద్ధికి సహాయం అందిస్తుంది. ఆరంభం నుంచి 2,500 నూతన సంస్థల స్థాపనలో సహకరించింది. వెయ్యి వరకు కార్యక్రమాలను నిర్వహించింది. 12వేల కంటే ఎక్కువ ఉద్యోగ అవకాశాలు కల్పించింది. 2022లో జరిగిన నూతన సంస్థల దినోత్సవ సభలో జాతీయ ఉత్తమ ఇంక్యుబేటర్ అవార్డును పొందింది. పిల్లలు, యువతలో ఉద్యమిత్వం పెంపొందించడం కోసం తెలంగాణ ప్రభుత్వం వై-హబ్‌ను కూడా ఆరంభించింది.

వి-హబ్

2018 మార్చిలో మహిళా వ్యవస్థాపకులను ప్రోత్సహించడానికి వి-హబ్‌ను ఏర్పాటుచేశారు. విద్యార్థులు, గ్రామీణ/గిరిజన మహిళా వ్యవస్థాపకులు, పట్టణ ఉన్నతస్థాయి మహిళా వ్యవస్థాపకులకు వ్యవస్థాపక శిక్షణ కార్యక్రమాలు చేపడతారు. వి-హబ్ ఆధ్వర్యంలో 2,194 చిన్న, మధ్యతరహా సంస్థలను, 5,235 మహిళా వ్యవస్థాపకులను ప్రోత్సహించి 2,823 ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగితను కల్పించారు.

టీ-వర్క్స్

2017లో దేశంలోనే అతిపెద్ద నమూనాల అభివృద్ధి కేంద్రంగా టీ-వర్క్స్ ఆరంభమైంది. ఉత్పత్తి నమూనాల అభివృద్ధి, వస్తు కూర్పు ఆధారాలు, మేధాసంపత్తి హక్కులు పొందడం ప్రక్రియల్లో టీ-వర్క్స్ తన సేవలు అందిస్తుంది. ఆరంభమైనప్పటి నుంచి 250 నూతన సంస్థలు, 15 చిన్నతరహా సంస్థలు నూతన ఉత్పత్తి, ఉత్పత్తి నమూనాలను సృష్టించడంలో ఇది తన సేవలను అందించింది.

గిగ్ ఎకానమీ

తాత్కాలిక ఒప్పందం ప్రకారం ఉపాధి పొందే లక్షణాలు కలిగి ఉన్న ఆర్థికస్థితినే గిగ్ ఎకానమీ అంటారు. ఉదాహరణకు ప్రాజెక్టు ఆధారిత ఉద్యోగావకాశాలు. నీతి ఆయోగ్ అంచనాల ప్రకారం 2020-21లో 77 లక్షలమందికి గిగ్ ఎకానమీ ఉపాధి కల్పిస్తుంది. 2029-30 నాటికి 2.35 కోట్లమందికి ఉపాధి కల్పించే అవకాశం ఉంది. మొత్తం గిగ్ ఉద్యోగితలో 22 శాతం ఉన్నతస్థాయి నైపుణ్యం, 47 శాతం మధ్యస్థాయి నైపుణ్యం, 31 శాతం తక్కువస్థాయి నైపుణ్యం గలవారు ఉన్నారు. 2022 జూలైలో టాస్కో అనే మార్కెట్ డిమాండ్‌ను పూరించే లక్ష్యిత సంస్థ వెల్లడించిన టాస్కో గిగ్ ఇండెక్స్ ప్రకారం సత్వర వాణిజ్య సేవలు(క్విక్ కామర్స్), ఆరోగ్య సాంకేతికత(హెల్త్ టెక్), ద్రవ్య సేవలు(ఫిన్ టెక్), 'ఇ' కామర్స్ రంగాలు గిగ్ ఎకానమీలో ఎక్కువ ఉపాధిని కల్పిస్తున్నాయి. మొదటిశ్రేణి పట్టణాల్లో ప్రతినెలా గిగ్ ఉపాధిలో 33 శాతం పెరుగుదల ఉంది. అయితే ముంబయ్‌లో ఈ పెరుగుదల 45.45 శాతం ఉండగా, హైదరాబాద్‌లో 25 శాతం ఉంది. ఢిల్లీలో 52 శాతం, బెంగళూరులో 25 శాతం, చెన్నైలో 23.4 శాతం ఉంది. భారత దేశం కలిగి ఉన్న అధిక జనాభా నిధి



2021-22లో తెలంగాణను సందర్శించిన దేశీయ పర్యాటకుల సంఖ్య 3,20,00,620 ఉండగా, 2022-23లో 6,07,48,425గా ఉంది. అదేకాలంలో విదేశీ సందర్శకుల సంఖ్య 5,917 నుంచి 68,401కి చేరింది. 2022 సెప్టెంబరు 22న న్యూఢిల్లీలో నిర్వహించిన ప్రపంచ పర్యాటక దినోత్సవ ఉత్సవాల్లో తెలంగాణ నాలుగు జాతీయ ఉత్తమ పర్యాటక అవార్డులను గెలుచుకుంది. అవి- 1) సమగ్ర పర్యాటక అభివృద్ధి- ఉత్తమ రాష్ట్రం 2) ఉత్తమ గోల్ఫ్ కోర్సు(హైదరాబాద్ గోల్ఫ్ కోర్స్) 3) ఉత్తమ రైల్వే స్టేషన్(సికింద్రాబాద్ రైల్వేస్టేషన్) 4) ఉత్తమ ఆరోగ్య సౌకర్యాలు(అపోలో ఆసుపత్రి) భారత ప్రభుత్వం పై అవార్డులను అందించింది.

2022లో యునెస్కో ప్రకటించిన ఆసియా పసిఫిక్ ఉత్తమ సాంస్కృతిక అవార్డును గోల్కొండకోట మెట్ల బావులు సొంతం చేసుకుంది. కామారెడ్డి జిల్లాలోని దోమకొండ కోట ఉత్తమ ప్రతిభా అవార్డును గెలుచుకుంది. ఆఫ్ఘనిస్థాన్, చైనా, ఇండియా, ఇరాన్, నేపాల్, థాయ్‌లాండ్‌లకు సంబంధించిన మొత్తం 13 ప్రాజెక్టులను పై అవార్డుకు ఎంపిక చేశారు. తెలంగాణ ప్రభుత్వం వివిధ రకాల అవస్థాపన సౌకర్యాలను కల్పిస్తూ పర్యాటకరంగాన్ని అభివృద్ధి చేస్తున్నది. ఇందులో భాగంగా వివిధ రకాల పర్యాటక ప్రాంతాల(టూరిస్ట్ సర్క్యూట్)ను గుర్తించింది. గిరిజన పర్యాటక ప్రాంతం(ట్రైబల్ సర్క్యూట్)గా ములుగు, లక్నవరం, మేడారం, తాడ్వాయి, దామరవాయి, మల్లూరు, బొగత జలపాతాన్ని; వారసత్వ పర్యాటక ప్రాంతం(హెరిటేజ్ సర్క్యూట్)గా కుతుబ్ షాహీ వారసత్వ బృందావనం, పైగా గోపురాలు, హయత్‌బక్షి మసీదు, రెమండో గోపురం; పర్యావరణ పర్యాటక ప్రాంతం(ఎకో టూరిజం సర్క్యూట్)గా సోమశిల రిజర్వాయర్, సింగాటం రిజర్వాయరు, అక్కన్న-మాదన్న గుహలు, శ్రీశైలం, మన్ననూరు, మల్లెల తీర్థం, ఉమామహేశ్వర దేవాలయాలను గుర్తించారు.

తెలంగాణలో రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే మేడారం సమ్మక్క సారక్క జాతర ఆసియా ప్రాంతంలోనే అతిపెద్ద గిరిజన పండగ. దాదాపు ఒక కోటిమంది భక్తులు ఈ జాతరలో పాల్గొంటారు. ప్రభుత్వం తగినన్ని అవస్థాపన సౌకర్యాలను కల్పించి భక్తులకు అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటుంది. 'బతుకమ్మ' పేరిట తెలంగాణలో జరిగే పూల పండగ ప్రపంచంలోనే ప్రకృతిని ప్రేమిస్తూ జరిపే విశిష్ట వేడుక. 2017 నుంచి ఆహార భద్రత పథకానికి అర్హులైన అందరికీ తెలంగాణ ప్రభుత్వం బతుకమ్మ పండగకు చీరలను పంపిణీ చేస్తుంది.

పర్యాటక సేవల సత్వర విస్తరణకు తెలంగాణ ప్రభుత్వం టీఎస్ ఐపాస్(తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ప్రాజెక్టు అప్రోవల్ అండ్ సెల్ఫ్ సర్టిఫికేషన్) పోర్టల్‌ను పర్యాటక సేవల విస్తరణకు ఆరంభించింది. హోటల్స్, రిసార్ట్స్, అతిథి సేవల భవనాలు, రహదారి అతిథి సౌకర్యాలు, సభా ప్రాంగణాలు, ట్రావెల్ ఏజెన్సీలు, పర్యాటక కార్యకలాపాల లైసెన్స్‌లు మొదలైన వాటికి టీఎస్ ఐపాస్ పోర్టల్‌ను వినియోగిస్తారు.

పైవిధంగా ఉపాధికి, తెలంగాణ రాష్ట్ర స్థూల అదనపు ఉత్పత్తికి సేవలరంగం అందిస్తున్న తోడ్పాటు దృష్ట్యా ప్రభుత్వం సేవలరంగం అభివృద్ధికి వివిధరకాల విధానాలు, చర్యల ద్వారా తోడ్పాటునందిస్తున్నది.



డా.ఎం.ఏ.మాలిక్
అసోసియేట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కూకట్‌పల్లి, హైదరాబాద్.



జాతీయ అత్యవసర పరిస్థితి (1975)
ఒక సమగ్ర అవగాహన

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

ఇటీవల 18వ లోక్‌సభ కొలువుతీరిన తొలి రోజున భారతదేశంలో జాతీయ అత్యవసర పరిస్థితి విధించి 49 ఏళ్లు కావస్తున్న సందర్భంగా ప్రధాని ఆనాటి దుర్భర పరిస్థితులకు వ్యతిరేకంగా పోరాడిన యోధులకు నివాళి అర్పించారు. అదేవిధంగా స్పీకర్ ఒక తీర్మానాన్ని ప్రవేశపెడుతూ 1975 నాటి అత్యవసర పరిస్థితి కాలాన్ని భారతదేశ చరిత్రలో చీకటి అధ్యాయంగా వర్ణించారు. సభలో ప్రతిపక్షాల నిరసనల మధ్య సభ వాయిదా పడింది. ఈ సంఘటన 1975 నాటి జాతీయ అత్యవసర పరిస్థితిపై దేశప్రజలందరూ దృష్టిసారించేలా చేసింది. ఈ నేపథ్యంలో 1975 నాటి జాతీయ అత్యవసర పరిస్థితి విధింపునకు కారణాలు, ఎమర్జెన్సీ కాలపు నిరంకుశ పద్ధతులు, రాజ్యాంగ సవరణలు, తదనంతర కాలంలో తీసుకొచ్చిన రాజ్యాంగ మార్పులు తదితర అంశాలపై అవగాహన ఆవశ్యకం.

భారత రాజ్యాంగంలో అత్యవసర పరిస్థితి నిబంధనల చేర్పు

ఏవైనా అంతర్గత లేదా బాహ్య కారణాలు లేదంటే ఆర్థిక పరిస్థితుల కారణంగా దేశ భద్రత, ఐక్యత, సమగ్రతలకు భంగం వాటిల్లే అవకాశం ఉంటే ఆ పరిస్థితులనే అత్యవసర పరిస్థితులుగా పరిగణిస్తారు. వీటిని ఎదుర్కొనడానికి, దేశాన్ని ఏకతాటిపై ఉంచడానికి కేంద్రానికి ప్రత్యేక అధికారాలు అవసరమని, ఆ అధికారాలను రాజ్యాంగ నిబంధనల పరంగా అందించాలని డా.బీ.ఆర్. అంబేద్కర్, టీ.టీ.కృష్ణమాచారి, అల్లాడి కృష్ణస్వామి అయ్యర్ వంటి న్యాయ కోవిదులు రాజ్యాంగ రచన సమయంలో భావించారు. ఈ అధికారాల నిరంకుశత్వాన్ని గ్రహించిన ప్రొ.కె.టి. షా, పీ.డీ.దేశ్‌ముఖ్, హెచ్.వీ.కామత్ వంటివారు వ్యతిరేకించడంతో వీటిని ప్రయోగించాల్సిన పరిస్థితులు పెద్దగా రాకపోవచ్చని, అన్యధా అవసరాల కోసమే వీటిని క్రోడీకరిస్తున్నామని వీటిని మృతాక్షరాలుగా పేర్కొనవచ్చని రాజ్యాంగ పరిషత్ చర్చల్లో అంబేద్కర్ అభిప్రాయం వ్యక్తం చేశారు. కానీ 1975 నుంచి 1977 మధ్యకాలంలో 21 నెలలు దేశం చూసిన చీకటి రోజులు అంబేద్కర్ ఆకాంక్షకు గండికొట్టాయి.



అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా పంజాబ్‌లో అకాళీ దళ్ ఆధ్వర్యంలో 'డెమోక్రసీ బచావో మోర్చా' ఉద్యమం తీవ్రరూపు దాల్చింది. దీనితో ఒక్క పంజాబ్‌లోనే నలభైవేలమందిని ప్రభుత్వం అరెస్ట్ చేసింది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది సభ్యులు, ఉద్యమకారులు జైళ్లపాలయ్యారు.

భారతదేశంలో 1975 నాటి అత్యవసర పరిస్థితి-పరిణామాలు

1971లో నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో ఇందిరా గాంధీ ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నియోజక వర్గం నుంచి పోటీచేసి విజయం సాధించారు. ఎన్నికల సమయంలో ఆమె ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951ని ఉల్లంఘించారని, నిబంధనలకు వ్యతిరేకంగా తన ప్రచార కార్యక్రమాలకు ప్రభుత్వ వనరులను పెద్ద ఎత్తున వినియోగించారు కాబట్టి ఇందిర ఎన్నిక చెల్లదని ఆమె ప్రత్యర్థి రాజ్ నారాయణ్ అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. 1975 జూన్ 12న అలహాబాద్ హైకోర్టు ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 123(7) ప్రకారం ఇందిరాగాంధీ చర్యలను చట్ట ఉల్లంఘనగా పేర్కొంటూ, ఎన్నిక చెల్లదని స్పష్టం చేసింది. అలాగే ప్రధానిగా కొనసాగరాదని, ఎన్నికల్లో పోటీ చేయకుండా ఆరేళ్ల నిషేధం వర్తిస్తుందని తీర్పు చెప్పింది.

ఈ తీర్పును సవాల్ చేస్తూ ఇందిరాగాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. 1975 జూన్ 24న సుప్రీంకోర్టు ఇందిరాగాంధీ ప్రధానిగా కొనసాగవచ్చని అయితే ఆమె పార్లమెంట్‌లో జరిగే ఏ ఓటింగ్‌లోనూ పాల్గొనరాదని, ఎంపీగా ఆమెకు లభిస్తున్న అన్ని సదుపాయాలను నిలిపివేయాలని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది.

అప్పటికే దేశంలో అనేక ప్రాంతాల్లో సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాల్లో అవినీతి; నిరుద్యోగం, ధరల పెరుగుదల, ఆర్థిక సంక్షోభాలకు వ్యతిరేకంగా ప్రజల్లో అశాంతి మొదలైంది. 1979లో గుజరాత్‌లో 'నవ నిర్మాణ్ ఆందోళన్', బిహార్‌లో జయప్రకాష్ నారాయణ్ ఉద్యమం ప్రారంభమయ్యాయి. విద్యార్థులు, మధ్యతరగతి ప్రజలు భారీగా ఈ ఉద్యమాల్లో పాల్గొన్నారు. దేశంలోని అన్ని విద్యార్థి సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు మద్దతునిచ్చాయి. నవ నిర్మాణ్ ఉద్యమం కారణంగా గుజరాత్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోయింది. జార్జి ఫెర్నాండెజ్ నేతృత్వంలో పెద్ద ఎత్తున రైల్వే సమ్మె నిర్వహించారు. ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని అలహాబాద్ హైకోర్టు తీర్పునివ్వడం ఈ పరిస్థితులకు ఆజ్యం పోసింది. ఇందిరాగాంధీ రాజీనామా కోసం విపక్షాలు పట్టుబట్టాయి. సుప్రీంకోర్టు నుంచి మధ్యంతర ఉత్తర్వులు పొంది ప్రధానిగా కొనసాగే అనుమతిని ఆమె తెచ్చుకోవడంతో తరవాతి రోజు 1975 జూన్ 25న ప్రతిపక్ష పార్టీలు ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ ర్యాలీ నిర్వహించాయి. పోరాటం తీవ్రం చేసేందుకు నిర్ణయించాయి. ఇటువంటి అననుకూల పరిస్థితుల్లో 1975 జూన్ 25 అర్ధరాత్రి జాతీయ అత్యవసర పరిస్థితి విధించారు. మంత్రిమండలిని సంప్రదించకుండానే రాష్ట్రపతికి అత్యవసర పరిస్థితి విధించాల్సిందిగా ఇందిరాగాంధీ సిఫార్సు చేశారు. ప్రతిపక్షాలను అణచివేసి తాను పదవిలో కొనసాగేందుకే రాజ్యాంగ ప్రకరణ 352లో ఉన్న 'అంతర్గత కల్లోలం' అనే పదాన్ని వక్రీకరించి అత్యవసర పరిస్థితి విధించారనే అపకీర్తిని ఇందిర మూటగట్టుకున్నారు. ఈ అత్యవసర పరిస్థితి కాలంలో ఆచరించిన అనేక నిరంకుశ విధానాలు కూడా తీవ్ర విమర్శలకు గురయ్యాయి.

1975 అత్యవసర పరిస్థితి కాలం నాటి వివిధ పరిణామాలు

అత్యవసర పరిస్థితి విధించిన కొన్ని గంటల్లోనే అనేక రాజకీయ పార్టీల నాయకులు అరెస్ట్ అయ్యారు. విజయరాజే సింధియా, జయప్రకాష్ నారాయణ, ములాయం సింగ్ యాదవ్, మొరార్జీ దేశాయ్, చరణ్ సింగ్, జార్జ్ ఫెర్నాండెజ్, అటల్ బిహారీ వాజపేయి, జ్యోతిబసు, అద్వానీ, అరుణ్ జైట్లీ వంటి పలువురు ప్రముఖులు వీరిలో ఉన్నారు. వీరందరూ ప్రధానంగా 'మీసా'(ఎంఐఎస్ఏ- మెయింటెనెన్స్ ఆఫ్ ఇంటర్నల్ సెక్యూరిటీ యాక్ట్), డీఐఎస్ఐఆర్(డిఫెన్స్ ఆఫ్ ఇండియా యాక్ట్ అండ్ డిఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్స్), సీఓఎఫ్ఈపీఓఎస్ఏ(కన్జర్వేషన్ ఆఫ్ ఫారిన్ ఎక్స్‌ఛేంజ్ అండ్ ప్రివెన్షన్ ఆఫ్ స్మగ్లింగ్ యాక్టివిటీస్ యాక్ట్) వంటి కఠిన చట్టాల కింద అరెస్టయ్యారు.

జమాతే ఇస్లామీ, ఆర్ఎస్ఎస్ వంటి సంస్థలపై నిషేధం విధించారు. అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా పంజాబ్‌లో అకాళీ దళ్ ఆధ్వర్యంలో 'డెమోక్రసీ బచావో మోర్చా' ఉద్యమం తీవ్రరూపు దాల్చింది. దీనితో ఒక్క పంజాబ్‌లోనే నలభైవేలమందిని ప్రభుత్వం అరెస్ట్ చేసింది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది సభ్యులు, ఉద్యమకారులు జైళ్లపాలయ్యారు.

(మిగతా రేపటి దిక్సూచిలో)



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్


పార్ట్-2

● రీజనింగ్

దిశలు - దూరాలు

టీజీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

ముఖ్య రేఖాచిత్రం




నోట్: ఈ చాప్టర్‌కు సంబంధించి అడిగే ప్రశ్నలకు పై రేఖాచిత్రంలో మిడిల్ పాయింట్‌ని బేసిక్‌గా తీసుకోవాలి. పై రేఖాచిత్రంలో మిడిల్ పాయింట్‌ని బేసిక్‌గా తీసుకొంటే మిడిల్ పాయింట్‌కు కుడివైపు అంటే తూర్పు, ఎడమవైపు అంటే పడమర, పై వైపు అంటే ఉత్తరం, కిందవైపు అంటే దక్షిణానికి అని అర్థం.

1. వినయ్ 40మీ. పడమరకు నడిచిన తరవాత దక్షిణం వైపునకు తిరిగి 30మీ. నడిచాడు. తదుపరి మరల తూర్పునకు 25మీ. నడిచిన తరవాత ఉత్తరానికి తిరిగి 20మీ. నడిచాడు. తదుపరి మరల తూర్పునకు తిరిగి 15 మీ॥ నడిచాడు. అయితే ఇప్పుడు వినయ్ బయలుదేరిన స్థానం నుంచి ఎంతదూరంలో ఏ దిశలో ఉన్నాడు?

ఎ) ఉత్తరం 10 మీ. బి) దక్షిణం 10 మీ.
సి) తూర్పు 10 మీ. డి) పడమర 10 మీ.

సమాధానం: (బి)

వివరణ:



పై రేఖాచిత్రంలో బయలుదేరిన స్థానం (L)నకు, చేరుకున్న స్థానం (M) కిందకు ఉంది.

ముఖ్యరేఖాచిత్రం(మెయిన్ డయాగ్రమ్)ను పరిశీలిస్తే మిడిల్ పాయింట్ నుంచి కిందకు అంటే దక్షిణం అని చెప్పారు. అంతేకాక పై రేఖాచిత్రాన్ని బట్టి వినయ్ బయలుదేరిన స్థానం నుంచి 10 మీ. దూరంలో ఉన్నాడని తెలుస్తుంది. సమాధానం దక్షిణం 10 మీ.

షార్ట్‌కట్: ముందుగా ప్రశ్నలో ఇచ్చిన సమాచారాన్ని రాసుకోవాలి. అది ఏమంటే పడమర 40, దక్షిణం 30, తూర్పు 25, ఉత్తరం 20, తూర్పు 15. తరవాత ఒకే దిశకు సంబంధించినవి రెండు లేదా అంతకంటే ఎక్కువసార్లు ఉంటే కూడాలి. పై సమాచారంలో తూర్పు 25, తూర్పు 15 లను కూడితే తూర్పు 40 అవుతుంది. ఇప్పుడు పై సమాచారం కింది విధంగా ఉంటుంది.

పడమర$_{40}$, దక్షిణం$_{30}$, తూర్పు$_{40}$, ఉత్తరం$_{20}$.


ఇప్పుడు వ్యతిరేక దిశల విలువ సమానంగా ఉంటే అది క్యాన్సిల్. పై సమాచారంలో పడమర $_{40}$, తూర్పు $_{40}$లు క్యాన్సిల్ అవుతాయి. మిగిలిన రెండింటిలో ఏది ఎక్కువ, ఎంత ఎక్కువ అదే సమాధానం అవుతుంది. తూర్పు$_{40}$, పడమర$_{40}$ క్యాన్సిల్ అవగా మిగిలిన దక్షిణం$_{30}$, ఉత్తరం$_{20}$ లలో దక్షిణం$_{10}$ ఎక్కువ ఉంది అదే సమాధానం అవుతుంది.

2. వినోద్ 5మీ. ఉత్తరానికి నడిచిన తరవాత కుడివైపునకు తిరిగి 6మీ. నడిచాడు. తదుపరి మరల ఎడమవైపునకు తిరిగి 3 మీ. నడిచాడు. అయితే ఇప్పుడు వినోద్ బయలుదేరిన స్థానం నుంచి ఎంత దూరంలో ఉన్నాడు?

ఎ) 10 మీ. బి) 14 మీ. సి) 12 మీ. డి) 18 మీ.

సమాధానం: (ఎ)

వివరణ:



D- బయలుదేరిన స్థానం, E- చేరుకున్న స్థానం.
DF- ఒక భుజము 6 మీ॥. EF- మరో భుజము 8 మీ॥ (5 + 3)
DE- కర్ణము

పైథాగరస్ సిద్ధాంతం ప్రకారం కర్ణము^{2} = భుజము^{2} +భుజము^{2}

$$కర్ణము^2 = 6^2 + 8^2$$
$$కర్ణము^2 = 36 + 64$$
$$కర్ణము^2 = 100$$
$$కర్ణము = \sqrt{100} = 10 మీ॥$$

వినోద్ బయలుదేరిన స్థానం (D)కు చేరుకున్న స్థానం (E) 10 మీ. దూరంలో ఉంది.

3. A, B, C, D అనే నలుగురు బల్లకు నాలుగు వైపుల కూర్చొని క్యారమ్స్ ఆడుతున్నారు. B, D భాగస్వాములు. A ఉత్తరానికి ముఖభాగం కలిగి ఉన్నాడు. D తూర్పునకు ముఖభాగం కలిగి ఉన్నాడు. అయితే దక్షిణానికి ముఖభాగం కలిగి ఉన్న వ్యక్తి ఎవరు?

ఎ) B బి) C సి) చెప్పలేం డి) ఏదీకాదు

సమాధానం: (బి)


వివరణ: A, B, C, D నలుగురు నాలుగువైపులా కూర్చుంటారు. ఎదురెదురు వ్యక్తులు భాగస్వాములౌతారు. B, D భాగస్వాములని చెప్పారు. కాబట్టి A, C మరొక భాగస్వాములు అవుతారు. A ఉత్తరానికి ముఖభాగం కలిగి ఉన్నాడని ప్రశ్నలో చెప్పారు. A, Cలు భాగస్వాములు కనుక దక్షిణానికి ముఖభాగం కలిగి ఉన్న వ్యక్తి 'C' అవుతారు. సమాధానం: సి

4. చరణ్ 4మీ. దక్షిణానికి తరవాత కుడివైపునకు తిరిగి 3 మీ. నడిచాడు. అయితే ఇప్పుడు చరణ్ బయలుదేరిన స్థానం నుంచి ఎంత దూరంలో ఏ దిశలో ఉన్నాడు?

ఎ) 5 మీ. వాయువ్యం బి) 5 మీ. నైరుతి
సి) 5 మీ. ఆగ్నేయం డి) 5 మీ. ఈశాన్యం

సమాధానం: (బి)


వివరణ:



ఒక భుజము (4 మీ.), - ఒక భుజము (3 మీ.)

కర్ణము AB.

పైథాగరస్ సిద్ధాంతం ప్రకారం



$$కర్ణము^2 = భుజము^2 + భుజము^2$$
$$కర్ణము^2 = 4^2 + 3^2$$
$$కర్ణము^2 = 16 + 9$$
$$కర్ణము^2 = 25$$
$$కర్ణము = \sqrt{25} = 5 మీ.$$


పై రేఖాచిత్రం ప్రకారం చరణ్ బయలుదేరిన స్థానం A నుంచి B చేరుకున్న స్థానం 5మీ. దూరంలోను, నైరుతి దిశలోను ఉన్నదని తెలుస్తుంది.

5. ఆడిటోరియానికి పడమరలో కాలేజి ఉంది. కాలేజికి దక్షిణాన బ్యాంక్ ఉంది. ఆడిటోరియానికి ఉత్తరాన లైబ్రరీ ఉంది. అయితే ఆడిటోరియానికి బ్యాంక్ ఏ దిశలో ఉన్నది?

ఎ) ఆగ్నేయం బి) వాయువ్యం సి) నైరుతి డి) ఈశాన్యం

సమాధానం: (సి)

వివరణ: ఇచ్చిన ప్రశ్న ప్రకారం డయాగ్రమ్ కింది విధంగా ఉంటుంది.



పై రేఖాచిత్రం ప్రకారం ఆడిటోరియానికి, బ్యాంక్ నైరుతి దిశలో ఉన్నదని తెలుస్తుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్, సీనియర్ ఫ్యాకల్టీ

స్పోర్ట్స్

వరంగల్ ● సోమవారం 8 జూలై 2024

వర్షార్పణం

దక్షిణాఫ్రికాతో భారత మహిళల రెండో టీ20 రద్దు

చెన్నై: వర్షం కారణంగా భారత్, దక్షిణాఫ్రికా మహిళల రెండో టీ20 రద్దయింది. లక్ష్య ఛేదనలో భారత్ బరిలోకి దిగాల్సి ఉండగా.. ఇన్నింగ్స్ బ్రేక్ అనంతరం మొదలైన వర్షం ఎంతకీ తగ్గలేదు. దీంతో భారత్ ఒక్క బంతి కూడా ఆడలేకపోయింది. వేచిచూసిన అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. మూడు టీ20ల సిరీస్‌లో సౌతాఫ్రికా 1-0తో ఆధిక్యంలో ఉంది. మంగళవారం ఆఖరి మ్యాచ్ జరగనుంది. అంతకుముందు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికా 20 ఓవర్లలో 6 వికెట్లకు 177 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్ తజ్మిన్ బ్రిట్స్ (52) వరుసగా రెండో అర్ధశతకం బాదగా.. అన్నెక్ బాష్ (40), లారా వొల్వార్ట్ (22) రాణించారు. పూజా వస్త్రాకర్, దీప్తి చెరో 2 వికెట్లు తీశారు.

పవర్‌లిఫ్టింగ్‌లో సుకన్యకు స్వర్ణం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆసియా-ఆఫ్రికా పవర్‌లిఫ్టింగ్ అంతర్జాతీయ పోటీల్లో తెలంగాణకు చెందిన తేజావత్ సుకన్య స్వర్ణ పతకం సాధించింది. దక్షిణాఫ్రికాలోని పోచెస్ట్రూమ్‌లో ఆదివారం జరిగిన మహిళల 76 కిలోల బెంచ్‌ప్రెస్ విభాగంలో సుకన్య 135 కిలోల బరువెత్తి టాప్‌లో నిలిచింది. సుకన్య స్వస్థలం మహబూబాబాద్.

ప్రియాన్షు పరాజయం

కాల్గరీ: కెనడా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత యువ షట్లర్ ప్రియాన్షు రజావత్ పోరాటం ముగిసింది. ఆదివారం జరిగిన సెమీఫైనల్లో ప్రియాన్షు 17-21, 10-21తో అలెక్స్ లానియర్ (ఫ్రాన్స్) చేతిలో ఓడాడు.

బ్రిటిష్ గ్రాండ్ ప్రీ విజేత హామిల్టన్



సిల్వర్‌స్టోన్: ఫార్ములావన్ స్టార్, మెర్సిడెస్ డ్రైవర్ లూయిస్ హామిల్టన్.. ఆదివారం జరిగిన బ్రిటిష్ గ్రాండ్ ప్రీ టోర్నీలో విజేతగా నిలిచాడు. వెర్‌స్టాపెన్ (రెడ్‌బుల్), నోరిస్ (మెక్‌లారెన్) రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. 2021 తర్వాత హామిల్టన్‌కు ఇదే తొలి టైటిల్ కావడం విశేషం. 9వ సారి ఇక్కడ టైటిల్ నెగ్గిన 39 ఏళ్ల హామిల్టన్‌కిది ఓవరాల్‌గా 104వ ఎఫ్1 విజయం.

అహో..అభిషేక్

46 బంతుల్లోనే శతకం

రెండో టీ20లో భారత్ ఘనవిజయం



1 భారత్ తరఫున తక్కువ ఇన్నింగ్స్ (2)లోనే టీ20 శతకం సాధించిన బ్యాటర్‌గా అభిషేక్. అలాగే జింబాబ్వేపై భారత బ్యాటర్‌కిదే అత్యధిక వ్యక్తిగత స్కోరు.

1 జింబాబ్వేపై ఏ వికెట్‌కైనా అత్యధిక భాగస్వామ్యం (137) నమోదు చేసిన అభిషేక్-రుతురాజ్ జోడీ.

3 టీ20ల్లో వేగవంతమైన శతకం (46 బంతుల్లో) చేసిన మూడో భారత బ్యాటర్‌గా రాహుల్‌తో సమంగా నిలిచిన అభిషేక్. రోహిత్ (35), సూర్య (45) టాప్‌లో ఉన్నారు.

50 ఈ ఏడాది అభిషేక్ బాదిన టీ20 సిక్సర్ల సంఖ్య. రోహిత్ (46)ను దాటాడు.

1 జింబాబ్వేపై అధిక స్కోరు (234/2) సాధించిన జట్టుగా భారత్. ఆస్ట్రేలియా (229/2)ను అధిగమించింది.

అంతర్జాతీయ టీ20ల్లో చివరి పది ఓవర్లలో అత్యధిక పరుగులు (160) సాధించిన జట్టుగా భారత్.

స్కోరుబోర్డు

భారత్: గిల్ (సి) బెన్నెట్ (బి) ముజరబాని 2; అభిషేక్ (సి) మైర్స్ (బి) మసకద్జ 100; రుతురాజ్ (నాటౌట్) 77; రింకూ (నాటౌట్) 48; **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 20 ఓవర్లలో 234/2. వికెట్ల పతనం:** 1-10, 2-147. **బౌలింగ్:** బెన్నెట్ 2-0-22-0; ముజరబాని 4-1-30-1; చటార 4-0-38-0; రజా 3-0-34-0; జోంగ్వే 4-0-53-0; మైర్స్ 1-0-28-0; మసకద్జ 2-0-29-1.

జింబాబ్వే: ఇన్నోసెంట్ (బి) ముకేశ్ 4; మదెవెరె (బి) బిష్ణోయ్ 43; బెన్నెట్ (బి) ముకేశ్ 26; మైర్స్ (సి) రింకూ (బి) అవేశ్ 0; రజా (సి) జురెల్ (బి) అవేశ్ 4; క్యాంప్‌బెల్ (సి) బిష్ణోయ్ (బి) సుందర్ 10; మదండె (ఎల్బీ) బిష్ణోయ్ 0; మసకద్జ (రనౌట్) 1; జోంగ్వే (సి) రుతురాజ్ (బి) ముకేశ్ 33; ముజరబాని (సి) సుందర్ (బి) అవేశ్ 2; చటార (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 18.4 ఓవర్లలో 134 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-4, 2-40, 3-41, 4-46, 5-72, 6-73, 7-76, 8-117, 9-123, 10-134. **బౌలింగ్:** ముకేశ్ 3.4-0-37-3; అభిషేక్ 3-0-36-0; అవేశ్ 3-0-15-3; రవి బిష్ణోయ్ 4-0-11-2; సుందర్ 4-0-28-1; పరాగ్ 1-0-5-0.

జింబాబ్వే చిత్తు

హరారే: ఒక్క రోజులోనే ఎంత తేడా! భారత ఆటగాళ్లంతా కలిసి వంద పరుగులు చేసేందుకు ఆపసోపాలు పడిన చోటే.. రోజైనా గడవక ముందే ఒక్కడే శతకంతో చెలరేగాడు. ఎక్కడ తడబడ్డారో, అదే పిచ్‌పై మనోళ్లు రికార్డుల మోత మోగించారు. అరంగేట్ర మ్యాచ్‌లో డకౌట్ అయిన ఓపెనర్ అభిషేక్ శర్మ (47 బంతుల్లో 7 ఫోర్లు, 8 సిక్సులతో 100) తన రెండో మ్యాచ్‌లోనే మెరుపు శతకంతో అదుర్స్ అనిపించుకున్నాడు. ఇక భారీ ఛేదనలో జింబాబ్వేను భారత బౌలర్లు ఆటాడుకున్నారు. దీంతో ఆదివారం జరిగిన రెండో టీ20లో టీమిండియా 100 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించి ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. మూడో మ్యాచ్ ఈనెల 10న జరుగుతుంది. ముందుగా భారత్ 20 ఓవర్లలో 2 వికెట్లకు 234 పరుగుల స్కోరు సాధించింది. రుతురాజ్ గైక్వాడ్ (47 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్‌తో 77 నాటౌట్), రింకూ సింగ్ (22 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సులతో 48 నాటౌట్) అజేయ ఆటతీరుతో చివర్లో జోరును ప్రదర్శించారు. ఆ తర్వాత కష్టసాధ్యమైన ఛేదనలో జింబాబ్వే 18.4 ఓవర్లలో 134 పరుగులకు ఆలౌటైంది. భారీ ఛేదనలో వేగంగా ఆడాలనే తాపత్రయంతో వరుస విరామాల్లో వికెట్లను కోల్పోయింది. టాపార్డర్‌లో ఓపెనర్ మదెవెరె (43), బెన్నెట్ (26) రాణించగా మిడిలార్డర్ కుప్పకూలింది. ఆఖర్లో జోంగ్వే (33) జోరు చూపి ఓటమితేడాను తగ్గించగలిగాడు. అవేశ్ ఖాన్, ముకేశ్ కుమార్‌లకు మూడేసి వికెట్లు దక్కగా.. రవి బిష్ణోయ్ 2 వికెట్లు తీశాడు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా అభిషేక్ నిలిచాడు.

అభిషేక్-రుతురాజ్ దూకుడు: బ్యాటింగ్‌కు అనుకూలించిన ఈ పిచ్‌పై భారత్ ఆరంభం కష్టంగానే సాగింది. కెప్టెన్ గిల్ (2) రెండో ఓవర్‌లోనే వెనుదిరగగా.. పవర్‌ప్లేలో జట్టు చేసింది 36 పరుగులే. అభిషేక్ శర్మ ఆచితూచి ఆడగా.. రుతురాజ్ తొలి 15 బంతుల్లో 9 పరుగులే చేశాడు. తొలుత ఓపిక ప్రదర్శించిన ఈ జోడీ కుదురుకున్నాక బౌలర్లకు చుక్కలు చూపించింది. అభిషేక్ 27 పరుగుల వద్ద ఉన్నప్పుడు వెల్లింగ్టన్ క్యాచ్‌ను వదిలేయడం కూడా లాభించింది. 8వ ఓవర్‌లో అభిషేక్ 4,6తో పరుగుల వేట ఆరంభమైంది. తర్వాతి ఓవర్‌లోనే రుతురాజ్ 2 ఫోర్లు సాధించగా, 11వ ఓవర్‌లో శర్మ 4,6,4,6,4తో 28రన్స్‌తో స్కోరును వంద దాటించాడు. అంతేకాకుండా 14వ ఓవర్‌లో హ్యాట్రిక్ సిక్సర్లతో అభిషేక్ 46 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేశాడు. కానీ తర్వాతి బంతికే మసకద్జకు చిక్కాడు. శర్మ తన చివరి 16 బంతుల్లోనే 59 రన్స్ రాబట్టాడు. రెండో వికెట్‌కు అభిషేక్, రుతురాజ్ జోడీ 137 రన్స్ జోడించింది. అటు రుతురాజ్ 38 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. ఆ వెంటనే 18వ ఓవర్‌లో రుతురాజ్ 4,6,4,4తో 20 రన్స్ వచ్చాయి. రింకూ సైతం ఇదే జోరుతో 19వ ఓవర్‌లో 2 సిక్సర్లు, ఆఖరి ఓవర్‌లో 4,6,6తో అదిరే ఫినిషింగ్ ఇచ్చాడు. వీరి మధ్య మూడో వికెట్‌కు అజేయంగా 87 రన్స్ సమకూరాయి. ఓవరాల్‌గా ఆఖరి 10 ఓవర్లలోనే భారత్ 160 రన్స్ రాబట్టింది.




గోల్ కొడుతున్న స్టీఫెన్

20ఏళ్ల తర్వాత..

యూరో సెమీస్‌కు నెదర్లాండ్స్

2-1తో తుర్కియేపై గెలుపు

బెర్లిన్: సుదీర్ఘ నిరీక్షణకు నెదర్లాండ్స్ తెరదించింది. రెండు దశాబ్దాల తర్వాత యూరోపియన్ చాంపియన్‌షిప్‌లో సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లింది. శనివారం అర్ధరాత్రి జరిగిన క్వార్టర్స్ మ్యాచ్‌లో నెదర్లాండ్స్ 2-1తో తుర్కియేను ఓడించింది. 2004 తర్వాత తొలిసారి ఫైనల్ ఫోర్‌లోకి అడుగుపెట్టింది. తుర్కియే కూడా అద్భుత పోరాటాన్ని ప్రదర్శించింది. 35వ నిమిషంలోనే సమేట్ అకాడిన్ హెడర్ ద్వారా గోల్ చేసి తుర్కియేను 1-0 ఆధిక్యంలో నిలిపాడు. దీంతో కంగుతున్న డచ్ టీమ్ కౌంటర్ ఎటాక్ చేసినా ప్రత్యర్థి సమర్థంగా అడ్డుకోవడంతో ఫస్టాఫ్‌లో గోల్ చేయలేకపోయింది. అయితే, సెకండాఫ్‌లో ఆరున్నర అడుగుల పొడుగున్న స్ట్రయికర్ వవౌట్ విగోస్ట్ సబ్‌స్టిట్యూట్‌గా ఎంట్రీ ఇవ్వడంతో ఆరెంజ్ ఆర్మీ మరింత దూకుడుగా దాడులు చేస్తూ తుర్కియేను ఆత్మరక్షణలో నెట్టింది. ఈ క్రమంలో 70వ నిమిషంలో డిపే ఇచ్చిన క్రాస్‌ను అందుకున్న స్టీఫెన్ డి వ్రిజ్ హెడర్‌తో బంతిని గోల్‌పోస్ట్‌లోకి పంపడంతో నెదర్లాండ్స్ 1-1తో స్కోరు సమం చేసింది. 6 నిమిషాల తర్వాత ఆరెంజ్ ఆర్మీ మరో దాడిలో బంతిని అడ్డుకొనే క్రమంలో తుర్కియే ఆటగాడు మెర్ట్ ముల్దర్ కాలికి తగిలిన బంతి నేరుగా గోల్‌లోకి వెళ్లింది. ఇలా తుర్కియే ప్లేయర్ ముల్దర్ ఓన్ గోల్‌తో 2-1 ఆధిక్యం సాధించిన నెదర్లాండ్స్.. ఆ తర్వాత ప్రత్యర్థికి మరో అవకాశం ఇవ్వకుండా మ్యాచ్‌ను సొంతం చేసుకొంది.

సెమీఫైనల్ షెడ్యూల్

స్పెయిన్ x ఫ్రాన్స్ (మంగళవారం రాత్రి 12.30)

ఇంగ్లండ్ x నెదర్లాండ్స్ (బుధవారం రాత్రి 12.30)

క్వార్టర్స్‌కు అల్కారజ్

సిన్నర్, జొకోవిచ్ ముందుకు • వింబుల్డన్



అల్కారజ్

లండన్: డిఫెండింగ్ చాంపియన్ కార్లోస్ అల్కారజ్, టాప్‌సీడ్ జానిక్ సిన్నర్ వింబుల్డన్‌లో జోరు కొనసాగిస్తూ క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకుపోయారు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రీక్వార్టర్‌ఫైనల్లో మూడోసీడ్ అల్కారజ్ 6-3, 6-4, 1-6, 7-5తో 13వ సీడ్ యుగో హంబర్ట్ (ఫ్రాన్స్)పై, సిన్నర్ 6-2, 6-4, 7-6(9)తో 14వ సీడ్ బెన్ షెల్టన్‌పై విజయం సాధించారు. కాగా, ప్రత్యర్థి 10వ సీడ్ దిమిత్రోవ్ వాకోవర్ ఇవ్వడంతో 5వ సీడ్ మెద్వెదెవ్ క్వార్టర్స్‌లో ప్రవేశించాడు. ఇక ఏడుసార్లు చాంపియన్ నొవాక్ జొకోవిచ్ నాలుగో రౌండ్‌లో ప్రవేశించాడు. శనివారం రాత్రి జరిగిన సింగిల్స్ మూడో రౌండ్ మ్యాచ్‌లో జొకో తొలి సెట్ కోల్పోయినా ఆపై అద్భుతంగా పుంజుకున్నాడు. 4-6, 6-3, 6-4, 7-6 (3)తో ఆస్ట్రేలియా యువ ఆటగాడు అలెక్సీ పాపిరిన్‌ను చిత్తు చేశాడు. తద్వారా ఆల్ ఇంగ్లండ్ క్లబ్ నొవాక్ 15వ సారి నాలుగో రౌండ్‌లో అడుగుపెట్టాడు. సోమవారం జరిగే ప్రీక్వార్టర్స్‌లో 15వ సీడ్ హోల్గర్ రూన్‌తో అమీతుమీ తేల్చుకుంటాడు. ఇతర మూడో రౌండ్ మ్యాచుల్లో రూన్ 1-6, 6-7 (7), 6-4, 7-6 (4), 6-1తో క్వెంటిన్ హేల్స్ (ఫ్రాన్స్)పై, 13వ సీడ్ టేలర్ ఫ్రిట్జ్ 7-6 (3), 6-3, 7-5తో టబీలోపై, 25వ సీడ్ ముసేటి 6-2, 6-7 (7), 7-6 (3), 6-3తో ఫ్రాన్సిస్కోపై నెగ్గారు.

కీస్ అవుట్: మహిళల సింగిల్స్‌లో ఏడో సీడ్ జాస్మిన్ పోలిని క్వార్టర్ ఫైనల్లో అడుగుపెట్టింది. రౌండ్-16 మ్యాచ్‌లో పోలిని 6-3, 6-7 (8), 5-5తో ఉన్న దశలో ప్రత్యర్థి, 12వ సీడ్ మాడిసన్ కీస్ గాయంతో వైదొలగింది. డొన్నా వెకిక్ 6-2, 1-6, 6-4తో పౌలా బడోసాపై నెగ్గి క్వార్టర్స్ చేరింది.

30 మందితో బరిలో..

ఒలింపిక్స్‌కు ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్ల జాబితా

న్యూఢిల్లీ: లాంగ్ జంపర్ జస్విన్ అల్‌డ్రిన్, 5000 మీటర్ల రన్నర్ అంకిత దయాని ఒలింపిక్స్‌కు అర్హత సాధించారు. వరల్డ్ ర్యాంకింగ్ కోటా ఆధారంగా వరల్డ్ అథ్లెటిక్స్ (డబ్ల్యూఏ) ఆదివారం తాజాగా విడుదల చేసిన జాబితాలో వీరికి ఒలింపిక్స్ బెర్త్‌లు ఖరారయ్యాయి. శ్రీశంకర్ గాయపడడంతో.. జస్విన్‌కు మార్గం సుగమమైంది. దీంతో ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో బరిలోకి దిగే భారత అథ్లెట్ల సంఖ్య 30కి పెరిగింది. 5వేల మీటర్ల రేస్‌లో పారుల్ చౌదరితోపాటు అంకిత కూడా పోటీపడనుంది. ఇక, తెలుగు అథ్లెట్లలో జ్యోతి ఎర్రాజీ 100 మీటర్ల హర్డిల్స్‌లో, జ్యోతికశ్రీ 4x400 మీటర్ల రిలే బరిలో దిగనున్నారు.

ఆసియా స్క్వాష్‌లో డబుల్ ధమాకా

జోహోర్ (మలేసియా): ఆసియా డబుల్స్ స్క్వాష్ చాంపియన్‌షిప్‌లో భారత్ డబుల్ ధమాకా సాధించింది. పురుషుల డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో భారత స్క్వాష్ ప్లేయర్లు టైటిళ్లు కొల్లగొట్టారు. ఆదివారం ఇక్కడ జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో అభయ్ సింగ్-సెంథిల్ కుమార్ జోడీ 11-4, 11-5తో ఒంగ్ సాయి హంగ్-సయఫిక్ కమల్ (మలేసియా) ద్వయాన్ని ఓడించి విజేతగా నిలిచింది. అనంతరం జరిగిన మిక్స్‌డ్ తుదిపోరులో భారత జంట అభయ్-జోష్నా చిన్నప్ప 11-8, 10-11, 11-5తో టాంగ్ వింగ్-టాంగ్ మింగ్ (హాంకాంగ్) జోడీపై నెగ్గి టైటిల్ అందుకుంది.

బిజినెస్

పన్ను రాయితీలు పెంచాలి

ఫార్మా బడ్జెట్ కోరికల చిట్టా

న్యూఢిల్లీ: ఫార్మా రంగంలో పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ) కార్యకలాపాలను ప్రోత్సహించేందుకు వచ్చే కేంద్ర బడ్జెట్‌లో మరిన్ని చర్యలు తీసుకోవాలని పరిశ్రమ వర్గాలు కేంద్ర ఆర్థిక మంత్రిని కోరాయి. ఇందుకోసం చేసే పెట్టుబడులకు 200 శాతం పన్ను మినహాయింపు ఇవ్వాలని కోరారు. అలాగే కంపెనీలు అభివృద్ధి చేసే కొత్త ఔషధాలకు పటిష్ఠమైన మేధో సంపత్తి హక్కుల రక్షణ (ఐపీఆర్) కల్పించాలని విజ్ఞప్తి చేశాయి. కొత్త ఔషధాల అభివృద్ధిలో నష్ట భయం ఎక్కువగా ఉన్నందున ఈ రెండు చర్యలు తప్పనిసరని భారత ఔషధ ఉత్పత్తుల సంస్థ (ఓపీపీఐ) డైరెక్టర్ జనరల్ అనిల్ మతాయ్ ఆర్థిక మంత్రికి విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక వైద్య సేవల్లో ఉద్యోగులకు శిక్షణ సదుపాయలు కల్పించే సంస్థలకూ పన్ను రాయితీలు కల్పించాలని సూచించారు. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల చికిత్సకు అవసరమైన ప్రాణ రక్షక ఔషధాలపై జీఎస్‌టీ, దిగుమతి సుంకాలు పూర్తిగా ఎత్తివేయాలని పరిశ్రమ వర్గాలు కోరాయి

అపోలో హెల్త్‌లో రూ.103 కోట్ల విలువైన షేర్ల కొనుగోలు

అపోలో హాస్పిటల్స్

న్యూఢిల్లీ: రైట్స్ ఇష్యూ ద్వారా తమ అనుబంధ సంస్థ అపోలో హెల్త్ లైఫ్‌స్టైల్ లిమిటెడ్ (ఏహెచ్ఎల్ఎల్) ఈక్విటీలో 35,12,107 షేర్లను అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ (ఏహెచ్ఈఎల్) కొనుగోలు చేయనుంది. ఇందుకోసం రూ.10 ముఖ విలువ ఉన్న ఒక్కో షేరుకు రూ.284 ప్రీమియం చెల్లించనుంది. ఇందుకు మొత్తం రూ.103 కోట్లు అవసరమవుతాయని పేర్కొంది. 2000లో ఏర్పాటైన ఏహెచ్ఎల్ఎల్.. ప్రత్యేక ఆస్పత్రులు, మెటర్నిటీ ఆస్పత్రులు, షుగర్, డెంటల్ క్లినిక్‌లు, వ్యాధి నిర్ధారణ కేంద్రాలు, డయాలసిస్ కేంద్రాల ద్వారా సమగ్ర వైద్య సేవలు అందిస్తోంది.

ఎఫ్‌పీఐ పెట్టుబడులు రూ.లక్ష కోట్లు

న్యూఢిల్లీ: విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) ఈ ఏడాది ఇంతవరకు భారత ఈక్విటీ మార్కెట్లో పెట్టిన పెట్టుబడులు రూ.1.16 లక్షల కోట్లకు చేరుకున్నాయి. జూలై 5వ తేదీ నాటికి డిపాజిటరీల సమాచారం ప్రకారం ఈ నెలలో ఇప్పటివరకు ఎఫ్‌పీఐ పెట్టుబడి రూ.7,962 కోట్లుంది. ఈ నెల చివరిలో ప్రతిపాదించనున్న కేంద్ర బడ్జెట్, త్వరలో ప్రారంభం కానున్న కార్పొరేట్ కంపెనీల త్రైమాసిక ఫలితాలు ఈ పెట్టుబడుల భవిష్యత్‌ను నిర్దేశిస్తాయని నిపుణులంటున్నారు. దేశంలో రాజకీయ స్థిరత్వం, మార్కెట్లలో ఏర్పడిన పునరుజ్జీవం ఆధారంగా జూన్‌లో కూడా ఎఫ్‌పీఐలు రూ.26,565 కోట్లు ఇన్వెస్ట్ చేశారు. ఇది కాకుండా వారు డెట్ మార్కెట్లో రూ.6,304 కోట్లు పెట్టుబడులుగా పెట్టారు.

- నేషనల్ మార్ట్ తన కార్యకలాపాలను మరింతగా విస్తరించింది. ఇందులో భాగంగా హైదరాబాద్ సమీపంలోని మేడ్చల్‌లో కొత్తగా హైపర్‌మార్ట్‌ను ప్రారంభించింది. కంపెనీకి ఇది ఎనిమిదవ షోరూమ్. 40 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ మార్ట్‌లో విస్తృత శ్రేణిలో అందుబాటులో ఉండనున్నాయి.
- వెల్‌స్పన్ లివింగ్ లిమిటెడ్ అనుబంధ బ్రాండ్ క్రిస్టీ.. వింబుల్డన్ చాంపియన్‌షిప్స్‌కు గడచిన 37 ఏళ్లుగా అధికారిక టవల్ భాగస్వామిగా వ్యవహరిస్తూ రికార్డు సృష్టించింది. కాగా ఈ టవల్‌ను గుజరాత్‌లోని వాపీలోని టెర్రీ టవర్ ప్లాంట్‌లో గడచిన పదిహేనేళ్లుగా కంపెనీ ఉత్పత్తి చేస్తూ వస్తోంది.
- జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికంలో రికార్డు స్థాయిలో 41,465 ట్రాక్టర్లను విక్రయించినట్లు సోనాలికా ట్రాక్టర్స్ వెల్లడించింది. అంతేకాకుండా కంపెనీ మార్కెట్ వాటా 14.4 శాతానికి చేరుకుందని తెలిపింది. ఈ కాలంలో దేశీయ మార్కెట్లో 14,062 ట్రాక్టర్లను విక్రయించగా మిగిలిన ట్రాక్టర్లను కంపెనీ ఎగుమతి చేసింది.

24,650 పైన బుల్లిష్

(జూలై 8-12 తేదీల మధ్య వారానికి)

అవుట్‌లుక్



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 24,401-23,993 పాయింట్ల మధ్యన కదలాడి 313 పాయింట్ల లాభంతో 24,324 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 24,650 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20,50,100,200 రోజుల చలన సగటు స్థాయిలు 24,294, 24,191, 23,916, 23,488 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డిఎంఏ 200 డిఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 24,600 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 24,150

నిరోధ స్థాయిలు: 24,525, 24,625, 24,725 (24,425 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 24,225, 24,125, 24,025 (24,325 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



8వ తేదీ			
హైదరాబాద్	530	విజయవాడ	550
వరంగల్	532	గోదావరి	550
చిత్తూరు	573	విశాఖపట్నం	570
		దజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	114	విజయవాడ	118
వరంగల్	114	గుంటూరు	118
కరీంనగర్	114	ఒంగోలు	118
మహబూబ్‌నగర్	114	చిత్తూరు	127
కర్నూలు	114	నెల్లూరు	127
విశాఖపట్నం	114	అనంతపురం	118
గోదావరి	118		

అదానీ గ్రూప్ వ్యవహారంలో

హిండెన్‌బర్గ్ నివేదిక వెనక పెద్ద కథ

రెండు నెలల ముందే హెడ్జ్ ఫండ్ మేనేజర్ చేతికి నివేదిక: సెబీ



న్యూఢిల్లీ: అదానీ గ్రూప్‌పై పెద్దఎత్తున ఆరోపణలు చేసిన హిండెన్‌బర్గ్ రీసెర్చ్ నివేదిక పుట్టుపూర్వోత్తరాలను మార్కెట్ నియంత్రణ మండలి సెబీ తవ్వి తీస్తోంది. గత ఏడాది అదానీ గ్రూప్ లిస్టెడ్ కంపెనీల షేర్ల దందాపై ఈ సంస్థ విడుదల చేసిన నివేదికతో.. ఆ గ్రూప్ మార్కెట్ క్యాప్ 15,000 కోట్ల డాలర్లు (సుమారు రూ.12.51 లక్షల కోట్లు) తుడిచి పెట్టుకుపోయిన సంగతి తెలిసిందే. అయితే హిండెన్‌బర్గ్ ఈ నివేదికను అధికారికంగా విడుదల చేయడానికి రెండు నెలల ముందే న్యూయార్క్ కేంద్రంగా పని చేసే మార్క్ కింగ్డన్ అనే హెడ్జ్ ఫండ్ మేనేజర్ చేతికి అందించిందని సెబీ తన షోకాజ్ నోటీసులో పేర్కొంది. ఈ ముందస్తు సమాచారం ఆధారంగా ఈ హెడ్జ్ ఫండ్ మేనేజర్.. కోటక్ మహీంద్రా బ్యాంక్ నిర్వహణలోని ఒక బ్రోకరేజీ సంస్థ ద్వారా అదానీ గ్రూప్ లిస్టెడ్ కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏఈఎల్) కంపెనీ షేర్లలో ముందే షార్ట్ పొజిషన్లు తీసుకుని.. నివేదిక వెలువడిన వెంటనే అమ్ముకుని లాభాలు సొమ్ము చేసుకున్నట్టు సెబీ తెలిపింది.

చైనా లింక్!

మరోవైపు హిండెన్‌బర్గ్ నివేదిక వెనక చైనా హస్తం ఉందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. హెడ్జ్ ఫండ్ మేనేజర్ మార్క్ కింగ్డన్ భార్య అన్లా చెంగ్ చైనా గూఢచారి అని గతంలో అదానీ గ్రూప్ తరఫున వాదించిన లాయర్ మహేశ్ జెఠ్మలానీ 'ఎక్స్' వేదికగా ఆరోపించారు. ఈవిడ ప్రమేయంతోనే మార్క్ కింగ్డన్, హిండెన్‌బర్గ్ ద్వారా అదానీ గ్రూప్ కంపెనీలపై నివేదిక తయారు చేయించి విడుదల చేయించినట్టు తెలిపారు. ఈ మొత్తం వ్యవహారంలో కోటక్ మహీంద్రా (ఇంటర్నేషనల్) బ్యాంక్ అనుబంధ బ్రోకరేజీ సంస్థ ఒక పావుగా మారిందని తెలిపింది.

- గోదావరి ఎలక్ట్రిక్ మోటార్స్.. తెలంగాణలోని మహబూబ్ నగర్‌లో కొత్త షోరూమ్‌ను ప్రారంభించింది. ఈ షోరూమ్‌లో కంపెనీకి చెందిన ఎలక్ట్రిక్ వాహన మోడళ్లు ఈబ్లూ స్పిన్, ఈబ్లూ థ్రిల్, ఈబ్లూ ఫియో, ఫియో ఎక్స్, రైనో ఉత్పత్తులు అందుబాటులో ఉండనున్నాయి.
- ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత ఉత్పత్తులపై బీస్పోక్ ఏఐ డేస్ పేరుతో ప్రత్యేక ఆఫర్లను సామ్‌సంగ్ అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ ఆఫర్‌లో భాగంగా రూ.20,000 వరకు క్యాష్‌బ్యాక్, జీరో డౌన్ పేమెంట్ వంటివి అందించనుంది. సామ్‌సంగ్ రిఫిజిరేటర్లు, వాషింగ్ మెషిన్లు, ఏసీలు, మైక్రోవేవ్ ఓవెన్స్ సహా అన్ని ఉత్పత్తులకు ఈ ఆఫర్లు అందుబాటులో ఉండనున్నాయి.
- గోద్రెజ్ ఆగ్రోవెట్‌కు చెందిన సీడ్ విభాగం మార్కెట్లోకి మొక్కజొన్న, ప్యాడీ (వరి)కి సంబంధించి మూడు కొత్త ఉత్పత్తులను విడుదల చేసింది. మొక్కజొన్నలో జీఎంహెచ్ 6034, జీఎంహెచ్ 4110 పేరుతో హైబ్రిడ్ సీడ్స్‌ను తీసుకురాగా వరిలో నవ్య పేరుతో విత్తనాలను తీసుకువచ్చింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా మరికొన్ని రాష్ట్రాల్లో ఇవి అందుబాటులో ఉండనున్నాయి.

అప్రమత్తంగా ఉండటం బెటర్!

ఇన్వెస్టర్లు ఈ వారం అప్రమత్తంగా ఉండటం మంచిది. బెంచ్‌మార్క్ సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీ సరికొత్త జీవితకాల గరిష్ఠాలకు చేరటమే ఇందుకు కారణం. రానున్న రోజుల్లో సూచీల గమనం ఎలా ఉంటుందో తెలియదు కానీ సమీప భవిష్యత్‌లో కొంత కరెక్షన్‌కు ఆస్కారం ఉంది. ఈ వారం రైల్వే, డిఫెన్స్ రంగాల షేర్లు వెలుగులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

స్టాక్ రికమండేషన్స్

ఐఆర్‌సీటీసీ: సుదీర్ఘకాలం అప్‌ట్రెండ్‌లో కొనసాగిన ఈ షేరు కొన్నాళ్లుగా కరెక్షన్ అవుతోంది. అయితే డెలివరీ, ట్రేడింగ్ వాల్యూమ్ తగ్గటాన్ని బట్టి చూస్తే మరికొన్ని రోజుల్లోనే పుంజుకునే అవకాశం కనిపిస్తోంది. సాధారణ ప్రయాణికుల కోసం కోచ్‌లు పెంచనున్నట్లు రైల్వే శాఖ ప్రకటించటంతో ఇన్వెస్టర్లు ఈ షేరుపై ఆసక్తిని కనబరుస్తున్నారు. గత శుక్రవారం ఈ షేరు 1.98 శాతం లాభంతో రూ.1,026 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.1,000/1,010 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,155/1,120 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.975 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

హెచ్‌బీఎల్ పవర్: టెక్నికల్‌గా చూస్తే ఈ షేరుకు చాలా సానుకూలతలు కనిపిస్తున్నాయి. భారీ డెలివరీ, ట్రేడింగ్ వాల్యూమ్‌తో ట్రయాంగిల్ ప్యాటర్న్ బ్రేక్ అయ్యింది. గత శుక్రవారం ఈ షేరు 7.5 శాతం లాభంతో రూ.569 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.550 శ్రేణిలో ప్రవేశించి రూ.590/660 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.525 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఐఆర్ఎఫ్‌సీ: ఈ కౌంటర్‌లో ఫిబ్రవరి నుంచి కొనసాగుతున్న కన్సాలిడేషన్ ముగింపు దశకు చేరుకుంది. గత శుక్రవారం మంచి వాల్యూమ్‌తో అంతకు ముందు వారం గరిష్ఠాన్ని బ్రేక్ చేసి చివరకు 5.91 శాతం లాభంతో రూ.188.23 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.185 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.199/210 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.182 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

బీఈఎల్: ప్రభుత్వ రంగానికి చెందిన ఈ షేరు తాజాగా జీవితకాల గరిష్ఠాన్ని బ్రేక్ చేసింది. వాల్యూమ్ కూడా పెరుగుతోంది. చివరి మూడు సెషన్లలో ప్రైస్ యాక్షన్ చాలా బాగుంది. గత శుక్రవారం ఈ షేరు 2.11 శాతం లాభంతో రూ.324 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.320 స్థాయిలో ఎంటరై రూ.345/390 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ. 314 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎస్‌బీఐ లైఫ్: కరెక్షన్ తర్వాత ఈ షేరులో మూమెంటమ్ పెరిగింది. మళ్లీ అప్‌ట్రెండ్ మొదలైంది. పెద్దపెద్ద క్యాండిల్స్ ఫామ్ అవుతున్నాయి. పైగా నిఫ్టీతో పోలిస్తే మెరుగైన ప్రదర్శన చేస్తోంది. అప్పర్ బొలింజర్ బ్యాండ్ బ్రేక్ చేసింది. గత శుక్రవారం ఈ షేరు 1.04 శాతం లాభంతో రూ.1,529 దగ్గర క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.1,520/1,500 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,575/1,640 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,475 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం, మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్

niftymasterlive@gmail.com +91 98855 59709

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

కరెక్షన్‌కు చాన్స్

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం పాజిటివ్ ట్రెండ్‌లో ప్రారంభమై కీలక మైన 24,000 కన్నా పైన నిలదొక్కుకుని మరింత అప్‌ట్రెండ్‌లో పురోగమించింది.ఆ క్రమంలో 24,400 వరకు వెళ్లి మైనర్ రియాక్షన్‌కు గురైనా వారం మొత్తం మీద 310 పాయింట్లు లాభపడి 24,320 వద్ద పటిష్ఠంగా ముగిసింది. గత ఎనిమిది వారాలుగా సాగుతున్న ర్యాలీలో 21,300 (జూన్ 4వ తేదీన ఏర్పడిన మహాపతనంలో నమోదైన ఇంట్రాడే కనిష్ఠ స్థాయి) నుంచి 3,000 పాయింట్ల మేరకు లాభపడింది. ప్రతీ ఒక్క నిరోధ స్థాయిలోనూ బలంగా నిలదొక్కుకుంటూ ఆ నిరోధాలను ఛేదించుకుంటూ అప్‌ట్రెండ్‌ను కొనసాగించింది. టెక్నికల్‌గా మార్కెట్ అప్‌ట్రెండ్‌లోనే ఉన్నప్పటికీ స్వల్పకాలిక ఇన్వెస్టర్లు ప్రస్తుత గరిష్ఠ స్థాయిల్లో అప్రమత్తంగా ఉండాలి. ర్యాలీకి దీటుగా కన్సాలిడేషన్ లేదా కరెక్షన్ ఏర్పడడం తప్పనిసరి. కాగా అదే ధోరణిని కొనసాగించిన మిడ్‌క్యాప్-100 సూచీ 1,350 పాయింట్లు, స్మాల్‌క్యాప్-100 సూచీ 620 పాయింట్లు లాభపడ్డాయి.

బుల్లిష్ స్థాయిలు: మరింత అప్‌ట్రెండ్ కోసం మైనర్ నిరోధ స్థాయి 24,410 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం, మానసిక అవధి 24,550.

బేరిష్ స్థాయిలు: రియాక్షన్‌లో పడినా మైనర్ మద్దతు స్థాయి 24,150 వద్ద నిలదొక్కుకోవాలి. విఫలమైతే మైనర్ బలహీనతకు ఆస్కారం ఉంటుంది. ప్రధాన మద్దతు స్థాయి 23,950.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం మైనర్ అప్‌ట్రెండ్ సాధించిన ఈ సూచీ 320 పాయింట్లు లాభపడి గరిష్ఠ, కనిష్ఠ స్థాయిలకు నడుమన 52,660 వద్ద ముగిసింది. గరిష్ఠ స్థాయిల్లో అమ్మకాల ఒత్తిడి ఏర్పడుతోందనేందుకు ఇది సంకేతం. మరింత అప్‌ట్రెండ్ కోసం నిరోధ స్థాయి 53,100 కన్నా పైన నిలదొక్కుకోవాలి. బలహీనత ప్రదర్శించినట్టయితే 52,300, 51,900 వద్ద గట్టి మద్దతు స్థాయిలున్నాయి.

పాటర్న్: మార్కెట్లో ఓవర్‌బాట్ స్థితి కొనసాగుతోంది. అప్రమత్తంగా ఉండాలి. రియాక్షన్‌లో పడి 24,150 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనతకు ఆస్కారం ఉంటుంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,410, 24,470
మద్దతు	24,250, 24,190

బంగారం ముక్కలను సంచుల్లో దాచి..
బస్సులో అక్రమంగా తరలింపు

» ఇద్దరి అరెస్టు.. రూ. 2.98 కోట్ల బంగారం స్వాధీనం



హైదరాబాద్ సిటీ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): బంగారాన్ని ముక్కలుగా చేసి, ప్రత్యేక సంచుల్లో దాచి బస్సులో రహస్యంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను హైదరాబాద్ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్ అధికారులు పట్టుకున్నారు. ఆదివారం విశ్వసనీయ సమాచారంతో కోల్‌కతా నుంచి హైదరాబాద్‌కు వస్తున్న ఓ బస్సులో తనిఖీలు చేసిన అధికారులు ఇద్దరు వ్యక్తులు ప్రత్యేకంగా కుట్టిన సంచుల్లో బంగారాన్ని దాచినట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. 3.98 కిలోల బరువున్న ఆ బంగారం విలువ సుమారు రూ. 2కోట్ల 89లక్షలు ఉంటుందని తెలిపారు. విమానాశ్రయాల్లో భద్రత కట్టుదిట్టంగా ఉండటం, తనిఖీలు ఎక్కువగా కావడంతో సరఫరాదారులు అక్రమంగా దిగుమతి చేసుకున్న బంగారాన్ని పలు రకాలుగా తరలిస్తున్నారని చెప్పారు. ఎవరికీ అనుమానం రాకుండా రైళ్లలో, బస్సులో సాధారణ ప్రయాణికుల మాదిరి బ్యాగుల్లో, దుస్తుల్లో దాచి గమ్యానికి చేరవేస్తున్నారని తెలిపారు. పట్టుబడిన వ్యక్తులు కోల్‌కతాకు చెందిన ఓ ముఠాకు చెందిన వారిగా గుర్తించామని, వారు బంగారాన్ని ఎవరికి చేరవేస్తున్నారో దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. దీని వెనుక ఎవరెవరున్నారనే కోణంలోనూ కేసును విచారిస్తున్నామని పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు పోరాటం

» మాదిగ 'దండోరా' ముప్పై వసంతాల వేడుకల్లో వక్తలు

హైదరాబాద్ సిటీ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మాదిగ రిజర్వేషన్ పోరాటం అంటే మానవ హక్కుల పోరాటమే అని పలువురు మాదిగ నేతలు పేర్కొన్నారు. మాదిగ రిజర్వేషన్ ఉద్యమాన్ని చీల్చే కుట్రలను ఛేదించాలని వారు పిలుపునిచ్చారు. మాదిగ హక్కుల దండోరాకు ముప్పై ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం రవీంద్రభారతిలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాదిగ దండోరా నాయకులు మాట్లాడుతూ.. అవిభాజ్య ప్రకాశం జిల్లా ఈదుముడి గ్రామంలో మూడు దశాబ్దాల కిందట మొదలైన ఈ ఉద్యమం మాదిగల అస్తిత్వాన్ని, ఔన్నత్యాన్ని సమాజానికి చాటిందని కొనియాడారు. హిందూత్వ శక్తుల కౌగిలిలో మందకృష్ణ మాదిగ ఒదగడం బాధాకరమని అన్నారు. మాదిగలంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. సదస్సులో మానుకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉందని తెలిపారు. మాదిక హక్కుల పోరాటానికి మద్దతుగా నిలిచిన ప్రజా గాయని విమలక్క, ప్రొఫెసర్లు ఆడమ్, మల్లేశం, ఇటిక్యాల పురుషోత్తం తదితరులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

భువనగిరి ఖిల్లాను సందర్శించిన వికీపీడియా

» గుట్ట అందాలు కెమెరాల్లో బంధించిన ఫొటోగ్రాఫర్లు

భువనగిరి టౌన్, జూలై 7: ఎన్నో త్యాగాలకు నిలయమైన చారిత్రక భువనగిరి ఖిల్లా విశేషాలను ప్రపంచానికి చాటే లక్ష్యంతో వికీపీడియా ఫొటోగ్రాఫర్ల బృందం ఆదివారం ఖిల్లాను సందర్శించింది. వికీపీడియా ఫొటోగ్రాఫర్ల టీం లీడర్ మహేశ్ నేతృత్వంలోని 50 మంది ఫొటోగ్రాఫర్లు సుమారు మూడు గంటల పాటు భువనగిరి కోట మొత్తాన్ని పరిశీలిస్తూ ఫొటోలు తీశారు. ప్రస్తుతం భువనగిరి ఖిల్లా సమాచారంతో పాటు కేవలం 10 ఫొటోలు మాత్రమే వికీపీడియాలో కనిపిస్తున్నాయి. నూతనంగా తీసిన ఫొటోలను అప్‌లోడ్ చేయడంతో పాటు మరింత సమాచారాన్ని చేర్చుతామని మహేశ్ తెలిపారు. కాగా, ఖిల్లా అభివృద్ధికి కేంద్రం మంజూరు చేసిన రూ.100 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులు త్వరలోనే ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో వికీపీడియాలో నూతన ఫొటోలు, విస్తృత సమాచారం అందుబాటులోకి రానుంది. అలాగే వికీపీడియా..త్వరలో నిర్వహించనున్న ఫొటో గ్యాలరీలో కూడా భువనగిరి ఖిల్లా ఫొటోలను ప్రదర్శించనున్నట్లు తెలుస్తోంది.

కేంద్రం వైఖరి వల్లే ఎస్సీ వర్గీకరణలో జాప్యం

» ఎమ్మార్పీఎస్(టీఎస్) అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

కవాడిగూడ, జూలై 7 (ఆంధ్ర జ్యోతి): ఎస్సీ వర్గీకరణ అంశంలో కేంద్ర ప్రభుత్వం మోసపూరిత వైఖరివల్లే జాప్యం జరుగుతోందని ఎమ్మార్పీఎస్(టీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో కేంద్రప్రభుత్వ మోసపూరిత వైఖరి, జాప్యాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ 30వ వార్షికోత్సవం సందర్భంగా ఎమ్మార్పీఎస్ టీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ ఆదివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో దీక్ష చేపట్టారు. తెలంగాణ జన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరాం హాజరై దీక్షను ప్రారంభించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్. కృష్ణయ్య, మాజీ ఛైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్కతో పాటు పలు జిల్లాల నుంచి ఎమ్మార్పీఎస్ నేతలు, కార్యకర్తలు తరలివచ్చి దీక్షకు సంఘీభావం ప్రకటించారు. బహుజన యుద్ధనౌక ఏపూరి సోమన్న మాదిగ జాతి మోసపోతున్న విధానంపై పాటల ద్వారా వివరించారు.

వర్గీకరణపై 30 ఏళ్లుగా పోరాటం: మంద కృష్ణ

బౌద్ధనగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ప్రారంభమైన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) ఉద్యమం 30 ఏళ్లుగా నిలబడడానికి మాదిగల సంకల్పబలంతో పాటు సమాజం అందించిన అండదండలే ప్రధాన కారణమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. సికింద్రాబాద్ పార్శీగుట్ట ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ మాదిగ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవంలో మందకృష్ణ మాదిగ పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ శ్రేణుల మధ్య కేకును కట్ చేశారు.

విద్యావ్యవస్థలో అన్నీ కొరతలే: హరీశ్‌రావు

హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక విద్యావ్యవస్థలో అరకొర వసతులు, టీచర్ల కొరత, పాఠ్యపుస్తకాలు, దుస్తులు, తాగునీరు ఇలా అన్నీ కొరతలేనని.. సమస్యలపై కనీసం దృష్టి పెట్టడం లేదని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేయొద్దని కోరుతూ ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన బహిరంగలేఖ రాశారు. కాంగ్రెస్ పాలన టీచర్లకు, విద్యార్థులకు, ప్రభుత్వ పాఠశాలలకు శాపంగా మారిందన్నారు. విద్యాశాఖను కూడా నిర్వర్తిస్తున్న మీరు (సీఎం).. రాజకీయ అంశాలకు మాత్రమే అధిక ప్రాధాన్యమిస్తున్నారు తప్ప.. ప్రజాసమస్యల పరిష్కారాన్ని పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు.

వృద్ధుడికి రూ.5 కోట్లు టోకరా!

» సైబర్ వలలో ట్రాన్స్‌కో రిటైర్డ్ ఉన్నతాధికారి
» గత నెల 13న ఓ నంబరు నుంచి కాల్
» మనీ ల్యాండరింగ్‌లో పేరుందని బెదిరింపు
» ముంబైలో కేసు నమోదైందని హల్‌చల్
» నగదు బదలాయించుకుని ఫోన్లు స్విచ్ఛాఫ్
» అమెరికాలోని కూతురుకు సమాచారం
» పోలీసులు స్పందించట్లేదని ఆరోపణ

హిమాయత్‌నగర్, జూలై 7(ఆంధ్రజ్యోతి): వృద్ధులను లక్ష్యంగా చేసుకుంటున్న సైబర్ నేరగాళ్లు రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. బెదిరించి.. అయోమయానికి గురిచేసి నిలువునా దోచుకుంటున్నారు. హైదరాబాద్ నాచారంలో నివసించే ట్రాన్స్‌కో రిటైర్డ్ ఉన్నతాధికారి(75) నుంచి ఇలానే ఏకంగా రూ.5 కోట్ల వరకు కాజేశారు. రిటైర్డ్ అధికారికి జూన్ 13న గుర్తుతెలియని నంబరు నుంచి కాల్ వచ్చింది. "ముంబై టెలికాం సంస్థ నుంచి మాట్లాడుతున్నాం. మీ ఫోన్ నంబరును అసాంఘిక కార్యకలాపాలకు వినియోగిస్తున్నట్లు గుర్తించాం. మీపై ఎఫ్ఐఆర్ బుక్ అయింది" అని అవతలి వ్యక్తి పరిచయం చేసుకున్నాడు. ఓ మెసేజ్‌ను కూడా బాధితుడి ఫోన్‌కు పంపించాడు. అందులో ఎఫ్ఐఆర్ నంబర్ ఎంహెచ్1045/0624, రిటైర్డ్ అధికారి ఫోన్ నంబరు, మొబైల్ నంబర్ అప్లికేషన్ పేరుతో షాప్ నం.10, ఖుర్షాల్ టవర్, ఘట్కోపర్, మహాలాల్ రోడ్, తిలక్‌నగర్, ముంబై అని వివరాలున్నాయి. వీటితో తనకేమీ సంబంధం లేదని రిటైర్డ్ అధికారి బదులిచ్చారు. అయితే, 'మీ ఫోన్‌ను ముంబై పోలీసులకు కనెక్ట్ చేస్తున్నా. మాట్లాడండి' అని ఆగంతకుడు చెప్పాడు. ముంబై పీఎస్ ఎస్ఐని అంటూ ఫోన్‌లో వినయ్‌కుమార్ చౌబే అనే వ్యక్తి పరిచయం చేసుకుని 'మీపై కేసు నమోదుచేశాం. ఫిర్యాదులుంటే స్కైప్ ద్వారా చెప్పొచ్చు' అని సూచించాడు. స్కైప్ ఆపరేట్ చేయడం రాదని వృద్ధుడు చెప్పడంతో మెయిల్ ఐడీ, పాస్‌వర్డ్‌ను పంపి పంపాడు. ఈ కేసుపై ఐపీఎస్ అధికారి కాల్ చేస్తారని, వివరాలు చెప్పాలని సూచించాడు. ఆకాష్ కులకర్ణి పేరుతో మరో ఆగంతకుడు కాల్ చేసి మహారాష్ట్ర పోలీసు ఉన్నతాధికారినని, మీ ఫోన్ నంబర్, బ్యాంకు ఖాతాల ద్వారా రూ.రెండు కోట్ల మనీల్యాండరింగ్ జరిగిందని, మనీ ల్యాండరింగ్ కేసులో వ్యాపారి సురేష్ గోయల్ ఇంట్లో దాడులు చేసిన సమయంలో మీ పేరుతో ఉన్న క్రెడిట్ కార్డులు పెద్ద సంఖ్యలో లభ్యమయ్యాయని తెలిపాడు. ఆర్‌బీఐ పబ్లిక్ అకౌంట్ ఫండ్స్‌కు వాటిని పంపిస్తున్నామని, మీ ఖాతాలన్నీ సీజ్ చేసి చర్యలు తీసుకుంటామని బెదరగొట్టాడు. ఖాతాల్లోని నగదు, బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లు, డీమ్యాట్ అకౌంట్లు, షేర్లు అన్నీ డబ్బుగా మార్చి, ఆర్‌బీఐ పబ్లిక్ అకౌంట్ ఫండ్స్ ఖాతాలకు బదిలీ చేస్తే ఇబ్బంది ఉండదని సూచించారు. పలు ప్రైవేట్ బ్యాంకు ఖాతాల నంబర్లు పంపించాడు. దీంతో జూన్ 14-27వ తేదీ మధ్య రిటైర్డ్ అధికారి.. రూ.1.30 కోట్లకు పైగా ఎఫ్‌డీలు, రూ.2 కోట్లు, రూ.1.25 కోట్ల నగదును ఆగంతకుడు చెప్పిన ఖాతాల్లో జమ చేశారు. ఇది జాతీయ భద్రతకు సంబంధించిన కేసు కాబట్టి కుటుంబసభ్యులకు కూడా చెప్పకూడదని బెదరగొట్టిన కేటుగాళ్లు మొత్తం దండుకున్న తర్వాత ఫోన్లు స్విచ్ఛాఫ్ చేశారు. మోసపోయానని గుర్తించిన బాధితుడు.. అమెరికాలో ఉండే కూతురుకు సమాచారం ఇచ్చారు. ఆమె.. పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే, ఎవరూ సరిగా స్పందించడంలేదని, డబ్బు రికవరీ విషయంలో ఎలాంటి భరోసా ఇవ్వట్లేదని ఆమె వాపోతున్నారు.

భూముల రిజిస్ట్రేషన్ విలువల..
సవరణ మళ్లీ మొదటికి!

» మరోసారి అధ్యయనానికి నిర్ణయం
» తక్కువే పెంచాలన్న యోచనలో ప్రభుత్వం
» మధ్యతరగతికి భారం కాకుండా పెంపు
» 50-60 శాతానికి మించవద్దన్న మంత్రి
» శాస్త్రీయ పద్ధతిలో సవరణకు ఆదేశం
» మార్గదర్శకాలను సమీక్షిస్తున్న కమిషనర్
» ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే అవకాశం



హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భూముల రిజిస్ట్రేషన్ విలువల సవరణ ప్రక్రియ మళ్లీ మొదటికి వచ్చింది. మధ్యతరగతి ప్రజలపై భారం పడకుండా భూముల ధరలను సవరించాలని, ఇందుకోసం విలువల నిర్ధారణ కమిటీలు మరోసారి క్షేత్రస్థాయికి వెళ్లి అధ్యయనం చేయాలని ప్రభుత్వం నిర్ణయించడమే ఇందుకు కారణం. వాస్తవానికి జూలై 1 నాటికే రిజిస్ట్రేషన్ విలువల సవరణ ప్రక్రియను పూర్తి చేసి, కొత్త విలువలను ప్రజాభిప్రాయ సేకరణ కోసం వెబ్‌సైట్‌లో పెట్టాల్సి ఉంది. ఇందుకు సంబంధించి గతంలో అప్పటి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్, ఇన్‌స్పెక్టర్ జనరల్ నవీన్ మిత్తల్ జూన్ 14న గ్రామీణ, పట్టణ పరిధిలో విలువల నిర్ధారణ కమిటీలను నియమించారు. ఆ కమిటీలకు కొన్ని మార్గదర్శకాలు, వాటిని అమలు చేసేందుకు షెడ్యూల్‌ను (తేదీలను) ఖరారు చేశారు. వీటి ప్రకారం.. విలువల నిర్ధారణ కమిటీలు జూన్ 18 నుంచి క్షేత్రస్థాయికి వెళ్లి, అక్కడ జరుగుతున్న రియల్‌ఎస్టేట్ వ్యాపార లావాదేవీలను తెలుసుకోవాలి. అనంతరం రిజిస్ట్రేషన్ విలువల రివిజన్, ప్రతిపాదించిన విలువలపై సమీక్షలు నిర్వహించాలి. ఆపై.. ప్రతిపాదిత రిజిస్ట్రేషన్ విలువలను ప్రజాభిప్రాయ సేకరణ కోసం జూలై 1న వెబ్‌సైట్‌లో పెట్టి ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించాలి. జూలై 15 వరకు ఈ అభ్యంతరాల స్వీకరణ కొనసాగాలి. అయితే కొన్ని కారణాల వల్ల ఈ ప్రక్రియ షెడ్యూలు ప్రకారం జరగకుండా ఆలస్యమయింది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్‌గా కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఐజీ జ్యోతి బుద్ధప్రకాశ్.. భూముల విలువల సవరణ ప్రక్రియను మళ్లీ సమీక్షిస్తున్నారు. రిజిస్ట్రేషన్ విలువలు, చార్జీలను భారీగా పెంచకుండా కొంత మేరకే పెంచాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉండడమే ఇందుకు కారణం. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ నెల 5న అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు సూచన చేశారు.

విమర్శలకు తావులేకుండా సవరణ..!

విలువల సవరణకు మరోమారు లోతైన పరిశీలన చేయాలని, ఇందుకోసం ఏర్పాటు చేసిన కమిటీలు మరోసారి క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి విలువలను ప్రతిపాదించాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. మధ్యతరగతి ప్రజలపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా ప్రస్తుత మార్కెట్ విలువలకు అనుగుణంగా భూముల ధరలను సవరించాలని నిర్దేశించారు. 50 నుంచి 60 శాతానికి మించి రిజిస్ట్రేషన్ విలువలు పెంచరాదని ఆయన సూచించినట్లు సమాచారం. ప్రస్తుతం మార్కెట్ విలువలకు, రిజిస్ట్రేషన్ విలువలకు భారీగా వ్యత్యాసం ఉన్న నేపథ్యంలో ఎలాంటి విమర్శలకు తావులేకుండా శాస్త్రీయ పద్ధతిలో భూముల ధరల సవరణ జరగాలని మంత్రి అన్నారు. ఏయే ప్రాంతాల్లో మార్కెట్ ధరలు, రిజిస్ట్రేషన్ విలువల మధ్య వ్యత్యాసం ఉందో.. దానిని సవరిస్తూ, అక్కడ హేతుబద్ధంగా ఎంత శాతం పెంచేందుకు అవకాశం ఉందో తెలుసుకునేందుకు లోతైన అధ్యయనం చేయాలన్నారు. బిల్డర్లతో కూడా మాట్లాడి అక్కడి బహిరంగ మార్కెట్ ధరలు, రిజిస్ట్రేషన్ విలువలను తెలుసుకోవాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో మార్కెట్ విలువ కంటే ప్రభుత్వ ధర అధికంగా ఉన్న నేపథ్యంలో.. అలాంటి ప్రాంతాలను గుర్తించి రిజిస్ట్రేషన్ విలువలను తగ్గించాలని సూచించారు. మంత్రి ఆదేశాల మేరకు అధికారులు మరోసారి క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించేందుకు సిద్ధమయ్యారు.

కమిషనర్ మారడంతో..

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్‌గా ఉన్న నవీన్ మిత్తల్‌ను తప్పించి మరో ఐఏఎస్ అధికారి జ్యోతి బుద్ధప్రకాశ్‌కు బాధ్యతలు అప్పగించడంతో మార్గదర్శకాల అమల్లో జాప్యం జరిగిందని కొందరు అధికారులు అంటున్నారు. కొత్త కమిషనర్ ఈ అంశంపై అధ్యయనం చేసేందుకు కూడా కొంత సమయం పట్టవచ్చని చెబుతున్నారు. అంతేకాకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పలు ఇతర అధికారిక అంశాలపై కేంద్ర మంత్రులను కలిసేందుకు ఇటీవల ఢిల్లీకి వెళ్లడం వల్ల కూడా మార్గదర్శకాల అమల్లో జాప్యం జరిగిందని పేర్కొంటున్నారు.



డీఎస్‌కు నివాళులర్పిస్తున్న దత్తాత్రేయ, చిత్రంలో ఎంపీ అర్వింద్

పార్టీలకతీతంగా
డీఎస్‌కు గుర్తింపు

» శ్రద్ధాంజలి సభలో పలువురి నివాళి

హైదరాబాద్ సిటీ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో పార్టీలకు అతీతంగా రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నేత ధర్మపురి శ్రీనివాస్(డీఎస్) అని పలువురు ప్రముఖులు కొనియాడారు. బీజేపీ ఎంపీ, డీఎస్ కుమారుడు ధర్మపురి అర్వింద్, కుటుంబ సభ్యులు గచ్చిబౌలి సంధ్య కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం డీఎస్ శ్రద్ధాంజలి సభను నిర్వహించారు. ఇందులో పలువురు ప్రముఖులు మాట్లాడుతూ.. రాజకీయాల్లో అజాత శత్రువుగా గుర్తింపు తెచ్చుకున్న నేత డీఎస్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల నుంచి పార్టీలకు అతీతంగా హాజరైన నేతలు డీఎస్ చిత్రపటానికి పూలమాళలు వేసి నివాళులు అర్పించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్, బీజేపీ ఎంపీలు డీకే అరుణ, రఘునందర్ రావు, రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్, మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు, కాంగ్రెస్ సీనియర్ నేతలు కేవీపీ, వీహెచ్ మధుయాష్కీ, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తదితరులు డీఎస్‌కు నివాళులర్పించారు. డీఎస్ ప్రస్థానంపై రూపొందించిన ఫొటో ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది.

ఎన్‌హెచ్65పై ట్రామా కేర్ సెంటర్

(మొదటిపేజీ తరువాయి)

ప్రమాద మరణాల సంఖ్యను తగ్గించేందుకు ట్రామా కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్టు రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డవారికి.. గంటలోపు చికిత్స అందించగలిగితే వారు బతికే అవకాశాలు చాలా ఎక్కువ ఉంటాయి. అందుకే దాన్ని 'గోల్డెన్ అవర్' అంటారు! విజయవాడ-హైదరాబాద్ మధ్య ఈ దారిలో ఎక్కడ ప్రమాదం జరిగినా ఆ గోల్డెన్ అవర్‌లోనే వారికి అత్యవసర వైద్యసేవలు అందించేలా ఈ ట్రామా కేర్ సెంటర్‌ను నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొర్లపాడు టోల్‌ప్లాజాకు దగ్గర్లో నిర్మించాలని నిర్ణయించారు. సోమవారం ఈ మేరకు అక్కడ భూమిపూజ నిర్వహించి శంకుస్థాపన చేయనున్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద.. ఏడీపీ సొల్యూషన్స్ సంస్థ ఈ సెంటర్ నిర్మాణానికి రూ.5కోట్లు అందించనుంది. మంత్రి కోమటిరెడ్డి తనయుడు ప్రతీక్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలోనే మరణించిన సంగతి తెలిసిందే. అలాంటి వేదన మరెవరికీ రాకూడదనే ఉద్దేశంతో ఈ సెంటర్ ఏర్పాటుకు మంత్రి చొరవ తీసుకున్నారు. దీనిపై ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. "ప్రజల ప్రాణాలను కాపాడడమే మన ప్రథమ ప్రాధాన్యం కావాలనే సీఎం రేవంత్‌రెడ్డి ఆశయానికి అనుగుణంగానే ఈ ట్రామాకేర్ సెంటర్‌ను ఏర్పాటుచేస్తున్నాం. ఈ సెంటర్‌లో అత్యవసర చికిత్సకు సంబంధించిన వైద్య ఉపకరణాలతోపాటు.. అత్యాధునిక ఆపరేషన్ థియేటర్, ఆక్సిజన్, వెంటిలేటర్ సదుపాయం కలిగిన 10 పడకలు అందుబాటులో ఉంటాయి. దీన్ని గ్రౌండ్ ప్లస్ ఒక అంతస్తుగా నిర్మిస్తున్నాం. అన్ని విభాగాల వైద్యులూ నిత్యం అందుబాటులో ఉంటారు" అని చెప్పారు. కాగా, ఎన్‌హెచ్-65పై నిత్యం ఏదో ఒకచోట ప్రమాదం చోటుచేసుకుంటూనే ఉంటుంది. రోజుకు ఒకటి, రెండు చొప్పున నెలకు సగటున 40-50 మరణాలు నమోదవుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఈ హైవేపై గతంలో సర్వే చేసిన జాతీయ రహదారుల సంస్థ.. మొత్తం మార్గంలో 17 చోట్ల అధికంగా ప్రమాదాలు జరుగుతున్నట్టు గుర్తించింది.



జగదాంబిక అమ్మవారి ఆలయంలోకి పట్టు వస్త్రాలను తీసుకెళ్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రులు సురేఖ, పొన్నం, ఎమ్మెల్యే దానం



లోయర్ ట్యాంక్‌బండ్‌లోని శ్రీ కనకాల కట్టమైసమ్మ దేవాలయం వద్దకు బోనాలు తీసుకెళ్తున్న కుమ్మర్లు

వైభవంగా గోల్కొండ బోనాలు

శ్రీ జగదాంబిక ఆలయంలో ఉత్సవాలు షురూ.. పట్టు వస్త్రాలు సమర్పించిన స్పీకర్, మంత్రులు

నార్సింగ్/కవాడిగూడ/కార్వాన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): భాగ్యనగరంలో ప్రతి ఏటా ఆషాఢ మాసంలో నెలరోజుల పాటు జరిగే బోనాల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వేదమంత్రాలు, ఊరేగింపులు, శివసత్తులు, పోతరాజుల నృత్యాలతో ఆదివారం చారిత్రక గోల్కొండ శ్రీ జగదాంబిక అమ్మవారి ఆలయంలో బోనాల వేడుకలకు శ్రీకారం చుట్టారు. ఈ వేడుకల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవాలకు గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్ బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు టి.ప్రకాష్‌గౌడ్, దానం నాగేందర్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, మాజీ ఎంపీ హనుమంతరావు, నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్, ఆలయ కమిటీ సభ్యులతోపాటు పలు పార్టీల నాయకులు హాజరయ్యారు. అంతకుముందు చోటాబజార్‌లో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ఆలయ పూజారి అనంతచారి సమక్షంలో ప్రత్యేక పూజలు చేశారు. లంగరహౌజ్ నుంచి భారీ అడుగుల తొట్టెల ఊరేగింపు, చోటాబజార్ నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గోల్కొండ కోటపై గల శ్రీ జగదాంబిక (గోల్కొండ ఎల్లమ్మ) అమ్మవారి ఆలయం వరకు ఊరేగించారు. మరోపక్క బంజారా దర్వాజ నుంచి పటేల్ లక్ష్మమ్మ ఇంటి నుంచి మొట్ట మొదటి బోనం దేవాలయం వరకు ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. కుతుబ్‌షాహీ కాలం నుంచి చోటాబజార్‌లోని ఆలయ పూజారి అనంతచారి ఇంటి నుంచి ఉత్సవ విగ్రహం, బంజారాదర్వాజ పటేల్ లక్ష్మమ్మ ఇంటి నుంచి మొదటి బోనం సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఇక ప్రతి ఆదివారం, గురువారం గోల్కొండ కోటలో ఆగస్టు 4 వరకు బోనాల ఉత్సవాలు జరుగుతాయి. గోల్కొండలోని గల శ్రీజగదాంబిక అమ్మవారి దర్శనం కోసం ఉదయం నుంచే భక్తులు క్యూలైన్‌లో ఉన్నారు. ఆదివారం ఒక్కరోజే రెండు లక్షలకు పైగా భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణమంతా కిక్కిరిసింది.

ఘనంగా కుమ్మర్ల బోనాల జాతర

బోనాల పండుగ సందర్భంగా మట్టికుండల్లోనే బోనాలు తీసుకెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించేలా త్వరలోనే జీవో తీసుకొచ్చి అమలు చేసేలా చర్యలు తీసుకుంటామని దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖ, హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌లు హామీ ఇచ్చారు. ఆషాఢ మాసం బోనాల పండగ సందర్భంగా ఆదివారం తెలంగాణ రాష్ట్ర కుమ్మర్ల బోనాల జాతరను వైభవంగా నిర్వహించారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని జగదీష్ మందిర్ నుంచి ట్యాంక్‌బండ్ మీదుగా లోయర్ ట్యాంక్‌బండ్‌లోని శ్రీ కనకాల కట్టమైసమ్మ దేవాలయం వరకు కుమ్మర్ల బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

న్యాప్‌కిన్‌లకు నిధుల కొరత

(మొదటిపేజీ తరువాయి)



కొరత కారణంగా న్యాప్‌కిన్స్ కొనుగోలు చేయడం లేదు. వాస్తవానికి ఈ పథకం కేంద్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ అమలు చేస్తోంది. జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఈ పథకం అమలు కోసం నిధులు కూడా కేటాయిస్తున్నారు. గతంలో రాష్ట్రప్రభుత్వం తాము ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు పీఐపీ (ప్రోగ్రామ్ ఇప్లిమెంట్ ప్లాన్)లో కూడా ఎన్‌హెచ్ఎమ్‌కు ప్రజెంటేషన్ ఇచ్చి మరీ నిధులు తెచ్చుకుంది. ఎన్‌హెచ్ఎమ్ కూడా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన హెచ్ఎల్ఎల్ హెల్త్‌కేర్ నుంచి ఈ న్యాప్‌కిన్స్‌ను కొనుగోలు చేయాలని సూచించింది. తొలుత మనదగ్గర హెచ్ఎల్ఎల్ దగ్గరి నుంచే కొనుగోలుచేశారు. తర్వాత ఆ కంపెనీకి బిల్లులు నిలిపివేయడంతో వారు డబ్బులు కోసం కోర్టును ఆశ్రయించారు. ఇదిలావుంటే దేశంలోని అన్ని రాష్ట్రాలు విధిగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినిల కోసం న్యాప్‌కిన్స్ కొనుగోలు చేసి ఉచితంగా అందించాలని సుప్రీంకోర్టులో పిల్ కూడా వేశారు. సుప్రీం ఆదేశాలతో మెజారిటీ రాష్ట్రాలు న్యాప్‌కిన్స్ కొనుగోలు చేసి పాఠశాల విద్యార్థినిలకు పంపిణీ చేస్తున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా సంస్థలన్నింటిలో 8 నుంచి 12వ తరగతి చదివే విద్యార్థినుల సంఖ్య 11 లక్షల వరకు ఉంది. నెలసరి సమయంలో కనీసం ఆరు న్యాప్‌కిన్స్ అవసరం అవుతాయని, అలా ఒక్కో విద్యార్థినికి ఏడాదికి 72 న్యాప్‌కిన్స్ అవసరమవుతాయని వైద్యవర్గాలు చెబుతున్నాయి. మొత్తం 11 లక్షల మంది కోసం కొనుగోలు చేయాల్సివస్తే సుమారు రూ.25-30 కోట్ల వరకు అవుతుందని అంచనా. కానీ ఆ నిధులు కూడా మన వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ వద్ద లేవు. ఇప్పటికే ఎంసీహెచ్ కిట్(గతంలో కేసీఆర్ కిట్) పంపిణీతో పాటు గర్భిణీలకు రెండుసార్లు ఇచ్చే న్యూట్రియంట్ కిట్స్‌ను కూడా నిలిపివేసింది.

తెలంగాణ యువకుడికి
సైబర్ చెర నుంచి విముక్తి

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రైవేటు ఏజెన్సీ ద్వారా ఆస్ట్రేలియాకు వెళ్లేందుకు ప్రయత్నించగా, కాంబోడియా దేశంలోని ఫ్నోమ్‌పెన్ సిటీకి పంపించారు. ఏజెన్సీ వారు సాఫ్ట్ ఇంజనీరింగ్ ఉద్యోగం అని చెప్పి పంపగా.. అక్కడివారు అతడితో సైబర్ నేరాలు చేయించేందుకు ప్రయత్నించారు. వారు చెప్పిన పని చేసేందుకు ససేమిరా అనడంతో కంపెనీ వాళ్లు వేధింపులకు గురిచేశారు. అతడికి మత్తు ఇంజెక్షన్లు ఇస్తూ మానసికంగా ఇబ్బందులకు గురి చేశారు. దీంతో అతడు వాట్సాప్‌కాల్ ద్వారా తన దుస్థితి గురించి అన్న ప్రశాంత్‌కు తెలియజేశాడు. తనను గదిలో బంధించి, ఆహారం ఇవ్వకుండా చిత్రహింసలకు గురి చేస్తున్నారంటూ వీడియో కాల్‌లో విలపించాడు. ఆ వీడియో అప్పట్లో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో స్పందించిన మహబూబాబాద్ ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్.. అక్కడి ఎంబసీ అధికారులతో మాట్లాడి, ప్రకాశ్‌ను కాపాడేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. మరోవైపు.. మానుకోట మాజీ ఎంపీ మాలోత్ కవిత కూడా కాంబోడియాలో తనకు తెలిసినవారికి ఈ విషయాన్ని తెలియపరిచి.. ప్రకాశ్‌కు సహాయం అందించాలని కోరారు. వీరందరి ప్రయత్నాలకు తోడు.. అక్కడున్న భారత ఎంబసీ అధికారుల ద్వారా న్యాయపోరాటం చేసిన ప్రకాశ్ ఎట్టకేలకు తిరిగి సురక్షితంగా స్వదేశానికి చేరుకున్నాడు. శనివారం ఢిల్లీకి వచ్చి.. అక్కణ్నుంచీ ఆదివారం తెల్లవారుజామున హైదరాబాద్‌కు చేరుకున్నాడు. రాత్రి స్వస్థలం గంధంపల్లికి చేరుకున్నాడు. 45 రోజుల అనంతరం ప్రకాశ్ రావడంతో కుటుంబసభ్యుల్లో ఆనందం వెల్లివిరిసింది. దీనిపై ప్రకాశ్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. కాంబోడియాలో తనతోపాటు మరో తొమ్మిది మంది కూడా చిత్రహింసలకు గురయ్యారని, వారు కూడా తనతో పాటే తిరిగొచ్చారని తెలిపాడు. తాము స్వదేశానికి వస్తామని అనుకోలేదని అతడు వాపోయాడు. తమను ఇక్కడికి తీసుకురావడానికి సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులకు, అక్కడి ఎంబసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపాడు.



కాంబోడియా నుంచి ప్రకాశ్‌తోపాటు ఇండియాకు తిరిగి వస్తున్న యువకులు

ఈడీ, సీబీఐ కేసులున్న నేతలను చేర్చుకోం

- అవినీతిపరులను మోదీ సర్కారు ఉపేక్షించదు
- పార్టీ అధ్యక్ష మార్పు హైకమాండ్ పరిధిలో: సంజయ్



కరీంనగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఈడీ, సీబీఐ కేసులున్న నాయకులను బీజేపీలోకి తీసుకునే అవకాశం లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ స్పష్టం చేశారు. ఈడీ, సీబీఐ సంస్థల విచారణకు బీజేపీకి సంబంధం లేదని, నరేంద్ర మోదీ సర్కారు అవినీతిపరులను ఉపేక్షించే ప్రసక్తే లేదని చెప్పారు. ఆదివారం కరీంనగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇతర పార్టీల నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లోలాగా రాజీనామా చేయకుండా బీజేపీలోకి వచ్చే అవకాశాలు లేవన్నారు. ఎంపీ కేశవరావుతో రాజీనామా చేయించిన కాంగ్రెస్ ఇతర పార్టీల నుంచి గెలిచిన వారిని ఎందుకు రాజీనామా చేయించలేదని ప్రశ్నించారు. 'విభజన చట్టంలోని అంశాలపై రెండు రాష్ట్రాల సీఎంలు సఖ్యతతో ఉన్నారు. ఇది మంచి పరిణామం. గతంలో కేసీఆర్ ప్రభుత్వం విభజన అంశాలకు పరిష్కారం లభించే అవకాశాలున్నా రాజకీయ లబ్ధి కోసం సమస్యలను జటిలం చేశారు. రెండు తెలుగు రాష్ట్రాలు చిత్తశుద్ధితో వ్యవహరిస్తే విభజన సమస్యలకు పరిష్కారం లభించే అవకాశం ఉంది' అని వ్యాఖ్యానించారు. బీజేపీ అధ్యక్ష మార్పు, కొత్త అధ్యక్షుడి ఎంపిక అంశం పూర్తిగా పార్టీ హైకమాండ్ పరిధిలో ఉంటుందని సంజయ్ స్పష్టం చేశారు. 'రామాయణ్ సర్క్యూట్ కింద ఇల్లందకుంట, కొండగట్టు ఆలయాలను అభివృద్ధి చేసే అవకాశముంది. వేములవాడ రాజన్న ఆలయాన్ని ప్రసాద్ స్కీంలో చేర్చుతాం. ప్రతిపాదనలు పంపించాలని గత ప్రభుత్వాన్ని అనేకసార్లు కోరినా కేసీఆర్ మూర్ఖంగా వ్యవహరించారు. కరీంనగర్-హసన్‌పర్తి రైల్వే లైన్ నిర్మాణానికి సంబంధించి సర్వే జరిగింది. రైల్వే లైన్ పూర్తయితే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది' అని చెప్పారు. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకే కేంద్రం స్మార్ట్ సిటీ గడువు పొడిగించిందని.. సీఎం రేవంత్ అడిగారని మాత్రం కాదని వివరించారు.

ఫిరాయింపులపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ నేతలకు లేదు: జూపల్లి

హైదరాబాద్, జూలై 7(ఆంధ్రజ్యోతి): శాసనసభలో పూర్తి మెజార్టీ ఉండి కూడా ఇతర పార్టీల ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ఎల్పీలో విలీనం చేసుకున్న కేసీఆర్‌కు, బీఆర్ఎస్ నేతలకు ఫిరాయింపుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నైతిక విలువలే ఉంటే ఆనాడు విపక్ష పార్టీల ఎమ్మెల్యేలను విలీనం చేసుకుని ఉండేవారు కాదని పేర్కొన్నారు. సీఎల్పీ మీడియా హాల్లో ఆదివారం మీడియా సమావేశంలో ఎమ్మెల్యే బి.శంకర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీజేపీతో కలిసి కూల్చే ప్రయత్నం కేసీఆర్ చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందంటూ బీఆర్ఎస్ నేతలు పలు మార్లు చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రజాతీర్పును అపహాస్యం చేయడం వల్లనే ప్రభుత్వాన్ని సుస్థిరం చేసేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. ఫిరాయింపులపైన మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి.. రాహుల్‌గాంధీకి బదులుగా కేసీఆర్‌కు లేఖ రాసుండాల్సిందని జూపల్లి సూచించారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ విలువల గురించి బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతుంటే.. దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని విమర్శించారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ.. "ఇన్నాళ్లుగా కేసీఆర్ పక్కనే ఉన్నవు కదా? ఈ పదేళ్లలో ఇతర పార్టీలకు చెందిన 60 మంది ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నప్పుడు గాడిదలు కాశావా?" అంటూ మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డిపై ఫైర్ అయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనకు ఆకర్షితులయ్యే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డిలపైన నిరంజన్ రెడ్డి మళ్లీ నోరు పారేసుకుంటే వనపర్తి గల్లీలో కూడా తిరగనివ్వబోమని హెచ్చరించారు.

సంజయ్.. కేంద్రం నుంచి నిధులు తేవడంలో నీ దమ్మేందో చూపించు: మల్లు రవి

హైదరాబాద్, జూలై 7(ఆంధ్రజ్యోతి): "దమ్ముంటే మళ్లీ ఎన్నికలు పెట్టండి.. మొత్తం మేమే గెలుస్తాం అంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతున్నడు. ఎన్నికలు ఎప్పుడు పడితే అప్పుడు పెట్టరు. ఆయన దమ్మేందో తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన నిధులు తేవడంలో చూపిస్తే మంచిది" అని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి సూచన చేశారు. రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దమ్మేందో ఇప్పటికే చూపించామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బండి సంజయ్‌కి దమ్ము ఉంటే.. వచ్చే ఎన్నికల వరకు దాచి పెట్టుకుని అప్పుడు చూపించాలని ఎద్దేవా చేశారు.

వైద్య శాఖలో బదిలీలకు కమిటీలు

హైదరాబాద్, జూలై 7(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో వైద్యులు, ఇతర ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం కమిటీలను నియమించింది. ఈ మేరకు ఆ శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్థు ఆదివారం జీవో జారీ చేశారు. మొత్తం ఏడు కమిటీలు వేశారు. ఐదు కమిటీలకు చైర్మన్‌గా వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్‌ను నియమించారు.

నేడు, రేపు భారీ వర్షాలు

హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సోమ, మంగళవారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ రెండ్రోజులు ఖమ్మం, జనగామ, సూర్యాపేట, సంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మిగిలిన అన్ని జిల్లాలకు యెల్లో అలెర్ట్ జారీ చేసింది. శనివారం దక్షిణ ఏపీ తీరం వద్ద పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఉన్న ఆవర్తనం ఆదివారం అదే ప్రాంతంలో సగటు సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతున్నట్లు వెల్లడించింది. ఇక గడిచిన 24 గంటల్లో ఆదిలాబాద్ జిల్లా తాంసీ మండలంలో అత్యధికంగా 10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలిపింది.

ఇందిరమ్మ ఇంటికి భరోసా!

(మొదటిపేజీ తరువాయి)

నిర్ణయించింది. ఈ పథకం అమలుకు 22,500కోట్ల నిధులు కావాలని గృహ నిర్మాణ సంస్థ అంచనా వేసింది. ఇందిరమ్మ ఇంటిని పీఎంఏవైకి అనుసంధానిస్తే పేదలతో పాటు ప్రభుత్వానికి ఉపశమనం లభించనుంది.

సాయం పెంచాలని వినతి..

గృహ నిర్మాణ పథకంలో ప్రస్తుతం 2015 నిర్మాణ అంచనాల ప్రకారం కేంద్రం సాయం అందిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం ఆ నిర్మాణ అంచనాలను పెంచాలని కోరింది. 2015 తర్వాత సిమెంటు, స్టీల్ తదితర నిర్మాణ సామగ్రి ధరలు పెరిగినందున.. ఆర్థిక సాయాన్ని పెంచి ఇస్తే పేదలకు న్యాయం జరుగుతుందని కేంద్రానికి వివరించినట్లు తెలిసింది. కేంద్ర ప్రభుత్వం ఈ విషయాన్ని పరిశీలిస్తున్నట్లు అధికారవర్గాల సమాచారం. ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో నిర్మించే ఒక్కో ఇంటికి రూ.1.60 లక్షలకు పైగా ఇస్తుండగా, దీన్ని రూ.2 లక్షల వరకు.. గ్రామీణంలో రూ.75 వేలకు పైగా ఇస్తున్న సాయాన్ని రూ.1.30 లక్షలకు పెంచాలని కోరినట్లు తెలుస్తోంది. దీనిపై కేంద్రం కసరత్తు చేస్తున్నట్లు అధికార వర్గాల సమాచారం.

గత ప్రభుత్వ నిర్లక్ష్యం..

కేంద్రం అందించే పీఎంఏవై సాయాన్ని అందుకోవడంలో గత ప్రభుత్వం విఫలమైంది. రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణ జాబితాను కేంద్రానికి అందించలేదు. ఫలితంగా 2017-18 తర్వాత పీఎంఏవై నిధులు రాష్ట్రానికి రాలేదు. 2016-17లో రూ.190.79 కోట్లు, 2017-18లో రూ.1120.7 కోట్లు కేంద్రం నుంచి అందాయి. ఆ తర్వాత గత ప్రభుత్వం కేంద్రానికి జాబితా ఇవ్వలేదు. దాంతో కేంద్రం కూడా నిధులివ్వలేదు. అందుకే గత ప్రభుత్వం చేపట్టిన 'డబుల్ బెడ్ రూం' ఇళ్ల పథకానికి ఆర్థిక సమస్య ఏర్పడిందనే విమర్శలున్నాయి.

ఈ ప్రభుత్వం అందరిదీ.. సర్వమతాలకు స్వేచ్ఛ కల్పిస్తాం



ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రథయాత్రలో పాల్గొన్న ప్రజలు

- ఇస్కాన్ 'పూరిజగన్నాథ రథయాత్ర'లో సీఎం రేవంత్‌రెడ్డి

కవాడిగూడ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): "ఈ ప్రభుత్వం అందరిదీ. సర్వమతాలకు స్వేచ్ఛ, అవకాశాలను కల్పిస్తుంది. మత సామరస్యాన్ని పాటిస్తుంది" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పూరి జగన్నాథ రథయాత్రను ఆయన ప్రారంభించారు. ఆబిడ్స్ ఇస్కాన్ దేవాలయం ఆధ్వర్యంలో ఇందిరా పార్కు వద్ద ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రథయాత్రకు సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇందిరాపార్కు వద్ద రథయాత్రలో కొలువుదీరిన జగన్నాథుడికి సీఎం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రం సుఖశాంతులతో వర్ధిల్లాలని, పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని భగవంతుణ్ని కోరుకున్నట్లు రేవంత్ తెలిపారు. రాష్ట్రంలో హింస, డ్రగ్స్‌ను అరికట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, దీనికి ప్రజలు కూడా తమవంతు సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఆబిడ్స్ ఇస్కాన్ దేవాలయానికి సేవలు చేస్తున్న వారికి ప్రసాదం, అవార్డులను అందజేశారు.



జగన్నాథుడికి హారతి ఇస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

నేడు ఏపీకి సీఎం రేవంత్

వైఎస్ జయంతి కార్యక్రమానికి హాజరు.. సీఎం వెంట వెళ్లనున్న డిప్యూటీ సీఎం, మంత్రులు

- ఇడుపులపాయలో ఏకకాలంలో జగన్, షర్మిల నివాళి
- వైఎస్ఆర్ నిస్వార్థ ప్రజాసేవ చేశారు: సోనియాగాంధీ
- ఆ మూడూ నా జీవితంలో మరువలేనివి: సీఎం
- టీపీసీసీ చీఫ్‌గా మూడేళ్లు పూర్తి చేసుకున్న రేవంత్



హైదరాబాద్/అమరావతి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లనున్నారు. ఉమ్మడి రాష్ట్ర దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి కార్యక్రమానికి రేవంత్ హాజరు కానున్నారు. వైఎస్ఆర్ కుమార్తె, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆధ్వర్యంలో మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఏపీలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్ జగన్ నేతృత్వంలోని వైసీపీ కేవలం 11 సీట్లకు పరిమితమైన నేపథ్యంలో.. వైఎస్ఆర్ అభిమానగణాన్ని తిరిగి ఆకట్టుకునే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ మొదలుపెట్టింది. అందులో భాగంగా వైఎస్ఆర్ జయంతిని భారీ ఎత్తున నిర్వహిస్తోంది. మరోవైపు తెలంగాణలోనూ వైఎస్ఆర్ జయంతి వేడుకలను టీపీసీసీ ఘనంగా నిర్వహిస్తోంది. ఇటు ప్రజాభవన్‌లో, అటు గాంధీభవన్‌లో కార్యక్రమాలు తలపెట్టింది. ప్రజాభవన్‌లో వైఎస్ఆర్ ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసింది. సోమవారం ఉదయం.. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇతర ముఖ్యనేతలు పంజగుట్టలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించనున్నారు. అనంతరం సీఎం, డిప్యూటీ సీఎం సహా అందరూ ప్రజాభవన్‌కు వెళ్లి.. అక్కడ వైఎస్ఆర్ ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించి ఆయన చిత్రపటానికి నివాళులర్పిస్తారు. ఆ తరువాత గాంధీభవన్‌కు చేరుకొని అక్కడ వైఎస్ఆర్ చిత్రపటానికి నివాళులర్పించనున్నారు. ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్నీ సందర్శించనున్నారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక విమానంలో విజయవాడకు వెళ్లనున్నారు. అక్కడి నుంచి వైఎస్ఆర్ జయంతి వేడుకలు జరిగే మంగళగిరికి రోడ్డుమార్గంలో చేరుకోనున్నారు. సీఎం రేవంత్ వెంట డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కతోపాటు పలువురు మంత్రులు, ముఖ్యనేతలు కూడా విజయవాడకు వెళ్లనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

ఏకకాలంలో జగన్, షర్మిల నివాళులు

వైఎస్ఆర్ జయంతి సందర్భంగా ఇడుపులపాయలోని వైఎస్ ఘాట్ వద్ద సోమవారం ఉదయం వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహనరెడ్డి, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఏకకాలంలో నివాళులర్పించనున్నారు. ఇటీవల జగన్, షర్మిల మధ్య మనస్పర్థలు తలెత్తాక ఇద్దరూ ఒకే సమయంలో ఇడుపులపాయలో వైఎస్ జయంతి, వర్ధంతి కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. కానీ, ఈసారి ఇద్దరూ ఒకే సమయంలో నివాళులర్పించనున్నారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

వైఎస్ఆర్ జ్ఞాపకాలను స్మరించుకుంటాం: సోనియా



న్యూఢిల్లీ: వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జ్ఞాపకాలను తమ పార్టీ ఎల్లప్పుడూ స్మరించుకుంటుందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ అన్నారు. వైఎస్ఆర్ 75వ జయంతి సందర్భంగా ఆదివారం ఆమె ఒక లేఖ విడుదల చేశారు. 'వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఒక మహోన్నత నాయకుడు. అద్భుతమైన ప్రతిభ, చైతన్యం, అంకితభావంతో దేశానికి, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు, కాంగ్రెస్‌కు నిస్వార్థంగా సేవ చేసిన నిజమైన దేశభక్తుడు' అని ఆ లేఖలో సోనియా కొనియాడారు. వైఎస్ ప్రజాసేవ వారసత్వాన్ని ఆయన కుమార్తె వైఎస్ షర్మిల సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తున్నారని, అందుకు కృతజ్ఞతలని సోనియా పేర్కొన్నారు.

ఆ మూడూ మరువలేని ఘట్టాలు: రేవంత్

టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడం, సోనియాగాంధీ సారథ్యంలో విజయభేరి సభ నిర్వహించడం, రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించడం.. తన జీవితంలో మరువలేని సందర్భాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. టీపీసీసీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించి ఆదివారంతో మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 'ఎక్స్' వేదికగా రేవంత్ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి ఆదివారంతో మూడు వసంతాలు పూర్తయ్యాయని, ఆనాడు తనపై ఎంతో నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన సోనియాగాంధీకి, పార్టీ అగ్రనేతలకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. ఈ మూడేళ్లలో టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతల స్వీకరణ, సోనియా సారథ్యంలో విజయభేరి సభ నిర్వహణ, ప్రజల ఆశీర్వాదంతో తెలంగాణ సీఎంగా బాధ్యతలు స్వీకరించడం.. తన జీవితంలో మరువలేని ఘట్టాలన్నారు. ఈ ప్రస్థానంలో తనకు సహకరించిన పార్టీ సీనియర్ నాయకులు, పార్టీ అధికారంలోకి రావడానికి శ్రమించిన లక్షలాది మంది కార్యకర్తలకు, కాంగ్రెస్ పార్టీని గెలిపించి ప్రజాపాలనకు నాంది పలికిన నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజలకు ధన్యవాదాలు తెలుపుకొంటున్నానన్నారు. కాగా, టీపీసీసీ చీఫ్‌గా రేవంత్‌రెడ్డి పదవీ కాలం మూడేళ్లు పూర్తయినా.. కొత్త అధ్యక్షుడి నియామకంపై అధిష్ఠానం ఇంతవరకు ఏ నిర్ణయమూ తీసుకోలేదు. దీంతో మరికొంత కాలం సీఎం రేవంత్‌రెడ్డే టీపీసీసీ చీఫ్‌గానూ కొనసాగనున్నారు.

తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు

(మొదటిపేజీ తరువాయి)

నిర్ణయించారు. ఈ ప్రాజెక్టుల పనుల పూర్తికి దాదాపు రూ.241 కోట్ల మేర నిధులు ఖర్చవుతాయని, తద్వారా దాదాపు 48 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందుతుందని ఇరిగేషన్ శాఖ అధికారులు ఒక అంచనాకు వచ్చారు. 2025 మార్చి నాటికి పనులు పూర్తయ్యేలా లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ప్రణాళిక ప్రకారం ముందుకువెళ్లాలని అధికారులకు సీఎం సూచించారు. నీల్వాయి వాగు ద్వారా మంచిర్యాల జిల్లాలోని భూములకు సాగునీరు అందనుండగా, పింప్రి ఎత్తిపోతల పథకం, సదర్మట్ ప్రాజెక్టు ద్వారా నిర్మల్ జిల్లాకు, పాలెంవాగుతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు స్టేజి-2తో వరంగల్, మహబూబాబాద్, జనగామ, ఖమ్మం, సూర్యాపేట జిల్లాల రైతులకు సాగు నీరు అందనుంది. కాగా, గత ప్రభుత్వం పదేళ్లలో చేపట్టిన ప్రాజెక్టులన్నీ బ్యారేజీలు, పంప్‌హౌస్‌లకే పరిమితమయ్యాయని సీఎం అభిప్రాయపడినట్లు తెలిసింది. భారీగా అప్పులు తెచ్చి కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మించినా.. నీరు పారేందుకు అవసరమైన ప్రధాన కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు, ఆయకట్టుకు నీటిని అందించే కాలువలు నిర్మించలేదనే అంశంపైనా చర్చించినట్టు సమాచారం.

గ్రూప్-1 మెయిన్స్‌కు 31,382 మంది!

(మొదటిపేజీ తరువాయి)

పాటించలేదన్న కారణంగా కోర్టు రద్దు చేసింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ నోటిఫికేషన్ జారీ చేసి, ప్రిలిమినరీ పరీక్షను నిర్వహించారు. అంటే.. గ్రూప్-1 పోస్టుల కోసం అభ్యర్థులు మూడుసార్లు ప్రిలిమినరీ పరీక్షలను రాశారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం డిసెంబరు లోపు గ్రూప్-1 పోస్టులను భర్తీ చేయాలని భావిస్తోంది. కాగా, గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అక్టోబరులో జరిగే మెయిన్స్ పరీక్షలోనూ విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఇక ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించలేని వారు నిరుత్సాహ పడొద్దని సీఎం తన 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేశారు.

గ్రూప్-2 పరీక్షలు వాయిదా?

ఇక గ్రూప్-2 పరీక్షలను వాయిదా వేసే అవకాశం కనిపిస్తోంది. రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం జూలై 17 నుంచి ఆగస్టు 5 వరకు డీఎస్సీ పరీక్షలను నిర్వహించాలని నిర్ణయించారు. ఈ పరీక్షలు పూర్తయిన వెంటనే.. ఆగస్టు 7, 8వ తేదీల్లో గ్రూప్-2 పరీక్షలు ఉన్నాయి. చాలా మంది అభ్యర్థులు ఈ రెండు పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. దీంతో గ్రూప్-2 పరీక్షలను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఈసారి ఇంజనీరింగ్ సీట్లు 98,296

- 173 కాలేజీలకు గుర్తింపు
- కన్వీనర్ కోటాలో 70,307 సీట్లు

హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది రాష్ట్రంలో మొత్తంగా 173 ఇంజనీరింగ్ కాలేజీలకు గుర్తింపు ఇచ్చారు. ఈ కాలేజీల్లో 98,296 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో 70,307 సీట్లను కన్వీనర్ కోటా కింద, మిగిలిన సీట్లను మేనేజ్‌మెంట్ కోటాలో భర్తీ చేయనున్నారు. జేఎన్‌టీయూ పరిధిలోని కాలేజీల్లోనే 56,564 ఇంజనీరింగ్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. కాగా మొత్తం సీట్లలో ఎక్కువ కంప్యూటర్ కోర్సులకు సంబంధించినవే ఉండటం గమనార్హం. ప్రస్తుతం ఇంజనీరింగ్ (ఎప్‌సెట్) సీట్ల భర్తీకి సంబంధించిన కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది గుర్తింపు పొందిన కాలేజీలు, వాటిలోని సీట్ల సంఖ్యకు సంబంధించిన వివరాలను ఆదివారం అధికారులు ప్రకటించారు. కాగా, సీఎస్ఈ కోర్సులో 21,599; సీఎస్ఈ (ఏఐ అండ్ మెషిన్ లెర్నింగ్) లో 11,196; ఈసీఈలో 10,398; సీఎస్ఈ (డేటా సైన్స్)లో 6,516, ఈఈఈలో 4,202; ఐటీలో 3,705; సివిల్ ఇంజనీరింగ్‌లో 3,231; మెకానికల్ ఇంజనీరింగ్‌లో 2,979; సీఎస్ఈ (సైబర్ సెక్యూరిటీ) 1,418; ఏఐ అండ్ డేటా సైన్స్‌లో 1,365; ఏఐ అండ్ మెషిన్ లెర్నింగ్‌లో 606 సీట్లు ఉన్నాయి.

రైతు ప్రభాకర్ కుటుంబాన్ని ఆదుకుంటాం: భట్టి

చింతకాని, ఖమ్మంకార్పొరేషన్/చింతకాని, జూలై 7: భద్రాద్రి జిల్లా చింతకాని మండలం పొద్దుటూరు రైతు బోజడ్ల ప్రభాకర్ ఆత్మహత్యకు పురిగొల్పినవారిని ఉపేక్షించేది లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ప్రభాకర్ ఆత్మహత్య బాధాకరమని, ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. రైతు ప్రభాకర్ వ్యవసాయ భూమిని పరిశీలించిన అనంతరం ఆయన రైతు ఇంటికి వెళ్లి ప్రభాకర్ చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క విలేకరులతో మాట్లాడుతూ.. రైతు ఆత్మహత్యకు ప్రేరేపించిన వారు ఎవరైనా, ఎంత పెద్దవారైనా, ఏ పార్టీ వారైనా నిష్పక్షపాతంగా విచారణ చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించానన్నారు. ప్రభాకర్ పిల్లలు చదువులకు అవసరమైన ఏర్పాట్లు ప్రభుత్వం చేస్తుందన్నారు. కాగా, రైతు ప్రభాకర్ ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని బీఆర్ఎస్ నాయకులు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌ను కోరారు. ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి, మాజీమంత్రి నిరంజన్‌రెడి తదితరులుసీపీని కలిసి వినతిపత్రం అందజేశారు.

ఫార్మా సిటీగా హైదరాబాద్

- ఫార్మా యూనివర్సిటీని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేలా ప్రధానితో మాట్లాడతా
- ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్ సిటీ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వ్యాక్సిన్ సిటీగా పేరుగాంచిన హైదరాబాద్‌ను ప్రపంచ ఫార్మా సిటీగా మార్చేందుకు ఔషధ తయారీ సంస్థలకు అన్ని రకాల సహకారం అందిస్తామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. వికసిత్ భారత్ లక్ష్య సాధన కోసం ఫార్మా పరిశ్రమ మద్దతు చాలా అవసరమన్న విషయాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందని పేర్కొన్నారు. ఫార్మా యూనివర్సిటీని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేలా ప్రధాని మోదీతో మాట్లాడతానని చెప్పారు. హైటెక్స్‌లో ఆదివారం ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ 73వ సదస్సు ముగింపు కార్యక్రమంలో కిషన్ రెడ్డి మాట్లాడారు. ప్రస్తుతం భారత్ ప్రపంచంలో అయిదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉందని, 2027 నాటికి మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా చేయాలన్న సంకల్పంతో ప్రధాని ఉన్నారన్నారు. ఇందులో భాగంగా మౌలిక సదుపాయాల కోసం నిధులు వెచ్చిస్తున్నామని చెప్పారు. దేశంలో వైద్య కళాశాలలను గణనీయంగా పెంచామన్నారు. 2014లో 388 వైద్య కళాశాలలు ఉండగా, కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల గడిచిన పదేళ్లలో వాటి సంఖ్య 706కు చేరిందన్నారు. ఎంబీబీఎస్ సీట్లు 51,348 నుంచి 1.09 లక్షలకు చేరాయన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా కేంద్రం 12 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల వరకు వైద్య బీమా అందిస్తోందన్నారు. జన ఔషధి కేంద్రాల ద్వారా జనరిక్ మెడిసిన్‌ను అందుబాటులోకి తెచ్చామని, తద్వారా 50 నుంచి 90%తక్కువ ధరకే మందులు అందుబాటులోకి వచ్చాయని ఆయన తెలిపారు. కాగా, రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు.

మహా 'మత్తు' పార్టీ

- కేవ్ పబ్‌లో సైకెడెలిక్ పార్టీ
- ముందుగా డ్రగ్స్ తీసుకోవడమే దీని హాజరుకు అర్హత
- పాల్గొన్న 55మంది.. 24 మందికి పాజిటివ్.. కేసు నమోదు
- పబ్‌ను సీజ్ చేసిన పోలీసులు


మియాపూర్, జూలై 7(ఆంధ్రజ్యోతి): పెద్ద శబ్దంతో మ్యూజిక్.. దాని ధాటికి సాధారణ వ్యక్తులకైతే చెవులు చిల్లులు పడిపోతాయ్..! కానీ, ఆ పార్టీలో పాల్గొన్నవారికి మాత్రం ఏమీ కాదు..! అందరూ ఓ విభ్రమలో ఉంటారు. అసలు వారు ఈ ప్రపంచంలోనే ఉన్నట్లుగా కనిపించరు..! దీనంతటికీ కారణం.. అప్పటికే ఒళ్లంతా ఆవహించేసిన డ్రగ్స్! ఆ పార్టీ పేరు సైకడలిక్ పార్టీ..! దీనికి హాజరవడానికి అర్హత.. 'ముందుగానే మాదక ద్రవ్యాలు తీసుకోవడం'. హైదరాబాద్ ఖాజాగూడలోని కేవ్ బార్ అండ్ లాంజ్‌లో శనివారం రాత్రి సైకెడెలిక్ పార్టీ జరుగుతుండగా.. టీజీ న్యాబ్ అధికారులు, సైబరాబాద్ ఎస్‌వోటీ, రాయదుర్గం పోలీసులు దాడి చేశారు. 55 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరికి పరీక్షలు నిర్వహించగా 24 మందికి డ్రగ్స్ పాజిటివ్ వచ్చిందని మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ ఆదివారం మీడియా సమావేశంలో తెలిపారు. ఇందులో టీసీఎస్, అమెజాన్‌తో పాటు ప్రముఖ కంపెనీల ఉద్యోగులు, విద్యార్థులు ఉన్నట్లు పేర్కొన్నారు. డిస్క్ జాకీ (డీజే)లు సందీప్‌శర్మ, సాయి గౌరంగ్ కూడా డ్రగ్స్ తీసుకున్నట్లు పరీక్షల్లో గుర్తించామన్నారు. యజమానులు రాజేష్, అభినవ్, సాయికృష్ణ, సన్నీలు పార్టీ నిర్వహణ వెనుక ఉన్నట్లు గుర్తించామని, వీరంతా పరారయ్యారని తెలిపారు. యజమానులు, పాజిటివ్ వచ్చినవారితో పాటు పబ్ మేనేజర్ అబ్దుల్లా ఆయూబ్, ఈవెంట్ మేనేజర్ ఆర్.శేఖర్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు డీసీపీ చెప్పారు. డ్రగ్స్ వాడకాన్ని ప్రోత్సహించినందుకు గాను పబ్‌ను మూసివేసినట్లు తెలిపారు. మేనేజర్‌ను విచారిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎవరు డ్రగ్స్ సరఫరా చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బందికి డ్రగ్స్ వాడకంతో కలిగే అనర్థాలపై ఐటీ సంస్థలు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.

కేవ్‌లో గతంలోనూ.. బెంగళూరు నుంచి డీజేలు

కేవ్ పబ్‌లో గతంలోనూ సైకెడెలిక్ పార్టీలు జరిగినట్లు అనుమానాలు ఉన్నాయని, యజమానులను అదుపులోకి తీసుకుంటే మరింత సమాచారం వస్తుందని డీసీపీ చెప్పారు. కాగా, సైకెడెలిక్ పార్టీకి బెంగళూరు నుంచి డీజేలను పిలిపించారని, పాల్గొనేవారికి నిర్వాహకులు ఇన్‌స్టాగ్రాం ద్వారా ఆహ్వానం పంపారని వివరించారు. వారికి ప్రత్యేకమైన కోడ్ ఉంటుందని ఆయన చెప్పారు.

తల్లిదండ్రులూ.. జాగ్రత్త!

- సోషల్ మీడియాలో పిల్లల ఫొటోలు పోస్టు చేయొద్దు
- సోషల్ మీడియా ముసుగులో క్రూర మృగాలు ఉన్నాయి
- ఓ యూట్యూబర్ వ్యాఖ్యలపై తెలంగాణ, ఏపీ సీఎంలకు హీరో సాయి దుర్గా తేజ్ ఫిర్యాదు



సోషల్ మీడియాలో చిన్న పిల్లలపై అసభ్యకరమైన రీతిలో ట్రోల్స్ జరుగుతున్న నేపథ్యంలో హీరో సాయి దుర్గాతేజ్ స్పందించారు. 'పేరెంట్స్ అందరికీ నా విన్నపం ఇదే. పేరెంట్స్ అందరూ తమ పిల్లల ఫొటోలు సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో పోస్ట్ చేసేటప్పుడు జాగ్రత్త వహించండి. బయట సోషల్ మీడియా ముసుగులో చాలా క్రూరమైన మృగాలు ఉన్నాయి. వారు మీ పిల్లల ఫొటోలపై ఇష్టమొచ్చినట్లు కామెంట్స్ చేస్తారు.. మార్ఫింగ్ చేస్తారు. పేరెంట్స్ ఆ వ్యక్తులు చేసే కామెంట్స్ వల్ల ఎంత ఇబ్బందిని అనుభవిస్తారో, ఎంత మానసిక ఒత్తిడికి లోనవుతారో వారికి అర్థం కాదు' అని పేర్కొన్నారు. 'ఎక్స్' వేదికగా చేసిన ఈ పోస్ట్‌కు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేశ్‌ను ట్యాగ్ చేశారు. ఈ పోస్ట్ పెట్టిన వెంటనే సాయి దుర్గాతేజ్ మరో ట్వీట్‌లో ఓ వీడియోను షేర్ చేసి సంబంధిత వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఇందులో ప్రణీత్ హనుమంతు అనే ఓ యూట్యూబర్.. కొంతమంది యూట్యూబర్లతో కలిసి ఓ తండ్రి, తన చిన్నారి కూతురు వీడియోను ఉద్దేశించి అసభ్యకరంగా మాట్లాడారు.

స్పందించిన రేవంత్, భట్టి విక్రమార్క, మంచు మనోజ్

ఈ పోస్ట్‌పై స్పందించిన సీఎం రేవంత్, భట్టి విక్రమార్క.. సోషల్ మీడియాలో ఇలాంటి పనులు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నటుడు మంచు మనోజ్ కూడా ఈ పోస్ట్‌పై స్పందించారు. 'ఇలాంటి వ్యక్తుల ప్రవర్తన సహించరానిదని.. వీరిని ఊరికే వదిలిపెట్టకూడద'ని ఆగ్రహం వ్యక్తం చేశారు. - సినిమా డెస్క్

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

తెలుగువారి హృదయాల్లో చెరగని ముద్ర వైఎస్సార్

అప్పుడు - ఇప్పుడు - ఎప్పుడూ వైఎస్సార్ అజెండా
ఎగిరే కాంగ్రెస్ మువ్వన్నెల జెండా




శ్రీ రాజీవ్ గాంధీ
పులివెందుల, 1982











కొందరు కొన్నాళ్ళు ఉండి... పోతారు. కొందరు శాశ్వతంగా ఉండిపోతారు.

శ్రీమతి ఇందిరాగాంధీ ఏఐసిసి అధ్యక్షురాలిగా ఉండగా వైఎస్సార్ 1983లో పిసిసి అధ్యక్షుడు.
రాహుల్ గాంధీని ప్రధానిగా చూడాలని మనసా, వాచా, కర్మణా కోరుకున్న వైఎస్సార్

2024 జూలై 8న మహా నేత వైఎస్సార్ 75వ జయంతి

ఇట్లు
వైఎస్సార్ ఆత్మ బంధువులు